సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 353

గురువారం 14-3-2024



'తెలుగువారి గుండెచప్పుడు వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు... నా జన్మ ధన్యమైనట్టే'



2026 ఆఖర్లో 'ధోలేరా' చిప్

టాటా, సీజీ పవర్ సెమీకండక్టర్ ప్లాంట్ల శంకుస్థాపనలో అశ్వనీ వైష్ణవ్ -13లో



చిన్న షేర్ల పెద్ద క్రాష్

కుప్పకూలిన ఈక్విటీ మార్కెట్. 73వేల దిగువకు సెన్సెక్స్ -13లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆ చట్టంపై రేపు విచారిస్తాం

సీఈసీ, ఈసీల నియామకానికి తెచ్చిన కొత్త చట్టాన్ని సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్‌ను శుక్రవారం విచారిస్తామని సుప్రీం తెలిపింది.

వివరాలు 6లో ▸



వంట మనిషి కుమార్తె 'ప్రజ్ఞ'

సుప్రీంకోర్టులో పనిచేస్తున్న ఓ వంట మనిషి కుమార్తె ప్రజ్ఞ రెండు అమెరికా వర్సిటీల్లో పీజీ లా కోర్సు చదివే అవకాశం పొందింది.


వివరాలు 6లో ▸



కవ్విస్తే అణు యుద్ధమే!

తమ దేశం వైపు ప్రత్యర్థులు కన్నెత్తి చూస్తే అణు యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని రష్యా అధ్యక్షుడు పుతిన్ పరోక్షంగా తేల్చిచెప్పారు.

వివరాలు 6లో ▸



మళ్లీ ఆ ఇద్దరే

అమెరికా అధ్యక్ష రేసులో మరోసారి బైడెన్, ట్రంప్‌లే నిలిచారు. తమ పార్టీల తరఫున అభ్యర్థిత్వాలను ఇరువురు గెలుచుకున్నారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

ఇంటర్ 'స్పాట్' షురూ



ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ మొదలైంది. ఈ నెల 16 నుంచి ఇది ఊపందుకుంటుందని అధికారులు తెలిపారు. నెలపాటు మూల్యాంకనం కొనసాగుతుందని, పరీక్ష ముగియగానే పత్రాలను మూల్యాంకన కేంద్రాలకు తరలిస్తున్నామన్నారు.

- వివరాలు 3లో▶


నేటి నుంచి అంతర్జాతీయ ఆధ్యాత్మిక సమ్మేళనం



కన్హా శాంతివనం అంతర్జాతీయ ఆధ్యాత్మిక సమ్మేళనానికి సిద్ధమైంది. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమయ్యే కార్యక్రమం 17 వరకు జరగనుంది.

- వివరాలు 14లో▶

పేద మహిళలకు ఏటా రూ. లక్ష



అధికారంలోకి వస్తే పేద మహిళలకు ఏటా రూ.లక్ష అందజేస్తామని, వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో 50% రిజర్వేషన్ కల్పిస్తామని రాహుల్ చెప్పారు. ఈ మేరకు 'మహిళా న్యాయ్' పేరిట హామీలను విడుదల చేశారు.

- వివరాలు 6లో▶

కేబినెట్‌లో భట్టి నంబర్ 2



రాష్ట్ర మంత్రివర్గంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అత్యంత పవర్‌ఫుల్ అని.. ఆయనే నంబర్ 2 అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం భట్టితో కలసి మధిరలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు.

- వివరాలు 2లో▶

ఇదండీ సంగతి



ఆ పార్టీతో పొత్తుంటుందని తెలియక గతంలో అడ్డగోలు తిట్లు తిట్టా.. మనసులో పెట్టుకొని ఇప్పుడు నన్ను ఓడించరు కదా!

ఇందిరమ్మ పట్టాలు ఇప్పట్లో లేనట్టే!



రెవెన్యూ పరమైన అంశాల జోలికి ఇప్పట్లో వెళ్లొద్దని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఉత్తర్వు జారీ

- మొదటి విడతలో ఇల్లు పొందాలంటే సొంత జాగా ఉండాల్సిందేనని స్పష్టీకరణ
- ప్రజా పాలనలో ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరించిన సర్కారు
- సొంత జాగా లేనివారు 30 లక్షల మంది ఉన్నట్టుగా తేలిన వైనం
- ప్రభుత్వ నిర్ణయంతో వీరంతా సొంతింటి కోసం వేచిచూడాల్సిన పరిస్థితి
- పథకం తొలి విడతలో రాష్ట్రంలోని చిన్న గ్రామాలకే ప్రాధాన్యం
- ఏడాది కాలంలో లక్ష ఇళ్ల నిర్మాణం! ఆ మేరకు నిధులు సిద్ధం!

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో సొంత స్థలం లేని నిరుపేదలకు ఇప్పట్లో 'ఇందిరమ్మ గృహ' వసతి అందే సూచనలు కనిపించటం లేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నాలుగు రోజుల క్రితం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే ఇప్పట్లో రెవెన్యూ పరమైన అంశాల జోలికి వెళ్లొద్దని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నందున నిరుపేదలకు గృహ నిర్మాణం కోసం అవసరమైన పట్టాల పంపిణీ ఇప్పట్లో జరిగేలా లేదు. పథకం ప్రారంభించడానికి ఒకరోజు ముందు ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన ఉత్తర్వును ప్రభుత్వం జారీ చేసింది. మొదటి విడతలో ఇందిరమ్మ ఇల్లు పొందాలంటే కచ్చితంగా సొంత జాగా కలిగి ఉండాలని అందులో పేర్కొంది. తద్వారా సొంత స్థలాలు లేని వారికి ప్రస్తుతానికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు లేదనే స్పష్టతనిచ్చింది. ఇటీవల నిర్వహించిన ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం.. గతంలో ప్రభుత్వం నుంచి ఇళ్లు పొందని వారు 66 లక్షలుగా ఉన్నట్టు ప్రాథమికంగా తేల్చింది. ఇందులో 30 లక్షల మందికి సొంత జాగా లేదని కూడా తేలినట్టు సమాచారం. కాగా వారందరికీ ప్రభుత్వం తొలుత భూమి పట్టాలు జారీ చేసి ఇళ్లను మంజూరు చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం.. సొంత స్థలాలు లేని

మిగతా 3వ పేజీలో ▶

తక్కువ ఇళ్లే ఇచ్చినా ఎక్కువ శాతం కన్పించేలా..

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో తొలుత చిన్న గ్రామాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. తక్కువ జనాభా ఉండే ప్రాంతాలను గుర్తించి, వాటిల్లో ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నారు. ఆయా గ్రామాల్లో తక్కువ ఇళ్లనే అందించినా.. ఆ గ్రామ జనాభా, మంజూరు చేసిన ఇళ్ల దామాషాను చూస్తే ఎక్కువ శాతం ఇళ్లను కేటాయించినట్టు లెక్కలు కనిపిస్తాయి. అదే ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతాలకు ఇచ్చే ఇళ్ల సంఖ్యను, ఆ ప్రాంత జనాభాను పరిగణనలోకి తీసుకుంటే తక్కువ ఇళ్లు కేటాయించినట్టుగా కన్పిస్తుంది. దీన్ని గమనంలో ఉంచుకునే తక్కువ జనాభా ఉన్న గ్రామాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పారాచూట్లకే ప్రాధాన్యం!

బీజేపీ రెండో జాబితాలో రాష్ట్రంలోని 6 ఎంపీ సీట్లకు అభ్యర్థులు

- మొత్తంగా 15 లోక్‌సభ స్థానాలకు ఖరారు.. వరంగల్, ఖమ్మం పెండింగ్
- ఇతర పార్టీల నుంచి చేరిన వారికి ప్రాధాన్యంపై కొందరు నేతల అసంతృప్తి
- బీఆర్‌ఎస్ నుంచి వచ్చిన వారికి వెంటనే టికెట్లు ఇవ్వడం ఏమిటనే ప్రశ్నలు



డీకే అరుణ మహబూబ్‌నగర్ | రఘునందన్ మెదక్ | గోడం నగేశ్ ఆదిలాబాద్ | సీతారాం మహబూబాబాద్ | శ్రీనివాస్ పెద్దపల్లి | సైదిరెడ్డి నల్లగొండ

సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి పోటీచేసే మరో ఆరుగురు అభ్యర్థుల పేర్లను బీజేపీ ప్రకటించింది. ఈ మేరకు బుధవారం రెండో జాబితాను విడుదల చేసింది. తొలిజాబితాలో 9 మంది పేర్లను, తాజాగా ఆరుగురి పేర్లను ప్రకటించడంతో.. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకుగాను 15 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లయింది. వరంగల్, ఖమ్మం స్థానాలు మాత్రం పెండింగ్‌లో ఉన్నాయి. అయితే ఇతర పార్టీల నుంచి వచ్చిన పారాచూట్ నేతలకు ఎంపీ టికెట్లు ఇవ్వడం ఏమిటంటూ బీజేపీలో అసంతృప్త స్వరాలు వినిపిస్తున్నాయి.

సగందాకా 'పారాచూట్ల'కే!

ఇప్పటివరకు ప్రకటించిన 15 మంది అభ్యర్థులలో ఏడుగురు ఇతర పార్టీల నుంచి వచ్చిన వారేనని (ఒకరు పార్టీలో కూడా లేనివారు) పలువురు బీజేపీ నేతలు పేర్కొంటున్నారు. పెండింగ్‌లోని ఖమ్మం, వరంగల్ స్థానాలను కూడా బీఆర్‌ఎస్ నుంచి చేరేందుకు సిద్ధపడ్డవారికే ఇవ్వనున్నట్టు ప్రచారం సాగుతోందని చెప్తున్నారు. అంటే 17 సీట్లలో 9 స్థానాలను (సగానికిపైగా) బయటి నుంచి వచ్చిన వారికే కేటాయిస్తే.. ఏళ్లుగా పార్టీని నమ్ముకుని పనిచేస్తున్నవారి పరిస్థితి ఏమిటని వాపోతున్నారు. ఇన్నాళ్లు తీవ్ర విమర్శలు చేసిన బీఆర్‌ఎస్ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరగానే ఎంపీ టికెట్లు ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రెండో జాబితాలో డీకే అరుణ, రఘునందన్‌రావు మినహా మిగతా నలుగురు సైదిరెడ్డి, సీతారాంనాయక్, గోడెం నగేశ్, గోమాస శ్రీనివాస్ ఇతర

మిగతా 3వ పేజీలో ▶



ఏఐకి చెప్తే.. వెబ్‌సైట్ రెడీ!

- ప్రపంచంలోనే మొట్టమొదటి కృత్రిమ మేధ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ 'డెవిన్' ఆవిష్కరణ
- రూపొందించిన అమెరికా స్టార్టప్ కంపెనీ కాగ్నిషన్
- వెబ్‌సైట్లు, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్‌లను పూర్తిస్థాయిలో తయారు చేయగలదు
- సాఫ్ట్‌వేర్ కోడ్ రాయడంతోపాటు టెస్టింగ్, డీబగ్గింగ్, డిప్లాయ్ కూడా చేయగలదు
- ఇప్పటికే వివిధ బెంచ్‌మార్క్ టెస్టులను 'డెవిన్' పాస్ అయిందని తెలిపిన కాగ్నిషన్

- వివరాలు 14లో▶

ఐదేళ్లలో 22,217 ఎలక్టోరల్ బాండ్లు



- 22,030 బాండ్లను నగదుగా మార్చుకున్న రాజకీయ పార్టీలు
- మిగిలిన 187 బాండ్ల డబ్బు ప్రధాని సహాయ నిధికి జమ
- సుప్రీంకోర్టులో ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ కుమార్ ఖరా అఫిడవిట్
- బాండ్ల వివరాలను ఇప్పటికే ఎన్నికల సంఘానికి సమర్పించామని వెల్లడి
- బాండ్ల సమాచారాన్ని రేపు సాయంత్రంలోగా వెబ్‌సైట్‌లో పెట్టనున్న ఈసీ

6లో

ఇంజనీరింగ్ కొలువుల భర్తీ షురూ



- 1:2 నిష్పత్తిలో అభ్యర్థుల జాబితాను ప్రకటించిన టీఎస్‌పీఎస్సీ.. వివిధ విభాగాల్లో దాదాపు 1,120 ఇంజనీరింగ్ ఉద్యోగాలు
- ఈ నెల 18 నుంచి 22 వరకు అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన.. పెండింగ్‌లో ఉన్న డీఏఓ, హెచ్‌డబ్ల్యూఓ ఉద్యోగ అర్హత పరీక్షల తేదీలు ఖరారు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ) ఉద్యోగాల భర్తీలో ముందడుగు పడింది. ఈ ఉద్యోగాలకు అర్హత పరీక్షలు నిర్వహించి ఏడాది కావస్తుండగా... తాజాగా కేటగిరీల వారీగా ప్రాథమిక ఎంపిక జాబితాను తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది. ఈ జాబితాను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు కమిషన్ కార్యదర్శి వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత అత్యధిక సంఖ్యలో ఇంజనీరింగ్ ఉద్యోగాల భర్తీకి టీఎస్‌పీఎస్సీ 2022 సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. 11 ప్రభుత్వ విభాగాల్లో 1,540 పోస్టులను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసేందుకుగాను గతేడాది జనవరిలో అర్హత పరీక్షలను కమిషన్ నిర్వహించింది. అయితే ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో నిర్వహించిన పరీక్షను రద్దు చేసిన టీఎస్‌పీఎస్సీ... ఆ తర్వాత గతేడాది మే నెలలో మరోమారు అర్హత పరీక్షలను నిర్వహించింది. ఈ క్రమంలో తాజాగా ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థుల ప్రాథమిక జాబితాను కమిషన్ వెల్లడించింది.

18 నుంచి ధ్రువపత్రాల పరిశీలన

ఏఈఈ ఉద్యోగాలకు ప్రాథమికంగా అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తున్నట్లు టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది. కూకట్‌పల్లిలోని

మిగతా 3వ పేజీలో ▶

సరైన అభ్యర్థులు లేకనే..

బీఆర్‌ఎస్ వారిని బీజేపీ చేర్చుకుంటోంది

పార్టీ శ్రేణులతో కేసీఆర్

- క్షేత్రస్థాయిలో బీజేపీకి సరైన బలగం లేదు
- ఏదో ప్రధాని మోదీని చూపి హడావుడి చేస్తున్నారు
- పార్టీని వీడి వెళ్తున్నవారికి అక్కడ ఆదరణ దక్కదని స్పష్టీకరణ
- కాంగ్రెస్ సర్కారుపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బీజేపీకి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆదరణ ఉండబోదని.. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రధాని మోదీని చూపి ఏదో హడావుడి చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్ రావు పేర్కొన్నారు. బీజేపీకి సరైన అభ్యర్థులు దొరకనందునే బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎంపీలు, ఇతర నేతలను చేర్చుకుని టికెట్లు ఇస్తున్నారని పేర్కొన్నారు. ఆ పార్టీకి క్షేత్రస్థాయిలో బలమైన కార్యకర్తల బలగం లేదని.. అందుకే అరూరి రమేశ్ వంటి నేతలను చేరాలని అడుగుతున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ బుధవారం హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసంలో వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని పార్టీ ప్రజాప్రతినిధులు, కీలక నేతలతో సమావేశమయ్యారు. అక్కడి తాజా రాజకీయ స్థితిగతులు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా

మిగతా 2వ పేజీలో ▶

బీఆర్‌ఎస్.. బీజేపీ.. అరూరి.. హైడ్రామా!

రమేశ్ బీజేపీలో చేరుతారనే ప్రచారం..



- హనుమకొండలోని ఇంటివద్ద ప్రెస్‌మీట్‌కు సిద్ధమైన మాజీ ఎమ్మెల్యే
- అక్కడికి చేరుకున్న ఎర్రబెల్లి, ఎమ్మెల్సీ సారయ్య, ఇతర నేతలు
- అరూరిని ఎర్రబెల్లి వాహనంలో ఎక్కించుకుని హైదరాబాద్‌కు..
- పెంబర్తి వద్ద అడ్డుకున్న బీజేపీ నేతలు.. హైవేపై అరగంట పాటు ఉద్రిక్తత
- కేసీఆర్ వద్దకు అరూరిని తీసుకెళ్లిన నేతలు.. బుజ్జగించిన బీఆర్‌ఎస్ పెద్దలు

2లో

మరో నలుగురితో బీఆర్‌ఎస్ రెండో జాబితా

- చేవెళ్ల నుంచి కాసాని జ్ఞానేశ్వర్.. వరంగల్ నుంచి కడియం కావ్య
- నిజామాబాద్ సీటు బాజిరెడ్డికి.. జహీరాబాద్ గాలి అనిల్‌కుమార్‌కు..



కాసాని | కావ్య | బాజిరెడ్డి | అనిల్‌కుమార్


ఇప్పటివరకు 9 మంది లోక్‌సభ అభ్యర్థులు ఖరారు

- వివరాలు 2లో

మరో బెంగళూరు కానివ్వొద్దు

- తాగునీటి ఎద్దడిపై రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించిన హైకోర్టు
- విద్యార్థులకూ నీటి వినియోగంపై అవగాహన కల్పించండి
- అవసరమైతే పాఠ్యాంశంగా చేర్చండి
- ఇంకుడు గుంతలు లేని ఇళ్లను గుర్తించి చర్యలు చేపట్టండి
- తాగునీటికి ఇబ్బంది ఉంటే గార్డెనింగ్‌కు వినియోగాన్ని నియంత్రించాలని సూచన

సాక్షి, హైదరాబాద్: వర్షపు నీటి నిల్వ విధానం (ఇంకుడు గుంతలు, ఆర్‌డబ్ల్యూఎస్‌హెచ్)పై సరైన చర్యలు చేపట్టకుంటే హైదరాబాద్ మరో బెంగళూరులా తాగునీటికి కూడా ఇబ్బందిపడే పరిస్థితి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు హెచ్చరించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇంకుడు గుంతలు లేని నిర్మాణాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని,



విద్యార్థులకు కూడా నీటి వినియోగంపై అవగాహన కలిగించేలా పాఠ్యాంశాల్లో చేర్చాలని చెప్పింది. తాగునీటికి ఇబ్బంది ఉంటే గార్డెనింగ్ లాంటి వాటికి వినియోగాన్ని నియంత్రించాలంటూ సర్కారుకు పలు సూచనలు చేసింది. తదుపరి విచారణను ఈ నెల 26కు వాయిదా వేసింది. రాష్ట్రవ్యాప్తంగా నీటికొరత ఉందని, ప్రధానంగా జంట నగరాలైన హైదరాబాద్, సికింద్రాబాద్‌లో తాగునీటికి ఇబ్బంది పడాల్సి వస్తోందని.. అధికారులు చర్యలు తీసుకునేలా ఆదేశించాలని కోరుతూ జర్నలిస్ట్ సుభాష్ చంద్రన్ 19 ఏళ్ల క్రితం హైకోర్టుకు లేఖ రాశారు. ఇందులోభాగంగా నీటి వినియోగాన్ని నియంత్రించడం, తాగునీటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. దీన్ని న్యాయస్థానం పిటిషన్‌గా మార్చి సుమోటోగా విచారణకు స్వీకరించింది. ప్రభుత్వం నియమించిన

మిగతా 2వ పేజీలో ▶

ఆరోగ్యశ్రీ

త్వరలో కొత్త కార్డులు

రేషన్ కార్డులతో సంబంధం లేకుండా ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయం

- ఆదాయంతో నిమిత్తం లేకుండా అందరికీ పథకం వర్తింప చేసే చాన్స్!. అదనంగా రూ.400 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా
- కొత్తగా మరిన్ని శస్త్రచికిత్సలు చేర్చాలని వైద్య,ఆరోగ్యశాఖ నిర్ణయం.. రూ.500 కోట్లకు పైగానే ఆస్పత్రులకు బకాయిలు.. త్వరలో విడుదల

- వివరాలు 3లో

రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు కొత్తగా కార్డులివ్వాలని నిర్ణయించింది. ప్రతి కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకొని యూనిక్ నంబర్‌తో కార్డులు ఇవ్వనుంది. కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ ఒక్కో సబ్ నంబర్ ఇస్తారు. ఇదే కార్డును హెల్త్ ప్రొఫైల్‌కు లింక్ చేసి, స్టేట్ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్‌ను తయారు చేస్తారు. ఈ మేరకు ఆరోగ్యశ్రీ ట్రస్టు కసరత్తు చేస్తోంది.

క్లుప్తంగా...



నల్లగొండ పట్టణంలో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి

కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వమే..

- ఇండియా కూటమి ఆధ్వర్యంలో రాహుల్ ప్రధాని అవుతారు
- తెలంగాణను నాశనం చేసింది కేసీఆర్ కుటుంబమే: కోమటిరెడ్డి

నల్లగొండ: కేంద్రంలో అధికారంలోకి వచ్చేది సంకీర్ణ కూటమే అని, ఇండియా కూటమి ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. నల్లగొండలో ఆయన బుధవారం పలు అభివృద్ధి పను లకు శంకుస్థాపన చేశారు. పట్టణంలో తాగు నీటి సమస్యపై సమీక్ష నిర్వహించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు బీజేపీ కామన్ సివిల్ కోడ్‌ను తీసుకొచ్చి మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తోందని ఆరోపించారు. అవినీతితో కేసీఆర్ కుటుంబం తెలంగాణను నాశనం చేసిందని, కాళేశ్వరం ప్రాజెక్టు పేర వారి కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతుందన్నారు. అధిక శాతం కాంగ్రెస్ పార్టీలోకి వస్తారని మంత్రి జోస్యం చెప్పారు.

రిజర్వేషన్ల సీలింగ్ తొలగిస్తాం

కేంద్రంలో కాంగ్రెస్‌కు అధికారమివ్వండి : ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి అధికారం ఇస్తే దేశ వ్యాప్తంగా రిజర్వేషన్లపై సీలింగ్ ఎత్తేస్తామని ఆ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు ఎత్తేస్తుందన్నారు. బుధవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భాష గురించే కేసీఆరే మాట్లాడాలని ఎద్దేవా చేశారు. ఇన్ని రోజులు కేసీఆర్ మాట్లాడితే బీఆర్ఎస్ నేతలకు వినసొంపుగా ఉందని, రేవంత్ మాట్లాడితే వారికి సీసం పోసినట్టుందని చెప్పారు. ఎస్సారెస్పీలో నీటి కొరత కు కేసీఆర్‌దే బాధ్యత అని, వర్షాకాలంలోనే మేడిగడ్డ నీటిని ఎస్సారెస్పీకి తరలించి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. పవర్ ప్లాంట్లపై న్యాయ విచారణకు ప్రభుత్వం ఆదేశించడంతో కేసీఆర్‌కు భయం మొదలైందని తెలిపారు. ప్రజలకు మంచి చేయాలన్న నిబద్ధ త గతంలో ఒక్క వైఎస్సార్‌కే ఉండేదని, ఇప్పు డు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అలాంటి పరిస్థితులు వచ్చాయని చెప్పారు.

కోదండరాం, అమేర్‌లను రీనామినేట్ చేయడం సరికాదు: దాసోజు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ మంత్రి మండలి ప్రొఫెసర్ కోదండరాం, అమేర్ అలీ ఖాన్‌లను ఎమ్మెల్సీలుగా రీనామినేట్ చేస్తున్నట్లు వస్తున్న కథనాలు నిజమయితే ఇటువంటి చర్యలు ముఖ్యమంత్రి, మంత్రి మండలి ఫ్యూడల్, అప్రజాస్వామిక మనస్తత్వా నికి నిదర్శనమని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ విమర్శించారు. ఈ మేరకు బుధవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. మీడియా రిపోర్ట్స్ నిజమైతే, రాజ్యాంగ నిబంధనలతో పాటు 2024లో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు రిట్ పిటిషన్ 180, 181లో ఇచ్చిన చరిత్రాత్మకమైన తీర్పును ఉల్లంఘించడమే అవుతుందన్నారు. మార్చి 7, 2024 నాటి తెలంగాణ హైకోర్టు ఆదేశాలతో జూలై 31, 2023న ఆనాటి మంత్రి మండలి చేసిన ముందస్తు తీర్మానం నం. 663 పునరుద్ధరించిందని, అది ఇప్పుడు గవర్నర్ ముందు పెండింగ్‌లో ఉందని గుర్తు చేశారు.

సెగ్మెంట్ల వారీగా కాంగ్రెస్ అభిప్రాయ సేకరణ

సాక్షి, హైదరాబాద్: నాలుగు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ.. మిగిలిన చోట్ల అభ్యర్థులుగా ఎవరైతే బాగుంటుందన్న అంశంపై అభిప్రాయ సేకరణ జరుపుతోంది. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ బుధవారం గాంధీభవన్‌లో పార్లమెంటు నియోజకవర్గాల వారీగా అభిప్రాయ సేకరణ జరిపారు. ఆయా నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే ఎమ్మెల్యేలు, పార్టీ అధ్యక్షులు, ముఖ్య నేతలతో విడివిడిగా మాట్లాడి.. అభ్యర్థిగా ఎవరైతే బాగుంటుందో తెలుసుకున్నారు. భువనగిరి, సికింద్రాబాద్, హైదరాబాద్, పెద్దపల్లి, మెదక్ స్థానాల్లో తమ అభ్యర్థిత్వాలను పరిశీలించాలని పలువురు మున్షీకి విజ్ఞప్తి చేశారు. అభిప్రాయ సేకరణ అనంతరం దీపాదాస్ మున్షీ సీఎం రేవంత్‌తో సమావేశమయ్యారు. పార్లమెంటు స్థానాల వారీగా వచ్చిన అభిప్రాయాలు, సర్వే వివరాలు, స్క్రీనింగ్ కమిటీకి ఇచ్చిన పేర్ల తదితరాలపై ఇద్దరూ చర్చించినట్టు సమాచారం.

బీఆర్ఎస్.. బీజేపీ.. అరూరి.. హైడ్రామా!

రమేశ్ బీజేపీలో చేరుతారనే ప్రచారం ● కేసీఆర్ వద్దకు అరూరిని తీసుకెళ్లిన నేతలు.. బుజ్జగించిన బీఆర్ఎస్ పెద్దలు



తీవ్ర ఉద్రిక్తతల నడుమ రమేశ్‌ను హైదరాబాద్‌కు తీసుకెళ్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు

సాక్షి ప్రతినిధి, వరంగల్: బీఆర్ఎస్‌ను వీడుతున్నారంటూ ప్రచారం జరిగిన ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ వ్యవహారంపై బుధవారం హైడ్రామా చోటు చేసుకుంది. హనుమకొండ నుంచి హైదరాబాద్‌లోని నందినగర్‌లో ఉన్న కేసీఆర్ నివాసం దాకా జరిగిన పరిణామాలు బీఆర్ఎస్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అరూరి రమేశ్ బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నారు. బీజేపీ అగ్రనేత అమిత్ షాతో అరూరి భేటీ అయ్యారని.. ఆయన వరంగల్ నుంచి బీజేపీ ఎంపీగా పోటీ చేయడం ఖాయమైందని అంచనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో ఆయన హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని తన స్వగృహంలో బుధవారం ఉదయం ప్రెస్‌మీట్ పెట్టేందుకు సిద్ధమయ్యారు. దీంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు పార్టీ అధినేత కేసీఆర్ సూచనల మేరకు అరూరితో ఫోన్‌లో మాట్లాడి హైదరాబాద్‌కు రావాల్సిందిగా కోరారు. అరూరిని వెంటబెట్టుకుని వచ్చే బాధ్యతను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యకు అప్పగించారు.

అరూరి ఇంటివద్ద ఉద్రిక్తత

ఎర్రబెల్లి, బస్వరాజు సారయ్య, ఇతర నాయకులు హనుమకొండలోని అరూరి రమేశ్ ఇంటికి చేరుకున్నారు. వారి వెంట వచ్చిన మరికొందరు నేతలు, కార్యకర్తలు 'బీఆర్ఎస్ జిందాబాద్.. జై కేసీఆర్, జైజై కేసీఆర్' అంటూ నినాదాలు చేయడం ప్రారంభించారు. ఇంట్లో నాయకులు, శ్రేయోభిలాషులతో మాట్లాడుతున్న రమేశ్ వద్దకు వెళ్లిన నేతలు బీఆర్ఎస్‌ను వీడొద్దని బుజ్జగిస్తూ బయటికి తీసుకొచ్చారు. బలవంతంగా ఎర్రబెల్లి కారు ఎక్కించేందుకు ప్రయత్నించారు. రమేశ్ అనుచరులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఒకదశలో రమేశ్ కన్నీరు పెట్టుకున్నారు. ఈ సమయంలో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. అయితే ఎర్రబెల్లి, ఇతర నేతలు రమేశ్‌ను కారులో ఎక్కించుకుని కాన్వాయ్‌గా హైదరాబాద్‌కు బయలుదేరారు.

కాన్వాయ్‌ను అడ్డుకున్న బీజేపీ నేతలు

రమేశ్‌ను హైదరాబాద్‌కు తీసుకెళ్తున్న బీఆర్ఎస్ నేతల కాన్వాయ్‌ను జనగామ జిల్లా పెంబర్తి వద్ద బీజేపీ శ్రేణులు అడ్డుకున్నాయి. జనగామ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు ఎర్రబెల్లి వాహనంలో కూర్చున్న రమేశ్‌ను కిందికి దింపే ప్రయత్నం చేశారు. వారిని బీఆర్ఎస్ నేతలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో రమేశ్ చొక్కా చినిగిపోయింది. ఇరుపార్టీల ఆందోళన, తోపులాటలతో పెంబర్తి వద్ద హైవేపై అరగంటకుపైగా ఉద్రిక్తత నెలకొంది. ఆరుట్ల దశమంతరెడ్డి ఎలాగోలా రమేశ్ వద్దకు వచ్చి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడించగా.. ''నన్ను ఎవరూ బలవంతంగా తీసుకెళ్లడం లేదు. వ్యక్తిగత పనిమీద వెళ్తున్నా. మాట్లాడి వస్తా..'' అని చెప్పినట్టు సమాచారం. పోలీసులు ఇరుపార్టీల శ్రేణులను చెదరగొట్టడంతో.. ఎర్రబెల్లి కాన్వాయ్ హైదరాబాద్‌లోని కేసీఆర్ నివాసానికి చేరుకుంది. ఈ సందర్భంగా పార్టీ మారొద్దని అరూరి రమేశ్‌ను కేసీఆర్, ఇతర కీలక నేతలు బుజ్జగించినట్టు సమాచారం. ఈ భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన అరూరి.. తాను అమిత్ షాతో భేటీకాలేదని, బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నానని పేర్కొన్నారు. తనను ఎవరూ కిడ్నాప్ చేయలేని స్పష్టం చేశారు.

మరో బెంగళూరు కానివ్వొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

నిపుణుల కమిటీ అన్ని అంశాలను పరిశీలించి సూచనలతో కూడిన నివేదికను హైకోర్టుకు సమర్పించింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌కు కాలం చెల్లిపోయిందని నిర్మాణాలకు అనుమతులిచ్చే విషయంలో నిబంధనలు పాటిస్తున్నామని ప్రభుత్వ ప్రత్యేక న్యాయ వాది సిద్ధివర్ధన పేర్కొన్నారు. తాగునీటి సంరక్షణ కు సంబంధించిన ఈ పిటిషన్ ద్వారా కోరిన ఉపశమనం ..తీసుకోవాల్సిన చర్యలు వేరని, కాలం చెల్లిందన్న వాదన సరికాదని ధర్మాసనం అభిప్రాయపడింది.

ధర్మాసనం చేసిన సూచనలివీ...

- తాగునీటి పరిరక్షణ, పునర్వినియోగం, పంపిణీ లాంటి అంశాలను 3 నుంచి 5వ తరగతి పాఠ్యాంశాల్లో చేర్చే అంశాన్ని పరిశీలించాలి. 6వ తరగతి విద్యార్థులకు ఇదే అంశాలపై సిలబస్ స్థాయి పెంచి పాఠ్యాంశంగా చేర్చాలి.
- రాష్ట్రంలోని భూగర్భ జలాలను పరిశీలించి.. అవసరమైతే తాగునీటిని గార్డెనింగ్ వంటి పనులకు వినియోగించడంపై ఆంక్షలు విధించాలి.
- ఇంకుడు గుంతల్లేని నిర్మాణాలను గుర్తించడానికి, చర్యలు తీసుకోవడానికి పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి కసరత్తు చేయాలి.
- పట్టణ, స్థానిక సంస్థల్లో ఆర్‌డబ్ల్యూహెచ్‌ఎస్ నిబంధనలు అమల్లో ఉండేలా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి చర్యలు చేపట్టాలి.
- గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూహెచ్‌ఎస్ వ్యవస్థ అవశ్యకతను తెలియజేయడానికి చర్యలు చేపట్టాలి.
- గతేడాది మార్చి 31న జారీచేసిన జీవో 49 అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. చిన్న నిర్మాణాల్లో సైతం వాటర్ రీసైక్లింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలి.
- వాల్టా చట్టంలోని నిబంధనల అమలుకు సెక్షన్ 11 ప్రకారం సంబంధిత విభాగం నోటిఫికేషన్ జారీచేయాలి.

రేపు మల్కాజిగిరిలో మోదీ రోడ్‌షో

విజయవంతానికి ఈటల విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: ఈనెల 15వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు మల్కాజిగిరిలో జరిగే ప్రధాని మోదీ రోడ్‌షోను విజయవంతం చేయాలని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు ఈటల రాజేందర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గ చరిత్ర డబ్బులకు, ప్రలోభాలకులొంగేది కాదని, ఇక్కడి ప్రజలది ఆత్మగౌరవ బావుటా ఎగురవేసే చరిత్ర అని బుధవారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొ న్నారు. మోదీని మళ్లీ ప్రధానిగా చేయాలని కోరుకుంటున్న భావన ప్రజల్లో కనిపిస్తోందన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో కమలం వికసించబోతున్నదని, మోదీకి వచ్చే 370 సీట్లలో మల్కాజిగిరి ఒకటి కాబోతుందని ఈటల ధీమా వ్యక్తం చేశారు.

పొత్తులో ముందడుగు

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ భేటీ
- ఒకే సీటు ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్న బీఆర్ఎస్
- కలిసి పోటీ చేసే స్థానాలపై మాయావతితో చర్చించి ప్రకటన

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీఎస్పీల నడుమ పొత్తుల అంశంలో ముందడుగు పడింది. రెండు పార్టీల పొత్తు చర్చలు సఫలీకృతం అయ్యాయని, కలిసి పోటీ చేసే స్థానాలపై త్వరలోనే ప్రకటన చేస్తామని బీఎస్పీ తెలిపింది. అయితే బీఎస్పీతో జరిగిన పొత్తుల అంశంపై మరోమారు చర్చ జరిగే అవకాశముందని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌తో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం భేటీ అయ్యింది. నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి వెళ్లిన బీఎస్పీ బృందానికి మాజీ మంత్రి హరీశ్‌రావు స్వాగతం పలికారు. రెండు గంటల పాటు జరిగిన ఈ భేటీలో బీఎస్పీకి కేటాయించే స్థానాలపై చర్చ జరిగింది.

నాగర్‌కర్నూల్‌తో పాటు మరో రెండు?

నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానంతోపాటు మరో రెండు సీట్లు తమకు ఇవ్వాలని బీఎస్పీ ప్రతిపాదించినట్టు తెలిసింది. వీటిలో ఆదిలాబాద్ (ఎస్టీ)తో పాటు మరో జనరల్ సీటు ఏదైనా ఇవ్వాలని కోరినట్టు సమాచారం. అయితే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాత్రం నాగర్‌కర్నూల్ స్థానాన్ని పొత్తులో భాగంగా ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇప్పటికే బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతితోనూ సీట్ల కేటాయింపుపై కేసీఆర్ చర్చించినట్టు తెలిసింది. తాము కలిసి పోటీ చేసే స్థానాలపై మాయావతితో చర్చించిన తర్వాతే ప్రకటన చేస్తామని బీఎస్పీ రాజ్యసభ ఎంపీ, పార్టీ కేంద్ర సమన్వయకర్త రాంజీ గౌతమ్ కేసీఆర్‌తో భేటీ అనంతరం ప్రకటించారు. ఈ భేటీలో బీఎస్పీ తెలంగాణ సెంట్రల్ కోఆర్డినేటర్ మంద ప్రభాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దయానంద రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు విజయ్‌ఆర్య, కె.ఈశ్వర్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరాల్సిందిగా ఆహ్వానం వచ్చింది

వరంగల్ ఎంపీ దయాకర్ వెల్లడి



సాక్షి,హైదరాబాద్: బీజేపీలో చేరాల్సిందిగా తనకు కూడా ఆహ్వానం అందిందని వరంగల్ ఎంపీ పసునూరు దయాకర్ వెల్లడించారు. అయితే తాను మాత్రం బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. కేసీఆర్ నివాసం వద్ద బుధవారం దయాకర్ మీడియాతో మాట్లాడుతూ...ఉద్యమకాలం నుంచి తాను బీఆర్ఎస్‌లో కొనసాగానన్నారు. తనకు కేసీఆర్ రెండుసార్లు ఎంపీగా అవకాశం కల్పించారని గుర్తు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ అభ్యర్థిగా కేసీఆర్ ఎవరిని ఎంపిక చేసినా వారి గెలుపు కోసం పని చేస్తానని తెలిపారు. వరంగల్ లోక్‌సభ స్థానం పరిధిలో ఒకేఒక్క అసెంబ్లీ స్థానంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే గెలిచినా ప్రస్తుత ఎన్నికల్లో మాత్రం తమ పార్టీ అభ్యర్థే గెలుస్తారని దయాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పార్టీలోనే కొనసాగుతారన్నారు.

కేబినెట్‌లో భట్టి నంబర్ 2

మంత్రివర్గంలో ఆయన అత్యంత పవర్‌ఫుల్: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సంగంబండ రిజర్వాయర్ వద్ద ఉత్తమ్, భట్టి తదితరులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/మధిర: రాష్ట్ర మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రి సీఎం మల్లు భట్టి విక్రమార్క అత్యంత పవర్‌ఫుల్ అని భారీ సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కేబినెట్‌లో ఆయనే నంబర్- 2 అని వెల్లడించారు. బుధవారం ఆయన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి ఖమ్మం, నారాయణపేట జిల్లాల్లో పర్యటించారు. మధిరలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. మధిర నియోజకవర్గం ఎర్రుపాలెం మండలంలో ఉన్న సాగర్ ఆయకట్టు భూములను జోన్-3 నుంచి జోన్-2 కు మారుస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతానికి ఇన్నాళ్లు జోన్-3 నుంచి సాగునీరు సరఫరా అవుతుండగా.. చివరిభూములకు నీరందక పంటలు ఎండిపోతుండటంతో భట్టి సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పైసల కోసమే బీఆర్ఎస్ ప్రాజెక్టులు చేపట్టిందని.. నీళ్ల కోసం కాదని మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.22,507 కోట్లకు పైగా ఖర్చు చేసి.. ఒక్క ఎకరాకూ సాగునీరు అందించలేదన్నారు. ఐదేళ్లలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులోని లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేస్తామని.. ఉమ్మడి పాలమూరు జిల్లాలో అసంపూర్తిగా ఉన్న పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని చెప్పారు.

చెప్పిందే చేస్తాం.. చేసేదే చెబుతాం: భట్టి

'కాంగ్రెస్ పార్టీ చెప్పిందే చేస్తుంది.. చేసేదే చెబుతుంది. అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేశాం' అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. నారాయణపేట జిల్లా మక్తల్‌లో ఆయన మంత్రి ఉత్తమ్‌తో కలిసి సంగంబండ రిజర్వాయర్ లోలెవల్ కాల్వ బండ పనులను పరిశీలించారు. అనంతరం ప్రజాదీవెన సభలో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని రైతులందరికీ రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు. సాగు చేసుకుంటున్న ప్రతీ నిరుపేద రైతుకు రైతు భరోసా అందాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందుకే మొదట ఒక్క ఎకరంతో మొదలుపెట్టి మూడెకరాల వరకు రైతుల ఖాతాల్లో నగదు జమ చేశామని చెప్పారు. తాజాగా నాలుగు ఎకరాల వరకు రైతులకు డబ్బులు వేస్తున్నామని.. త్వరలోనే మిగతా రైతులందరికీ నగదు జమ చేస్తామని చేప్పారు. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించుకుంటున్న వారు బిల్లు కట్టాల్సిన పనిలేదని, జాబితాలో పేర్లు రాని అర్హులు ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి నమోదు చేసుకోవాలని సూచించారు.

ముందుచూపుతోనే వైఎస్సార్ జలయజ్ఞం

దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ముందుచూపుతోనే ఈ రాష్ట్రంలో జలయజ్ఞం కార్యక్రమాన్ని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని భట్టి చెప్పారు. అందులో భాగంగానే 70 వేల ఎకరాలకు నీరందించే సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి పునాది పడిందన్నారు. బండ పగలకొడితే 25 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని స్థానిక ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్ చెప్పారన్నారు. కృష్ణా, గోదావరి జలాలను మళ్లించే శక్తి సామర్థ్యాలతోపాటు మంచి ఆలోచన కలిగిన నాయకుడు మంత్రి ఉత్తమ్‌కుమార్ అని కొనియాడారు. పాలమూరు ప్రాంతం నుంచి వచ్చిన వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారని, ఈ ప్రాంతంపై ఆయనకు పూర్తి అవగాహన ఉందన్నారు.

లింక్ కెనాల్‌కు శంకుస్థాపన

వైరా/సూర్యాపేట: సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటిని వైరా రిజర్వాయర్‌కు మళ్లించేలా రూ.99.16కోట్లతో నిర్మించనున్న లింక్ కెనాల్ పనులకు వైరాలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్‌కుమార్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. అయితే, మధిర నుంచి వైరాకు వచ్చే క్రమంలో హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో భట్టి, ఉత్తమ్ రోడ్డు మార్గంలో చేరుకున్నారు. అంతకుముందు సూర్యాపేట నుంచి కోదాడకు వెళ్లేటప్పుడు కూడా హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తింది.



వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ముఖ్యనేతల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

సరైన అభ్యర్థులు లేకనే..

▶ మొదటి పేజీ తరువాయి

పార్టీ పరిస్థితిపై చర్చించారు. పార్టీ శ్రేణులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. వివరాలు కేసీఆర్ మాటల్లోనే.. ''దూరపు కొండలు నునుపు అన్నట్టు బీఆర్ఎస్‌ను వీడి ఇతర పార్టీల్లో చేరుతున్న నేతలకు అక్కడ పెద్దగా ఆదరణ ఏమీ ఉండదు. బీఆర్ఎస్ నేతలను చేర్చుకోవడం ద్వారా తమ బలం పెరిగిందనే ప్రచారం చేసుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయి. అందుకే కండువాలు కప్పి తమ వారు అనిపించుకునేందుకు రెండు పార్టీలు పోటీ పడుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీలకు నిజంగా బలముంటే వారి పార్టీల్లోనే అభ్యర్థులు ఎందుకు దొరకడం లేదు? బీజేపీ తాజాగా ప్రకటించిన జాబితాలో ఒక్కరైనా ఆ పార్టీలో పుట్టి పెరిగిన నేతలున్నారా? భవిష్యత్తులో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అసాధ్యమని ప్రజలకు అర్థమవుతోంది. భవిష్యత్తులో బీఆర్ఎస్ బీఫారం ఇస్తే చాలు గెలుపు ఖాయమనే పరిస్థితి వస్తుంది.

కాంగ్రెస్‌పై వ్యతిరేకత పెరుగుతోంది

క్షేత్రస్థాయిలో సాగునీరు, విద్యుత్, తాగునీటికి సమస్యలు నెలకొన్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంది. కాంగ్రెస్ సర్కారుపై పెరుగుతున్న ఈ ప్రజా వ్యతిరేకతను ఓట్ల రూపంలోకి మార్చుకునేందుకు బీఆర్ఎస్ ముఖ్యులు, మాజీ ఎమ్మెల్యేలు కలసికట్టుగా పనిచేయాలి..''అని కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. కాగా.. వరంగల్ లోక్‌సభ స్థానంలో పార్టీ తరఫున పోటీచేసే అభ్యర్థి ఎవరైతే బాగుంటుందన్న దానిపై భేటీకి హాజరైన నేతలను కేసీఆర్ ప్రశ్నించినట్టు తెలిసింది. ఈ భేటీలో మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, వినయ్‌భాస్కర్, నరేందర్, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకట రమణారెడ్డి, ఇతర నేతలు పాల్గొన్నారు.

మరో నలుగురితో బీఆర్ఎస్ రెండో జాబితా

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే మరో నలుగురు అభ్యర్థులను పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు ఖరారు చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ రెండో జాబితాను విడుదల చేశారు. ఇందులో చేవెళ్ల నుంచి మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్, వరంగల్ నుంచి కడియం శ్రీహరి కుమార్తె కావ్య పేర్లను ప్రకటించారు. ఇక నిజామాబాద్ సీటును మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జహీరాబాద్ సీటును గాలి అనిల్‌కుమార్‌లకు ఇచ్చారు. వాస్తవానికి బాజిరెడ్డి, గాలి అనిల్‌కుమార్, కాసాని జ్ఞానేశ్వర్‌ల అభ్యర్థిత్వం గతంలోనే ఖరారైనా ఇప్పుడు అధికారికంగా ప్రకటించారు. మరోవైపు వరంగల్ ముఖ్య నేతలతో భేటీ అయి చర్చించిన అనంతరం కడియం కావ్య పేరును ఎంపిక చేశారు. వరంగల్ నేతల సమష్టి నిర్ణయం మేరకే కావ్య అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశామంటూ ప్రకటన విడుదల చేయడం గమనార్హం. దీనితో బీఆర్ఎస్ ఇప్పటివరకు మొత్తంగా తొమ్మిది మంది అభ్యర్థుల పేర్లను బీఆర్ఎస్ ఖరారు చేసింది. తొలి జాబితాలో ఐదుగురు అభ్యర్థులు బి.వినోద్‌కుమార్ (కరీంనగర్), కొప్పుల ఈశ్వర్ (పెద్దపల్లి), నామా నాగేశ్వర్‌రావు (ఖమ్మం), మాలోత్ కవిత (మహబూబాబాద్), మన్నె శ్రీనివాస్‌రెడ్డి (మహబూబ్‌నగర్) పేర్లను ప్రకటించిన విషయం తెలిసిందే.

మెదక్ ఎంపీగా అవకాశమివ్వండి

- మున్షీకి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి వినతి



సాక్షి, హైదరాబాద్: మెదక్ లోక్‌సభ స్థానం నుంచి తనకు పోటీ చేసే అవకాశం ఇవ్వాలని సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి కోరారు. ఈ మేరకు రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీకి బుధవారం విజ్ఞప్తి చేశారు. గత 30 ఏళ్లుగా మెదక్ పార్లమెంటు స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ గెలుపొందలేదని, తనకు అవకాశమిస్తే కచ్చితంగా గెలుస్తానని మున్షీకి చెప్పినట్టు నిర్మలా జగ్గారెడ్డి తెలిపారు. కాగా, సికింద్రాబాద్ లోక్‌సభ నుంచి పోటీ చేసే అవకాశాన్ని మరోమారు తనకు ఇవ్వాలని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ కోరగా, పెద్దపల్లి, వరంగల్ స్థానాలను స్థానికులకే కేటాయించాలని ఆయా జిల్లాల నేతలు మున్షీని కోరినట్లు సమాచారం.

ఆ భాషకు ఆద్యుడు ఆయనే కదా?

- కేసీఆర్ అవినీతి జబ్బు అన్నారం, సుందిళ్లకు కూడా పాకింది
- తెలంగాణ ప్రజలు ఆయన కుర్చీని మడత పెట్టేశారు
- ప్రజాతీర్పును కేసీఆర్ చులకన చేస్తున్నారు
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భాష గురించి మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పీకడానికి, తోకమట్ట, బొందలగడ్డ, సన్నాసి, రండ వంటి పదాలను అలవోకగా వదిలి తెలంగాణ రాజకీయాల్లో నీచ భాషతో తిట్ల ప్రయోగాలకు ఆద్యుడు కేసీఆరే కదా అని పొంగులేటి ఎద్దేవా చేశారు. కరీంనగర్ సభలో కేసీఆర్ మాట్లాడుతూ ప్రజలు అత్యాశకు పోయారంటూ ప్రజాతీర్పును చులకన చేశారని ఆరోపించారు. ఈ మేరకు బుధవారం పొంగులేటి ఒక ప్రకటన విడుదల చేశారు. తనకు ఓటేసినంత కాలం ప్రజలు మంచోళ్లు, వ్యతిరేకంగా ఓటేస్తే మాత్రం వారికి తెలివి లేదన్నట్టు కేసీఆర్ మాట్లాడుతు న్నారని, అసలు ప్రజా తీర్పును ఆమోదిస్తున్నా మని ఇప్పటివరకు కేసీఆర్ నోటి నుంచి వచ్చిందా అని ప్రశ్నించారు. ఒక పన్ను పాడైతే అన్నీ పీకేసు కుంటామా అని కేసీఆర్ అంటున్నారని, అక్కడ పాడైంది పన్ను కాదని, కేసీఆర్ అవినీతికి బలైంది కాళేశ్వరం ప్రాజెక్టుకు వెన్నుముక మేడిగడ్డ అని తెలిపారు. కేసీఆర్ అవినీతి జబ్బు మేడిగడ్డతో పాటు అన్నారం, సుందిళ్లకు కూడా పాకిందని, వాటి పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉందని వెల్లడించారు. మేడిగడ్డ బ్యారేజీలోని 22 పిల్లర్లలో 7 పిల్లర్లు 3 మీటర్ల మేర కుంగాయని అందరూ గగ్గోలు పెడుతుంటే అపరమేధావి కేసీఆర్ మాత్రం సమస్యను చిన్నదిగా చూపే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

ఇప్పుడు టీవీల ముందు మాట్లాడతారా?

శాసనసభలో ఇరిగేషన్‌పై జరిగిన చర్చలో పారిపోయిన పెద్దమనిషి, 80 వేల పుస్తకాలు చదివిన మేధావి, కాళేశ్వరం రూపశిల్పి ఇప్పుడు టీవీల ముందు మాట్లాడుతారా అని పొంగులేటి ఎద్దేవా చేశారు. భూమి, ఆకాశం ఉన్నన్ని రోజులు బీఆర్ఎస్ ఉంటుందని కేసీఆర్ అంటున్నారని, దేశంలో గత్తర పుట్టిస్తానని, భూకంపం సృష్టిస్తానని చెప్పిన వ్యక్తి దేశంలో ఎక్కడా పోటీ చేయకుండా చేతులెత్తేస్తే, సొంత రాష్ట్రంలో ప్రజలు ఆయన కుర్చీని మడత పెట్టేశారని నిందించారు. కనీసం రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు బీఆర్ఎస్ పార్టీకి అభ్యర్థులు కూడా దొరకని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. కరువుకు, కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదని, తమ ప్రభుత్వం డిసెంబర్7న ఏర్పాటైందని, అప్పటికే వర్షాకాలం ముగిసిందని పొంగులేటి గుర్తు చేశారు.

ఆరు గ్యారంటీలకు నిధులేవీ?

- మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ గతే
- మోదీ ప్రధానిగా లేని భారత్‌ను ఊహించుకోలేం
- రసమయిపై మాట్లాడి నా స్థాయిని తగ్గించుకోను
- ఎంపీ బండి సంజయ్ వ్యాఖ్యలు



మాట్లాడుతున్న బండి సంజయ్

కరీంనగర్ టౌన్: ఆరు గ్యారంటీల అమలుకయ్యే నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు ఎందుకు విడుదల చేయలేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ మీటింగ్‌లో ఆరు గ్యారంటీలకు ఆమోదం తెలపకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. బుధవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2500, రైతు భరోసా కింద రైతులకు ఎకరాకు రూ.15 వేలు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారని నిందించిన ఆయన 15 లక్షల మంది కౌలు రైతులకు ఇస్తామన్న రైతు భరోసా హామీ ఏమైందని నిలదీశారు. ఆరు గ్యారంటీలపై ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు బీఆర్ఎస్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. మోదీ ప్రధానిగా లేని భారత్‌ను ప్రజలు ఊహించుకోవడం లేదని వ్యాఖ్యానించారు.

వినోద్‌కు కేసీఆర్ సర్టిఫికెట్ ఇవ్వడం హాస్యాస్పదం

మాజీ ఎంపీ వినోద్ కుమార్ నిజాయితీపరుడంటూ బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ సర్టిఫికెట్ ఇవ్వడం హాస్యాస్పదమని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో రూ.500 కోట్ల విలువైన భూదాన భూములను స్వాధీనం చేసుకున్నాడంటూ వినోద్ కుమార్‌పై మీడియాలో కథనాలు వస్తే కేసీఆర్ ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. రాజకీయాల్లో బూతులకు కేరాఫ్ అడ్రస్ కేసీఆర్ అని, పదేళ్లలో రాష్ట్రాన్ని దోచుకున్నారనీ, గతంలో, కేంద్ర మంత్రిగా ఉంటూ సహారా, ఈఎస్ఐ కుంభకోణాలకు పాల్పడ్డారని విమర్శించారు. బీఆర్ఎస్‌కు ఎంపీ అభ్యర్థులే కరువయ్యారని ఎద్దేవా చేశారు. కరీంనగర్ బహిరంగసభలో రసమయి బాలకిషన్ చేసిన వ్యాఖ్యలపై మాట్లాడి తన స్థాయిని తగ్గించుకోలేననీ, అతని సంగతి తమ పార్టీనే చూస్తుందని బండి పేర్కొన్నారు.

త్వరలో కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు

రేషన్ కార్డులతో సంబంధం లేకుండా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇప్పటివరకు కొందరు పేదలకు ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్నాయి. అంతేకాకుండా అనేకమంది తెల్ల రేషన్‌కార్డును ఆధారం చేసుకొనే ఆరోగ్యశ్రీ సేవలు పొందుతున్న సంగతి తెలిసిందే. ఇక నుంచి ఆరోగ్యశ్రీకి రేషన్ కార్డుకు లింకు పెట్టకూడదని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో కొత్త ఆరోగ్యశ్రీ కార్డుల జారీ అంశంపై ఆరోగ్యశ్రీ ట్రస్టు దృష్టిసారించింది. ఈ మేరకు లబ్ధిదారుల గుర్తింపుపై మార్గదర్శకాలు రూపొందిస్తోంది. అందరికీ ఆరోగ్యశ్రీని వర్తింప చేస్తే ఎలా ఉంటుందన్న దానిపై వైద్య, ఆరోగ్యశాఖ కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ కోసం ఏటా రూ.1,100 కోట్లు ఖర్చు చేస్తున్నారు. అందరికీ వర్తింప చేయడం వల్ల అదనంగా రూ.400 కోట్ల భారం పడే అవకాశం ఉందని, ఇది పెద్ద భారం కాదన్న భావనలో సర్కారు ఉంది. మధ్యతరగతి ప్రజల్లో చాలామందికి, ఉద్యోగులకు, ఇతరులకు పలు పథకాలు ఉన్నాయి. అలాగే ప్రైవేట్ ఆరోగ్య బీమాతో ఆరోగ్య సేవలు పొందుతున్న వారూ చాలామంది ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆరోగ్యశ్రీ కార్డులతో అందరికీ సార్వజనీన ఆరోగ్య సేవలు అందించవచ్చని సర్కారు యోచిస్తోంది.

వంద శస్త్రచికిత్సలు చేర్చే అవకాశం

రాష్ట్రంలో 293 ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులు, 198 ప్రభుత్వ పెద్దాసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్నాయి. అలాగే గత ఏడాది 809 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ)లోనూ ఆరోగ్యశ్రీ కింద సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. మొత్తంగా రాష్ట్రంలో 1,310 ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఆరోగ్యశ్రీకి అర్హులుగా 77.19 లక్షల మంది పేదలు ఉన్నారు. ఉద్యోగులు, జర్నలిస్టుల ఆరోగ్య పథకాన్ని కూడా ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా అమలు చేస్తున్నారు. లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులు, జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు ఈజేహెచ్‌ఎస్ కిందకు వస్తారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ కింద 1,376 శస్త్రచికిత్సలు, 289 వైద్య సేవలున్నాయి. ఆయుష్మాన్ భారత్ కింద 1,949 వ్యాధులకు వైద్యం అందుతోంది. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్‌లో ఈ రెండింటిలో ఉన్న వ్యాధులను కలిపి అమలు చేస్తున్నారు. వీటికి సుమారు మరో వంద శస్త్రచికిత్సలను చేర్చే అవకాశం ఉంది.

ఒక్కో కుటుంబానికి 10 లక్షల కవరేజీ

ఆయుష్మాన్ భారత్ పథకం కింద కేంద్రం 2022లో ప్యాకేజీలను సవరించింది. గతంలో ఆరోగ్యశ్రీ కింద కవరేజీ రూ. 2 లక్షలు ఉండగా, ఆయుష్మాన్ భారత్ పథకం రావడంతో దాన్ని రూ. 5 లక్షలు చేశారు. కొత్త కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని రూ.10 లక్షలు చేసిన సంగతి తెలిసిందే. ఏడాదికి ఈ పథకాల కింద ఒక్కో కుటుంబానికి రూ. 10 లక్షల వరకు కవరేజీ వర్తిస్తుంది. దీనికి ప్యాకేజీ సొమ్ము కూడా పెంచితే ఏటా రూ.1,500 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.



ఈహెచ్‌ఎస్ పథకంపై తేలని నిర్ణయం

ఈహెచ్‌ఎస్ పథకంపై ఉద్యోగులు కంట్రిబ్యూషన్ ఇస్తామని పేర్కొన్న సంగతి విదితమే. గత అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌కు ముందు రోజు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంప్లాయి హెల్త్ కేర్ ట్రస్ట్ (ఈహెచ్‌సీటీ) ఏర్పాటు చేసి అమలు చేయాలని నిర్ణయించింది. పథకం అమలుకు ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేసి ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి కొంత మొత్తాన్ని, అంతే మొత్తంలో ప్రతి నెలా ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్‌గా జమ చేయాలని పేర్కొన్నది. ఈ మేరకు తమ మూల వేతనంలో ఒక శాతం కాంట్రిబ్యూషన్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ప్రభుత్వానికి గతంలో విజ్ఞప్తి చేశాయి. ఆసుపత్రుల్లో తమకు వైద్యం అందనందున ఈ ప్రక్రియకు ఉద్యోగులు కూడా ముందుకు వచ్చారు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం దీనిపై ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అంటున్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల బకాయిల చెల్లింపునకు ఏర్పాట్లు

ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులు మాత్రం ఆరోగ్యశ్రీ రోగులకు వైద్యం చేయడంపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. బకాయిలు పేరుకుపోవడంతో పాటు ఆరోగ్యశ్రీ కింద ఆసుపత్రులకు ఇచ్చే ప్యాకేజీ సొమ్ము సరిపోవడం లేదని ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు చెబుతున్నాయి. దీంతో ఆరోగ్యశ్రీ లబ్ధిదారులు, ఈహెచ్‌ఎస్ బాధితులు డబ్బులు చెల్లించి వైద్యం పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. కరోనా తర్వాత అనారోగ్య సమస్యలు పెరగడంతో చాలామంది ప్రైవేట్ ఆరోగ్య బీమా తీసుకుంటున్నారు. ఉద్యోగులైతే రీయింబర్స్‌మెంట్ పద్ధతిలో ముందుగా డబ్బులు చెల్లించి వైద్యం పొందుతున్నారు. అయితే బిల్లుల సొమ్ము మాత్రం పూర్తి స్థాయిలో రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దఎత్తున బిల్లులు పేరుకుపోవడం వల్లే తాము వైద్యం అందించలేకపోతున్నామని ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు నెట్‌వర్క్ ఆసుపత్రుల లెక్క ప్రకారం దాదాపు రూ.500 కోట్లు ఆరోగ్యశ్రీ నుంచి తమకు రావాల్సిన బిల్లుల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని అంటున్నాయి. మరోవైపు వివిధ వ్యాధులకు 2013లో నిర్ధారించిన ప్యాకేజీ ప్రకారమే ఆసుపత్రులకు సొమ్ము అందుతోంది. అంటే తెలంగాణ ఏర్పడ్డాక ఇప్పటివరకు ఒక్కసారి కూడా వ్యాధులు, చికిత్సలకు ప్యాకేజీ సవరణ జరగలేదు. ఈ రెండు కారణాల వల్ల తాము ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్ పథకాల కింద వైద్యం చేయలేకపోతున్నామని ఆసుపత్రుల యాజమాన్యాలు అంటున్నాయి. ఈ నేపథ్యంలో పెండింగ్ బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి.

క్లుప్తంగా...

త్వరలో రాష్ట్రానికి వెయ్యి కొత్త బస్సులు

- ఆర్టీసీలో 3,500 మంది నియామకాలు
- మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్: ప్రయాణికుల సౌకర్యార్థం త్వరలో వెయ్యి కొత్త బస్సులు కొంటున్నామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో బుధవారం ఆయన రూ.18.50 కోట్ల వ్యయంతో నిర్మించే పలు అభివృద్ధి పనులకు కలెక్టర్ మను చౌదరితో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీలో 3,500 మందితో నియామకాలు చేపడుతున్నామని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు సీఎం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టు ట్రయల్ రన్ చేసి, కాలువల నిర్మాణం చేపట్టలేదన్నారు.

పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు శుభపరిణామం

రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మచ్చ వరలక్ష్మి



సాక్షి, హైదరాబాద్: పద్మశాలి కులస్తుల ఆర్థిక, సామాజికాభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం శుభపరిణామమని కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మచ్చ వరలక్ష్మి పేర్కొన్నారు. పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ...తెలంగాణ ఏర్పాటైన తర్వాత పదేళ్లలో కేసీఆర్ రజాకార్ల పాలన సాగిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలో సామాజిక తెలంగాణ దిశగా అడుగులు పడుతున్నాయన్నారు.

జేఈఈలో 2021-22 ముందు పాసైన వారికి అవకాశం ఇవ్వాలి: కేఎన్‌వీ

సాక్షి, హైదరాబాద్: కేంద్ర విద్యా సంస్థలైన ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, ఎన్ఐటీ తదితర వాటిల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ పరీక్షకు 2021-22 సెప్టెంబర్ ముందు పాసైన అభ్యర్థులు అనర్హులని కేంద్ర విద్యాశాఖ ప్రకటించడం దారుణమని కుల నిర్మూలన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాపని నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. కోవిడ్-19 పరిస్థితులతో దాదాపు మూడేళ్లపాటు విద్యా వ్యవస్థ తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొందని, విద్యార్థులు సైతం తీవ్రంగా నష్టపోయారని, ఇలాంటి పరిస్థితుల్లో 2021-22 సెప్టెంబర్ కంటే ముందు చదివిన విద్యార్థులకు జేఈఈలో అవకాశం ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఈ వ్యవహారం కుట్రపూరితంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు.

అన్ని కులాలకు కార్పొరేషన్లు: జాజుల వినతి



సాక్షి, హైదరాబాద్: అన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. 8 బీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తూ కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్పొరేషన్లకు పాలకమండళ్లను నియమించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు కేటాయించాలని జాజుల కోరారు.

కేసీఆర్ చేసిన మంచిని మరిచి బురద జల్లుతున్నారు

మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: పదేళ్లలో కేసీఆర్ సీఎంగా తెలంగాణకు చేసిన మేలు గురించి మాట్లాడకుండా ఆయన మీద బురదజల్లడమే ఎజెండాగా కాంగ్రెస్, బీజేపీ పనిచేస్తున్నాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణభవన్‌లో బుధవారం మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, మన్నె గోవర్ధన్‌రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణకు చేసిన మేలు గురించి చర్చకు సిద్ధమా అంటూ కేసీఆర్ విసిరిన సవాల్‌ను స్వీకరించకుండా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తోక ముడిచారని విమర్శించారు. పదేళ్ల నుంచి మోదీ, అమిత్‌షాలు కేసీఆర్ మీద నిందలు మోపడం తప్ప ఒక్కటీ నిరూపించడం లేదని చెప్పారు. పార్టీని వీడుతున్న నేతల తీరును గమనిస్తున్న ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి సలాం చేస్తూ, బీజేపీకి గులాం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఏక్‌నాథ్ షిండే వస్తాడన్న బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మాటల గురించి స్పందించే దమ్ము రేవంత్‌రెడ్డికి లేదా అని ప్రశ్నించారు.

సవరణ

13వ తేదీ నాటి సాక్షి సంచికలో కాళేశ్వరంపై కమిషన్ వార్తలో కమిషన్ చైర్మన్ పేరు జస్టిస్ పినాకి చంద్రఘోష్‌కు బదులుగా జస్టిస్ పినాకిని చంద్రబోస్‌గా పొరపాటున ప్రచురితమైంది.

15న సీఎం ఇఫ్తార్ విందు

ఎల్బీ స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలించిన షబ్బీర్ అలీ



ఇఫ్తార్ విందు ఏర్పాట్లను పరిశీలిస్తున్న నేతలు

సాక్షి, హైదరాబాద్: పవిత్ర రంజాన్ మాసం తొలి శుక్రవారం పురస్కరించుకుని ముస్లిం సోదరులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇఫ్తార్ విందు ఇవ్వనున్నారు. ఈ నెల 15న ఎల్బీ స్టేడియంలో జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ పలువురు అధికారులతో కలసి ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఇఫ్తార్ తర్వాత నమాజ్ చేసేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులకు షబ్బీర్ అలీ సూచించారు. ఇఫ్తార్‌తో పాటు ప్రతి ఒక్కరికీ భోజన సదుపాయం, తాగునీరు అందుబాటులో ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, సీఎం కార్యదర్శి షానవాజ్ ఖాసిం, ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంతరావు, నగర అదనపు పోలీస్ కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు షబ్బీర్ అలీ వెంట ఉన్నారు.

ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ రూపకల్పన

- ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- గోదావరిఖనిలో 355 పడకల ఆస్పత్రికి భూమిపూజ



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని(రామగుండం): రాష్ట్రంలోని ప్రజలందరి హెల్త్ ప్రొఫైల్ రూపొందించే పనిలో ప్రభుత్వం ఉందని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. బుధవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో రూ.142 కోట్ల నిధులతో నూతనంగా నిర్మించే 355 అదనపు పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ ఎం.శ్రీనివాస్, రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రామగుండం ప్రాంతంలో మెడికల్ కళాశాలకు అనుసంధానంగా నర్సింగ్ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రాథమిక వైద్యం అందించే దిశగా కార్పొరేషన్‌లో అవసరమైన చోట బస్తీ దవాఖానాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆర్‌ఎంపీలకు శిక్షణ అందించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని, వైద్య విద్యార్థులు ఎంబీబీఎస్‌తో ఆపకుండా పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు స్పెషలైజేషన్ చేయాలని సూచించారు. రామగుండం ప్రాంతంలో నిరుపేద ఆటో కార్మికులందరికీ ఇళ్ల స్థలాలు అందిస్తామని ఆయన హామీనిచ్చారు. సింగరేణి ఓసీపీల్లో స్థానిక యువతకు 80 శాతం మేర ఉపాధి కల్పించాలని సూచించారు. రామగుండంలో ఉన్న సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్ వంటి పరిశ్రమలకు అనుసంధానంగా చిన్న సూక్ష్మ పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ఎంఎస్‌ఎంఈ పార్క్ స్థాపనకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు.

28న బార్ అసోసియేషన్ల ఎన్నికలు

అన్ని చర్యలు చేపట్టండి: బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్లకు ఈ నెల 28న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రస్తుత కమిటీలను తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి ఆదేశించారు. ఇప్పటికే ఓటర్ల జాబితాను ఆయా అసోసియేషన్లకు పంపినట్లు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 15న ఎన్నికల నోటిఫికేషన్ జారీ కానుందని, ఎన్నికల మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ కోసం అడహక్ కమిటీలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల్లో విజయం సాధించిన వారు ఏప్రిల్ 1న బాధ్యతలు చేపడతారని వివరించారు.



పారాచూట్లకే ప్రాధాన్యం!

▶ మొదటి పేజీ తరువాయి

పార్టీల నుంచి వచ్చినవారేనని అంటున్నారు. తొలిజాబితాలో ప్రకటించిన ఎంపీ బీబీ పాటిల్ (జహీరాబాద్), ఎంపీ పి.రాములు కుమారుడు భరత్ (నాగర్‌కర్నూల్) బీఆర్‌ఎస్ నుంచి వచ్చారని.. పార్టీలో కూడా చేరని మాధవీలతకు హైదరాబాద్ టికెట్ ఇచ్చారని పేర్కొంటున్నారు. అయితే పార్టీపరంగా బలమైన అభ్యర్థులు లేని ఎంపీ సీట్లలో గెలుపు ప్రాతిపదికగా ఇతర పార్టీల నుంచి వచ్చినవారికి జాతీయ నాయకత్వం టికెట్లు కేటాయించిందంటూ కొందరు పార్టీ ముఖ్యనేతలు సమర్థిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా అత్యధిక స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్టు చెప్తున్నారు.

ఎస్సీ రిజర్వ్‌డ్ అన్నీ వారికేనా?

రాష్ట్రంలో మూడు ఎస్సీ రిజర్వ్‌డ్ లోక్‌సభ స్థానాలు ఉండగా.. ఆ స్థానాలను పార్టీలో ముందు నుంచీ ఉన్నవారికి కాకుండా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ఇవ్వడం ఏమిటని అంతర్గతంగా విమర్శలు వస్తున్నాయి. ఈ మూడు సీట్లను మాదిగ సామాజికవర్గానికి ఇవ్వాలని సూత్రప్రాయంగా నిర్ణయించడంతోపాటు ఇప్పటికే రెండు టికెట్లను (నాగర్‌కర్నూల్, పెద్దపల్లి) వారికే ప్రకటించడం పట్ల పార్టీలోని మాల సామాజికవర్గ నేతలు, కార్యకర్తల్లో అసంతృప్తి కనిపిస్తోంది. పెండింగ్‌లో పెట్టిన వరంగల్ (ఎస్సీ) సీటును కూడా మాదిగలకే కేటాయించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఇక్కడ బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ బీజేపీలో చేరి పోటీ చేయాలని నిర్ణయించుకున్నా.. బీఆర్‌ఎస్ నేతలు తాత్కాలికంగా అడ్డుకున్నారని కాషాయ వర్గాలు అంటున్నాయి. వరంగల్ టికెట్‌ను బీఆర్‌ఎస్ కడియం కావ్యకు ఇచ్చిన నేపథ్యంలో.. అరూరి రమేశ్ బీజేపీ తరఫున పోటీ చేసేందుకు ఇంకా అవకాశాలు ఉన్నాయని పేర్కొంటున్నాయి.

21 ఇళ్ల స్థలాలు, 7 ఎకరాల పొలం

- జమ్మికుంట తహసీల్దార్ రజని ఆస్తుల చిట్టా... ఆరుచోట్ల ఏసీబీ దాడులు



వరంగల్ క్రైం: రెండు అంతస్తుల ఇల్లు, 21 ఇంటి స్థలాలు, ఏడు ఎకరాల భూమి, కిలోన్నర బంగారం, 2 కార్లు, 3 ద్విచక్ర వాహనాలు, బ్యాంకులో రూ.25లక్షలు, ఇంట్లో రూ.1.50 లక్షల నగదు.. ఇతరత్రా కలిపి మార్కెట్ విలువ ప్రకారం రూ.12 కోట్ల ఆస్తులు.. ఇదంతా కరీంనగర్ జిల్లా జమ్మికుంట తహసీల్దార్ మర్కల రజనికి చెందిన ఆస్తుల చిట్టా. హనుమకొండ కేఎల్‌ఎన్‌రెడ్డి కాలనీలోని ఇంటితోపాటు మరో ఐదు చోట్ల ఏకకాలంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు బుధవారం నిర్వహించిన దాడుల్లో ఇవన్నీ వెలుగుచూశాయి. తహసీల్దార్ రజని ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నట్లు ఆరోపణలు రావడంతో ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళిక ప్రకారం ఆమె బంధువుల ఇళ్లల్లో, ఆమె గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన ప్రాంతాల్లో, ఆమెకు సన్నిహితంగా ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. తహసీల్దార్ రజనిని అదుపులోకి తీసుకుని కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు.

ఇంజనీరింగ్ కొలువుల భర్తీ షురూ

▶ మొదటి పేజీ తరువాయి

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూ)లోని పరిపాలన విభాగంలో ఈ పరిశీలన ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపింది. ప్రాథమికంగా ఎంపికైన అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్‌ను తెరిచి చెక్‌లిస్టు డౌన్‌లోడ్ చేసుకోవాలని, అప్లికేషన్ పత్రాలను రెండు కాపీలు ప్రింట్ తీసుకోవాలని, అదేవిధంగా అటెస్టేషన్ పత్రాలను కూడా రెండు సెట్లు ప్రింట్ తీసుకుని అందుబాటులో ఉంచుకోవాలని సూచించింది. చెక్‌లిస్టులో నిర్దేశించినట్లుగా అభ్యర్థులు అన్నిరకాల సర్టిఫికెట్లతో హాజరు కావాలని పేర్కొంది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలో అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలు సమర్పించకుంటే తదుపరి అవకాశం ఉండదని స్పష్టం చేసింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కాని అభ్యర్థులకు సైతం మరో అవకాశం ఇచ్చేది లేదని కమిషన్ తేల్చిచెప్పింది.

వెబ్‌సైట్‌లో డీఏఓ, హెచ్‌డబ్ల్యూఓ పరీక్షల తేదీలు

ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్(డీఏఓ), హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్(హెచ్‌డబ్ల్యూఓ) ఉద్యోగ అర్హత పరీక్షల తేదీలను కూడా కమిషన్ వెల్లడించింది. పరీక్షల షెడ్యూల్‌ను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. డీఏఓ ఉద్యోగ ఖాళీలు 53, హెచ్‌డబ్ల్యూఓ ఖాళీలు 581 ఉన్నాయి.

ఒప్పందాలు జరగని టెండర్లు రద్దు

నీటిపారుదల శాఖకు ప్రభుత్వం ఆదేశం

సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వ హయాంలో టెండర్లు జరిగినా, ఇంకా కాంట్రాక్టర్లతో ఒప్పందం జరగని పనులను రద్దు చేయాలని నీటిపారుదలశాఖను ప్రభుత్వం ఆదేశించింది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు అందించే పనులను మాత్రమే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2024-25లో కొత్తగా 7లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో గత శాసనసభ ఎన్నికలకు ముందు పిలిచిన టెండర్లు రద్దు చేయాలని నీటిపారుదల శాఖను ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా రూ.8877 కోట్లు విలువ చేసే 66 టెండర్లు రద్దు చేయాలని ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. ఇందులో రూ.6,655 కోట్లు విలువైన పనులు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు విస్తరణకు సంబంధించినవి కాగా, మరో రూ.1,658 కోట్లు చెన్నూరు ఎత్తిపోతల పథకానికి సంబంధించినవి ఉన్నాయి.

ఇంటర్ స్పాట్ షురూ

- నేటితో ముగియనున్న పరీక్షలు
- 16 నుంచి పూర్తి స్థాయిలో మూల్యాంకనం... ఏప్రిల్ మూడో వారంలోనే ఫలితాలు?


సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ మొదలైంది. ఈ నెల 16 నుంచి ఈ ప్రక్రియ మరింత ఊపందుకుంటుందని అధికారులు తెలిపారు. నెల రోజుల పాటు ఇది కొనసాగుతుందని, పరీక్ష ముగిసిన వెంటనే విద్యార్థుల సమాధాన పత్రాలను మూల్యాంకన కేంద్రాల (స్పాట్ వాల్యూయేషన్)కు తరలిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం కలిపి దాదాపు 10 లక్షల మంది వరకు పరీక్షలు రాస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని మూల్యాంకన కేంద్రాలనూ పెంచారు. ఆదిలాబాద్ జిల్లాలో ఒకటి, భద్రాద్రి కొత్తగూడెంలో మరో కేంద్రం అదనంగా ఏర్పాటు చేశారు. ఇంటర్ పరీక్షలు గురువారం ముగియనున్న నేపథ్యంలో మూల్యాంకనం చేపట్టాల్సిన అధ్యాపకులు కొందరు ఇంకా ఇన్విజిలేషన్ విధుల్లోనే ఉన్నారు. పరీక్షలు ముగిసిన వెంటనే వీరు కూడా 'స్పాట్'లో భాగస్వాములవుతారని ఇంటర్ పరీక్షల విభాగం తెలిపింది. ఈ ఏడాది నుంచి మూల్యాంకనాన్ని ఆన్‌లైన్‌లో పూర్తిస్థాయిలో చేపట్టాలని భావించారు. కానీ ప్రభుత్వం నుంచి ఆమోదం లభించకపోవడంతో ఎప్పటిలాగే సాధారణ పద్ధతిలో మూల్యాంకనం చేపడుతున్నారు.

నిరంతర పర్యవేక్షణ

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల సమాధాన పత్రాలు 60 లక్షల వరకూ ఉంటాయి. ఇవి ఎప్పటికప్పుడు మూల్యాంకన కేంద్రానికి చేరుకోగానే ఓఎంఆర్ షీట్‌లో ఉన్న విద్యార్థి వ్యక్తిగత సమాచారం తొలగిస్తారు. దీని స్థానంలో కోడ్ నంబర్ ఇస్తారు. కోడింగ్ మొత్తం ఇంటర్ బోర్డుకు ఆన్‌లైన్ ద్వారా అనుసంధానమై ఉంటుంది. తద్వారా సమాధాన పత్రం ఎవరిది అనే విషయం మూల్యాంకనం చేసే వ్యక్తికి తెలియకుండా జాగ్రత్త పడతారు. ఆయా కేంద్రాల్లో నిర్దేశిత సబ్జెక్టు అధ్యాపకులు సమాధాన పత్రాలను పరిశీలించి మార్కులేస్తారు. వీటిని మూడు దఫాలుగా అధికారులు పరిశీలిస్తారు. ఆ తర్వాత మార్కుల వివరాలు ఆన్‌లైన్ ద్వారా బోర్డుకు అందుతాయి. మార్కులు కంప్యూటరైజ్ చేసిన తర్వాత అధికారులు డీ కోడ్ చేస్తారు. అన్ని సబ్జెక్టు మార్కులను క్రోడీకరిస్తారు. ఆ తర్వాత ఉన్నతాధికారులు సగటున కొన్ని పేపర్లను మరోసారి పరిశీలిస్తారు. ఈ ప్రక్రియ అంతటిపై ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. ఆయా దశలను దాటిన తర్వాత ఫలితాలను వెల్లడిస్తారు.

వారం ముందుగానే ఫలితాలు?

ఇంటర్ పరీక్ష ఫలితాలను వీలైనంత త్వరగా వెల్లడించాలని బోర్డు భావిస్తోంది. ప్రతి ఏటా ఏప్రిల్ నాలుగోవారంలో వెల్లడించడం ఆనవాయితీ. అయితే ఈసారి ఇంతకన్నా ముందే రిజల్ట్స్ ఇవ్వాలని అధికారులు అనుకుంటున్నారు. మూల్యాంకన ప్ర క్రియతో పాటు డీకోడింగ్ విధానాన్ని వేగంగా పూర్తి చేసి మూడో వారంలోనే ఫలితాలు ప్రకటించే ఆలోచనలో ఉన్నారు. వీలైనంత త్వరగా ఫలితాలు ప్రకటించేందుకు కృషి చేస్తున్నామని ఇంటర్ పరీక్షల విభాగం అధికారిణి జయప్రదాబాయ్ తెలిపారు.



ఇందిరమ్మ పట్టాలు ఇప్పట్లో లేనట్టే!

▶ మొదటి పేజీ తరువాయి

వీరంతా తదుపరి విడత కోసం ఎదురు చూడక తప్పని పరిస్థితి నెలకొంది.

లక్ష ఇళ్లపైనే దృష్టి: ఈ ఆర్థిక సంవత్సరంలో నాలుగున్నర లక్షల ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నా.. ఏడాది కాలంలో లక్ష ఇళ్లకు మించి పూర్తి కావని ప్రభుత్వం అంచనా వేస్తోంది. దీంతో తొలుత ఆ లక్ష ఇళ్లకు సరిపడా నిధులు సిద్ధం చేసుకోవాలని నిర్ణయించింది. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆ ప్రక్రియ కాస్తా పూర్తయి, కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాతే ఇళ్ల కేటాయింపు ప్రక్రియ ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. అంటే జూలైలో ఈ ప్రక్రియ ఊపందుకుంటుంది. గ్రామ సభలు నిర్వహించి అర్హుల ఎంపిక పూర్తి అయ్యేసరికి రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. అప్పటికి కూడా వానాకాలం కొనసాగనున్నందున అక్టోబర్ తర్వాత గాని ఆ ప్రక్రియలో వేగం పెరగదు. అయితే వివిధ దశల్లో ఇళ్ల నిర్మాణం కొనసాగుతుంది. ప్రభుత్వం ఇచ్చే నిధులకు కొన్ని సొంత నిధులు కలిపి లబ్ధిదారులు పనులు చేసుకోవాల్సి ఉంటుంది. ఇది కొన్ని కుటుంబాల్లో ఆర్థికపరమైన ఇబ్బందులకు కారణమవుతుంది. అలాంటి వారి ఇళ్ల నిర్మాణంలో జాప్యం జరుగుతుంది. ఈలోపు ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. ఈ క్రమంలో వచ్చే మార్చిలోపు కొన్ని ఇళ్లకే పూర్తి నిధులు కేటాయించాల్సి ఉంటుంది. అలా దాదాపు లక్ష ఇళ్లకే నిధులు అందించాల్సిన పరిస్థితి ఉంటుందని ప్రభుత్వ అంచనా వేస్తోంది.

నిధులు సిద్ధం!: లక్ష ఇళ్లకు రూ.5 వేల కోట్ల నిధులు కావాల్సి ఉంటుంది. హడ్కో నిధుల కోసం గతంలోనే ప్రభుత్వం దరఖాస్తు చేయగా, ప్రస్తుతం రూ.3 వేల కోట్ల రుణం మంజూరైంది. ఇందులో రూ.1,500 కోట్లు మాత్రమే ఇప్పుడు విడుదల కానున్నాయి. కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం మొదటి కిస్తీగా రూ.1,000 కోట్లు మంజూరవుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. వెరసి రూ.2,500 కోట్లు అందుబాటులో ఉన్నట్టవుతుంది. కాగా మిగతా మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ద్వారా కేటాయించాల్సి ఉంటుంది. ఈ విధంగా లక్ష ఇళ్లకు నిధులు దాదాపు సిద్ధంగా ఉన్నట్టుగానే ప్రభుత్వం భావిస్తోంది.


సర్వే వివరాల్లో ప్రణాళిక శాఖది కీలక పాత్ర

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ చిన్నారెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ పాలనలో వివిధ శాఖలకు గణాంకాలు, సర్వే వివరాల సమాచారాన్ని అందించడంలో ప్రణాళిక శాఖ కీలక పాత్రను పోషిస్తోందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి అన్నారు. పెరుగుతున్న ఎండల తీవ్రతపై ప్రభుత్వానికి, ప్రజలకు ఎప్పటికప్పుడు ముందస్తు సమాచారాన్ని ఇవ్వాలని ఆయన అధికారులకు సూచించారు. బుధవారం అర్థగణాంకశాఖ, ప్రణాళిక అభివృద్ధి సొసైటీ కార్యాలయాలను చిన్నారెడ్డి సందర్శించారు. ప్రతి విభాగంలో కలియ తిరుగుతూ.. సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేశారు. అనంతరం ఆయా విభాగాల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రంలో పంటల సాగు విస్తీర్ణం, గ్రామస్థాయి నుంచి సేకరించిన వివిధ అంశాల గణాంక వివరాలు, కుల, జన, జంతువులు, పాఠశాలలు, ఇతర వివరాల సర్వే విధానం, వాతావరణ విశ్లేషణ వంటి అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. అర్థ గణాంక శాఖ సంచాలకుడు దయానంద్.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశాల్లో ఇతర ఉన్నతాధికారులు రవీందర్ రెడ్డి, రమణ, శివ కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.





సంతృప్తిగా ఉండటం సహజ సంపద,
విలాసం కృత్రిమ పేదరికం.
– సోక్రటీస్

సాక్షి
గురువారం, 14 మార్చి 2024

బెంగళూరు దాహార్తి!

దేశంలో నీటి ఎద్దడి నిత్యజీవిత వ్యథగా పరిణమించి చాలా కాలమైంది. అది స్థలకాలాదులను అధిగమించింది. దాని బారిన పడని నగరమంటూ లేదు. బెంగళూరు దాహార్తి అందులో భాగమే. అది జనాభారీత్యా దేశంలో మూడో అతి పెద్ద నగరం. సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో అది దేశానికే ఐటీ రాజధాని. కానీ తాగటానికి గుక్కెడు నీళ్లు కరువైతే ఆ భుజకీర్తులన్నీ దేనికి పనికొస్తాయి? 500 ఏళ్లనాటి ఆ నగరం గొంతెండి నీళ్ల కోసం అలమటిస్తోంది. టెకీలంతా నగరాన్నొదిలి స్వస్థలాల నుంచి పనిచేయటం మొదలుపెట్టారు. అపార్ట్‌మెంట్‌లన్నీ బేల చూపులు చూస్తున్నాయి. కోచింగ్ సెంటర్లు ఆన్‌లైన్ క్లాసులకు మళ్లాయి. రోడ్డుపై పోయే నీటి ట్యాంకర్ల వెనక జనం పరుగు లెడుతున్నారు. ఇది పరీక్షల కాలమైనా విద్యార్థులకు నీటి అన్వేషణ ముఖ్యమైపోయింది. కావేరి పరివాహ ప్రాంతాన్ని కరువు కాటేయటంతో నగరానికి వచ్చే నీరు తగ్గింది. భూగర్భ జలాలు అడుగంటాయి. మార్చి నెలాఖరుకు రావాల్సిన ఉష్ణోగ్రతలు బెంగళూరును ఫిబ్రవరి మూడోవారం లోనే పలకరించాయి. కోటిన్నర జనాభాగల ఆ నగరంలో వాల్‌మార్ట్ మొదలుకొని గూగుల్ వరకూ ఎన్నో అంతర్జాతీయ సంస్థలున్నాయి. ఇవిగాక బోలెడు స్టార్టప్‌లు కొలువుదీరాయి. బెంగళూరుకు సగటున రోజుకు కనీసం 185 కోట్ల లీటర్ల నీరు లభిస్తుండగా కనీసం మరో 168 కోట్ల లీటర్లు అవసరమని అంచనా. కానీ ఎక్కడుంది లభ్యత? ఇది దిక్కుతోచని స్థితి.

ఆరా తీస్తే బెంగళూరు నగరానిది కూడా దేశంలోని అన్ని నగరాల వ్యథే. మౌలిక సదుపాయాల కల్పనపై కనీస స్థాయి దృష్టిపెట్టకుండా దశాబ్దాలుగా అభివృద్ధిని కేంద్రీకరించిన పర్యవసానమే ప్రస్తుత కష్టాలకు మూలకారణం. అభివృద్ధి పేరు చెప్పి వెనకా ముందూ చూడకుండా హరిత ప్రాంతాలను హరించటంవల్ల వర్షాలు గణనీయంగా తగ్గాయి. పెరుగుతున్న జనాభా పేరు చెప్పి ఆవాసప్రాంతాలను విస్తరించటం, అందుకోసం చెరువులనూ, సరస్సులనూ మాయం చేయటం అలవాటైపోయింది. 1961 నాటికి బెంగళూరు నగర పరిసరాల్లో 262 సరస్సులుండేవి. ఇప్పుడు వాటి సంఖ్య 81కి పడిపోయింది. వాస్తవానికి ఆ సరస్సుల్లో ఇప్పటికీ జీవంతో వున్నవి కేవలం 33 మాత్రమే. జనావాసాలకు అననుకూల ప్రాంతాల్లో వుండటంవల్లే ఇవి బతికిపోయాయి. మిగిలినవి పేరుకు సరస్సులుగా వున్నా వాటిలో చుక్క నీరు కూడా కనబడదు. ఇంకా దారుణం... ఇప్పుడున్న సరస్సుల్లో 90 శాతం కాలుష్యం కారణంగా పనికిరాకపోవచ్చని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధ్యయనంలో తేలింది. లీటర్ నీటిలో కనీసం 4 మిల్లీగ్రాముల ఆక్సిజన్ వుంటేనే ఆ నీరు మెరుగ్గా వున్నట్టు లెక్క. కానీ అంతకన్నా తక్కువ స్థాయిలో ఆక్సిజన్ వున్నదని నిపుణులు తేల్చారు. ఎన్నడో 1971లో ఇరాన్‌లోని రాంసర్‌లో నీటి వనరుల సంరక్షణపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో కుదిరిన ఒడంబడికపై సంతకం చేసిన దేశాల్లో భారత్ కూడావుంది. కానీ దానికి అనుగుణంగా శ్రద్ధాసక్తులు కనబరిచిన దాఖలా లేదు. 2030 నాటికి నీటి అవసరాలు రెట్టింపవుతాయని నీతి ఆయోగ్ నివేదిక 2018లో చెప్పింది. మన దేశంలో కేవలం రక్షిత మంచినీరు అందక ఏటా 2 లక్షలమంది మరణిస్తున్నారని వివరించింది. అంతకు రెండేళ్లముందు దక్షిణ కన్నడ జిల్లాలోని మూడ్‌బిద్రీలో సరస్సులపై అంతర్జాతీయ సదస్సు జరిగింది. హరిత ఆచ్ఛాదనగా వున్న పట్టణ అడవులు, తడి నేలలు వగైరాలను పట్టణీకరణ కోసం మూడు దశాబ్దాలుగా డీ నోటిఫై చేస్తున్నారనీ, ఇది బెంగళూరుకు ముప్పు కలిగిస్తుందనీ సదస్సు ఆందోళన వ్యక్తం చేసింది. కానీ ఏళ్లు గడుస్తున్నకొద్దీ ఆ ధోరణి మరింత పెరిగిందే తప్ప తగ్గలేదు. అసలు పట్టణీకరణలో స్థానిక జీవావరణం, పర్యావరణం, నీటి లభ్యత వగైరాలకు చోటేలేదు. వాటిపై ఎలాంటి అధ్యయనమూ లేదు. కేంద్రీకృత అభివృద్ధి వల్ల జనాభా అనేక రెట్లు పెరగటం, దాంతోపాటే మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్థం కావటం తరచు కనబడుతున్న వాస్తవం. స్థానికంగా వుండే చెరువులు, సరస్సులు వగైరాల్లో మురుగు నీరు విడిచిపెట్టే దురలవాటుతో అటు నీటి వనరులూ నాశనమవుతున్నాయి, ఇటు భూగర్భ జలాలు సైతం కాలుష్యం బారిన పడుతున్నాయి.

నగరాలు నేల చూపులు విడిచిపెడుతున్న తీరు ఆందోళనకరం. నేల విడిచి ఆకాశంలోకి దూసుకుపోయే నగరాలకు చుక్కలు కనబడటం ఖాయమని కేప్‌టౌన్ అనుభవాలు ఆరేళ్ల క్రితమే చెప్పాయి. దక్షిణ అట్లాంటిక్ సముద్ర తీరాన దక్షిణాఫ్రికాలో వున్న ఆ నగరంలో కళ్లు చెదిరే స్థాయిలో భారీ భవంతులు దర్శనమిస్తాయి. ప్రపంచం నలుమూలల నుంచీ తరలివచ్చే వినియోగ వస్తువులతో అక్కడి మహా దుకాణాలు మెరిసిపోతుంటాయి. ఏటా కనీసం 20 లక్షలమంది ఆ నగర అందచందాల్ని చూడటానికి తరలివస్తారని అంచనా. 46 లక్షల జనాభాగల ఆ నగరం 2018లో నీటి సంక్షోభంలో చిక్కుకుని గుడ్లు తేలేసింది. ఇళ్లకూ, దుకాణ సముదాయాలకూ, కార్యాలయాలకూ నీటి సరఫరాను పూర్తిగా నిలిపేసింది. 200 నీటి కేంద్రాలవద్ద రోజుకు మనిషికి 25 లీటర్ల నీరిస్తామని అన్ని అవసరాలనూ దాంతోనే తీర్చుకోవాలని ప్రకటించింది. నీటి సంరక్షణను ఒక సంస్కృతిగా మార్చుకుని ఇప్పుడిప్పుడే కుదుటపడటం మొదలెట్టింది. కేప్‌టౌన్ కష్టాలూ, వాటిని ఆ నగరం అధిగమించిన తీరూ అధ్యయనం చేయటం ఒక్క బెంగళూరుకు మాత్రమే కాదు... అన్ని మెట్రోపాలిటన్ నగరాలకూ తక్షణావసరం. నీటి వృథాను, నష్టాలను అరికట్టడంలో... కాలానుగుణమైన ప్రణాళికల రూపకల్పనలో స్థానిక సంస్థల చొరవను పెంచితేనే ఈ సమస్యను అధిగమించగలమని పాలకులు గుర్తించటం మంచిది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, **తిథి:** శు.చవితి ఉ.6.40 వరకు, తదుపరి పంచమి తె.4.52 వరకు (తెల్లవారితే శుక్రవారం), **నక్షత్రం:** భరణి రా.10.08 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** ఉ.8.24 నుండి 9.52 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.10 నుండి 10.58 వరకు, తదుపరి ప.2.58 నుండి 3.46 వరకు, **అమృతఘడియలు:** సా.5.40 నుండి 7.10 వరకు.

సూర్యోదయం : 6.14
సూర్యాస్తమయం: 6.06
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

ద్రవిడవాదంలో వేర్పాటు నినాదం

విశ్లేషణ



పి. వేణుగోపాల్ రెడ్డి

వెనుకబాటుతనం ఆ ప్రాంతంలో అసంతృప్తిని రేకెత్తించడం, అది ఆగ్రహమై, ఉద్యమంగానో, ఆఖరికి ఉగ్రవాదంగానో పరిణమించడం పరిపాటే. ఒకప్పుడు ఈశాన్య భారతదేశంలో ప్రత్యేక దేశం నినాదాలు వినిపించేవి. కశ్మీర్ లోయలో ఉగ్రవాదులు కూడా ఇదే వినిపించేవారు. రెడ్ కారిడార్ నినాదంలో కూడా ఇందుకు సంబంధించిన ఛాయలు ఉన్నాయి. కానీ తమిళనాడులో ద్రవిడవాదం మోతాదు ఎక్కువగా ఉన్న డీఎంకే వినిపించే వేర్పాటువాదం, తామొక జాతి అని చెప్పుకోవడం వెనుక కుత్సిత రాజకీయం మాత్రమే ఉంది. ఆ పార్టీలో కొందరు ప్రత్యేక దేశం నినాదాన్ని అందుకోవడం చరిత్ర పట్ల మహా ద్రోహం. భారతదేశం ఐక్యంగా ఉండాలన్న భావన కేవలం బీజేపీది అనుకోవడం అజ్ఞానం. ఒక పార్టీ మీద ద్వేషం దేశ ఐక్యతకు విఘాతం కారాదు.

భారత ఈశాన్య ప్రాంతాన్నో, కశ్మీర్ లోయ పరిస్థితులతోనో పోలిస్తే తమిళనాడు ప్రాంతం వేర్పాటువాద నినాదాన్ని అందుకోవలసిన అగత్యం ఏమాత్రం లేదు. కొందరు నాయకుల అజెండా ప్రజలందరి ఆశయం కూడా కాదు. తమిళ సమాజంలో అందుకు సంబంధించిన రుజువులు కూడా లేవు. చెన్నై ఇవాళ నాలుగు మెట్రో నగరాలలో ఒకటి. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం (ఏ పార్టీది అయినా) అండ లేకుండా అది సాధ్యమయ్యేదేనా? ఢిల్లీ వివక్షే చూపి ఉంటే జరిగేదేనా?

ద్రవిడవాదం, అది చెప్పే ప్రాంతీయవాదం, వేర్పాటువాదం, నాస్తికత్వం తమిళనాట కొద్దిమందిలో ఉంటే ఉండవచ్చు. మెజారిటీ ప్రజలు కచ్చితంగా వాటికి దూరంగానే ఉన్నారు. అక్కడి జీవన సరళిని చూసినవారు ఎవరైనా దీనిని ఒప్పుకుంటారు. కాబట్టి తమిళనాడులో వేర్పాటువాదాన్ని ప్రోత్సహించే వాదనలు కుత్సిత రాజకీయానికి సంబంధించినవే. డీఎంకే ఎంపీ ఎ.రాజా తాజాగా భారత్ ఒక దేశం కాదని తీర్పు ఇచ్చాడు. ఇది కొన్ని రాష్ట్రాల కూటమి అంటాడు. ఒక దేశమైతే ఒకే భాష ఉంటుందని వింత భాష్యం చెప్పాడు. తమిళనాడుకు దేశం అనదగ్గ లక్షణాలు ఉన్నాయంటాడు. ఈ దేశంలో అనుసంధాన భాషగా సంస్కృతం చిరకాలం ఉంది. రాజా వాదన మీదే ఒక్క క్షణం నిలబడి ఇంకొక ప్రశ్న వేయాలి. తమిళనాడులోనే ఉన్న కొంగునాడు (కొంత భాగం కేరళ, కర్ణాటకలలో కూడా విస్తరించి ఉంది) ప్రజలు ఇది కూడా 'నాడు', కాబట్టి తమదీ ఒక జాతేననీ, తమకూ దేశం కావాలనీ అంటే డీఎంకే ప్రభుత్వం నుంచి ఏం సమాధానం వస్తుంది? 'నాడు' అనేది భౌగోళిక ఉనికికి పేరు. అది మరచిపోతే ఎలా?

తమిళులకో ప్రత్యేక దేశం కోరికతో ఈవీ రామస్వామి నాయకర్ క్రిప్స్ మిషన్‌కు వినతిపత్రం సమర్పించాడు. దానికి హేతుబద్ధమైన ప్రాతిపదిక ఏమిటో ఇప్పటికీ తెలియదు. ద్రవిడస్థాన్ నినాదంతో, కోరికతో ఏమాత్రం పొంతన లేనిది ముస్లింలకో ప్రత్యేక రాజ్యం. అది జిన్నా, కొందరు ముస్లింల కోరిక. అలాంటి జిన్నాను తనకు వత్తాసుగా తెచ్చుకోవాలని చూసి ఈవీ భంగపడిన సంగతి చరిత్ర ప్రసిద్ధమే. 'నేను ముస్లింలందరికీ నాయకుడినే; కానీ తమిళులంతా నీ (ఈవీ) వెనుక లేరు' అన్నది జిన్నా వివరణ. నేటికీ అదే వాస్తవం. తమిళులంతా ద్రవిడవాదం మత్తులో లేరు. ఏనాడూ లేరు. 1942లోనే కాలం చేసిన ఆ వాదాన్ని ఆవాహన చేస్తామని బెదిరిస్తూ డీఎంకే పబ్బం గడుపుకొంటున్నది. ఇదంతా గమనించాక ఈవీ రామస్వామి నాయకర్‌ను పిచ్చాసుపత్రిలో ఉంచవలసిన వ్యక్తిగా ప్రథమ ప్రధాని నెహ్రూ కూడా భావించారు. కానీ ఇప్పటికీ అలాంటివాడి వికృత వాదంతో పార్టీలు రాజకీయాలు సాగించడమే విషాదం. ఎ.రాజా తాజా ప్రకటన కావచ్చు, ఆ మధ్య ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కుమారుడు, మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన సనాతన ధర్మ వ్యతిరేక వ్యాఖ్యలు కావచ్చు, ఆ ఆవాహన బెదిరింపులో భాగమే. వీటికి తాజా నేపథ్యం ఉంది. దేశ రాజకీయాలలో బీజేపీ ప్రబల శక్తిగా ఎదగడం. ద్రవిడవాద అడ్డా తమిళనాడుకు రాదనుకున్న బీజేపీ... అన్నామలై (తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు) రూపంలో విశ్వరూపం దాల్చడం!



భారత్ ఒక దేశం కాదు, ఉపఖండం అంటాడు రాజా. ఈ ఒక్క అంశమే కేంద్రబిందువుగా ఆయన వాదం సాగడం లేదు. దీనికి రాముడినీ, రామాయణాన్నీ జోడిస్తున్నాడు. ఆ రెండు అంశాల మీద ఆయనకి విశ్వాసం లేదట. లేకపోవచ్చు. కానీ రాజా ఈ రాముడినీ, రామాయణాన్నీ డీఎంకే వేర్పాటువాదానికి తోడు తెచ్చుకునే పిచ్చి ప్రయత్నం చేస్తున్నాడు. రాముడు భారతదేశ ఉత్తర భాగం వాడనీ, భారతభూమి దక్షిణ భాగంతో సంబంధమే లేదనీ డీఎంకే మొదటి నుంచి భాష్యం చెబుతోంది. ఈరోడ్ జిల్లా గోబిచెట్టిపాళయం వద్ద ఇటీవలే జరిగిన సభలో రాజా ఇవన్నీ మాట్లాడాడు. నిజానికి ఈ వాదం కూడా తప్పే. దీనికి అన్నామలై ఇటీవలనే చక్కని వివరణ ఇచ్చాడు. తమిళనాడులోనే ఆరణి క్షేత్రంలో శివాలయం ఉంది. దాని పేరు పుత్తరకామెట్టీశ్వరాలయం. దశరథుడు ఇక్కడికి వచ్చి తపస్సు చేసిన తరువాతే ఆయనకు సంతానం కలిగిందని ప్రతీతి. అలాగే రామేశ్వరానికీ, వారణాసికీ నేటికీ చెక్కుచెదరకుండా కొనసాగుతున్న బంధాన్ని మరచిపోరాదు. ఈ జనవరి 22న అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ జరిగిన బాలరాముడి ప్రతిమకు దక్షిణాది కన్నడిగుడే జన్మనివ్వడం యాదృచ్ఛికం కావచ్చు.

భారతదేశం ఐక్యంగా ఉండాలన్న భావన 1950లలో పుట్టిన భారతీయ జనసంఘ్‌దో లేదా 1980లలో ఆవిర్భవించిన భారతీయ జనతా పార్టీదో అనుకోవడం శుద్ధ అజ్ఞానం. మొత్తం భారతదేశాన్ని బ్రిటిష్ పాలన నుంచి విముక్తం చేసే ఉద్దేశంతోనే భారత స్వాతంత్ర్యోద్యమం సాగింది. దీనికి వందలాది ఉదాహరణలు చూపించవచ్చు. తమిళ మహాకవి సుబ్రహ్మణ్య భారతి జీవితమే దీనికి రుజువు. గాంధీజీ పిలుపునకు, సైమన్ కమిషన్ వ్యతిరేకోద్యమానికి తమిళనాడు కూడా కదిలింది. జాతీయ భావనతో, సాంస్కృతికంగా ఏకత్వం ఉన్న దేశంలో సామాజిక రాజకీయ ఏకత్వం తేవడానికి భారత జాతీయ కాంగ్రెస్, కొన్ని ఇతర అతివాద జాతీయ భావాలను నమ్మిన సంస్థలు పనిచేశాయి. జాతీయ కాంగ్రెస్ తన సభలు తమిళనాడులోనూ (నాటి మద్రాస్ ప్రెసిడెన్సీ) పలుసార్లు నిర్వహించింది. అడయార్ కేంద్రంగా పనిచేసిన అనీబిసెంట్ భారతీయులందరి స్వేచ్ఛ కోసం పనిచేశారు. కానీ మరొక పక్క తమిళనాడులో బలపడిన జస్టిస్ పార్టీ బ్రిటిష్ వాళ్ల మోచేతి నీళ్లు తాగింది. భారత్ ఐక్యతకూ, భారతీయులు చైతన్యవంతం కావడానికీ ఇంగ్లండ్ బద్ధవ్యతిరేకి. ఎవరో ఒకరిని వివక్షతో అణచివేయడానికి కుటిలనీతిని అవలంబించడమే బ్రిటిష్ లక్షణం. దాని అవశేషమే ద్రవిడవాదం. దాని పేలికే డీఎంకే. భారతదేశ చరిత్రను బట్టి, సమీప గతాన్ని బట్టి, ప్రస్తుతం జరుగుతున్న ప్రపంచ పరిణామాల ఆధారంగా డీఎంకే నేతల వదరుబోతుతనం ఎంత నిర్హేతుకమో అర్థం చేసుకొనే ప్రయత్నం చేయాలి. నాలుగు ముక్కలైన పోలెండ్ కలసిపోయింది. రెండు ముక్కలయిన జర్మనీ ఐక్యమైంది. వేరుకావడం వల్ల కలిగే కష్టనష్టాలను ప్రపంచం గుర్తిస్తున్న క్షణాలివి. సాధ్యాసాధ్యాలు ఎలా ఉన్నా, ఆక్రమిత కశ్మీర్‌లో, బలూచిస్తాన్‌లో ప్రజలు తాము భారత దేశంలో భాగం కావాలనుకుంటున్నామని చెప్పుకోవడం వాస్తవం. ఇన్ని ఉదాహరణలు ఉండగా ఇంత అభివృద్ధి చెందిన దేశంలో వేరే దేశం కోరుకోవడం, అది కూడా తమ పార్టీ బలహీనపడే లేదా ఓడిపోయే పరిస్థితిలో ఉన్నప్పుడు ప్రత్యేక దేశం నినాదాన్ని అందుకోవడం చరిత్ర పట్ల మహా ద్రోహం. ఓట్ల రాజకీయంతో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని భగ్నం చేయాలని అనుకుంటే ఆ పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పడం అవసరమే.

ఇప్పుడు ఎ. రాజా ప్రకటననీ, అప్పుడు ఉదయనిధి స్టాలిన్ వాగుడునూ బీజేపీ ఖండించింది. అది సహజమే. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా ఖండించింది. 'రాజా వ్యాఖ్యలతో నేను నూరు శాతం విభేదిస్తున్నాను' అంటూ కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనేత్ నిర్ద్వంద్వంగా పేర్కొనడం స్వాగతించవలసినదే. ఆ పార్టీ కర్ణాటక ఎంపీ డీకే సురేశ్ రెండు భారతదేశాల గురించి మాట్లాడినందుకు ఇది పాప పరిహారం కావచ్చు. రేపు ఎన్నికలలో 'ఇండి' పేరుతో ఎన్డీఏని ఎదుర్కొనబోతున్న కూటమి భాగస్వాములు తోటి ద్రవిడ భాగస్వామి చేస్తున్న ఇలాంటి ప్రేలాపనలను నిర్ద్వంద్వంగా ఖండించడం అవసరం. భారతీయ జనతా పార్టీని వ్యతిరేకించడం, దానిని అధికారం నుంచి దించాలనుకోవడం తప్పు పట్టవలసిన విషయం కాదు. కానీ ఒక రాజకీయ పార్టీ మీద ద్వేషం భారతదేశ ఐక్యతకు విఘాతం కారాదు.

వ్యాసకర్త ఏకలవ్య ఫౌండేషన్ ఛైర్మన్ | pvg@ekalavya.net

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

చేదు వాస్తవం



శరణార్థులకు ఆశ్రయం ఇస్తున్న దేశాన్నేమో జనాలు ద్వేషిస్తున్నారు. కానీ ఆ శరణార్థుల రాకకు కారణమవుతున్న దేశాన్నేమో వదిలేస్తున్నారు. అది ముందు గ్రహించండి.

– అహ్మద్ షరీఫ్, వ్యాఖ్యాత

మెరుగ్గా లేదా?



రవిచంద్రన్ అశ్విన్ 2011లో వెస్ట్ ఇండీస్‌తో ఆడిన తన తొలి టెస్టులో 128 పరుగులిచ్చి, 9 వికెట్లు తీశాడు. అదే అశ్విన్ మొన్న ఇంగ్లండ్‌తో ఆడిన తన నూరో టెస్టులో కూడా 128 పరుగులిచ్చి, 9 వికెట్లు తీశాడు. కార్పొరేట్ హెచ్‌ఆర్ దృష్టికోణం: రవిచంద్రన్ అశ్విన్ పనితీరు వంద టెస్టుల్లో సున్నా శాతమే మెరుగుపడింది!

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

చేయలేరా?



దాదాపు ప్రధానస్రవంతి ఆర్థికవేత్తలందరూ లెఫ్టిస్టులే. కానీ వాళ్లెవరూ కేరళ ఆర్థిక సంక్షోభాన్ని ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్థం కాదు.

– విజయ్ పటేల్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

కంట్రోల్



జూన్ 30 దాకా సమయం కోరింది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎన్నికల బాండ్ల విషయంలో). కానీ సుప్రీంకోర్టు ఒత్తిడి చేసేసరికి ఒక్క రోజులోనే డేటా ఇచ్చేసింది. ఏజెన్సీలను బీజేపీ ఎలా నియంత్రిస్తున్నదో చెప్పడానికి ఇదే ఉదాహరణ.

– నరుందార్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

అనుమానమే!



బెంగళూరు రామేశ్వరం కెఫే పేలుళ్లకు సంబంధించిన కీలక అనుమానితుడు షబ్బీర్‌ను బళ్లారిలో ఎన్ఐఏ అరెస్టు చేసింది. ఈ విచారణను ఎన్ఐఏ చేపట్టక పోయివుంటే కూడా ఇదే విధంగా విచారణ జరిగేదా?

– నూపుర్ జె శర్మ, సంపాదకురాలు

దేశానికి దెబ్బ



ప్రధానమంత్రి అభ్యర్థిగా నరేంద్ర మోదీని మూడోసారి కూడా బీజేపీ ప్రతిపాదిస్తే దాన్ని దేశం బహిరంగంగా వ్యతిరేకించాలి. 'ఎవరూ రాలేదు' అని అబద్ధం చెప్పి, 4,065 చదరపు కిలోమీటర్ల వివాదరహిత భారత ప్రాంతాన్ని చైనా మింగడానికి ఉత్తిపుణ్యానికి ఆయన అనుమతించారు.

– సుబ్రమణియన్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి

వృద్ధి జరిగినట్టా?



భారత వృద్ధి రేటు 7.6 శాతం ఉండటం మంచిదే. కానీ అందులో ఒక అంశం ఉంది. సూక్ష్మంగా గమనించి చూస్తే, చాలామంది సాధారణ జనాలకు దీనివల్ల ప్రయోజనం లేదని అర్థమవుతుంది. 2017లో సృష్టించిన 73 శాతం సంపద కేవలం 1 శాతం అత్యంత ధనవంతులకే చేరింది. 2020–22 వరకు కోటీశ్వరుల ఆదాయం 121 శాతం పెరిగింది. 2022 అక్టోబర్ నుంచి 2023 సెప్టెంబర్ మధ్యలో 96,917 మంది భారతీయులను యూఎస్ఏలోకి ప్రవేశిస్తుండగా అడ్డుకున్నారు.

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

ఇన్ బాక్స్

కల్తీతో కిడ్నీలు ఖరాబ్

ప్రతి సంవత్సరం మార్చి రెండవ గురువారం 'ప్రపంచ మూత్రపిండాల దినోత్సవం' జరుపుకొంటారు. ప్రపంచంలో సుమారు 10 శాతం జనాభా అనగా 85 కోట్ల మంది 'క్రిటికల్ కిడ్నీ డిసీజ్' (సి.కె.డి.)తో బాధ పడుతుండగా, మనదేశంలో సుమారు 10 శాతం మంది కిడ్నీ (మూత్రపిండ) జబ్బులతో బాధపడుతున్నారు అని నివేదికలు చెబుతున్నాయి. 140 కోట్ల మంది ఉన్న భారత్‌లో కేవలం సుమారు 2,600 మంది మూత్రపిండాల వ్యాధి నిపుణులు (నెఫ్రాలజిస్టులు) మాత్రమే ఉండడం ఆందోళన కలిగించే అంశం. దీంతో కిడ్నీ డిసీజ్‌లతో బాధపడుతున్న వారికి సరైన వైద్యం అందడం లేదు. ఇకనైనా ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలి. క్యాన్సర్ వ్యాధిలాగే ఈ మూత్రపిండాల వ్యాధి కూడా బాగా ముదిరిన తరువాతే బయటపడుతుంది. అందుచేతనే ఈ వ్యాధి పట్ల ప్రజలకు సరైన అవగాహన కల్పించాలి.

డయాబెటిస్, అధిక రక్తపోటు మూత్రపిండాల వ్యాధులకు ప్రధాన కారణం. వీటిని అదుపులో ఉంచుకోవాలి. కనీసం ప్రతి సంవత్సరం క్రియాటినిన్, యూరిన్ అల్బుమిన్ పరీక్షలు చేయించుకోవాలి. వైద్యులను సంప్రదించాలి. సమయానికి నిద్ర పోవడం, తరచూ నీళ్ళు తాగడం, కల్తీలేని రసాయనాలు కలవని ఆహారాన్నీ, తేలికగా జీర్ణమయ్యే పదార్థాలనూ తినడం వంటి కార్యకలాపాల ద్వారా కిడ్నీ వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో 'జగనన్న సురక్ష' ద్వారా తరచూ వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తూ, 'ఆరోగ్య శ్రీ' పథకం ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు. ముఖ్యంగా నీటి కాలుష్యం ద్వారా మూత్ర పిండాలు వ్యాధులు ప్రబలుతున్నాయని గ్రహించాలి. మూత్ర పిండాల పనితీరు పైనే మానవుని ఆరోగ్యం ఆధారపడి ఉందన్న విషయాన్ని ఇటు ప్రభుత్వాలూ, అటు ఎన్జీఓలూ, వైద్య సిబ్బందీ ప్రజలకు అవగాహన కల్పించాలి. అవగాహన కల్పించటమే ఈ దినోత్సవం వెనుక ఉన్న పరమార్థం. మూత్రపిండాల వ్యాధి తక్కువగా ఉన్న స్విట్జర్లాండ్ దేశం వలే మనదేశం కూడా 2047 నాటికి 'జీరో సి.కె.డి.' దేశంగా గుర్తింపు పొందాలని ఆశిద్దాం.

– ఐ. ప్రసాదరావు, కాకినాడ
(నేడు ప్రపంచ కిడ్నీ దినోత్సవం)


వందేళ్ల కుల తెలంగాణం

బిహార్ రాష్ట్రంలో కులగణన జరిపి రిజర్వేషన్లను 15 శాతం పెంచడంతో అన్ని రాష్ట్రాలలో కులగణన జరపాలన్న డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవలే కులగణన కోసం వివరాల సేకరణ జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో కులగణన జరపాలనే తీర్మానం అసెంబ్లీలో ఆమోదం పొందడంతో సర్వత్రా ఈ విషయమై చర్చ జరుగుతోంది. ప్రభుత్వ ఉద్యోగాలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలలో ఎవరి వాటా వారు పొందడానికి జనాభా లెక్కల అవసరం ఎంతైనా ఉంది. అందుకే కులగణన తప్పనిసరి అయ్యింది. దీని ఆధారంగానే రిజర్వేషన్ల శాతం పెంపు వంటివి జరుగుతాయి. ఈ సందర్భంగా తెలంగాణ (గత హైదరాబాద్ స్టేట్)లో గతంలో జరిగిన జనాభా లెక్కల గురించి ఒకసారి పరిశీలిద్దాం.

బ్రిటిష్ వారి హయాంలో 1891 నుంచి ప్రతి పదేళ్ళకు జనాభా లెక్కలు సేకరణ జరిగేది. ఆ లెక్కలలో ఆయా కులాల జనాభా సంఖ్య కుటుంబాల ఆర్థిక, సామాజిక పరిస్థితులన్నీ సేకరించారు. 1941 వరకు ఈ లెక్కలు సేకరించారు. అయితే రెండవ ప్రపంచయుద్ధం కారణంగా 1941 నాటి సేకరణ మధ్యలో నిలిచిపోయింది. 1931 లెక్కలు మాత్రమే ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్నాయి. అప్పటి హైదరాబాద్ రాష్ట్ర సెన్సస్ కమిషనర్ మజర్ హుస్సేన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సేకరణకు సంబంధించిన వివరాలను పుస్తకంగా ముద్రించారు.

1931లో హైదరాబాద్ స్టేట్‌లో మొత్తం 17 జిల్లాలు ఉండేవి. వీటిలో తొమ్మిది తెలుగు జిల్లాలను తెలంగాణగానూ, మిగిలిన ఏడు జిల్లాలను మరాట్వాడాగానూ పిలిచేవారు. అప్పటి హైదరాబాద్ రాజ్యం మొత్తం జనాభా 1,44,36,146 కాగా తెలంగాణ తొమ్మిది జిల్లాలలోని జనాభా 75,54,598 మందిగా నమోదయ్యింది. కులగణనలో హిందువులలో 58 కులాల వివరాలు నమోదయ్యాయి. ముస్లింలలో ఉన్న తెగలను విడిగా చూపించలేదు.

ఇక కులాల వారీగా చూస్తే అగ్రవర్ణంగా పిలుస్తున్న కాపు (రెడ్డి)ల జనాభా (7,95,003) అత్యధికంగా ఉంది. రెడ్లను అప్పట్లో కాపులనే పిలిచేవారు. రెడ్డి అనేది అప్పటికి ఒక పదవీ సూచకంగా ఉండేది. ఇప్పుడు రెడ్డి అనేది కులనామంగా మారింది. ఈ కేటగిరీలో అత్యల్పంగా ఉన్నవారు క్షత్రియ (రాజపుత్) కులం వారు (29,673). బలహీనవర్గాల వారి విషయానికి వస్తే తెలగలు అత్యధికంగా 8,59,874 మంది ఉన్నారు. మున్నూరు కాపు, ముత్రాసిలను కలిపి 'తెలగ'లుగా చూపించారు. వీరిలో అతి తక్కువ జనాభాగా గుజరాతీ కులం వారిది (967).



షెడ్యూల్డు కులాల విషయానికి వస్తే మాదిగలు అత్యధికంగా 7,72,680 మంది నమోదయ్యారు. మాలలు 4,81,722 మంది ఉన్నారు. షెడ్యూల్డు తెగలలో లంబాడి (బంజారి) అత్యధికంగా 2,02,423 మంది ఉన్నారు. చెంచులు అత్యల్పంగా 2,224 మంది నమోదయ్యారు. ఇండియన్ క్రిష్టియన్లు 96,775, ఆంగ్లో ఇండియన్లు 2,729 మంది ఉన్నారు. ముస్లింలు 6,79,322 మంది ఉన్నారు. అప్పటి లెక్కలు పరిశీలిస్తే అగ్రకులాల వారు 12.5 లక్షల జనాభాతో 16.6 శాతం, షెడ్యూలు కులాల వారు 16 శాతం, షెడ్యూలు తెగల వారు 5.2 శాతం, క్రైస్తవులు 1.5 శాతం, ముస్లింలు 9 శాతం, బీసీలు 52 శాతం మంది ఉన్నారు.

2024లో తెలంగాణ జనాభా మూడు కోట్ల 90 లక్షల 40 వేల మంది. 1941తో పోలిస్తే తెలంగాణలో జనాభా సుమారుగా ఐదు రెట్లు పెరిగింది. అయితే అన్ని కులాలూ ఇదే దామాషాలో పెరిగి ఉండక పోవచ్చు. కొన్ని కులాలలో ఎక్కువ శాతం పెరుగుదల ఉంటే కొన్నింటిలో తక్కువ శాతం పెరిగి ఉండవచ్చు. ఇక అప్పట్లో తెలంగాణలో నివాసం ఉండిన మరాఠీ, కర్ణాటక నేపథ్యం ఉన్న కొన్ని కులాల వారు రాష్ట్రం విడిపోయినప్పుడు ఆ యా రాష్ట్రాలకు వలస వెళ్ళారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అప్పటి మద్రాసు రాష్ట్రంలోని ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల వారు హైదరాబాద్ ప్రాంతానికి అధికంగా వలస రావడం వల్ల ఆ యా కులాల జనాభా పెరిగింది. కొత్త కులాలు కూడా వచ్చి చేరాయి.

– మేడపాటి శ్రీనివాసరెడ్డి, సీనియర్ జర్నలిస్టు

అదుపు–పొదుపు

సంపాదించిన డబ్బును అదుపు తప్పి, ఖర్చు చేస్తూ, పొదుపు చేయలేనప్పుడూ; మాటలను మితంగా వాడుతూ పొదుపు చేయలేనప్పుడూ ఇబ్బంది పడతాము. సంపాదన అపరిమితంగా వస్తున్నప్పుడు సహజంగా మనిషిని అతిశయం, అహం వరిస్తాయి. రేపు ఎలా అనేది ఆలోచించరు. తమతో సమానంగా ఖర్చు పెట్టలేని వారిని తక్కువగా చూడటం, ఎదుటివారి ఆత్మగౌరవాన్ని న్యూనత పరచటం చేస్తుంటారు. అదుపులేని ఖర్చు, ఆడంబరాల కోసం చేసే వృథా ఖర్చు అనర్థాలకు కారణమౌతుంది. చేతిలో పైసా లేనపుడు ఎంత పశ్చాత్తాప పడినా ప్రయోజనం ఉండదు. అలవాటు లేని నిరాడంబర జీవితాన్ని గడపలేరు. పోయిన డబ్బు సంపాదించటానికి వయసు సహకరించక పోవచ్చు. బాగున్నప్పుడు ఉన్న స్నేహితులు, బంధువులు దూరమౌతారు. వెనక విమర్శిస్తూ ఉంటారు. దీనివల్ల తీవ్రమైన మానసిక వ్యథకు గురవుతారు. కొంచెం ముందు ఆలోచనతో తగినంత ఖర్చు చేస్తూ, రేపటికి పొదుపు చేస్తూ ఉంటే జీవితం సుఖవంతమౌతుంది.



పోయిన డబ్బునైనా తిరిగి సంపాదించవచ్చు కానీ, నోటి నుంచి ఒకసారి వెలువడిన మాటను వెనక్కి తీసుకోలేము. ఒక్క పరుషపు మాట బంధుత్వాలను, స్నేహాలను దూరం చేస్తుంది. మనసును ఆవేశం ఆక్రమిస్తున్న వేళ మౌనంగా ఉండటమే మేలు. 'వాక్ పారుష్యం చన్నే' అన్నాడు నన్నయ భారతం సభాపర్వంలో. పరుషపు మాట తగదని భావం. మాట కాఠిన్యం విషం కంటె, అగ్ని కంటె అతి భయంకరం అన్నాడు నన్నయ. ఒక ప్రేమ నిండిన మాట మనసు గాయాలను మాన్పుతుంది. ఒక స్ఫూర్తి నిచ్చే మాట లక్ష్యసిద్ధి వైపు నడిపిస్తుంది. అవసరానికి మించి ఎక్కువగా మాట్లాడితే ఏవో పొరపాటు మాటలు, ఎదుటివారిని గాయపరిచే మాటలు రావటానికి అవకాశం ఎక్కువ.

నాలుక అనేది జుట్లు జుట్లు ముడిపెడుతుంది. మనసులో విషం నింపుతుంది. అమృతాన్నీ చిందిస్తుంది. నాలుక ఒకటే గాని నానా రూపాలు ధరిస్తుంది. అందుకే మాటకూ, డబ్బుకూ అదుపూ, పొదుపూ అవసరం.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

క్లుప్తంగా...

సీఎం రేవంత్‌కు కొడంగల్‌లో ఓటు హక్కు



ఓటరు జాబితాలో రేవంత్‌రెడ్డి పేరు

కొడంగల్: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కొడంగల్ తహసీల్దార్ కార్యాలయంలో ఓటరుగా తన పేరు నమోదు చేయించుకున్నారు. తహసీల్దార్ విజయ్‌కుమార్ బుధవారం విడుదల చేసిన ఓటరు జాబితాలో సీఎం పేరు నమోదైంది. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఎక్స్ ఆఫీషియో హోదాలో సీఎం తన ఓటు హక్కు విని యోగించుకుంటారు. ఈ మేరకు రేవంత్ కొడంగల్ మున్సిపల్ పరిధిలోని లాహోటీ కాలనీ లో ఉన్న తన ఇంటి నంబర్‌పై ఓటరుగా నమోదు చేసుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈనెల 28న జరిగే ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

'మహనీయులకు సరైన గౌరవం దక్కింది'

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతిఏటా విమోచన దినోత్సవం (17 సెప్టెంబర్ వేడుకలు) జరిపేందుకు నిర్ణయించినందుకు కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సి.హెచ్ విద్యాసాగరరావు వేర్వేరు ప్రకటనల్లో హర్షం ప్రకటించారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినందున ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షాకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

కవిత జన్మదిన వేడుకలు



భర్త, కుమారుడితో కలసి కేక్ కట్ చేస్తున్న కవిత

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్, భారత జాగృతి శ్రేణులు కవిత నివాసంలో భారీ కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

కులగణనకు కేంద్రంపై ఒత్తిడి పెంచాలి

- బీసీ న్యాయయాత్రలో ఆర్.కృష్ణయ్య



బీసీ న్యాయ యాత్రలో పాల్గొన్న ఆర్.కృష్ణయ్య

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): జనగణనలో కులగణన చేపట్టాలని ప్రతి పక్ష పార్టీలన్నీ ఏకమై కేంద్రంపై ఒత్తిడి పెంచాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. జనగణనలో కులగణన, పార్లమెంట్‌లో బీసీ బిల్లు, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జాతీయ బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో నారాయణగూడలో బీసీ భవన్ నుంచి బషీర్‌బాగ్ అమ్మవారి ఆలయం వరకు బీసీ న్యాయయాత్ర పేరుతో ర్యాలీ నిర్వహించారు. జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడు భరత్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ యాత్ర జరిగింది. కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కులగణన చేయడానికి అన్ని ప్రతిపక్ష పార్టీలు వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ బీసీ కులగణన, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెడతామని ప్రకటిస్తుందో ఆ పార్టీకే బీసీలు మద్దతు ఇస్తారని చెప్పారు.

భార్యను చంపి భర్త ఆత్మహత్య

ఆటో నడవక ఆర్థిక ఇబ్బందులతోనే...

ఖలీల్‌వాడి: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ ఆటోడ్రైవర్ భార్యను చంపి తను కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌లోని ఖిల్లా కెనాల్ కట్ట సమీపంలోని శాంతినగర్‌లో స్వామి(49), దేవలక్ష్మి(38) దంపతులు నివసించేవారు. వీరికి ఇంటర్ చదువుతున్న ఒక కుమారుడు ఉన్నాడు. స్వామి ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. స్వామికి ఆర్థిక ఇబ్బందులకు తోడు రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటో సరిగ్గా నడవడం లేదు. ఈ క్రమంలో ఒత్తిడికి గురైన స్వామి బుధవారం కుమారుడు ఇంటర్ పరీక్షకు వెళ్లాక, భార్యకు ఉరి వేసి, తను కూడా పురుగుల మందు తాగాడు. పరీక్ష ముగిశాక కొడుకు ఇంటికొచ్చే సరికి తల్లిదండ్రులు విగతజీవులుగా పడి ఉండటంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు.

ఇద్దరు ఉన్నతాధికారులకు ట్యాపింగ్‌లో పాత్ర!

- వారి ఆదేశాల మేరకే నేతలు, ప్రముఖుల ఫోన్లు ట్యాపింగ్
- ప్రణీత్‌రావు టీమ్‌లో ఓ ఇన్‌స్పెక్టర్ సహా 18 మంది
- విచారణకు ఏమాత్రం సహకరించని ఎస్‌ఐబీ మాజీ డీఎస్పీ
- కొందరితో కలసి నేరం చేసినట్టుగా మాత్రం అంగీకారం
- సాంకేతిక ఆధారాలతో ముందుకు వెళ్తున్న దర్యాప్తు అధికారులు
- ప్రణీత్‌ను కోర్టులో హాజరుపరిచిన పోలీసులు.. జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలింపు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని పంజగుట్ట పోలీసుల అదుపులో ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్‌ఐబీ) మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావు విచారణకు ఏమాత్రం సహకరించడం లేదని సమాచారం. కాగా సాంకేతిక ఆధారాలను బట్టి ముందుకు వెళ్తున్న దర్యాప్తు అధికారులు ఈ అక్రమ ట్యాపింగ్ వ్యవహారంలో ఇద్దరు ఉన్నతాధికారుల పాత్ర ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసు దర్యాప్తులో నిఘా విభాగానికి చెందిన అధికారులు పాల్గొంటున్నారు. మంగళవారం రాత్రి సిరిసిల్లలో అరెస్టు చేసిన ప్రణీత్‌రావును హైదరాబాద్ తరలించిన అధికారులు ఓ రహస్య ప్రదేశంలో ఉంచి విచారిస్తున్నారు. ఎస్‌ఐబీ కార్యాలయంలో ప్రణీత్ ఏర్పాటు చేసుకున్న స్పెషల్ టీమ్‌లో ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్, హెడ్ కానిస్టేబుల్‌తో పాటు 15 మంది కానిస్టేబుళ్లు ఉన్నట్లు తెలిసింది. వీరిని సైతం దర్యాప్తు అధికారులు వివిధ కోణాల్లో విచారిస్తూ వాంగ్మూలాలు నమోదు చేస్తున్నారు.



ఫోరెన్సిక్ పరీక్షలకు ప్రణీత్ ఫోన్

ప్రణీత్ నుంచి సీజ్ చేసిన ఫోన్‌ను దర్యాప్తు అధికారులు ఫోరెన్సిక్ పరీక్షల నిమిత్తం పంపారు. అక్కడి నిపుణులు ఆ ఫోన్ నుంచి వెళ్లిన ఎస్ఎంఎస్, వాట్సాప్ సందేశాలను రిట్రీవ్ చేయగలిగారు. వాటి ఆధారంగానే ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఇద్దరు ఉన్నతాధికారులను గుర్తించగలిగారని సమాచారం. ఫలానా నంబర్ లేదా వ్యక్తి ఫోన్ ట్యాప్ చేయాలంటూ వీరి నుంచి ప్రణీత్‌కు సందేశాలు రావడం, ఆ ట్యాపింగ్‌కు సంబంధించిన కొన్ని రికార్డులను ప్రణీత్ వీరికి పంపినట్లుగా గుర్తించినట్టు తెలిసింది. ఇద్దరు ఉన్నతాధికారుల్లో ఒకరు అప్పటికే పదవీ విరమణ పొంది, ఎక్స్‌టెన్షన్‌పై కొనసాగిన అధికారి కాగా.. మరొకరు ఇప్పటికీ సర్వీసులో ఉన్నట్టు తెలుస్తోంది. కాగా మరికొన్ని ఆధారాలు సేకరించిన తర్వాత ఆ అధికారులకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది.

ఐదేళ్లలో 2 లక్షల సంభాషణలు రికార్డు

ప్రణీత్‌రావు పోలీసు శాఖ జారీ చేసిన అధికారిక ఫోన్‌తో పాటు మరికొన్ని ప్రైవేట్ నంబర్లను విని యోగించినట్లు గుర్తించారు. ఈ ఫోన్ నంబర్లను సేకరించిన అధికారులు గడిచిన కొన్నేళ్లలో వాటికి వచ్చిన, వెళ్లిన కాల్స్, ఎస్ఎంఎస్‌ల వివరాలు సేకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రణీత్‌రావు 2018 నుంచి ఎస్‌ఐబీలో ఆ విభాగం చీఫ్‌గా వ్యవహరించిన ప్రభాకర్‌రావు కనుసన్నల్లో పని చేశాడు. ఐదేళ్లలో అతడు వివిధ ఫోన్ నంబర్లకు సంబంధించిన దాదాపు 2 లక్షల సంభాషణల్ని ట్యాపింగ్ ద్వారా రికార్డు చేసినట్లు తెలుస్తోంది. గతేడాది డిసెంబర్ 4 రాత్రి ఎస్‌ఐబీ కార్యాలయంలోకి ప్రవేశించి ధ్వంసం చేసిన హార్డ్‌డిస్కుల్లో ఇవి ఉన్నట్లు అనుమానిస్తున్నారు. కొన్ని రికార్డులను అతను కార్యాలయం నుంచి బయటకు కూడా తరలించినట్లు భావిస్తున్న అధికారులు వాటి కోసం ఆరా తీస్తున్నారు. ప్రణీత్‌రావు కేవలం ప్రతిపక్షాలు, కొందరు ప్రముఖుల ఫోన్లు మాత్రమే కాకుండా బీఆర్ఎస్‌కు చెందిన కొందరివి, పోలీసు అత్యున్నత అధికారులవీ ట్యాప్ చేసినట్లుగా ఆధారాలు సేకరించారు. వీళ్లు ఎవరు? ఎవరు చెప్పడంతో చేశారు? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల సందర్భంగా నిధుల తరలింపు!

గత ఎన్నికలతో పాటు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో ప్రణీత్‌రావు ఓ పార్టీ నిధుల తరలింపులోనూ కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. తన అధికారిక వాహనంతో పాటు ఎస్‌ఐబీ, గ్రేహౌండ్స్‌కు సంబంధించిన వాహనాలను దీనికోసం వినియోగించాడని తెలుస్తోంది. నగదు, బంగారం, వెండి ఆభరణాలతో పాటు ఇతర వస్తువులను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చేర్చడంలో ప్రణీత్ కీలక పాత్రధారని పోలీసులు చెప్తున్నారు.

పోలీస్ కస్టడీ కోసం నేడు పిటిషన్

ప్రణీత్‌రావును బుధవారం రాత్రి పోలీసులు కొంపల్లిలోని నాంపల్లి కోర్టు న్యాయమూర్తి ఇంట్లో ఆయన ఎదుట హాజరు పరిచారు. న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా ప్రణీత్‌ను 10 రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు గురువారం కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు. ఇలా వుండగా అయితే తాను మరికొందరితో కలిసి ఈ నేరం చేసినట్లుగా ప్రణీత్ రావు అంగీకరించాడని వెస్ట్ జోన్ డీసీపీ ఎస్.విజయ్‌కుమార్ వెల్లడించారు. ఈ కేసును జూబ్లీహిల్స్ ఏసీపీ పి.వెంకటగిరి నేతృత్వంలోని బృందం దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టీవీ 5 సాంబశివరావు నా ఫోన్లు ట్యాప్ చేయించాడు

- ప్రణీత్‌రావుతో కలిసి నన్నూ నా కుటుంబాన్ని వేధించాడు
- వ్యాపారాల్లో నష్టం వచ్చేలా చేశాడు
- పంజగుట్ట పోలీసులకు శ్రీధర్‌రావు ఫిర్యాదు

పంజగుట్ట (హైదరాబాద్): టీవీ–5 సాంబశివరావు, ఎస్‌ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావులు కలిసి తనను, తన కుటుంబాన్ని తీవ్ర మానసిక వేధింపులకు గురిచేశారని, తన ఫోన్లు ట్యాపింగ్ చేసి వ్యాపారంలో నష్టం వచ్చేలా చేశారని పేర్కొంటూ వ్యాపారవేత్త శరణాల శ్రీధర్‌రావు బుధవారం రాత్రి పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాంబశివరావు, ప్రణీత్‌రావుతో పాటు వారికి సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రణీత్‌రావు వ్యవహారంతో నా కష్టాలకు కారణం తెలిసింది

'జూబ్లీహిల్స్ పరిధిలోని నందగిరి హిల్స్‌లో నివసించే నేను గత మూడు దశాబ్దాలుగా రియల్ ఎస్టేట్, ఫుడ్ కోర్టులతో పాటు పలు వ్యాపారాలు నిర్వహిస్తున్నా. గతంలో పరిచయస్తుడైన సాంబశివరావు 2017–18 ప్రాంతంలో నా వద్దకు వచ్చి తనకు ప్రభుత్వంలో పెద్ద పెద్దవారు పరిచయం ఉన్నారని, మీకు ఎలాంటి సాయం కావాలన్నా చేస్తామని నమ్మబలికాడు. సాంబశివరావు ఉంటున్న ఇంటికి నేనే అద్దె చెల్లించే వాడిని. 2021లో నాకు ఉన్న రెండు కమర్షియల్ ప్లాట్‌లలో ఒకటి సాంబశివరావు హెచ్‌పీసీఎల్ పెట్రోల్‌బంకు పెట్టుకుంటానంటే అద్దెకు ఇచ్చా. ఇంతసాయం చేసినా సాంబశివరావు నన్ను భుజంగరావు అనే పోలీస్ ఉన్నతాధికారి వద్దకు తీసుకువెళ్లాడు. ఇద్దరూ కలిసి కొన్ని సెటిల్‌మెంట్‌ల విషయంలో ఆర్థిక సాయం చెయ్యాలంటూ ఒత్తిడి చేశారు. నేను ఒప్పుకోకపోవడంతో నీవు హైదరాబాద్‌లో నన్ను కాదని ఎలా వ్యాపారాలు చేస్తావో చూస్తానంటూ సాంబశివరావు హెచ్చరించాడు. దీంతో నేను అతన్ని దూరం పెట్టా. కానీ నాకు తెలియకుండానే నా వ్యాపారాలకు సంబంధించిన ఉద్యోగస్తుల్లో గొడవలు సృష్టించి నానా ఇబ్బందులకు గురిచేశాడు. అంతే కాకుండా పోలీసు అధికారుల అండతో ఎలాంటి ఆధారాలు లేకున్నా నాపై పదుల సంఖ్యలో తప్పుడు కేసులు బనాయించాడు.

నా వ్యాపారాలు హస్తగతం చేసుకోవాలనుకున్నాడు

తాజాగా ప్రణీత్‌రావు వ్యవహారం బయటకు రావడంతో నేను ఇన్నిరోజులు పడ్డ కష్టానికి కారణం తెలిసింది. ప్రణీత్ రావు, ఇతర పోలీసు అధికారుల సహాయంతో సాంబశివరావు నా ఫోన్ ట్యాప్ చేయించాడు. నన్ను హింసకు గురిచేసి, తుదముట్టించి, నా వ్యాపారాలు హస్తగతం చేసుకోవాలనుకునే కుట్రతో నా ఫోన్లు, నా కుటుంబ సభ్యుల ఫోన్లు రెండు మూడు సంవత్సరాలుగా ట్యాప్ చేయించాడు. నా అంతర్గత సంభాషణలు వినడమే కాకుండా, నా సంస్థల్లోని ఉద్యోగస్తుల ఫోన్లను సైతం ట్యాప్ చేశారు. నాపై తప్పుడు కేసులు బనాయించారు..' అని శ్రీధర్‌రావు తన ఫిర్యాదులో ఆవేదన వ్యక్తం చేశారు.

జస్టిస్ సిర్పూర్కర్ నివేదిక రాజ్యాంగ విరుద్ధం

- 'దిశ' కేసులో పోలీసుల వాదనలు

సాక్షి, హైదరాబాద్: 'దిశ' నిందితుల ఎన్‌కౌంటర్ కేసులో జస్టిస్ సిర్పూర్కర్ సుప్రీంకోర్టుకు సమర్పించిన నివేదిక రాజ్యాంగ విరుద్ధమని, దాన్ని రద్దు చేయాలని పోలీసులు, పలువురు అధికారులు.. హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. కమిషన్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ పోలీసులు, అధికారులు హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు శ్రీరఘురాం, వివేక్ రెడ్డి, రచనారెడ్డి తదితరులు వాదనలు వినిపించారు. దిశ ఎన్‌కౌంటర్లో పాల్గొన్న 10 మంది పోలీసులను బాధ్యులుగా చేస్తూ కమిషన్ ఇచ్చిన నివేదిక రాజ్యాంగం ప్రకారం చెల్లదన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో సిట్ దర్యాప్తునకు.. కమిషన్ నివేదిక భిన్నంగా ఉందని చెప్పారు. దర్యాప్తు చేయకుండా పోలీసులను బాధ్యులను చేయడం సమంజసం కాదన్నారు. తదుపరి వాదనల కోసం విచారణను న్యాయమూర్తి నేటి (గురువారం)కి వాయిదా వేశారు.

పరువు తీస్తామంటూ బ్లాక్‌మెయిల్

- భరించలేక పిల్లలను చంపి తండ్రి ఆత్మహత్య
- టంగటూరు ఆత్మ'హత్య'ల కేసును ఛేదించిన పోలీసులు
- ఇద్దరు విలేకరులు, ఓ హోంగార్డు రిమాండ్
- పరారీలో మరో ముగ్గురు విలేకరులు

మణికొండ: ముగ్గురు కన్న బిడ్డలను చంపి ఓ తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డ కేసును మోకిల పోలీసులు ఛేదించారు. కేసు వివరాలను బుధవారం నార్సింగి ఏసీపీ కార్యాలయంలో డీసీపీ చింతమనేని శ్రీనివాస్ వెల్లడించారు. శంకర్‌పల్లి మండలం, టంగటూరుకు చెందిన నీరటి రవి(40) విజయనగరంలోని జీఎస్ఎస్ ఫౌండేషన్ మనీ సర్క్యులేషన్ స్కీమ్‌లో వందలాదిమందిని చేర్పించి మోసపోయాడు. మొదట్లో డబ్బులు సక్రమంగానే ఇచ్చిన సదరు ఫౌండేషన్ ఆ తర్వాత చెల్లింపులు నిలిపివేసింది. ప్రతి నెలా వచ్చే డబ్బులు రాకపోవడంతో రవిపై సభ్యుల ఒత్తిడి పెరిగింది. అందులో హోంగార్డు నాగరాజు, అతని భార్య ఒత్తిడి అధికం కావటంతో తన భార్య పేరిట ఉన్న రెండు ప్లాట్‌ల పత్రాలను తాకట్టు పెట్టి రూ. 18 లక్షలను తెచ్చి ఇచ్చాడు. దీంతో మిగిలిన వారు ఒత్తిడి చేస్తూ వచ్చారు. విషయం తెలుసుకుని శంకర్‌పల్లి మండలానికి చెందిన విలేకరులు శ్రీను, శ్రీనివాస్, మహేష్, ప్రవీణ్,, శ్రీనివాస్‌రెడ్డి బెదిరించారు. పత్రికల్లో రాయొద్దంటే రూ. 20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో చివరికి భార్య పుస్తెల తాడును తాకట్టు పెట్టి రూ. 2.50 లక్షలు వారికి ఇచ్చాడు. అయినా వేధింపులు ఎక్కువ కావటంతో మార్చి నెల 3వ తేదీన ఇంట్లో తన ముగ్గురు కుమారులు సాయికిరణ్(13), మోహిత్(11), ఉదయ్‌కిరణ్(9)ల మెడకు తాడుతో బిగించి హత్య చేసి తాను ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు ఐదు మంది విలేకరులతో పాటు అతన్ని వేధింపులకు గురి చేసిన మరో నలుగురిని గుర్తించి కేసులో చేర్చారు. శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్, హోంగార్డు నాగరాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, మిగిలిన ముగ్గురు విలేకరులు పరారీలో ఉన్నారని డీసీపీ తెలిపారు.



రవి కుటుంబం (ఫైల్)

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌రావు కన్నుమూత



పెద్దవంగర: మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ వైద్యుడు నెమరుగొమ్ముల సుధాకర్ రావు (74) తీవ్ర అనారోగ్య సమస్యలతో బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం వడ్డెకొత్తపల్లి గ్రామానికి చెందిన మాజీ మంత్రి యతిరాజారావు–విమలదేవి దంపతులకు 1950, ఏప్రిల్ 3న నెమరుగొమ్ముల సుధాకర్‌రావు జన్మించారు. తండ్రి రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తూ నియోజకవర్గంలో తిరుగులేని రాజకీయ నాయకుడిగా వెలుగొందారు. నాటి చెన్నూరు (ప్రస్తుతం పాలకుర్తి) శాసనసభ్యుడిగా పనిచేశారు. ఉమ్మడి ఏపీలో టీడీపీ ఎమ్మెల్యేగా 1999 నుంచి 2004 వరకు కొనసాగారు. 2004, 2014 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ ట్రస్టు చైర్మన్‌గా పనిచేశారు. సుధాకర్‌రావుకు భార్య విజయలక్ష్మి, కుమారుడు వెంకట అనంతరావు(సంజయ్), కూతురు కార్తీక ఉన్నారు. సుధాకర్‌రావు మృతి పట్ల మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఎస్‌బీఐలో రూ.4.50 కోట్లు కాజేసిన మేనేజర్

- 24 మంది ఉద్యోగుల పేరుతో రుణాలు స్వాహా
- సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి...

సూర్యాపేట: తను పనిచేస్తున్న ఎస్‌బీఐ బ్యాంకులోని సొమ్మునే ఓ మేనేజర్ కాజేశారు. 2022 నుంచి 2023 వరకు 24 మంది ఉద్యోగుల పేరుతో రుణాలు స్వాహా చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. షేక్ సైదులు సూర్యాపేట ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేసిన సమయంలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ బ్యాంక్ రుణం తీసుకునేందుకు అర్హత కలిగిన వారిని ఎంచుకొని కుంభకోణానికి శ్రీకారం చుట్టాడు. బ్యాంకు రుణం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి అర్హత ఉన్నా, సాంకేతిక కారణాలు చూపి, అవసరమైన అదనపు పత్రాలు లేవంటూ రుణ దరఖాస్తును మొదటగా తిరస్కరించేవాడు. ఆపై అదే దరఖాస్తు ఆధారంగా, దరఖాస్తుదారుడి పేరు, వివరాలతో నకిలీ పత్రాలు సృష్టించి, వారి పేర్లతో మరోసారి రుణం కోసం దరఖాస్తు చేసేవాడు. దీనికి రుణం మంజూరు చేసినట్టు బ్యాంకు రికార్డుల్లో పొందుపర్చేవాడు. ఇలా ఒక్కో దరఖాస్తుదారుడి పేరుతో కనిష్టంగా రూ.15 లక్షలు కాజేశాడు. ఈ మొత్తాన్ని తన సొంత ఖాతాల్లోకి మళ్లించాడు.

వెలుగులోకి వచ్చింది ఇలా..


ఉద్యోగుల పేరుతో రుణం తీసుకొని తన ఖాతాల్లోకి మళ్లించుకున్న సైదులు గత సంవత్సరం హైదరాబాద్‌లోని సీసీసీ (కమర్షియల్ క్లయింట్‌గ్రూప్) మేనేజర్‌గా బదిలీ అయ్యాడు. అయితే తాను తీసుకున్న ఈ రుణాలకు ప్రతి నెలా ఈఎంఐలు చెల్లించేవాడు. 2024 ఫిబ్రవరి ఈఎంఐ చెల్లించకపోవడంతో ఉద్యోగులకు బ్యాంకు నుంచి నోటీసులు వచ్చాయి. దీంతో అసలు విషయం తెలుసుకున్న బాధితులు సూర్యాపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా ఇతను రామంతాపూర్ ఎస్‌బీఐ మేనేజర్‌తో కలిసి ఇదే తరహా మోసం చేసి రూ. 2.84 కోట్లు, సికింద్రాబాద్‌లో వెస్ట్ మారేడ్‌పల్లి బ్రాంచ్ నుంచి రూ. 9.50 కోట్లు కాజేసినట్టు సమాచారం.

కొందరు ఉద్యోగులకు తెలిసే చేశారా ?

పోలీస్‌శాఖలో 11 మంది ఉద్యోగులు, వైద్యారోగ్యశాఖలో ఇద్దరు, విద్యాశాఖలో ఇద్దరు, ఎక్సైజ్‌లో ఇద్దరు, కలెక్టరేట్‌లో వివిధ శాఖలకు చెందిన ఐదుగురు, ఇద్దరు ప్రైవేటు ఉద్యోగులు ఇలా మొత్తం 24 మంది ఉద్యోగుల పేరుతో బ్యాంక్ మేనేజర్ రుణం తీసుకున్నాడు. అయితే తమ పేరున రుణాలు తీసుకున్నట్టు కొందరు ఉద్యోగులకు ముందుగానే తెలిసినట్టు సమాచారం. మేనేజర్‌తో ఉద్యోగులు పర్సెంటేజీ మాట్లాడుకొని రుణం తీసుకునేందుకు అంగీకరించినట్టు తెలుస్తోంది. మరి కొంతమంది ఉద్యోగులు మేనేజర్ మాయమాటలకు మోసపోయినట్టు సమాచారం.

'రజాకార్'పై సీబీఎఫ్‌సీనే సంప్రదించండి

- పిటిషనర్ ఏపీసీఆర్‌కు తేల్చిచెప్పిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: 'రజాకార్' చిత్రం విడుదలను ఆపాలని నేరుగా కోర్టుకు రావడం సరికాదని.. సెంట్రల్ బోర్డు ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) లోనే అప్పిలేట్ అథారిటీలు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ (ఏపీసీఆర్)కు హైకోర్టు తేల్చిచెప్పింది. సెన్సార్ బోర్డులోని అథారిటీని సంప్రదిస్తే కమిటీలను వేసి.. మరోసారి చిత్రాన్ని చూసి, మీ అభ్యంతరాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేస్తూ పిటిషన్‌లో వాదనలను ముగించింది. సమర్ వీర్ క్రియేషన్స్ బ్యానర్‌పై గూడూరు నారాయణరెడ్డి రజాకార్ చిత్రాన్ని నిర్మించారు. 1950 సమయంలో రజాకార్లు హైదరాబాద్ ప్రజలను ఎలా పీడించారు అనే అంశంతో రూపొందిన ఈ సినిమా మార్చి 15న తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళం, మరాఠీ, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది. ఈ చిత్రం మత కలహాలను రెచ్చగొట్టేలా ఉందని, విడుదలను ఆపాలని కోరుతూ ఢిల్లీకి చెందిన ఏపీసీఆర్ కార్యదర్శి మహ్మద్ వాసిక్ నదీమ్ ఖాన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. సీబీఎఫ్‌సీ తరఫున న్యాయవాది వాదిస్తూ.. పిటిషనర్లు సెన్సార్ బోర్డు సర్టిఫికెట్‌ను చాలెంజ్ చేయలేదన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. సెన్సార్ బోర్డులోని అప్పిలేట్ అథారిటీని సంప్రదించాలని ఆదేశిస్తూ, వాదనలను ముగించింది.

పథకాల లబ్ధిదారులతో మోదీ మమేకం

- గవర్నర్ తమిళిసై సౌందరరాజన్
- పీఎం–సురాజ్ పోర్టల్‌ను వర్చువల్‌గా ఆవిష్కరించిన మోదీ



పీఎం–సురాజ్ పోర్టల్ ఆవిష్కరణ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ప్రధాని నరేంద్ర మోదీ సంక్షేమ, అభివృద్ధి పథకాల లబ్ధిదారులతో నిత్యం మమేకం అవుతున్నారని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. ఆయా పథకాల అమలులో వారిని భాగస్వాములను చేస్తున్నారని పేర్కొన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కందిలో ఉన్న హైదరాబాద్ ఐఐటీలో పీఎం–సురాజ్ పోర్టల్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. దీనిని ప్రధాని మోదీ వర్చువల్‌గా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన గవర్నర్ మాట్లాడుతూ.. దేశంలో సామాజిక న్యాయం, సాధికారత సాధించే దిశగా కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతోందన్నారు. ఈ సందర్భంగా మోదీ.. షెడ్యూల్డ్ కులాలు, సఫాయి కార్మికులు, బీసీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కార్యక్రమంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, ఐఐటీహెచ్ డీన్ చంద్రశేఖర్ శర్మ, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్‌బీఐ సీజీఎం రాజేశ్ కుమార్, కెనరా బ్యాంకు డీజీఎం ఆర్.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

మళ్లీ ఆ ఇద్దరే!



అమెరికా అధ్యక్ష తుది రేసులో నిలిచిన బైడెన్, ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష రేసులో చివరకు మళ్లీ బైడెన్, ట్రంప్‌లే నిలిచారు. అధ్యక్ష పీఠం కోసం తమ తమ పార్టీల తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వాలను బైడెన్, ట్రంప్ గెల్చుకున్నారు. మెజారిటీ డెలిగేట్ల ఓట్లను సాధించడం ద్వారా రిపబ్లికన్ పార్టీ తరఫున డొనాల్డ్ ట్రంప్, డెమొక్రటిక్ పార్టీ తరఫున 81 ఏళ్ల జో బైడెన్‌లు తమ అభ్యర్థిత్వాన్ని ఖరారుచేసుకున్నారు. తాజాగా జార్జియాలో జరిగిన డెమొక్రటిక్ ప్రైమరీలో గెలిచి ఇప్పటిదాకా బైడెన్ 2,099 డెలిగేట్ల ఓట్లను సాధించారు. మొత్తం 3,933 ఓట్లలో 1,968 ఓట్లు వచ్చినా అభ్యర్థిత్వం ఖరారు అవుతుంది. ఇప్పటికే బైడెన్ ఆ సంఖ్యను దాటేయడం విశేషం. డెమొక్రటిక్ పార్టీ తరఫున బైడెన్ అభ్యర్థిత్వాన్ని ఆగస్ట్‌లో చికాగోలో జరిగే పార్టీ జాతీయ సదస్సులో అధికారికంగా ప్రకటిస్తారు. రిపబ్లికన్ పార్టీ తరఫున అభ్యర్థిత్వం సాధించాలంటే కనీసం 1,215 ఓట్లు గెలవాలి. ట్రంప్ ఇప్పటిదాకా మొత్తంగా 1,228 ఓట్లను గెల్చుకున్నారు. జూలైలో మిల్‌వాకీలో జరిగే రిపబ్లికన్ నేషనల్ కన్వెన్షన్‌లో ట్రంప్ అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ప్రకటిస్తారు. మంగళవారం నాటి ప్రైమరీలో గెలవడం ద్వారా ట్రంప్ రిపబ్లికన్ పార్టీ తరఫున వరసగా మూడోసారి అధ్యక్ష ఎన్నికల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. 2020 నాటి ప్రత్యర్థులే మళ్లీ అధ్యక్ష సమరంలో గెలుపు కోసం పోరాడుతున్నా ఈసారి ఎన్నికల్లో ప్రధాన అంశాలు, ప్రచార అస్త్రాలు మారాయి. ఆనాడు ట్రంప్‌పై ఎలాంటి కేసులు లేవు. కానీ ఇప్పుడు ట్రంప్ మెడకు 91 కేసులు చుట్టుకున్నాయి.

ఎవరికి ఓటేస్తారు?: బైడెన్

మంగళవారం నాటి ప్రైమరీ గెలుపు తర్వాత బైడెన్ మాట్లాడారు. ''ప్రజాస్వామ్యాన్ని గెలిపిస్తారా? లేదంటే కూలదోస్తారా?. స్వేచ్ఛ, ఎన్నుకునే హక్కులను పునరుద్ధరించుకుందామా? లేదంటే వాటిని అతివాదులకు అప్పగిద్దామా?'' అని పరోక్షంగా ట్రంప్‌ను విమర్శిస్తూ బైడెన్ ఓటర్లకు పిలుపునిచ్చారు. చరిత్రలో చెత్త అధ్యక్షుడు బైడెన్‌ను గద్దె దించాల్సిన సమయమొచ్చింది అని ట్రంప్ సైతం ఒక వీడియో సందేశంలో రిపబ్లికన్ ఓటర్లకు పిలుపునిచ్చారు.

డెమొక్రటిక్ పార్టీలో అభ్యర్థులు గెల్చిన డెలిగేట్ల ఓట్లు	
జో బైడెన్	2,099
ఇతరులు	20
జేసన్ పామర్	3

రిపబ్లికన్ పార్టీలో అభ్యర్థులు గెల్చిన డెలిగేట్ల ఓట్లు	
ట్రంప్	1,228
నిక్కీ హేలీ	91
రాన్ డీశాంటిస్	9
వివేక్ రామస్వామి	3

కవ్విస్తే అణు యుద్ధమే!



రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరిక

మాస్కో: తమ దేశ సార్వభౌమత్వం, స్వాతంత్ర్యం, గుర్తింపునకు ఏదైనా ముప్పు తలెత్తితే అణ్వాయుధాలు ప్రయోగించడానికి వెనుకాడబోమని రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ హెచ్చరించారు. రష్యావైపు ప్రత్యర్థులు కన్నెత్తి చూస్తే అణు యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని పరోక్షంగా తేల్చిచెప్పారు. ఇలాంటి ప్రమాదకర యుద్ధానికి దారితీసే చర్యలకు అమెరికా దూరంగా ఉంటుందని ఆశిస్తున్నామని బుధవారం ప్రసారమైన ప్రభుత్వ అధికారిక టీవీ చానల్ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. రష్యాలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు అధ్యక్ష ఎన్నికలు జరుగబోతున్న తరుణంలో పుతిన్ పశ్చిమ దేశాలకు హెచ్చరికలు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఎన్నికల్లో పుతిన్ మరోసారి అధ్యక్షుడిగా నెగ్గడం ఖాయమేనని తెలుస్తోంది. ఆరేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. అణు యుద్ధమే జరిగితే తలెత్తే పరిణామాల గురించి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు బాగా తెలుసని చెప్పారు. అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడైన బైడెన్ అన్నీ అర్థం చేసుకుంటారని భావిస్తున్నట్లు పుతిన్ వ్యాఖ్యానించారు. ప్రపంచ దేశాలు అణు యుద్ధం వైపు మొగ్గు చూపుతాయని తాను భావించడం లేదన్నారు.

ఉక్రెయిన్ విషయంలో లక్ష్యాలు సాధిస్తాం

తమ అణ్వాయుధ శక్తులు పూర్తి సన్నద్ధతతో ఉన్నాయని పుతిన్ స్పష్టం చేశారు. ఈ విషయంలో సైనిక–సాంకేతికపరంగా తాము సన్నాహాలు పూర్తిచేసుకొని, సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఒకదేశంగా రష్యా మనుగడకు ఎలాంటి ముప్పు వాటిల్లినా సహించబోమని, తమ దేశ సార్వభౌమత్వాన్ని, స్వాతంత్ర్యాన్ని కచ్చితంగా కాపాడుకుంటామని, ఇందుకోసం ఏమైనా చేస్తామని, ఇందులో భాగంగా అణ్వాయుధ ప్రయోగాలకైనా సిద్ధమేనని ఉద్ఘాటించారు. ఉక్రెయిన్‌పై జరుగుతున్న యుద్ధంలో అణ్వాయుధాలు ప్రయోగించాలని అనుకుంటున్నారా? అని ప్రశ్నించగా, ఆ అవసరం లేదని బదులిచ్చారు. ఉక్రెయిన్ విషయంలో తమ లక్ష్యాలు తప్పనిసరిగా సాధిస్తామని పుతిన్ ధీమా వ్యక్తం చేశారు. ఉక్రెయిన్‌తో చర్చలకు తలుపులు తెరిచే ఉన్నాయని సూచించారు. రష్యా భద్రతకు పశ్చిమ దేశాల నుంచి గ్యారంటీలు కోరుతున్నామని చెప్పారు. అయితే, చర్చలు జరిగే సమయాన్ని తమ ప్రత్యర్థి దేశం ఆయుధాలు సమకూర్చుకోవడానికి వాడుకోవద్దని అన్నారు. తమ దేశంలో ఎన్నికల ప్రక్రియకు భంగం కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇందులో భాగంగానే ఉక్రెయిన్ సైన్యం ఇటీవలి కాలంలో డ్రోన్లతో దాడులకు దిగిందని భావిస్తున్నామని తెలిపారు. 2022 ఫిబ్రవరిలో రష్యా సైన్యం ఉక్రెయిన్‌పై దండయాత్ర ప్రారంభించిన సంగతి తెలిసిందే. అప్పటినుంచి అణ్వాయుధ ప్రయోగంపై పుతిన్ తరచుగా ప్రకటనలు చేస్తూనే ఉన్నారు. గత నెలలో రష్యా ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలోనూ ఈ ప్రస్తావన తీసుకొచ్చారు. ఉక్రెయిన్‌కు సహకరిస్తే అణుబాంబులు ప్రయోగిస్తామని పశ్చిమ దేశాలను హెచ్చరించారు.

బెంగళూరు పేలుడు కేసులో ఒకరి విచారణ

సాక్షి, బళ్లారి: కర్ణాటక రాజధాని బెంగళూరులోని వైట్‌ఫీల్డ్ రామేశ్వరం కేఫ్‌లో ఇటీవల జరిగిన బాంబు పేలుడు ఘటనలో బళ్లారిలో షబ్బీర్ అహ్మద్ అనే వ్యక్తిని ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కేఫ్‌లో బాంబు పెట్టి వెళ్లిపోయిన నిందితుడి కోసం గాలిస్తూ బుధవారం షబ్బీర్ ఆచూకీని కనుగొన్నారు. బళ్లారిలో మోతీ సర్కిల్ సమీపంలోని కొత్త బస్టాండ్‌కు వెళ్లే దారిలో షబ్బీర్‌ను అతడి ఇంటి వద్ద అదుపులోకి తీసుకున్నారు. అక్కడ కొంతసేపు విచారించి బెంగళూరుకు తరలించారు. బాంబు పెట్టిన వ్యక్తికి, షబ్బీర్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు అనుమానాలున్నాయి. షబ్బీర్ బళ్లారి సమీపంలో తోరణగల్లు వద్ద ఓ ప్రైవేట్ కంపెనీలో ఎలక్ట్రిషియన్‌గా పని చేస్తున్నాడు. బాంబు పేలుడు తర్వాత ప్రధాన నిందితుడు బెంగళూరు నుంచి బళ్లారికి బస్సులు మారుతూ వచ్చాడు. ఆపై షబ్బీర్ ఇంటికి వచ్చి అతడిని కలిసినట్లు ఎన్ఐఏ అధికారులు సీసీ కెమెరాల ద్వారా గుర్తించినట్లు తెలిసింది. కాగా, షబ్బీర్‌ను విచారించి రాత్రి వదిలిపెట్టినట్లు సమాచారం.

సెమీ కండక్టర్ల రంగంలో
గ్లోబల్ పవర్‌గా ఇండియా

- ప్రధాని మోదీ వెల్లడి
- 3 చిప్ ప్లాంట్లకు శంకుస్థాపన

గాంధీనగర్: సెమీ కండక్టర్ల రంగంలో మన దేశం కీలక పాత్ర పోషించబోతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఈ రంగంలో భారత్ గ్లోబల్ పవర్‌గా ఎదిగే రోజు ఎంతో దూరంలో లేదని అన్నారు. ఇండియాలో రూ.1.25 లక్షల కోట్లతో స్థాపించనున్న మూడు సెమీ కండక్టర్ల తయారీ ప్లాంట్లకు ప్రధాని మోదీ బుధవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఇందులో రెండు గుజరాత్‌లో, ఒకటి అస్సాంలో రాబోతున్నాయి. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... గత ప్రభుత్వాలు దేశీయంగా సెమీ కండక్టర్ల తయారీని పట్టించుకోలేదని పరోక్షంగా కాంగ్రెస్‌పై మండిపడ్డారు. అభివృద్ధి పట్ల అంకితభావం లేకపోవడమే ఇందుకు కారణమని చెప్పారు. దేశ శక్తి సామర్థ్యాలను, ప్రాధాన్యతలను, భవిష్యత్తు అవసరాలను గుర్తించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆక్షేపించారు. మన దేశాన్ని సెమీ కండక్టర్ల తయారీ హబ్‌గా తీర్చిదిద్దాలని తమ ప్రభుత్వం సంకల్పించిందని వెల్లడించారు. దేశీయంగా చిప్‌ల తయారీతో యువతకు ఎన్నెన్నో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి ఈ రంగం దోహదపడుతుందని వివరించారు. సెమీ కండక్టర్ మిషన్‌ను రెండేళ్ల క్రితం ప్రకటించామని, తర్వాత కొన్ని నెలల వ్యవధిలోనే అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్నామని, ఈరోజు మూడు పరిశ్రమలకు శంకుస్థాపన చేశామని వ్యాఖ్యానించారు. అనుకున్నది సాధించే శక్తి భారత్‌కు, ప్రజాస్వామ్యానికి ఉందని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.



పీఎం-సూరజ్ నేషనల్ పోర్టల్ ప్రారంభం

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఎస్సీ, ఎస్టీలు, బీసీలే అత్యధికంగా లబ్ధి పొందుతున్నారని ప్రధాని మోదీ చెప్పారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆయా వర్గాలను విస్మరించాయని ఆరోపించారు. దేశాభివృద్ధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీల పాత్రను కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏనాడూ గుర్తించలేదని విమర్శించారు. దళిత, గిరిజన వర్గాలకు చెందిన రామ్‌నాథ్ కోవింద్, ద్రౌపదీ ముర్మును తాము రాష్ట్రపతులను చేశామని అన్నారు. అణగారిన వర్గాలను అత్యున్నత పదవుల్లో నియమిస్తున్నామని, ఇది ఇకపైనా కొనసాగుతుందని వివరించారు. ప్రధానమంత్రి సామాజిక్ ఉత్థాన్, రోజ్‌గార్ ఆధారిత్ జన్‌కల్యాణ్(పీఎం–సూరజ్) నేషనల్ పోర్టల్‌ను మోదీ బుధవారం ప్రారంభించారు. ఈ పోర్టల్ ద్వారా ఎస్టీలు, ఎస్సీలు, వెనుకబడిన తరగతులతోపాటు పారిశుద్ధ్య కార్మికులు రుణాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

సీఈసీ, ఈసీల నియామక చట్టంపై
15న సుప్రీం అత్యవసర విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: ముఖ్య ఎన్నికల కమిషనర్(సీఈసీ), ఎన్నికల కమిషనర్ల(ఈసీలు) నియామకం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ఈ నెల 15వ తేదీన విచారణ చేపడతామని సుప్రీంకోర్టు బుధవారం వెల్లడించింది. సీఈసీ, ఈసీ నియామకం కోసం ఉద్దేశించి ప్యానెల్ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కేంద్రం తప్పించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) అనే ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తమ పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ చేపట్టాలని ఏడీఆర్ విజ్ఞప్తి చేసింది. 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్, అదర్ ఎలక్షన్ కమిషనర్స్ యాక్ట్–2023'లోని సెక్షన్ 7 అమలుపై స్టే విధించాలని కోరింది. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం స్పందించింది. శుక్రవారం విచారణ చేపట్టేందుకు అంగీకరించింది.

ఐదేళ్లలో 22,217 ఎలక్టోరల్ బాండ్లు

న్యూఢిల్లీ: దేశంలో రాజకీయ పార్టీలకు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా సమకూరిన నిధుల వివరాలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) సుప్రీంకోర్టుకు తెలియజేసింది. 2019 ఏప్రిల్ 1 నుంచి 2024 ఫిబ్రవరి 15 దాకా.. ఐదేళ్లలో 22,217 ఎలక్టోరల్ బాండ్లు జారీ చేశామని, వీటిని వ్యక్తులు/సంస్థలు కొనుగోలు చేసి, రాజకీయ పార్టీలకు విరాళం రూపంలో అందజేశారని వెల్లడించింది. ఇందులో 22,030 బాండ్లను రాజకీయ పార్టీలు నగదుగా మార్చుకున్నాయని వివరించింది. నిబంధనల ప్రకారం.. జారీ చేసిన తేదీ నుంచి 15 రోజుల్లోగా నగదుగా మార్చుకోకపోవడం వల్ల మిగిలిపోయిన 187 బాండ్లకు సంబంధించిన డబ్బును ప్రధానమంత్రి సహాయ నిధికి అందజేసినట్లు స్పష్టం చేసింది. ఈ మేరకు ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్‌కుమార్ ఖరా బుధవారం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. న్యాయస్థానం ఆదేశాల ప్రకారం ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఇప్పటికే ఎన్నికల సంఘానికి అందజేశామని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ప్రతి బాండ్‌ను కొనుగోలు చేసిన తేదీ, కొనుగోలుదార్ల పేర్లు, బాండ్లను రాజకీయ పార్టీలు నగదుగా మార్చుకున్న తేదీ వంటి అన్ని వివరాలను ఎన్నికల సంఘానికి డిజిటల్ రూపంలో అందజేశామని తెలిపారు.

సీఏఏ దరఖాస్తుదారుల కోసం హెల్ప్‌లైన్

సాక్షి, న్యూఢిల్లీ: పౌరసత్వ(సవరణ) చట్టం(సీఏఏ)–2019 కింద భారత పౌరసత్వం పొందాలనుకునే శరణార్థులకు సాయపడేందుకు త్వరలో హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తేనున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఆన్‌లైన్ వేదికగా దరఖాస్తు ప్రక్రియ జరుగుతుందని హోం శాఖ బుధవారం 'ఎక్స్'లో ఒక పోస్ట్ పెట్టింది. దరఖాస్తుల సమర్పణకు ఇప్పటికే ఓ పోర్టల్‌ను సిద్ధం చేసినట్లు గుర్తుచేసింది. ప్రతిరోజూ ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ఈ టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్లు అందుబాటులో ఉంటాయి. దేశంలోని ఏ ప్రాంతంలో నివసిస్తున్న వలసదారులైనా ఈ నంబర్లకు ఫోన్ చేసి తమ దరఖాస్తు సంబంధ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

విశ్వాసపరీక్షలో నెగ్గిన సైనీ

చండీగఢ్: ఖట్టర్ రాజీనామాతో హరియాణా సీఎం కుర్చీపై కూర్చున్న నాయబ్ సింగ్ సైనీ బుధవారం అసెంబ్లీ చేపట్టిన విశ్వాస పరీక్షలో గెలిచారు. మంగళవారం సీఎంగా బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజే ఆయనే స్వయంగా విశ్వాస పరీక్షకు గవర్నర్‌ను అభ్యర్థించి శాసనసభ ప్రత్యేక సమావేశం జరిగేలా చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు కుదరక సంకీర్ణ ప్రభుత్వం నుంచి జననాయక్ జనతా పార్టీ(జేజేపీ) వైదొలగడం, సీఎంగా ఖట్టర్ రాజీనామా చేయడం, నూతన సీఎంగా సైనీ ప్రమాణం చేయడం తెల్సిందే. ఈ నేపథ్యంలో విశ్వాసపరీక్షలో పాల్గొనకుండా 10 మంది తమ పార్టీ ఎమ్మెల్యేలకు జేజేపీ విప్ జారీచేసింది. అయినాసరే ఐదుగురు జేజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చారు. కానీ తీరా బలపరీక్షపై ఓటింగ్ జరిగే సమయానికి బయటకు వెళ్లిపోయారు. విశ్వాసపరీక్ష తీర్మానాన్ని ముఖ్యమంత్రి సభలో ప్రవేశపెట్టారు. రెండుగంటల చర్చ తర్వాత తీర్మానంపై ఓటింగ్‌ను స్పీకర్ అనుమతించారు. మూజువాణి ఓటుతో తీర్మానం నెగ్గింది. 90 మంది సభ్యులున్న హరియాణా అసెంబ్లీలో బీజేపీకి 41 మంది సొంత ఎమ్మెల్యేల బలముంది. మరో ఏడుగురు మద్దతు పలికారు. బుధవారం 12 మంది సభకు రాకపోవడంతో సభలో సభ్యుల సంఖ్య 78కి, మెజారిటీ మార్కు 40కి దిగివచ్చాయి. ఈ నేపథ్యంలో బీజేపీ సర్కార్ బలపరీక్షలో నెగ్గడం లాంఛనమైంది.



సభలో మాట్లాడుతున్న రాహుల్

పేద మహిళలకు ఏటా రూ. లక్ష

- ప్రభుత్వ ఉద్యోగాల్లో వారికి 50 శాతం రిజర్వేషన్
- 'మహిళా న్యాయ్' పేరిట ఎన్నికల హామీలను ప్రకటించిన రాహుల్ గాంధీ

ధులే: ఐదురకాల హామీలతో యువతకు 'యువ న్యాయ్' పేరిట ఎన్నికల వరాలు ప్రకటించిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బుధవారం పేద మహిళల కోసం ప్రత్యేకంగా 'మహిళా న్యాయ్' పేరిట హామీలను ఇచ్చారు. తాము కేంద్రంలో అధికారంలోకి వస్తే పేద మహిళలకు ఏటా రూ.1 లక్ష అందజేస్తామని, వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్ అమలుచేస్తామని ప్రకటించారు. 50 శాతం రిజర్వేషన్ పరిమితిని రాజ్యాంగ సవరణ ద్వారా తొలగిస్తామని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ చెప్పారు. బుధవారం మహారాష్ట్రలో భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా ధులే జిల్లాలో జరిగిన మహిళా ర్యాలీలో ఐదు 'మహిళా న్యాయ్' గ్యారెంటీలను రాహుల్ ప్రకటించారు. ' ఏటా పేద మహిళలకు రూ.1 లక్ష వారి బ్యాంక్ ఖాతాలో జమచేస్తాం. మహిళలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తాం. ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన పథకం, చైల్డ్ కేర్ సెంటర్లలో పనిచేసే మహిళా సిబ్బందికి అందే వేతనంలో కేంద్రం తరఫు బడ్జెట్‌ను రెట్టింపు చేస్తాం. మహిళా సమస్యల పరిష్కారానికి, తమ హక్కుల పట్ల మహిళల్లో అవగాహన పెంపునకు నోడల్ అధికారిని నియమిస్తాం. దేశంలో ప్రతీ జిల్లాలో సావిత్రిబాయ్ ఫూలే హాస్టళ్లను నెలకొల్పుతాం'' అని హామీలు ఇచ్చారు. '' మోదీ సర్కార్ మహిళలను మహిళా రిజర్వేషన్ చట్టం పేరిట ఎగతాళి చేసింది. ఆర్భాటంగా చట్టం చేసింది. కానీ పదేళ్ల తర్వాతే దానిని అమలుచేస్తారట. మేం అధికారంలోకి వస్తే తక్షణం చట్టాన్ని అమలుచేస్తాం' అని రాహుల్ అన్నారు.

లోక్‌సభ బరిలో
ఖట్టర్, గడ్కరీ
72 మంది అభ్యర్థులతో బీజేపీ రెండో జాబితా

న్యూఢిల్లీ: హరియాణా ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన బీజేపీ సీనియర్ నేత మనోహర్‌లాల్ ఖట్టర్ రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయబోతున్నారు. ఆయన అభ్యర్థిత్వాన్ని బీజేపీ నాయకత్వం ఖరారు చేసింది. 72 మంది అభ్యర్థులతో రెండో జాబితాను బుధవారం విడుదల చేసింది. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్, అనురాగ్ ఠాకూర్, కర్ణాటక మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై, ఉత్తరాఖండ్ మాజీ సీఎం త్రివేంద్ర సింగ్ రావత్‌తోపాటు ఖట్టర్‌కు ఇందులో స్థానం లభించింది. కేంద్ర మాజీ మంత్రులు సదానంద గౌడ, రమేశ్ పోఖ్రియాల్ నిశాంక్‌కు ఈసారి టికెట్ నిరాకరించారు. ఖట్టర్ హరియాణాలోని కర్నాల్ నుంచి, పీయూష్ గోయల్ ముంబై నార్త్ స్థానం నుంచి పోటీకి దిగబోతున్నారు. బసవరాజ్ బొమ్మై హావేరీ నుంచి, త్రివేంద్ర సింగ్ రావత్ హరిద్వార్ నుంచి పోటీ చేస్తారు. నితిన్ గడ్కరీ నాగపూర్ నుంచి అనురాగ్ ఠాకూర్ హమీర్‌పూర్ నుంచి బరిలోకి దిగుతారు. మహారాష్ట్రలోని బీడ్ స్థానంలో ప్రీతం ముండే స్థానంలో ఆమె సోదరి పంకజ ముండేకు అవకాశం కల్పించారు. బీజేపీ యువజన విభాగం జాతీయ అధ్యక్షుడు తేజస్వీ సూర్య మరోసారి బెంగళూరు సౌత్ స్థానంలో పోటీకి దిగుతారు. మైసూరు రాజవంశానికి చెందిన యదువీర్ కృష్ణదత్త వడెయార్ మైసూర్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతారు.



ప్రజ్ఞకు పుస్తకాలను బహూకరిస్తున్న సీజేఐ చంద్రచూడ్

అమెరికా వర్సిటీ సీటు సాధించిన 'సుప్రీం' వంటమనిషి కుమార్తె ప్రజ్ఞ
ఘనంగా సన్మానించిన సీజే

న్యూఢిల్లీ: కలలు కనడం సులువే. వాటిని నెరవేర్చుకోవడమే కష్టం. నిరంతర శ్రమ, పట్టుదల, అంకితభావంతో కలలు సాకారం చేసుకొనేవారు కొందరే ఉంటారు. అలాంటి కొందరిలో ఒకరే ప్రజ్ఞ. సుప్రీంకోర్టులో పని చేస్తున్న వంట మనిషి కుమార్తె ప్రజ్ఞ(25) అమెరికాలోని అత్యున్నత విశ్వవిద్యాలయాల్లో న్యాయశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ అభ్యసించే అరుదైన అవకాశం దక్కించుకున్నారు. న్యాయశాస్త్రంలో ప్రతిభా పాటవాలు ప్రదర్శిస్తున్న ప్రజ్ఞను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌తోపాటు ఇతర న్యాయమూర్తులు బుధవారం సుప్రీంకోర్టు ప్రాంగణంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆమె ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, దేశానికి సేవలందించాలని వారు ఆకాంక్షించారు. భారత రాజ్యాంగంపై రచించిన మూడు పుస్తకాలపై వారంతా సంతకాలు చేసి, ఆమెకు బహూకరించారు. స్వయంకృషి, పట్టుదలతో ప్రజ్ఞ ఈ స్థాయికి చేరుకున్నారని, భవిష్యత్తులో ఆమెకు తమ వంతు తోడ్పాటు అందిస్తామని జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పారు. పిల్లలు వారి కలలు నెరవేర్చుకొనేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంతోపాటు తల్లిదండ్రులపైనా ఉందని సూచించారు. సన్మాన కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా తిలకించిన ప్రజ్ఞ తల్లిదండ్రులు భావోద్వేగానికి గురయ్యారు. వారిని కూడా న్యాయమూర్తులు సన్మానించారు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, యూనివర్సిటీ ఆఫ్ మిషిగాన్‌లో మాస్టర్స్ చదవడానికి ప్రజ్ఞకు అవకాశం దక్కింది. స్కాలర్‌షిప్ లభించింది. ఆమె తండ్రి అజయ్ సమాల్ సుప్రీంకోర్టు వంట మనిషి. న్యాయశాస్త్రంలో ఉన్నత చదవులు చదవడానికి జస్టిస్ డీవై చంద్రచూడ్ తనకు స్ఫూర్తిగా నిలిచారని ప్రజ్ఞ చెప్పారు. ప్రజ్ఞ ప్రస్తుతం సుప్రీంకోర్టుకు చెందిన సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ ప్లానింగ్‌లో రీసెర్చర్‌గా పనిచేస్తున్నారు.


బీజేపీతో చిరాగ్ పాశ్వాన్ వర్గం పొత్తు

న్యూఢిల్లీ: బిహార్‌లో ఎన్‌డీఏ కూటమితో చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జన శక్తి(రామ్ విలాస్) పార్టీ పొత్తు ఖరారైంది. లోక్‌సభ సమరంలో సీట్ల సర్దుబాటు ఒప్పందంలో భాగంగా బిహార్‌లో చిరాగ్ వర్గం ఐదు స్థానాల్లో పోటీపడే అవకాశముంది. తన తండ్రి ఎనిమిదిసార్లు ఎంపీగా గెలిచిన హాజీపూర్ సీటు తమకే కావాలని పట్టుబట్టి చిరాగ్ సాధించారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. హాజీపూర్, వైశాలి, జుమాయ్, సమస్తీపూర్, ఖగారియా స్థానాల్లో చిరాగ్ వర్గం బరిలో దిగనుంది. బుధవారం ఢిల్లీలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాతో చిరాగ్ భేటీ తర్వాత ఈ సీట్ల సర్దుబాటు కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. 2020లో రామ్ విలాస్ పాశ్వాన్ మరణం తర్వాత పార్టీని చీల్చిన ఆయన తమ్ముడు పశుపతి కుమార్ పరాస్‌కు బిహార్ గవర్నర్ పదవిని బీజేపీ ఆఫర్ చేసిందని సమాచారం. రాష్ట్రీయ లోక్‌జనశక్తి పార్టీ చీఫ్ అయిన పశుపతితో బీజేపీ ఒక ఒప్పందం కుదుర్చుకుంది. దాని ప్రకారం పశుపతి వర్గం ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేయబోదు. బదులుగా తమ వర్గం నేత ప్రిన్స్‌రాజ్‌కు బిహార్ మంత్రి పదవి ఇచ్చేందుకు బీజేపీ ఒప్పుకుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. బిహార్‌లో 17 చోట్ల బీజేపీ, 16 చోట్ల జేడీ(యూ) పోటీకి దిగొచ్చని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మరో రెండు స్థానాలను ఎన్‌డీఏ కూటమిలోని రెండు చిన్న పార్టీలకు చెరొకటి చొప్పున ఇవ్వాలని భావిస్తున్నారు.

ఆయుర్దాయానికి కోవిడ్ కోత

- మహమ్మారి కారణంగా దాదాపు రెండేళ్ల ఆయుఃక్షీణత
- దక్షిణాసియా దేశాలపై కోవిడ్ పెను ప్రభావం
- తగ్గిన ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలు
- లాన్సెట్ తాజా నివేదికలో వెల్లడి

కరోనా కోరల్లో చిక్కి యావత్ ప్రపంచం విలవిల్లాడిన ఘటన ఇప్పటికీ చాలా మందికి పీడకలే. అధునాతన కోవిడ్‌వ్యాక్సిన్లతో ఎలాగోలా కోవిడ్‌పై యుద్ధంలో గెలిచామని సంతోషపడేలోపే కరోనా మహమ్మారి మనుషుల ఆయుర్దాయాన్ని తగ్గించేసిందన్న చేదు నిజం తాజాగా బయటపడింది. 2019–2021 కాలంలో ప్రపంచవ్యాప్తంగా మానవాళి ఆయుష్షు దాదాపు రెండు సంవత్సరాలు తగ్గిపోయిందని లాన్సెట్ జర్నల్‌లో ప్రచురితమైన ఒక తాజా అధ్యయనం వెల్లడించింది. కోవిడ్ కష్టాల నుంచి తెరిపినపడి ఎలాగోలా మళ్లీ సాధారణ జీవితం గడుపుతున్నాం కదా అని సంబరపడుతున్న ప్రజానీకానికి ఇది పిడుగుపాటులాంటి వార్తే. లాన్సెట్ అధ్యయనంలోని ముఖ్యాంశాలు



- 2019 డిసెంబర్‌లో తొలిసారిగా కోవిడ్ వ్యాధికారక కరోనా వైరస్ విస్తృతి బయటపడ్డాక తొలి రెండేళ్లు అంటే 2020, 2021 సంవత్సరాల్లో జనాభా ఆయుర్దాయం ఎలా ఉంది అనే అంశాలపై తాజా అధ్యయనం సమగ్ర వివరాలను వెల్లడించింది. ఈ కాలంలో ప్రపంచ వ్యాప్తంగా చూస్తే 84 శాతం దేశాల్లో ఆయుర్దాయం తగ్గింది. ఈ కాలంలో ప్రజల ఆయుర్దాయం 1.6 సంవత్సరాలు తగ్గిపోయింది.
- మెక్సికో సిటీ, పెరూ, బొలీవియా వంటి చోట్ల ఆయుఃక్షీణత మరింత ఎక్కువగా నమోదైంది. కరోనా తొలినాళ్లలో టీనేజర్లు మినహాయించి మిగతా అన్ని వయసుల వాళ్లు ఎక్కువగా మృత్యువాత పడ్డారని వార్తలొచ్చాయి. అందులో నిజం లేదని ఈ అధ్యయనం కుండబద్దలు కొట్టింది.
- ప్రపంచవ్యాప్తంగా టీనేజీ, యుక్త వయసు వాళ్లలో కోవిడ్ మరణాల రేటు ఎక్కువగానే ఉందని పేర్కొంది.
- ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలు తగ్గడం విశేషం. 2019తో పోలిస్తే 2021లో ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలు 7 శాతం తగ్గాయి. అంటే మరణాలు 5,00,000 తగ్గాయని అధ్యయనం వెల్లడించింది.
- దక్షిణాసియా, ఆఫ్రికా చిన్నారుల పేరిట కోవిడ్ శాపమనే చెప్పాలి. ఎందుకంటే ప్రతి నలుగురు చిన్నారుల్లో ఒకరు దక్షిణాసియాలోనే చనియారు. ప్రతి నలుగురిలో ఒకరు సహారా ఆఫ్రికా ప్రాంతంలో ప్రాణాలు వదిలారు.
- అధ్యయనంలో భాగంగా మొత్తం జనాభాలో 15 ఏళ్లపైబడిన వారు ఎంత మంది? వారిపై కోవిడ్ ప్రభావం, ఆయుర్దాయం వంటి అంశాలను విశ్లేషించారు. వీరిలో 2019–2021 కాలంలో పురుషుల్లో 22 శాతం, మహిళల్లో 17 శాతం మరణాల రేటు పెరగడం ఆందోళనకరం
- 2020, 2021 సంవత్సరాల్లో మొత్తంగా 13.1 కోట్ల మంది మరణించారు. అందులో కోవిడ్ సంబంధ మరణాలు ఏకంగా 1.6 కోట్ల పైమాటే.
- గతంలో ఎన్నడూ లేని విధంగా జోర్డాన్, నికరాగ్వా వంటి దేశాల్లో కోవిడ్ మరణాలు భారీగా నమోదయ్యాయి.
- దక్షిణాఫ్రికాలోని క్వాజూలూ–నాటల్, లింపోపో వంటి చోట్ల ఆయుర్దాయం దారుణంగా తగ్గిపోయింది
- కోవిడ్‌ను సమర్థంగా ఎదుర్కొన్న/ కోవిడ్ బారిన పడి కూడా బార్బడోస్, న్యూజిలాండ్, ఆంటిగ్వా, బార్బుడా వంటి దేశాల్లో తక్కువ మరణాలు నమోదవడం విశేషం.
- కోవిడ్ వల్ల ఆయుర్దాయం కొంత తగ్గినప్పటికీ దశాబ్దాలుగా అందుబాటులోకి వస్తున్న నూతన వైద్య విధానాల కారణంగా 1950 నుంచి చూస్తే ఆయుర్దాయం మెరుగ్గానే ఉండటం కాస్త ఊరటనిచ్చే అంశం.

– సాక్షి, నేషనల్ డెస్క్

జపాన్ తొలి ప్రైవేట్ రాకెట్ 'కైరోస్' విఫలం




టోక్యో: జపాన్‌లో ప్రైవేట్ రంగంలో చేపట్టిన మొట్టమొదటి రాకెట్ ప్రయోగం విఫలమైంది. ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టేందుకు ఈ రాకెట్‌ను ప్రయోగించగా, కొన్ని క్షణాల వ్యవధిలోనే ఆకాశంలో పేలిపోయింది. ఇందుకు కారణాలు ఏమిటన్న దానిపై విచారణ ప్రారంభించారు. తొలి ప్రైవేట్ రాకెట్ 'కైరోస్' ప్రయోగం విఫలం కావడం సైంటిస్టులను నిరాశపర్చింది. బుధవారం సెంట్రల్ జపాన్‌లోని వకయామా ప్రయోగం కేంద్రం నుంచి కైరోస్ రాకెట్‌ను నింగిలోకి పంపించారు. టేకాఫ్ అయిన తర్వాత సెకండ్ల వ్యవధిలోనే పెద్ద శబ్దంతో పేలిపోయింది. దట్టమైన పొగ అలుముకుంది. నేలపై పడిన రాకెట్ శకలాలు మంటల్లో చిక్కుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేశారు. ఈ ఘటనలో ఎవరైనా గాయపడ్డారా? అనేది తెలియరాలేదు. టోక్యోకు చెందిన 'స్పేస్ వన్' అనే ప్రైవేట్ సంస్థ ఈ ప్రయోగం నిర్వహించింది. ఒకవేళ ప్రయోగం సఫలమై ఉంటే రాకెట్ ద్వారా ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టిన తొలి ప్రైవేట్ సంస్థగా స్పేస్ వన్ రికార్డుకెక్కి ఉండేది. ఈ సంస్థ 2018లో ఏర్పాటైంది. జపాన్‌లోని బడా కంపెనీలు, బ్యాంకులు ఇందులో పెట్టుబడులు పెట్టాయి.

సాక్షి హైదరాబాద్

7

గురువారం । 14 । మార్చి । 2024



మోదీ కిట్లు.. తల్లుల పాట్లు!



మోదీ పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

ముషీరాబాద్: తల్లీ బిడ్డల సంపూర్ణ ఆరోగ్యం కోసం, గర్భిణుల్లో రోగ నిరోధక శక్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం అందించే మోదీ పౌష్టికాహార కిట్ల పంపిణీ కార్యక్రమం బుధవారం ముషీరాబాద్‌లో మహిళలకు పాట్లు తెచ్చిపెట్టింది. స్థానిక బీజేపీ నేతల ఆధ్వర్యంలో ఓ ఫంక్షన్ హాలులో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయగా..ఉదయం 9 గంటలకే దాదాపు 1500 మంది మహిళలు చిన్నారులను తీసుకుని వచ్చారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ మొదట కొద్ది మంది మహిళలకు కిట్లు పంపిణీ చేసి వెళ్లిపోగా...తర్వాత గందరగోళం ఏర్పడింది. కేవలం 400 కిట్లు మాత్రమే ఉండగా...పిల్లలతో వచ్చిన తల్లులు 1500 మంది ఉండడంతో నిర్వాహకులకు దిక్కుతోచలేదు. ఈ దశంలో కిట్ల కోసం మహిళలు ఎగబడడంతో తోపులాట జరిగింది. చిన్నారులు ఇబ్బందులు పడ్డారు. ఒక దశలో పరిస్థితి అదుపుతప్పడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే చేతికందిన వారు కిట్లను లాగేసుకున్నారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రామ్, పూస రాజుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. డ్రైఫ్రూట్స్, రోగ నిరోధక శక్తిని పెంచే పలు రకాల పౌడర్లు, డ్రైఫ్రూట్ లడ్డూలు వంటి 8 రకాల వస్తువులు మోదీ కిట్‌లో ఉండటం, అంగన్‌వాడీ కేంద్రాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించడంతో మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఈ క్రమంలో తల్లుల వెంట వచ్చిన ఇద్దరు చిన్నారులు తప్పిపోవడంతో కొద్ది సేపు టెన్షన్ నెలకొన్నది. ఈలోగా పోలీసులు వెతికి తెచ్చి పిల్లలను తల్లులకు అప్పగించారు.



కిట్ల కోసం హాల్‌లో చిన్నారులతో వేచి ఉన్న మహిళలు



కిట్ల కోసం ఎగబడుతున్న దృశ్యం



హాలులోకి వెళ్లేందుకు ప్రయాస...




తప్పిపోయిన చిన్నారిని పైకి ఎత్తి చూపిస్తున్న పోలీసు

పౌర సమస్యలపై ఏఐ గళం!

కృత్రిమ మేధతో కార్టూన్ల సృష్టి

- నూటిగా, స్పష్టంగా అర్థవంతంగా చిత్రాలు
- ఎక్స్ ఖాతాలో సంబంధిత విభాగాలకు ట్యాగ్
- మణికొండవాసుల వినూత్న ఆలోచనకు ప్రశంసలు



అధిక ట్యాక్స్‌లు చెల్లించమంటూ నిరసన

సాక్షి, సిటీబ్యూరో: కుళాయి రావడం లేదనో, దోమలు, వీధి కుక్కల బెడద ఉందనో, రోడ్లు మరమ్మతులు చేయడం లేదనో, వీధి దీపాలు వెలగడం లేదనో జనం ఆందోళన వ్యక్తం చేయడం..పౌర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానికులు నిరసన వ్యక్తం చేయడం, ఆయా ప్రభుత్వ విభాగాలకు అర్జీ పెట్టుకోవడమూ మనకు తెలిసిందే. కానీ, మణికొండ మున్సిపాలిటీ వాసులు వినూత్న రీతిలో గళమెత్తుతున్నారు. కృత్రిమ మేధ (ఏఐ) అస్త్రాన్ని సంధిస్తున్నారు. ఏఐ సాంకేతికతతో కార్టూన్లు రూపొందిస్తున్నారు. వాటిని ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో సంబంధిత ప్రభుత్వ విభాగాలకు ట్వీట్ చేస్తున్నారు. సమస్య తీవ్రతను సూటిగా, స్పష్టంగా, అర్థవంతంగా అధికారులకు చేరవేస్తున్నారు. వినూత్న రీతిలో సమస్యలపై గళమెత్తుతున్న మణికొండ వాసుల ఆలోచనకు సర్వత్రా ప్రశంసలు లభిస్తున్నాయి.

నీటి ఎద్దడిని తెలిపే ట్యాంకర్ల క్యూ..

వేసవికాలం ఇంకా ప్రారంభం కాకముందే మణికొండలో నీటి ఎద్దడి మొదలైంది. కుళాయి 30–45 నిమిషాలకు మించి రావడం లేదు. దీంతో ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల మీద ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్క ట్యాంకర్‌కు రూ.1,500 నుంచి 2,000 వసూలు చేస్తున్నారు. నీటి ట్యాంకర్ల కోసం స్థానికులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిని కళ్లకట్టేలా నీటి ట్యాంకర్ల క్యూను ఏఐతో కార్టూన్ చిత్రీకరించారు.

ముగియని రోడ్ల మరమ్మత్తులు..


కోతకు గురైన రోడ్డు 'సీ సెక్షన్'తో ప్రయాణికులు ఎంత ఇబ్బంది పడుతున్నారో కళ్లకు కట్టేలా కార్టూన్‌ను సృష్టించారు. అంజలీ గార్డెన్ కాలనీలో కొత్తగా వేసిన రహదారిని తాజాగా ఓ నిర్మాణ సంస్థ డ్రైనేజీ పనుల కోసం తవ్వారు. దీంతో పన్ను చెల్లింపుదారుల సొమ్ము వృథా అయిందని తెలుపుతూ కార్టూన్‌ను వేశారు. జలమండలి పనుల కారణంగా బీఆర్‌సీ అపార్ట్‌మెంట్ పక్కన ఉన్న ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు మూసి వేశారు. అంజలి గార్డెన్స్ వద్ద ప్రత్యామ్నాయ మార్గాన్ని కూడా క్లోజ్ చేశారు. దీంతో ఉదయం, సాయంత్రం సమయాలలో ఆఫీసులు, స్కూళ్లకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులతో రోడ్ల మీద వాహనాల రద్దీ ఏర్పడుతుంది. గంటల కొద్దీ రోడ్ల మీదే గడపాల్సిన పరిస్థితిని నరకప్రాయమైన ప్రయాణాన్ని కళ్లకు కట్టినట్లు చూపించే కార్టూన్‌ను చిత్రీకరించారు.

నో వాటర్ నో ఓటు..

రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తేనే పన్నులు చెల్లిస్తామని, రాజకీయ నాయకులు తమ ప్రాంతానికి రావద్దంటూ నిరసిస్తూ 'నో వాటర్ నో ఓటు అంటూ' కార్టూన్‌ను సృష్టించారు. ల్యాంకో హిల్స్ నుంచి ఔటర్‌కు కొత్తగా లింక్ రోడ్డును ఓపెన్ చేశారు. కానీ, సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో ఈ రోడ్డు గురించి వాహనదారులకు అవగాహన లేదు. దీంతో బస్సులు, నిర్మాణ వాహనాలు అంజలి గార్డెన్ కాలనీ మీదుగానే వెళుతున్నాయి. అసలే 20 ఫీట్లే ఉన్న ఈ రహదారిని భారీ వాహనాలు ఆక్రమిస్తున్నాయి. దీంతో భారీ శబ్దకాలుష్యం వస్తుండటంతో నివాసితులు ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి ఏర్పడుతుందని వివరించే పోస్టును క్రియేట్ చేశారు.



నో వాటర్..నో ఓట్ కాన్సెప్ట్‌తో..



రోడ్డు పనులతో అసౌకర్యాలపై..

ఏఐ ఆలోచన ఇలా..

ఉద్యోగ రీత్యా ఏఐ సాంకేతికత మీద పని చేస్తున్న క్రమంలో వెంకట్ మామిళ్లకు ఈ ఆలోచన వచ్చింది. తన ప్రాంతంలో మున్సిపల్ సమస్యలను లేవనెత్తేందుకు ఏఐను ఎందుకు ఉపయోగించకూడదనిపించింది. దీంతో ఓపెన్ ఏఐ, కో పైలెట్, డల్.ఈ వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించి స్థానిక సమస్యలపై కార్టూన్లు వేయడం ప్రారంభించాడు. 2022లో ప్రారంభమైన మణికొండ సిటిజన్స్ గ్రూప్ ఎక్స్ ఖాతాకు 1,500లకు పైగా ఫాలోవర్లు ఉన్నారు.

రూ. 139 కోట్ల భారం వద్దు

- అదనపు వ్యయాన్ని తిరస్కరిస్తూ పెండింగ్‌లో పెట్టిన స్టాండింగ్ కమిటీ
- రెండు ఆర్ఓబీల మరమ్మతులతో సహా 16 అంశాలకు ఓకే
- రెండు స్టేడియాల్లో క్రీడాకారుల ఉచిత శిక్షణకు గోపీచంద్ ఫౌండేషన్‌తో ఒప్పందం

సాక్షి, సిటీబ్యూరో: వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం (ఎస్సార్‌డీపీ)లో భాగంగా ఇందిరాపార్కు- వీఎస్‌టీ, రామ్‌నగర్-బాగ్‌లింగంపల్లిలో ఫ్లై ఓవర్ల నిర్మాణానికి సంబంధించిన ప్యాకేజీ పనుల అంచనా వ్యయం రూ.426 కోట్ల కంటే రూ.139 కోట్లు అదనంగా పెంచగా, వాటిని చెల్లించేందుకు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ససేమిరా అంది. ఆ అంశాన్ని కూలంకుశంగా పరిశీలించేందుకు దాన్ని ఆమోదించకుండా వాయిదా వేసి పెండింగ్‌లో పెట్టింది. ఈ ప్యాకేజీకి రూ.139 కోట్లు, ఎల్‌బీనగర్ పరిసరాల్లోని పనుల ప్యాకేజీకి రూ. 67 కోట్లు అదనపు వ్యయం చూపుతూ మొత్తం రూ.206 కోట్లు అదనపు నిధులు చెల్లించేందుకు సిద్ధమైన జీహెచ్‌ఎంసీ..అందుకు అనుమతి కోరుతూ బుధవారం జరిగిన జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ముందుంచగా, ఇందిరాపార్కు-వీఎస్‌టీ ప్యాకేజీకి రూ.139 కోట్ల అదనపు చెల్లింపులకు ససేమిరా అంది. ఈ అంశాన్ని సమగ్రంగా పరిశీలించాలని భావించింది. అంత అదనపు ఖర్చు ఎలా అయ్యిందో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించాలని కోరింది. ఈ ప్రాజెక్టుల వల్ల జీహెచ్ఎంసీపై రూ.206 కోట్ల అదనపు భారం పడటాన్ని 'సాక్షి' వెలువరించింది. ఈ నేపథ్యంలో సభ్యులు వీఎస్‌టీ ఫ్లై ఓవర్‌కు సంబంధించి పూర్తి వివరాలు కోరారు. దీర్ఘకాలంగా మరమ్మతులు లేనందున ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న బేగంపేట, రామకృష్ణాపురం ఆర్ఓబీల మరమ్మతులు, పునరుద్ధరణలకు కమిటీ ఆమోదం తెలిపింది. ఇందులో బేగంపేట ఆర్ఓబీ మరమ్మతులు, పునరుద్ధరణలకు రూ.20 కోట్లు ఖర్చుకానుండగా, సికింద్రాబాద్ రామకృష్ణాపురం ఆర్ఓబీ మరమ్మతులు, పునరుద్ధరణలకు రూ.6 కోట్లు ఖర్చు కానున్నట్లు అధికారులు అంచనా వ్యయంలో పేర్కొన్నారు. వీటితో సహ మొత్తం 16 అంశాలకు స్టాండింగ్‌కమిటీ ఆమోదం తెలిపింది.



సమావేశంలో మేయర్, కమిషనర్ తదితరులు

ముఖ్యాంశాలు

- జీహెచ్‌ఎంసీ ఔట్‌సోర్సింగ్, రెగ్యులర్ సిబ్బంది హాజరు నమోదుకు మొబైల్ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ (ముఖగుర్తింపు) బయోమెట్రిక్ అటెండెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలుకు ప్రైవేటు ఏజెన్సీ కోసం టెండరు జారీకి ఆమోదం.
- చందానగర్ పీజేఆర్ స్టేడియం,మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లలో క్రీడాకారులకు ఉచిత శిక్షణ కోసం పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ ఫౌండేషన్‌తో 12 నెలల ఒప్పందానికి కమిషనర్‌కు అనుమతినిస్తూ ఆమోదం.
- రామచంద్రాపురం రాయసముద్రం చెరువు డ్రైనేజీ మళ్లింపు పనులకు రూ.2.52 కోట్లతో టెండర్లు పిలిచేందుకు ఆమోదం.
- జీహెచ్‌ఎంసీలో అన్నపూర్ణ పథకం కింద రూ. 5 కే భోజనాన్ని అందజేస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్‌తో ఒప్పందం పూర్తయినందున మరో రెండు సంవత్సరాల పొడిగింపునకు ఆమోదం.
- యూసుఫ్‌గూడబస్తీ జంక్షన్ అభివృద్ధికి రూ.4.90 కోట్లకు పరిపాలన అనుమతి, టెండర్లు పిలిచేందుకు ఆమోదం.
- రహ్మత్‌నగర్ పీజేఆర్ విగ్రహం జంక్షన్ అభివృద్ధికి రూ.5.17కోట్లకు పరిపాలన అనుమతి, టెండర్లకు ఆమోదం.
- బాలాజీ నగర్ నుండి బీఎస్ఎన్ఎల్ ఓపెన్ ల్యాండ్ వరకు రూ.5.99 కోట్ల వ్యయంతో చేపట్టే (బాక్స్ డ్రైన్)వరద నీటి కాలువ నిర్మాణానికి ఆమోదం.
- బంజారాహిల్స్ లో వైకుంఠ మహాప్రస్థానం శ్మశాన వాటిక నిర్వహణను సీఎస్సార్ కింద మూడు సంవత్సరాల వరకు ఫీనిక్స్ ఫౌండేషన్‌కు అప్పగించేందుకు ఒప్పందానికి ఆమోదం.
- మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిషనర్ రోనాల్డ్‌రాస్, స్టాండింగ్‌కమిటీ సభ్యులు, ఆయా విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భాగ్యనగరిలో రేపు మోదీ షో



సాక్షి, సిటీబ్యూరో: భాగ్యనగరం వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. ఒకట్రెండు రోజుల్లో ఎన్నికల నగారా మోగనుందనే సంకేతాల నేపథ్యంలో ప్రధాని మోదీ.. ఈ నెల 15న మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో ప్రచారపర్వానికి శ్రీకారం చుట్టనున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలను సాధించాలని భావిస్తున్న భారతీయ జనతాపార్టీ..మల్కాజ్‌గిరి స్థానంపై ప్రత్యేక దృష్టి సారించింది. సిట్టింగ్ సికింద్రాబాద్ స్థానం సహా మల్కాజ్‌గిరి, చేవెళ్ల, హైదరాబాద్ స్థానాలపై ఫోకస్ పెట్టిన కమలదళం ..ప్రచారపర్వంలోకి జాతీయ నేతలను రంగంలోకి దింపుతోంది. రెండు రోజుల క్రితం హోం మంత్రి అమిత్‌షా నగరంలో పర్యటించగా..పది రోజుల వ్యవధిలోనే ప్రధాని రెండోసారి రాష్ట్రానికి వస్తుండడం గమనార్హం. ఇటీవల నగర శివార్లలోని పటాన్‌చెరులో జరిగిన బహిరంగ సభలో మోదీ పాల్గొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే లోక్‌సభ ఎన్నికలకు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న బీజేపీ నగర ఓటర్లను ఆకట్టుకునేందుకు రోడ్‌షోలు నిర్వహిస్తోంది. మల్కాజ్‌గిరిలో సుమారు 5 కిలో మీటర్ల మేర ప్రధాని రోడ్ షో నిర్వహించేలా కార్యక్రమాన్ని రూపొందించింది.

పీఎం పర్యటన నేపథ్యంలో ఆంక్షలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో పోలీసులు పలు ఆంక్షలు విధించారు. ఈ నెల 15న మల్కాజ్‌గిరిలో జరగనున్న సభలో మోదీ పాల్గొననున్నారు. దీంతో మీర్జాల్‌గూడ నుంచి మల్కాజ్‌గిరి క్రాస్ రోడ్ వరకు 5 కి.మీ. మేర పారా గ్లైడర్లు, రిమోట్ కంట్రోల్ డ్రోన్‌లు, రిమోట్ కంట్రోల్ మైక్రో లైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను ఎగరవేయడానికి అనుమతి లేదని రాచకొండ పోలీసు కమిషనర్ తరుణ్ జోషి ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఐపీసీ సెక్షన్ 188, 121, 121 (ఏ), 287, 336, 337, 338 కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓయూ పైలాన్ ప్రారంభం



పైలాన్ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ వాణీదేవి, వీసీ రవీందర్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో వందేళ్ల శతాబ్ది ఉత్సవాల పైలాన్‌ను బుధవారం ఎమ్మెల్సీ సురభి వాణీదేవి ప్రారంభించారు. ఓయూ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలలో భాగంగా 2017లో పైలాన్‌ను నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. రూ.1.58 కోట్ల వ్యయంతో గత ఏడాది ప్రారంభమైన పనులు ఇటీవల ముగిశాయి. ప్రారంభానికి ముఖ్యఅతిథిగా తొలుత సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతారని నిర్ణయించారు. ఆయన బిజీగా ఉండి రాలేక పోవడంతో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆహ్వానించారు. కానీ ఆయన కూడా హాజరుకాలేదు, చివరకు మాజీ ప్రధాని పీవీ కుమార్తె వాణీదేవి చేతుల మీదుగా పైలాన్‌ను ప్రారంభించారు.

రేసు గుర్రాలు!

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థుల ఎంపికపై పీటముడి

- మూడు స్థానాల్లోనూ తేలని అభ్యర్థుల వ్యవహారం
- తెరపైకి పారాచ్యూట్లు..పార్టీలోనూ తీవ్ర పోటీ
- మల్కాజిగిరి రేసులో మైనంపల్లి, కంచర్ల, హరివర్ధన్ రెడ్డి
- లష్కర్ బరిలో మాజీ మేయర్ బొంతు, వినోద్ రెడ్డి
- చేవెళ్లకు సునీత పేరు దాదాపు ఖరారు..అయినా సస్పెన్సే

సాక్షి, సిటీబ్యూరో: అధికార కాంగ్రెస్ పార్టీలో లోక్‌సభ స్థానాల కోసం తీవ్ర పోటీ నెలకొంది. గ్రేటర్ పరిధిలోని నాలుగింటిలో మూడింటిపైన పీటముడి నెలకొంది. దీర్ఘకాలంగా పార్టీని నమ్ముకున్న పార్టీ శ్రేణులతోపాటు కొత్తగా పార్టీలో చేరిన వారు, పార్టీలో చేరని వారు సైతం సీటు కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికార కాంగ్రెస్ పార్టీ సైతం ప్రతి ఒక్క లోక్‌సభ స్థానాన్ని ప్రతిష్టాత్మకంగా భావించి గెలుపు గుర్రాల కోసం లోతైన సర్వే నివేదికల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసేందుకు కసరత్తు చేస్తోంది. బుధవారం గాంధీభవన్‌లో జరిగిన గ్రేటర్ పరిధిలోని పార్లమెంట్ నియోజకవర్గాల స్థాయి సమావేశంలో పార్టీ ముఖ్య నేతల అభిప్రాయాలను స్వీకరించింది. ఇప్పటికే గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల పార్లమెంట్ స్థానాల అభ్యర్థుల ఎంపికపై ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. మొత్తం మీద అభ్యర్థుల ఎంపికలో రెండు స్థానాల్లో పారాచ్యూట్లకు ప్రాధాన్యం లభించే అవకాశాలు ఉన్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది.

మూడింటిలో తీవ్రపోటీ

దేశంలోనే అతి పెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజిగిరి సీటు కోసం తీవ్ర పోటీ నెలకొంది. ఆశలు పెంచుకున్న అభ్యర్థులు సీరియస్‌గానే ప్రయత్నిస్తున్నారు. ఈ స్థానం నుంచి మైనంపల్లి హనుమ్మంతరావు, మలిపెద్ది సుధీర్ రెడ్డి, కంచర్ల చంద్రశేఖరరెడ్డి, కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, సర్వే సత్యనారాయణ, సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, చలన చిత్ర నిర్మాత బండ్ల గణేష్ తదితరులు తీవ్ర స్థాయిలో పోటీపడుతున్నారు. అదేవిధంగా సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, విద్యావేత్త విద్యా స్రవంతి, ఎంఆర్‌సీ వినోద్ రెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్, మాజీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాస్ టికెట్ రేసులో ఉన్నారు. చేవెళ్ల స్థానానికి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి పేరు దాదాపు ఖరారైందని ప్రచారం సాగుతోంది. అయితే మొదటి జాబితాలో పేరు లేకపోవడంతో ఎంపీ అభ్యర్థి విషయంలో హైడ్రామా నడుస్తున్నది. పార్టీ నాయకత్వం హామీ ఇచ్చిందంటూ పట్నం సునీతా మహేందర్‌రెడ్డి భరోసాగా ఉండగా..మరోవైపు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఎంపీ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇక హైదరాబాద్ పార్లమెంట్ స్థానానికి అలీ మస్కతి పేరు వినిపిస్తోంది.

తగ్గుతూ.. పెరుగుతూ..

- సామాన్యులకు భారంగానే కూరగాయల ధరలు

సాక్షి, సిటీబ్యూరో: ఎండా కాలం పూర్తి స్థాయిలో ప్రారంభం కానేకాలేదు. కూరగాయల ధరలు సామాన్యులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రోజురోజుకు ఆకాశన్నంటుతున్న ధరలతో బెంబేలెత్తుతున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితికి ధరలు చేరుతున్నాయి. చిన్న చిన్న పనులు చేసుకునే బతికేవారికి రోజూ పనిదొరకడమే కష్టమవుతున్న తరుణంలో కూరగాయలు, నిత్యావసరాల ధరలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. గత నెల..ఈ నెల ప్రారంభంలో కూరగాయలు కాస్త తగ్గినట్టే తగ్గి ఈ వారం నుంచి మళ్లీ పెరుగుతున్నాయి. ఒక్క టమాటా ధర తప్ప మిగతా కూరగాయల ధరలు కిలో రూ.60–80 మధ్య పలుకుతున్నాయి. హోల్‌సేల్ మార్కెట్‌లో ధరలు కాస్త తక్కువగా ఉన్నా..రిటైల్, బహిరంగ మార్కెట్‌లలో మాత్రం ఎక్కువగా ఉన్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. బీన్స్, బీరకాయ, బెండకాయ కిలో రూ.80 ఉండగా.. మిగతా కూరగాయల ధరలు రూ 60–70 మధ్య ఉన్నాయి. ఎండా కాలం ప్రారంభంతో ఉత్పత్తి తగ్గి డిమాండ్ పెరగడంతో ధరలు అందుబాటులో లేకుండా పోయాయి. ఇప్పటికే నిత్యావసర ధరలతో ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు పెరిగిన కూరగాయల ధరలు భారంగా మారాయి. శివారు జిల్లాల్లో కూరగాయల ఉత్పత్తి పడిపోవడంతో దిగుమతులు తగ్గిపోయాయి. రానున్న రోజుల్లో ఎండలు పెరిగి ఉత్పత్తి మరింత తగ్గితే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని హోల్‌సేల్ వ్యాపారులు అంటున్నారు.



కిడ్నీలో 418 రాళ్లు!

- తొలగించిన ఏఐఎన్‌యూ వైద్యులు



లక్డీకాపూల్‌ : కేవలం 27 శాతం మాత్రమే కిడ్నీ పని తీరు ఉన్న ఓ వ్యక్తి మూత్రపిండాల నుంచి ఏఐఎన్‌యూ వైద్యులు ఏకంగా 418 రాళ్లను తొలగించారు. ఇదంతా మినిమల్లీ ఇన్వేజివ్‌ పద్ధతిలో చేయడం మరో విశేషం. 60 సంవత్సరాల వయస్సు గల మహేష్‌ కిడ్నీలో అసాధారణ సంఖ్యలో రాళ్లు ఉండటంతో కిడ్నీ పనితీరు దెబ్బతినింది. ఆయనకు సంప్రదాయ శస్త్రచికిత్స కంటే మినిమల్లీ ఇన్వేజివ్‌ పద్ధతిలోనే శస్త్రచికిత్స చేయాలని డాక్టర్‌ కె.పూర్ణచంద్రారెడ్డి, డాక్టర్‌ గోపాల్‌ ఆర్‌.టక్‌, డాక్టర్‌ దినేష్‌ నేతృత్వంలోని బృందం నిర్ణయించింది. అందుకోసం పెర్క్యుటేనియస్‌ నెఫ్రోలితోటమీ (పీసీఎన్‌ఎల్‌) పద్ధతిని ఎంచుకున్నారు. ఇందులో భాగంగా ప్రత్యేక పరికరాలతో చిన్న చిన్న రంధ్రాలు ఏర్పాటు చేసి.. వాటి ద్వారా కిడ్నీలోకి ఒక సూక్ష్మ కెమెరా, లేజర్‌ ప్రోబ్‌లను పంపారు. ఆ కెమెరా చూపించిన దృశ్యాలతో రాళ్లన్నింటినీ తొలగించగలిగారు. దీనివల్ల పెద్ద కోత అవసరం లేకపోవడంతో పాటు రోగికి నొప్పి అంతగా ఉండకపోవడం, త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది. ఈ ప్రక్రియ కోసం దాదాపు రెండు గంటలకు పైగా సమయం పట్టింది. మొత్తం వైద్య బృందం ప్రతి ఒక్క రాయినీ తొలగించి రోగికి ఊరట కల్పించింది. అద్భుతమైన ఇమేజింగ్‌ టెక్నాలజీతో పాటు అత్యాధునిక పరికరాలు ఈ ప్రక్రియలో కీలకపాత్ర పోషించాయి. దీంతో కిడ్నీ అతడి పనితీరు కూడా గణనీయంగా మెరుగుపడింది. ఇలా చిన్న రంధ్రం పెట్టి, దాని ద్వారానే మొత్తం 418 రాళ్లను తొలగించడం వైద్యపరమైన నైపుణ్యానికి ప్రతీక. వేసవిలో కిడ్నీల్లో రాళ్లు ఎక్కువగా ఏర్పడే అవకాశం ఉంటుందని, వీలైనంత వరకు ఉప్పు తక్కువగా, నీళ్లు ఎక్కువగా తీసుకోవడం అలవాటు చేసుకోవాలని ఏఐఎన్‌యూ వైద్య నిపుణులు సూచించారు.

‘పోస్టల్‌ బిల్లు 2023’ రద్దు చేయాలి

రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో ప్రభుత్వ రంగ కార్మిక సంఘాల డిమాండ్‌



మాట్లాడుతున్న యూఎఫ్‌పీయూ కన్వీనర్‌ రమణ

హిమాయత్‌నగర్‌: కేంద్ర ప్రభుత్వం ‘పోస్టల్‌ బిల్లు 2023’ను రద్దు చేయాలని ప్రభుత్వరంగ కార్మిక సంఘాలు డిమాండ్‌ చేస్తున్నాయి. యునైటెడ్‌ ఫోరం ఆఫ్‌ పబ్లిక్‌ సెక్టార్‌ యూనియన్స్‌ (యూఎఫ్‌పీయూ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ‘పోస్టల్‌ బిల్లు 2023 రద్దు చేయాలి’ అనే అంశంపై బుధవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో రౌండ్‌ టేబుల్‌ సమావేశం నిర్వహించారు. సమావేశానికి కన్వీనర్‌ రమణ అధ్యక్షత వహించగా, ఏఐబీఈఏ కార్యదర్శి బి.ఎస్‌. రాంబాబు ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పోస్టల్‌ బిల్లు 2023 కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా పార్లమెంటులో ఆమోదించిందని, దానివల్ల ప్రజలకు, పోస్టల్‌ ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయని తెలియజేశారు. ఈ బిల్లు ఆధారంగా పోస్టల్‌ సేవలను ఔట్‌సోర్సింగ్‌, ప్రైవేటుపరం చేసే ఉద్దేశంలో కేంద్ర ప్రభుత్వం ఉందని దీనిని పోస్టల్‌లోని అన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉద్యమిస్తున్నాయని తెలిపారు. బీఎస్‌ రాంబాబు మాట్లాడుతూ ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి అనేక ప్రభుత్వరంగ సంస్థలను, ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీకరణ దిశగా అడుగులేస్తుందని ఆల్‌ ఇండియా బ్యాంక్‌ ఎంప్లాయీస్‌ అసోసియేషన్‌ ఈ విధానాలను నిర్ద్వందంగా వ్యతిరేకిస్తూ పోస్టల్‌ ఉద్యోగుల పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ రౌండ్‌ టేబుల్‌ సమావేశం పోస్టల్‌ బిల్‌ 2023ను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఏకగ్రీవంగా డిమాండ్‌ చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో వివిధ రంగాల కార్మిక సంఘాల నాయకులు బి.చంద్రయ్య, ఎస్‌.బాల్‌రాజ్‌, రఘునాథ్‌, ఎం.శివశంకర్‌, వై.జానకిరామ్‌, వి.వి.దుర్గారావు, ఎస్‌.ఎ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోటీ ప్రపంచంలో డిజిటలైజేషన్‌ కీలకం

గో డాడీ సర్వేలో వెల్లడి

సాక్షి,సిటీబ్యూరో: రోజు రోజుకూ డిజిటలైజేషన్‌ విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో పోటీ ప్రపంచంలో డిజిటలైజేషన్‌ అందిపుచ్చుకున్న వారే విజయాలు సాధిస్తారని నగర మహిళా పారిశ్రామిక వేత్తలు సైతం అభిప్రాయపడుతున్నారనే విషయాన్ని వెల్లడించింది గో డాడీ గ్లోబల్‌ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ సర్వే. డిజిటలైజేషన్‌ దిశగా తమ ప్రయాణాన్ని సాగిస్తే భవిష్యత్‌ అద్భుతంగా ఉంటుందని వీరు అర్థం చేసుకుంటున్నారని, సర్వేలో పాల్గొన్న వారిలో 90 శాతం మంది తమ వ్యాపార విజయానికి డిజిటలైజేషన్‌ కీలకమని భావించారని వెల్లడించింది. దీనిలో భాగంగా 38 శాతం మంది సైబర్‌ భద్రత డేటా రక్షణ చర్యలను పెంచడంపై ప్రధానంగా ఫోకస్‌ చేస్తున్నారని, అలాగే కృత్రిమ మేధస్సు (ఏఐ)దే భవిష్యత్తు అని కూడా వీరు భావిస్తున్నారని స్పష్టం చేసింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ఆటో బోల్తాకొట్టిన ప్రమాదంలో మృతిచెందిన అఫ్జల్‌ (ఫైల్‌)

కీసర: ప్రమాదవశాత్తు ఆటోబోల్తాపడి తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం బర్సిగూడ సమీపంలో చోటు చేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన మేరకు.. బోగారం గ్రామానికి చెందిన మహ్మద్‌ అఫ్జల్‌(36) అదే గ్రామానికి చెందిన ఇద్దరు మిత్రులతో కలిసి బుధవారం ఆటోలో బర్సిగూడ వెళ్లి తిరిగి బోగారం గ్రామానికి వస్తున్నారు. బర్సిగూడ గ్రామం దాటిన తరువాత మూల మలుపువద్ద ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న అఫ్జల్‌కు తీవ్రగాయాలు కాగా మిగిలిన ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితిలో ఉన్న అఫ్జల్‌ను ఈసీఐఎల్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే అతడు మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. అఫ్జల్‌తోపాటు ఆటోలో ఉన్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాల సమాచారం పంపాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ హేమంత్‌కేశవ్‌ పాటిల్‌

అదనపు కలెక్టర్‌(రెవెన్యూ) హేమంత్‌ కేశవ్‌ పాటిల్‌

సాక్షి, సిటీబ్యూరో: రాబోవు పార్లమెంట్‌ ఎన్నికలను నిర్వహణకు పగడ్బందీగా అన్ని చర్యలు తీసుకోవాలని, సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాల వివరాలను పంపాలని అదనపు కలెక్టర్‌ (రెవెన్యూ) హేమంత్‌ కేశవ్‌ పాటిల్‌ అన్నారు. బుధవారం పార్లమెంట్‌ ఎన్నికల నిర్వహణకు సంబంధించి సికింద్రాబాద్‌ పార్లమెంటరీ నియోజకవర్గంలోని ఆర్వోలు, ఏఆర్వోలు, పోలీస్‌ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన నార్త్‌ జోన్‌ డీసీపీ రోహిణి ప్రియదర్శిని తో కలిసి అసెంబ్లీ నియోజకవర్గం వారిగా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్‌ పార్లమెంటరీ నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాలను కచ్చితంగా సందర్శించి సమాచారం పంపించాలని సూచించారు. సమావేశంలో ఆర్వోలు, ఏఆర్వోలు, పోలీస్‌ అధికారులు తదితరులు పాల్గొన్నారు

పెళ్లి పేరుతో నమ్మించి మోసం

భార్యాభర్తలను అరెస్ట్‌ చేసిన సీసీఎస్‌ పోలీసులు




నిందితులు రంజిత్‌ సంధ్య

హిమాయత్‌నగర్‌: పెళ్లి పేరుతో అమ్మాయిలను ట్రాప్‌ చేస్తూ భారీ మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులు (భార్యాభర్తలను) హైదరాబాద్‌ సీసీఎస్‌ స్పెషల్‌ జోనల్‌ క్రైమ్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. సీసీఎస్‌ పోలీసులు వివరాల ప్రకారం యెలిగేటి రంజిత్‌ అలియాస్‌ యడ్ల శ్రీ రాధా కృష్ణ అలియాస్‌ రాకేష్‌, యెలిగేటి సంధ్య వీరిద్దరూ భార్యభర్తలు. వీరు సిరిసిల్ల జిల్లా వెంకంపేటకు చెందిన వారు. నగరంలోని పీర్జాదిగూడ వినాయక్‌ నగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. వీరు ఆన్‌లైన్‌లోని మ్యాట్రిమోనియల్‌ వెబ్‌సైట్‌లలో ఉన్నత వర్గాలకు చెందిన అమ్మాయిల ప్రొఫైల్‌ ద్వారా వారి వివరాలను సేకరిస్తారు. ఆ వివరాల ఆధారంగా అమ్మాయిలను టార్గెట్‌ చేసి, నిందితుడు యెలిగేటి రంజిత్‌ తన పేరు యడ్ల శ్రీ రాధా కృష్ణగా నకిలీ పేరుతో పరిచయం చేసుకుంటాడు. తాను ఉన్నత వర్గానికి చెందిన వ్యక్తినని రియల్‌ వ్యాపారాలు ఉన్నాయని నమ్మిస్తాడు. మాట్రిమోనీ సైట్లలో పరిచయమైన అమ్మాయిలతో పరిచయం చేసుకొని వారిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి, వారితో చనువుగా మాట్లాడి పరిచయం పెంచుకుంటాడు. తన భార్య యెలిగేటి సంధ్యను తన మేనేజర్‌గా వారికి పరిచయం చేస్తాడు. అనంతరం అమ్మాయిల పేరెంట్స్‌తో సైతం వారి ఇంటికి వెళ్లి మాయమాటలు చెప్పి నమ్మించేవాడు.బాగా పరిచయం అయ్యాక వారిని పెళ్లి చేసుకుంటానని వారిని ఒప్పించేవాడు. అనంతరం తనకు రియల్‌ ఎస్టేట్‌ బిజినెస్‌లో అత్యవసరంగా డబ్బు అవసరం ఉందంటూ లక్షల రూపాయలు తీసుకునే వాడు. మరో కేసులో బాధితుల నుంచి కట్నం,పెళ్లి గిఫ్టల పేరుతో లక్షల రూపాయలు దండుకున్నాడు. గతంలో బాధితలు పిర్యాదు పై కేసు నమోదు చేసుకుని, సీసీఎస్‌ స్పెషల్‌ జోనల్‌ క్రైమ్‌ టీమ్‌ ఇన్‌స్పెక్టర్‌ డి.భిక్షపతి ఆధ్వర్యంలో బృందం నిందితులను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విధంగా నిందితులు భార్యభర్తలు కలిసి 12 మంది బాధితుల నుంచి సుమారు రూ.30 లక్షలకు పైగా మోసాలకు పాల్పడ్డట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి ఓ సాంట్రో కారు,ద్విచక్ర వాహనం పోలీసులు సీజ్‌ చేశారు.

రూ.10 కోట్లతో ఉస్మానియా ఫౌండేషన్‌ భవన్‌

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీ క్యాంపస్‌లో పూర్వ విద్యార్థుల నుంచి విరాళంగా సేకరించిన రూ.10 కోట్ల నిధులతో ఉస్మానియా ఫౌండేషన్‌ భవన్‌ను నిర్మించనున్నారు. వందేళ్ల శతాబ్ది ఉత్సవాలను పూర్తి చేసుకొని 107 ఏండ్ల ఓయూ అభివృద్ధికి పూర్వవిద్యార్థులు, దాతల నుంచి నిధులు రాబట్టేందుకు ఏర్పాటు చేసిన ఉస్మానియా ఫౌండేషన్‌కు ప్రత్యేక భవనం ఉండాలనే లక్ష్యంతో క్యాంపస్‌లోని దూర విద్య కేంద్రం భవనం వెనుక గల 1.20ఎకరాల ఖాళీ స్థలంలో భవనాన్ని నిర్మించనున్నారు. గురువారం ఉదయం 9.30 గంటలకు రాష్ట్ర ఉన్నత విద్య ముఖ్యకార్యదర్శి బుర్ర వెంకటేశంతో కలసి వీసీ ప్రొ.రవీందర్‌ భవన నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారు.

నగరంలో నీటి వృథా లేదు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో తాగు నీటి వృథా పెద్దగా లేదని జలమండలి అధికారులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుతం నగరంలో దినసరి 568 ఎంజీడీ నీటి సరఫరా చేస్తున్నట్లు వెల్లడించింది. కృష్ణా మూడు దశల ద్వారా 270 ఎంజీడీ, గోదావరి ద్వారా 172 ఎంజీడీ, మంజీరా-సింగూర్‌ నుంచి 106 ఎంజీడీ, ఉస్మాన్‌ సాగర్‌ నుంచి 16 ఎంజీడీ, హిమయత్‌సాగర్‌ నుంచి 2 ఎంజీడీ నీటిని సరఫరా చేస్తున్నట్లు పేర్కొంది. ట్రాన్స్‌ మిషన్‌ వింగ్‌ వాటర్‌ ఆడిట్‌లో భాగంగా, ట్రాన్స్‌ మిషన్‌ సిస్టమ్‌లో నష్టాలు 1శాతం కంటే తక్కువగా ఉంటాయని పేర్కొంది. పంపిణీ వ్యవస్థలో వ్యక్తిగత గృహాల సర్వీస్‌ కనెక్షన్లలో మీటర్లు లేకపోవడంతో నీటి ఆడిట్‌ ప్రస్తుతం జరగడం లేదని పేర్కొంది. నీటి సరఫరాలో సుమారు 15 శాతం వరకు సర్వీస్‌ కనెక్షన్లు, డిస్ట్రిబ్యూషన్‌ పాయింట్ల వద్ద నీటి వృథా నష్టం ఉంటుందని జలమండలి స్పష్టం చేసింది.

ల్యాబ్‌ టెక్నీషియన్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ప్రొఫెసర్‌ కోదండరామ్‌



మాట్లాడుతున్న ప్రొఫెసర్‌ కోదండరామ్‌

హిమాయత్‌నగర్‌: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మెడికల్‌ ల్యాబ్‌ టెక్నీషియన్ల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్‌ కోదండరామ్‌ అన్నారు. ప్రపంచాన్ని వణికించిన కోవిడ్‌ వ్యాప్తి నేపథ్యంలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ల్యాబ్‌ టెక్నీషియన్లు చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివన్నారు. బుధవారం కింగ్‌ కోఠిలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మెడికల్‌ ల్యాబ్‌ టెక్నీషియన్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ఎం.ఎస్‌.మూర్తి ఆధ్వర్యంలో జాతీయ ల్యాబ్‌ టెక్నీషియన్ల దినోత్సవాలని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కోదండరామ్‌ మాట్లాడుతూ... రోగులకు మెరుగైన వైద్య సేవలందించడంలో ల్యాబ్‌ టెక్నీషియన్ల పాత్ర ఎంతో ముఖ్యమైందన్నారు. టీఎన్జీవో హైదరాబాద్‌ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్‌ ముజీబ్‌ హుస్సేనీ, కింగ్‌ కోఠి జిల్లా హాస్పిటల్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రాజేంద్రనాథ్‌, హాస్పిటల్‌ నోడల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ మల్లికార్జున్‌, ఆర్‌ఎంఓ డాక్టర్‌ సాధన, హెచ్‌ఓడీ ప్రొఫెసర్‌ డాక్టర్‌ జలజ, ఐఎన్టీయూసీ మెడికల్‌ అండ్‌ హెల్త్‌ విభాగం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు రెడ్డి, ఉస్మానియా ఆస్పత్రి నర్సింగ్‌ సూపరింటెంట్‌ సుజాత రాథోడ్‌, టీఎన్జీవో యూనిట్‌ అధ్యక్షుడు నరసింహారెడ్డి, నర్సింగ్‌ ఆఫీసర్‌ శైలజ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి



పురస్కార గ్రహీతలతో ప్రెస్‌ అకాడమీ చైర్మన్‌ శ్రీనివాస్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్రెస్‌ అకాడమి చైర్మన్‌ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో ప్రాజ్ఞిక ఆర్ట్స్‌ అకాడమి, సీల్‌వెల్‌ కార్పొరేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ మీడియా సంస్థలలో విధులు నిర్వహిస్తున్న మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గాయనీ గాయకుల గీతాలాపన ఆహూతులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, సహకార శాఖ సికింద్రాబాద్‌ డిప్యూటీ రిజిస్ట్రార్‌ వెంకట్‌రెడ్డి, తెలుగు ప్రపంచం సంపాదకులు పురుషోత్తమ్‌గౌడ్‌, ప్రాజ్ఞిక వ్యవస్థాపక అధ్యక్షులు ప్రవీణ్‌ తదితరులు పాల్గొన్నారు.

బూర్గుల రామకృష్ణారావు పురస్కారం ప్రదానం

సుల్తాన్‌బజార్‌: హైదరాబాద్‌ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి డాక్టర్‌ బూర్గుల రామకృష్ణారావు 121వ జయంతి సందర్భంగా బుధవారం సాయంత్రం సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణ దేవారాయ భాషా నిలయంలో బూర్గుల రామకృష్ణారావు ప్రతిభా పురస్కారాన్ని ఓయూ పూర్వ రిజిస్ట్రార్‌ డాక్టర్‌ వి.కిషన్‌రావుకు మాజీ ప్రభుత్వ సలహాదారు డాక్టర్‌ కేవీ రమణాచారి చేతుల మీదుగా ప్రదానం చేశారు. అలాగే రావిచెట్టు రంగారావు 47వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, అమ్మంగి వేణుగోపాల్‌, నిత్యానందరావు, చంద్రప్రకాష్‌రావు, ఉడయవర్లు హాజరయ్యారు.



ఫ్లెక్సీ వివాదంలో కార్పొరేటర్‌పై దాడి

బంజారాహిల్స్‌: ఫ్లెక్సీ వివాదం ముదిరింది. రెచ్చిపోయిన నలుగురు మహిళలు ఏకంగా వెంగళరావునగర్‌ కార్పొరేటర్‌ దేదీప్యరావు కారుపై దాడి చేశారు. లోపల ఉన్న ఆమె పై పిడిగుద్దుల వర్షం కురిపించారు. కార్పొరేటర్‌ ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్‌ పోలీసులు నలుగురు మహిళలపై క్రిమినల్‌ కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్‌ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ నాయకులు యూసుఫ్‌గూడ చౌరస్తాతో పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్‌ వేడుకలు ముగియడంతో ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించేలా ఉన్న ఫ్లెక్సీలను తొలగించాలని వెంగళరావునగర్‌ కార్పొరేటర్‌ దేదీప్యరావు జీహెచ్‌ఎంసి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఈ నెల 12న రాత్రి జీహెచ్‌ఎంసి సిబ్బంది కొన్ని ఫ్లెక్సీలు తొలగించేందుకు యూసుఫ్‌గూడ చౌరస్తాకు చేరుకున్నారు. ఫ్లెక్సీలు తీస్తుండగా అక్కడే ఉన్న మహిళలు అడ్డుకున్నారు. విషయం తెలుసుకొని కార్పొరేటర్‌ దేదీప్యరావు, ఆమె భర్త విజయ్‌ కుమార్‌ కారులో అక్కడకు చేరుకున్నారు. దీంతో వారిపై మహిళలు రెచ్చిపోయారు. కార్పొరేటర్‌పై పిడిగుద్దులు కురిపించారు.దీంతో గాయపడ్డ దేదీప్యరావు. ఆమె భర్త విజయకుమార్‌ పిర్యాదు మేరకు జూబ్లీహిల్స్‌ పోలీసులు భావన, నాగలక్ష్మీ, హెస్సెన్‌, లక్ష్మీ పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కార్పొరేటర్‌పై దాడిని జూబ్లీహిల్స్‌ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ ఖండించారు. బుధవారం మధురానగర్‌ లోని కార్పొరేటర్‌ దేదీప్యరావు నివాసానికి వచ్చి ఆమెను పరామర్శించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

అదనపు కలెక్టర్‌ (లోకల్‌ బాడీస్‌) కదిరవన్‌

సాక్షి, సిటీబ్యూరో: పేద ప్రజలకు ఆర్థిక సహాయం, వారి ఇతర సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం సహకరిస్తుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ పి కదిరవన్‌ తెలిపారు. బుధవారం పీఎం సూరజ్‌ పోర్టల్‌ను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌ పద్ధతిలో ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్‌ కొత్తపేట్‌ సురభి ఎలైట్‌ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా అదనపు కలెక్టర్‌ సామాజిక న్యాయం , సాధికారత మంత్రిత్వ శాఖ పునీత్‌ గార్గ్‌, వివిధ శాఖల అధికారులతో కలిసి తిలకించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివద్ధి చెందాలని, జిల్లా యంత్రాంగం పేదలకు ఆర్థిక సాయం, ఇతర సమస్యల పరిష్కారానికి సహకరిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏజీఎం కష్ణన్‌, యూబిఐ జనరల్‌ మేనేజర్‌ రఘునాథ్‌ రెడ్డి, ఎల్‌డీఎం జీఎం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ట్రేడింగ్‌ పేరుతో రూ.20లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్‌: ట్రేడింగ్‌లో అధిక లాభాలు వస్తాయని నమ్మించి 60 ఏళ్ల వృద్ధుడిని సైబర్‌ నేరగాళ్లు మోసం చేశారు. నగర సైబర్‌ క్రైమ్‌ పోలీసులు తెలిపిన మేరకు.. నగరానికి చెందిన 60 ఏళ్ల వ్యక్తికి వాట్సాప్‌లో స్టాక్‌ మార్కెట్‌ పెట్టుబడుల పేరుతో ఓ లింక్‌ వచ్చింది. ఆన్‌లైన్‌ ట్రేడింగ్‌, ఐపీఓలలో పెట్టుబడులు పెట్టడం ద్వారా అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. దీంతో బాధితుడు తన ఆధార్‌, పాన్‌ కార్డ్‌ వివరాలతో ట్రేడింగ్‌ అకౌంట్‌ను తెరిచాడు. మొదటగా సైబర్‌ కేటుగాళ్లు చెప్పిన విధంగా రూ.50,000 డిపాజిట్‌ చేశాడు. నకిలీ ట్రేడింగ్‌ ఖాతాలో లాభాలు వచ్చినట్లు చూపించారు. అది నమ్మిన బాధితుడు బల్క్‌ ట్రేడింగ్‌లో భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టాడు. 30 రోజులు స్టాక్స్‌ కలిగి ఉంటే, మంచి లాభాలు వస్తాయని మరోసారి నమ్మించారు. 30 రోజుల అనంతరం బాధితుడు లాభాలు కలిపి మొత్తం రూ.79 లక్షలు చూపించారు. ఆ డబ్బును విత్‌డ్రా చేసుకునే ప్రయత్నం చేయడంతో సాధ్యం కాలేదు.విత్‌ డ్రా చేసుకోవాలంటే మరింత డబ్బు పెట్టుబడి పెట్టాలని, కమీషన్‌ ఇతర చార్జీల పేరుతో మరింత డబ్బు ట్రాన్స్‌ఫర్‌ చేయాలని ఒత్తిడి చేశారు. అప్పటికే బాధితుడు మొత్తం రూ.20,75,000 పంపిచడంతో ఇంకా డబ్బు పంపిచడం వీలుకాదని తేల్చిచెప్పడంతో కేటుగాళ్లు బాధితుడి ట్రేడింగ్‌ ఖాతాను కూడా బ్లాక్‌ చేశారు. దీంతో మోసపోయానని గ్రహించి బాధితుడు నగర సైబర్‌ క్రైమ్‌ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

‘గాంధీ’లో 122 వైద్యపోస్టుల భర్తీకి రంగం సిద్ధం

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్‌ గాంధీ మెడికల్‌ కాలేజీ, ఆస్పత్రుల్లో గౌరవ వేతనం, కాంట్రాక్టు పద్ధతిలో 122 వైద్య పోస్టుల భర్తీకి రంగం సిద్ధమైంది. రాష్ట్రంలోని 26 ప్రభుత్వ మెడికల్‌ కాలేజీల్లో 4,356 అధ్యాపక పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో గాంధీ పాలనయంత్రాంగం అందుకు తగ్గ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయనుంది. గాంధీ మెడికల్‌ కాలేజీలోని పలు విభాగాల్లో ప్రొఫెసర్‌, అసోసియేట్‌, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గాంధీ ప్రాంగణంలో మదర్‌ అండ్‌ చైల్డ్‌ హెల్త్‌ (ఎంసీహెచ్‌) 200 పడకల ఆస్పత్రి ఇటీవల అందుబాటులోకి రావడంతో గైనకాలజీ, పిడియాట్రిక్‌, అనస్తీషియా తదితర విభాగాలకు చెందిన వైద్యుల అవసరం మరింత పెరిగింది. గాంధీ మెడికల్‌ కాలేజీ 22 విభాగాలలో 3 ప్రొఫెసర్లు, 74 అసిస్టెంట్‌ ప్రొఫెసర్లు, 8 మంది ట్యూటర్లు, 37 మంది సీనియర్‌ రెసిడెంట్లను గౌరవ వేతనం, కాంట్రాక్టు పద్ధతిలో నియమించనున్నారు. వచ్చేఏడాది మార్చి 31వ తేది వరకు ఏడాది కాలానికి వీరిని నియమిస్తున్నారు. అర్హులైనవారంతా గాంధీ మెడికల్‌ కాలేజీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, ఈనెల 16వ తేదిన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

దుర్గంచెరువును మరోసారి పరిశీలించండి

స్వల్పకాలిక చర్యలపై నివేదిక ఇవ్వాలని నిపుణుల కమిటీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్‌: దుర్గం చెరువును మరోసారి పరిశీలించి..చెరువు పరిరక్షణకు ప్రభుత్వం తీసుకున్న స్వల్పకాలిక చర్యలపై నివేదిక ఇవ్వాలని నిపుణుల కమిటీని హైకోర్టు ఆదేశించింది. దీనికోసం ఆరు వారాల సమయం ఇస్తున్నామని చెప్పింది. కమిటీ పరిశీలనకు అయ్యే రవాణా, వసతి తదితర ఖర్చులన్నీ భరించాలని, పోలీస్‌ టీమ్‌ను కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. నాగ్‌పూర్‌లోని నేషనల్‌ ఎన్విరాన్‌మెంటల్‌ ఇంజనీరింగ్‌ రీసెర్చ్‌ ఇన్‌స్టిట్యూట్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ అతుల్‌ నారాయణ్‌ వైద్య, రాష్ట్ర నీటిపారుదల కమాండ్‌ ఏరియా డెవలప్‌మెంట్‌ ముఖ్యకార్యదర్శి, హైకోర్టు లీగల్‌ సర్వీసెస్‌ కమిటీ కార్యదర్శి ఎం.శాంతివర్ధనితో నిపుణుల కమిటీని హైకోర్టు నియమించిన విషయం తెలిసిందే. దుర్గం చెరువులో కాలుష్యం చేరి ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టంగా మారి వందలాది చేపలు మృతి చెందాయంటూ ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని హైకోర్టు సుమోటో ప్రజాప్రయోజన వ్యాజ్యంగా విచారణకు స్వీకరించింది. విచారణలో భాగంగా కమిటీ చెరువును పరిశీలించి గత నెలలో నివేదిక అందజేసింది. ‘దుర్గం చెరువులోకి మురుగు నీరు, చెత్త చేరకుండా చర్యలు చేపట్టాలి. ఫుల్‌ ట్యాంక్‌ లెవల్‌(ఎఫ్‌టీఎల్‌), బఫర్‌ జోన్‌లను గుర్తించాలి. చెట్లు, గార్డెన్‌లను అభివృద్ధి చేయాలి. చెరువు చుట్టూ సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలి. మొత్తంగా అహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు ఏం చర్యలు తీసుకోవాలనే స్వల్పకాలిక, దీర్ఘకాలిక చర్యలు’ నివేదికలో పొందుపర్చింది. ఈ నివేదికపై కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని అధికారులను గతంలో ధర్మాసనం ఆదేశించగా..అడ్వొకేట్‌ జనరల్‌(ఏజీ) ఎ.సుదర్శన్‌రెడ్డి ప్రణాళిక, స్వల్పకాలిక చర్యల వివరాలను అందజేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ అలోక్‌ ఆరాధే, జస్టిస్‌ అనిల్‌ కుమార్‌ జూకంటి ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. స్వల్పకాలిక అంశాలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను పరిశీలించి చెప్పాలని కమిటీని ధర్మాసనం కోరింది. తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా వేసింది.

దుర్గమ్మకు కానుకగా బంగారు మంగళ సూత్రాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు బుధవారం బంగారు మంగళ సూత్రాలను, గొలుసును కానుకగా సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన భాష్యం ప్రవీణ్‌, లావణ్య దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి వచ్చారు. ఆలయ ఎఈవో ఎస్‌.రమేష్‌బాబును కలిసి అమ్మవారికి 35 గ్రాముల బంగారంతో తయారు చేయించిన బంగారు రాళ్ల గొలుసు, మంగళ సూత్రాలు, పట్టుచీరను అందచేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఎఈవో ఎస్‌. రమేష్‌బాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందచేశారు.

అక్రమ కట్టడాలను అడ్డుకోండి



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ వెంకటేష్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను వెంటనే పూర్తయ్యేలా చూడటంతో పాటు అక్రమ కట్టడాలు జరక్కుండా చూడాలని కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ రోనాల్డ్ రోస్‌లకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన వారినిత కలిసి వినతిపత్రాలు అందజేశారు. వినాయకనగర్ పార్వతాంజనేయ స్వామి దేవాలయం వద్ద జరుగుతున్న అక్రమ నిర్మాణాలు జరక్కుండా అడ్డుకోవాలన్నారు. రాక్ గార్డెన్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, దీన్‌దయాళ్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ స్థలంలో తాత్కాలిక ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఆ స్థలంలో విద్యార్థులకు ఉపయోగపడేవిధంగా ఇంటర్ కళాశాల నిర్మించాల్సిందిగా కోరారు. రోడ్డు నెంబర్ 46 అంబేడ్కర్‌నగర్ కాలనీలో పునాదుల వద్ద ఆగిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల భవనాన్ని పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

సరస్వతీపుత్రులకు 'ఆప్త' ప్రోత్సాహకాలు



కార్యక్రమంలో ఆప్తా ప్రవాస భారతీయుల ప్రతినిధులు

బంజారాహిల్స్: అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్త) ఆధ్వర్యంలో చదువుల్లో రాణిస్తూ పేదలైన విద్యార్థులకు స్కాలర్‌షిప్పుల పంపిణీ కార్యక్రమం జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-66లో ఘనంగా జరిగింది. తెలంగాణలో గుర్తించిన వంద మంది పిల్లలకు ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున చదువుకునేందుకు సహకారం అందిస్తూ నగదు అందజేశారు. ఆప్త ప్రవాస భారతీయులు తూము రమేష్, సుగ్గ కోట, గోడపాటి గోపాల్, ఇండియా ప్రతినిధులు దుప్తా రవీంద్రనాథ్ ఠాగూర్, అరవ రామకృష్ణ, శ్రీహరి, అలపాటి లక్ష్మీనారాయణ, పీవీరావు, పీఎస్ఆర్‌కే భగవాన్, పరసా పరమేశ్వర్, డాక్టర్ పటేల్ తదితరులు పాల్గొని విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. అమెరికన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థ గత 10 సంవత్సరాల నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో గుర్తించిన పిల్లలకు నగదు ప్రోత్సాహకాలను అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో కూడా చదువులో రాణిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం కొనసాగిస్తామన్నారు.

కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్శిటీకి ప్రతిష్టాత్మక గుర్తింపు

అకాడెమియా ఎక్స్‌లెన్స్ అవార్డు, విజేత అవార్డులు



అవార్డును స్వీకరిస్తున్న కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్శిటీ ప్రతినిధి

బంజారాహిల్స్: ఇటీవల న్యూ ఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో జరిగిన 12వ గ్రీన్ ఎనర్జీ సమ్మిట్, నాల్గో గ్రీన్ ఉర్జా అండ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ అవార్డ్స్‌లో కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్శిటీ అకాడెమియా ఎక్స్‌లెన్స్ అవార్డును కైవసం చేసుకుంది. దీంతో పాటు స్కిల్ డైవర్శిటీ అండ్ ఔట్ రీచ్ విభాగంలో 'విజేత అవార్డు'ను అందుకుంది. ఇంధన పొదుపు, పునరుత్పాదక శక్తి, సంబంధిత రంగాలను అభివృద్ధి చేయడంలో చేసిన కృషికి గాను ఈ గుర్తింపు లభించింది. ఈ గుర్తింపు పునరుత్పాదక ఇంధన పరిష్కారాల వైపు ప్రపంచ మార్పుపై అర్థవంతమైన ప్రభావాన్ని చూపుతుందన్నారు. ఈ సందర్భంగా కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్శిటీ వైస్ చాన్సలర్ జి.పార్థసారథివర్మ మాట్లాడుతూ... ప్రతిష్టాత్మక గుర్తింపు తమ సంస్థ అంకితభావానికి నిదర్శనమన్నారు. భారత ప్రభుత్వం మాజీ సెక్రటరీ పవర్ అనిల్ రజ్దాన్, రిటైర్డ్ ఐఏఎస్ అలోక్‌కుమార్, న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డైరెక్టర్ సుమన్ చంద్ర చేతుల మీదుగా యూనివర్శిటీ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ వీ రాజేష్ ఆ సంస్థ తరపున అవార్డును స్వీకరించారు.

సీఏఏను ఉపసంహరించుకోవాలి: ఏఐవైఎఫ్

హిమాయత్‌నగర్: వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఏఏను వ్యతిరేకించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర డిమాండ్ చేశారు. బుధవారం హిమాయత్‌నగర్‌లో వారు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టాన్ని తెలంగాణలో అమలు చేయకుండా చూడాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ, లౌకిక విలువలకు తూట్లు పొడిచే విధంగా, మతం పేరుతో విభజన రాజకీయాలు చేస్తున్న మోదీ ప్రభుత్వం మరో ముందడుగు వేసి లోక్ సభ ఎన్నికలకు ముందు పౌరసత్వ (సవరణ) చట్టం-2019ను అమలు చేస్తున్నట్లు ప్రకటించడం అహేతుకమైన చర్య అని వారు అభివర్ణించారు. సీఏఏ చట్టం ।వివక్షతకి।తో కూడిందన్నారు. మత-విభజన చట్టాలను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రోత్సహించబోమని వారు తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

హిమాయత్‌నగర్: తప్పిపోయిన ఓ బాలుడిని గంటల వ్యవధిలోనే ఆ బాలుడి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు పోలీసులు. నారాయణగూడ అడ్మిన్ ఎస్ఐ నరేష్ కుమార్ సమాచారం మేరకు... బుధవారం సాయంత్రం నారాయణగూడ మెట్రోస్టేషన్ వద్ద 7 సంవత్సరాల బాలుడు ఉన్నాడని డయల్ 100 ద్వారా సమాచారం వచ్చింది. వెంటనే కానిస్టేబుల్ అక్కడి చేరుకొని బాలుడిని పోలీస్ స్టేషన్‌కి తీసుకొచ్చారు. ఆ బాబు ఎలాంటి వివరాలు తెలపకపోవడంతో పోలీసులు వెంటనే సోషల్ మీడియాతో పాటు స్థానికులకు సమాచారం అందజేశారు. ఈ సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. దీంతో పోలీసులు క్షేమంగా ఆ బాలుడిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సింఘానియాలో బిగ్‌బాస్ ఫేం రతిక సందడి



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-36లోని సింఘానియాస్ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. బిగ్‌బాస్ ఫేం, నటి రతిక విచ్చేసి ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా సింఘానియా ఎండీ శైలేష్ మాట్లాడుతూ... కంజీవరం, బనారసీ, పైథాని, చందేరి, బాందని, వెంకటగిరి, గద్వాల్, కలంకారీ, కానికాశ్మీరి, పటాన్-పటోలా, ఇక్కత్, ఓరగంజా డిజైనర్ చీరలతో పాటు ఫ్యాబ్రిక్స్, లెహెంగాస్, దుప్పట్టాలు,రెడీమేడ్ బ్లౌజ్‌లు కట్ పీసెస్, హస్తకళా ఉత్పత్తులను పదర్శనలో ఉంచినట్లు తెలిపారు.

మెసేజ్‌లు పంపి నగదు కాజేసిన సైబర్ నేరగాళ్లు

వెంగళరావునగర్: మేసేజ్‌లు పంపి యువకుడి నుంచి సైబర్ నేరగాళ్లు నగదు కాజేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... ఎల్లారెడ్డిగూడకు చెందిన మద్ది రాజేష్ అనే వ్యక్తి ఎస్‌బీఐలో ప్రైవేట్ ఉద్యోగి. ఫిబ్రవరి 12వ తేదీ రాత్రి అతనికి ఒక మెసేజ్ వచ్చింది. దానిని ఓపెన్ చేసి యూజర్ పేరు, పాస్‌వర్డ్ కొట్టాడు. ఓటీపీ రాగానే దానిని కూడా ఎంటర్ చేశాడు. ఈ విధంగా మూడుసార్లు ఓటీపీలు వచ్చాయి. అనంతరం అతని అకౌంట్ నుంచి రూ. 49,988 నగదు డెబిట్ అయినట్లుగా మెసేజ్ వచ్చింది. 13వ తేదీ బ్యాంక్‌లో అనంతరం సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదులు చేశాడు. 14వ తేదీ రూ. 11256 హోల్డ్ చేసినట్లుగా మెసేజ్ వచ్చింది. ఈ కేసు బుధవారం మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైంది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సొంతింటి కల.. నెరవేరనున్న వేళ!

- పేదల్లో చిగురిస్తున్న ఆశలు
- ఒక్కో నియోజకవర్గానికి 3500 చొప్పున ఇళ్ల కేటాయింపు
- ఇళ్ల స్థలాలు లేనివారికి స్థలంతో పాటు రూ. 5 లక్షలు
- ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో వేలల్లో దరఖాస్తుదారులు



ఫిలింనగర్ ఎంజీనగర్‌లో నాలా పక్కన ఇళ్ల కూల్చివేతల ఫొటోలు చూపుతున్న మహిళ

బంజారాహిల్స్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రవేశపెట్టడంతో నివాస యోగ్యానికి నోచుకోని నిరుపేదలు సొంతింటి కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించగా ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను అధికారులు విడుదల చేశారు. దీంతో సొంతింటి కల ఈ సారైనా నెరవేరుతుందో లేదో అని అర్హత ఉన్న పేద, మధ్యతరగతి ప్రజానీకం ఎదురుచూస్తున్నారు. ఇళ్ల స్థలం లేనివారికి స్థలంతో పాటు రూ. 5 లక్షల నిధులు, సొంత స్థలాలు ఉన్నవారికి రూ. 5 లక్షలు మంజూరు చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. అలాగే గిరిజనులు, అత్యంత నిరుపేదలకు రూ. 6 లక్షలు మంజూరు చేస్తారు. మొదటి విడత కింద ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 ఇళ్లను కేటాయించారు.

- ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్, జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్‌ల డివిజన్ల పరిధిలో పేద ప్రజానీకం ఇందిరమ్మ ఇళ్ల కోసం ఆశలు పెట్టుకున్నారు.
- ఖైరతాబాద్‌కు 3500, జూబ్లీహిల్స్‌కు 3500ల చొప్పున ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని పరిగణలోనికి తీసుకోనున్నారు.
- ఇందిరమ్మ ఇళ్లకు కూడా మార్గదర్శకాలు విడుదల చేయగా దీని ప్రకారం గృహలక్ష్మీ పథకానికి అర్హులను గుర్తించనున్నారు.
- ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలన కార్యక్రమంలో 88,000 మంది, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో లక్ష మంది దరఖాస్తు చేసుకున్నారు. గత ప్రభుత్వం మొదటి, రెండో విడతలో ఈ రెండు నియోజకవర్గాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించింది.
- అయితే ఇంకా చాలామంది ఇళ్లు రాక వేచి ఉన్న తరుణంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. మరోసారి పేదల్లో సొంతింటి కోసం ఆశలు చిగురించాయి. వీరిని ఎలా ఎంపిక చేస్తారనేది ఇంకా స్పష్టంగా తెలియడం లేదు. చాలాచోట్ల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మాణాలు పూర్తయ్యి ఉండగా వాటిని కేటాయిస్తారా..? కొత్తగా నిర్మిస్తారా..? అన్నది తేలాల్సి ఉంది.
- అయితే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లనే మిగిలిన వాటిని నియోజకవర్గానికి 3500 చొప్పున కేటాయించనున్నట్లు స్పష్టమవుతోంది.
- సొంత స్థలం ఉండి ఇళ్లు లేనివారు మాత్రం నగదు అందించనున్నారు.
- త్వరలోనే దీనికి సంబంధించి పూర్తి జాబితా విడుదల కానుంది. ఎవరికి ఈ సారి ఇందిరమ్మ ఇళ్లు దక్కుతుందో కొద్ది రోజుల్లో త్వరలోనే ప్రజాపాలన దరఖాస్తులతో అధికారులు ఇంటింటికీ తిరిగి సర్వే చేయనున్నట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.

ముదిరాజ్‌లను బీసీ ఏలోకి మార్చాలి

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్‌ల చిరకాల కోరికైన ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని పలు ముదిరాజ్ సంఘాలు తెలిపాయి. అదే తరహాలో మరో స్వప్నం ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చి ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు కోరారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ముదిరాజ్ మహాసంఘం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్, తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్‌లు మాట్లాడారు.

ఎమ్మెల్సీగా నియమించాలని గవర్నర్‌కు వినతి

శ్రీనగర్‌కాలనీ: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా తన అభ్యర్థిత్వాన్ని ఆమోదించాలని, ఇప్పటికే తన విజ్ఞప్తిని అందించానని, మరోసారి తన విన్నతిని గవర్నర్ తమిళసైకి బుధవారం అందించానని హైకోర్ట్ న్యాయవాది, సామాజిక వేత్త సుంకర నరేష్ తెలిపారు. శ్రీనగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అన్ని అర్హతలు, సమాజం కోసం నిస్వార్థంగా పనిచేసే తనకు అవకాశం కల్పించాలన్నారు.

పైప్‌లైన్ పనుల ప్రారంభం



వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 3లోని ఓల్డ్ వెంకటేశ్వరనగర్ బస్తీలో రూ. 9.5 లక్షల వ్యయంతో 90 మీటర్ల మేర నిర్మించనున్న సీవరేజి పైప్‌లైన్ పనులను వెంకటేశ్వర కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ప్రారంభించారు. జలమండలి బంజారాహిల్స్ సెక్షన్ మేనేజర్ శివ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంనగర్ బస్తీ సమస్యలు పరిష్కరించండి

రహమత్‌నగర్: శ్రీరాంనగర్ బస్తీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డికి బుధవారం వినతి పత్రం సమర్పించారు. నాయకులు ఎక్బాల్, ఇంతియాజ్ ఖాన్, లింగమూర్తి, వినోద్‌కుమార్ తదితరుల పాల్గన్నారు.

సంప్రదాయ పద్యకవి మధునాపంతుల

చిక్కడపల్లి: మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి సంప్రదాయ పద్యకవి అని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ డాక్టర్ ఆయాచితం శ్రీధర్ అన్నారు. త్యాగరాయ గానసభలో బుధవారం శతాబ్దిపూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలో భాగంగా తెలుగు సాహిత్య నిర్మాత మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి సంస్మరణసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ... తెలుగు సాహిత్యంలో ముఖ్యంగా అచ్చ తెలుగు సాహిత్యంలో పేరెన్నికగన్న కవులలో ప్రముఖుడు మధునాపంతుల అన్నారు. ఆధునిక సంప్రదాయ పద్యకవులలో ప్రతిభ అభ్యాసం, ఉత్పత్తి సమపాళ్లలో సముపార్జించిన మహాకవి ఆయన అన్నారు. ఆయన రచించిన ఆంధ్రపురాణం కవ్యంలో విశ్వనాథవారి కవితాధార, కరుణశ్రీ వంటి కవుల శైలి లాలిత్యం కనిపిస్తాయన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, సంఘసేవకులు ఆత్మీయ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలి

ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే



ప్రొఫెసర్ కాత్యాయని విద్మహేను సన్మానిస్తున్న వీసీ సీతారామారావు

బంజారాహిల్స్: మహిళలకు విద్య, రాజకీయాల్లో జనాభా దామాషా పద్ధతిలో సరైన వాటా దక్కలేదని ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే అభిప్రాయపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ మహిళా అభివృద్ధి, విస్తరణ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమానికి తెలంగాణ ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక కార్యదర్శి, కాకతీయ విశ్వవిద్యాలయ తెలుగు విశ్రాంత అధ్యాపకురాలు ఆచార్య కాత్యాయని విద్మహే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆమె ఈ సందర్భంగా 'మహిళా శక్తి: మహిళల హక్కులు' అనే అంశంపై ప్రసంగించారు. అనేక సంవత్సరాలుగా అంతర్జాతీయ మహిళలకు హక్కుల ఉద్యమం చేసిన గొప్ప చరిత్ర ఉన్నప్పటికీ, ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా భ్రూణ హత్యలు, బాలికలను హరించడం, లైంగిక బానిసలుగా వాడుతుండటం దుర్మార్గమైన చర్యగా ఆమె అభివర్ణించారు. మహిళల మానవ హక్కులు, మహిళా సాధికారత, లింగ సమానత్వం-హక్కులను పరిరక్షించడం, రాజకీయ ప్రాతినిత్యం మొదలుకొని అన్ని రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. న్యాయం జరగనప్పుడు ప్రభుత్వాలను ప్రశ్నించాల్సిన బాధ్యత కూడా మహిళలు, మహిళా సంఘాలపై ఉందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.సీతారామారావు మాట్లాడుతూ... ప్రపంచంలో స్త్రీని మించిన మహాశక్తి ఏదీ లేదని, స్త్రీ లేకపోతే ఈ సృష్టి లేదన్నారు. మహిళల సాధికారత, అభ్యున్నతి, వివక్ష నిర్మూలనపై తమ విశ్వవిద్యాలయం ద్వారా పాఠ్యాంశాలను అందిస్తున్న విషయాన్నిగుర్తుచేశారు. రానున్న రోజుల్లో మహిళా సాధికారతకు సంబంధించి తమ విశ్వవిద్యాలయం పెద్దపీట వేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి, మహిళా అభివృద్ధి, విస్తరణ కేంద్రం ఇన్‌చార్జి డాక్టర్ మేరీ సునంద తదితరులు పాల్గొన్నారు.

హనుమంత వాహన సేవలో శ్రీవారు



హనుమంత వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీ వెంకటేశ్వరస్వామి నాల్గవ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు బుధవారం హనుమంత వాహనంపై శ్రీనివాసుడు శ్రీరామచంద్రమూర్తి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం గజ వాహనంపై వెంకటేశ్వరస్వామిని ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, స్నపన తిరుమంజనం అర్చన, సల్లింపు, ఆస్థానం, ఏకాంత సేవ తదితర పూజాదికాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో టీటీడీ పాలకమండలి సభ్యురాలు జి. సీతారెడ్డి, టీటీడీ ఎల్ఏసీ వైస్ ప్రెసిడెండ్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆకాశమే హద్దుగా సత్తాచాటుతున్న మహిళలు

వెంగళరావునగర్: గడచిన పదేళ్లల్లో సమాజంలో ఎన్నో మార్పులు సంభవించాయని, మహిళలు ఎంతో ధైర్యంగా ముందుకొచ్చి అన్ని రంగాల్లో సత్తాచాటుతున్నారని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ప్రముఖ సినీనటి గాయత్రీ భార్గవి పేర్కొన్నారు. మధురానగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వారం రోజులుగా నిర్వహిస్తున్నారు. అందులోగా మహిళలకు రోజూ వివిధ రకాల క్రీడలైన లెమన్ అండ్ స్పూన్, పరుగుపందెం, స్పీడ్ వాకింగ్, మ్యూజికల్ చైర్స్, బాస్కెట్‌లో బంతి వేయడం, దారం ముడులు వేయడం, గ్లాసులతో అంతస్తులు నిర్మించడం తదితర పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజయం సాధించిన వారికి మంగళవారం రాత్రి బహుమతులను ప్రదానం చేశారు. కార్పొరేటర్ దేదీప్య విజయ్, మధురానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడె సాంబశివరావు, ఎం.కళ్యాణ చక్రవర్తి, కోశాధికారి ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

బూర్గులకు నివాళి

లిబర్టీ: రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావుకు పలువురు నివాళులు అర్పించారు. బూర్గుల రామకృష్ణారావు జయంతి సందర్భంగా లిబర్టీ కూడలి వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. బూర్గుల రామకృష్ణారావు కుటుంబ సభ్యులు, మాల మహానాడు ప్రధాన కార్యదర్శి వెన్న సదానంద తదితరులు పూలమాలలు వేసి ఘనమైన నివాళులర్పించారు. స్వాతంత్ర సమరయోధుడిగా తెలంగాణ స్టేట్ ముఖ్యమంత్రిగా బూర్గుల రామకృష్ణారావు అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు.

'మాత పురస్కార్' అవార్డుల ప్రదానం



అవార్డులను అందిస్తున్న డాక్టర్ కుసుమ

శ్రీనగర్‌కాలనీ: కుటుంబ బాధ్యతలను తమపై వేసుకొని స్వయం ఉపాధితో పిల్లలను చదివిస్తూ ఉండే మహిళలు సమాజంలో ఆదర్శప్రాయులని శ్రీమాత సేవాసమితి అధ్యక్షురాలు డాక్టర్ కుసుమ విజయ అన్నారు. బుధవారం రాజీవ్‌నగర్‌కాలనీలో ఆదర్శ మహిళలైన సరస్వతి, ఉషా అనే ఇద్దరికి మాత పురస్కార్ అవార్డులను అందించారు. పిల్లను ఉన్నతంగా చదివిస్తూ కుటుంబ పోషణను తమ భుజస్కందాలపై వేసుకున్న ఒంటరి మహిళలకు తాము తోడుగా ఉంటామన్నారు. నేతలు కళ్లెం శ్రీనివాసరెడ్డి, రాధిక, శంకర్ పాల్గొన్నారు.

సన్మానం



బంజారాహిల్స్: అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.సీతారామారావును టీ శాట్ సీఈఓ వేణుగోపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. టీ శాట్ సీఈఓగా వేణుగోపాల్‌రెడ్డిని ప్రభుత్వం ఇటీవలే నియమించగా అంబేడ్కర్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలోనే టీ శాట్ కార్యాలయం ఉంది. ఈ నేపథ్యంలో ఆయన వీసీని కలవగా విశ్వవిద్యాలయ అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యా వ్యాప్తి, తెలంగాణ నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు ఉపయోగపడేలా కార్యక్రమాలను రూపొందించి టీ శాట్ ద్వారా ప్రసారం చేయాలని చర్చలు జరిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఏవీఎన్‌రెడ్డి, టీ శాట్ జనరల్ మేనేజర్ లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం

పంజగుట్ట: మున్నూరు కాపులకు ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షిస్తున్నట్లు, యావత్ మున్నూరు కాపుల తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘాలు ప్రకటించాయి. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్, రాష్ట్ర మున్నూరు కాపు డెవలప్మెంట్ ఫోరం అధ్యక్షులు ఎడ్ల రవికుమార్, రాష్ట్ర మున్నూరు కాపు యువత అధ్యక్షులు బండి సంజీవ్ పటేల్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్ పటేల్ ఈ మేరకు ప్రకటన చేశారు. అలాగే మున్నూరు కాపులకు ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రకటించడం పట్ల తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ హర్షం వ్యక్తం చేసింది. మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు రమేష్ కుమార్‌లు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లో కార్పొరేషన్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



ఖైరతాబాద్: వృత్తి కులాల పరంగా కార్పొరేషన్ల ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేస్తూ బుధవారం ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టీపీసీసీ సెక్రటరీ, బ్యాక్‌వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ మధుకర్ యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన పాలాభిషేకం కార్యక్రమంలో కార్పొరేటర్ విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక తృతజ్ఞతలు తెలిపారు. పార్టీ డివిజన్ ప్రెసిడెంట్ వెంకట్, సీనియర్ నాయకులు అనిల్, శ్రీనివాస్‌యాదవ్, బంటి, కిరణ్, శశిరాజ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ ఆధీనంలోకి బంగారు మైసమ్మ ఆలయం

రహమత్‌నగర్: రహమత్‌నగర్‌లోని బంగారు మైసమ్మ ఆలయాన్ని దేవదాయ శాఖ తమ అధీనంలోని తీసుకుంది. ఈ మేరకు బుధవారం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సంధ్యారాణి, ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఆలయాన్ని సందర్శించి బోర్డును పాతారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ సంధ్యారాణి మాట్లాడుతూ... దాదాపు 1600 గజాలు విస్తీర్ణంలో అతి పురాతనమైన ఆలయంగా పేరుందన్నారు. ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేయగా తన వంతు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

ఏకలవ్య కార్పొరేషన్‌కు రూ. 500 కోట్లు కేటాయించాలి

కాచిగూడ: సామాజికంగా, రాజకీయంగా, అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న ఎరుకల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏకలవ్య కార్పొరేషన్‌ను ప్రకటించడం అభినందనీయమని ఎకలవ్య సంఘం చైర్మన్ సుల్తాన్ యాదగిరి అన్నారు. ఎకలవ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించినందున సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రూ. 500 కోట్లతో ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నేతలు కురాకుల కృష్ణ, బుడ్డ సత్యనారాయణ, బనాపురం రఘు, రాంపల్లి నర్సింహ, మల్లికార్జున్, సాయి తదితరులు పాల్గొన్నారు.

చేనేత వృత్తి కళాకారుల సంక్షేమానికి నిధులు కేటాయించాలి

కాచిగూడ: చేనేత వృత్తి కళాకారుల సంక్షేమం, అభివృద్ధి కోసం బడ్జెట్‌లో రూ. 2500 కోట్లు కేటాయించాలని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నారాయణగూడ పద్మశాలీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కులాన్ని యూనిట్‌గా తీసుకొని పద్మశాలీ కార్పొరేషన్ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

నేరుగా వచ్చి ఆత్మహత్యాయత్నం

ఫోన్ మాట్లాడుతూ ట్రాక్‌పైకి వచ్చింది

జన్మభూమి ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్ విజయ్‌రామ్ వాంగ్మూలం



సాక్షి ప్రతినిధి, గుంటూరు:'గుంటూరు నుంచి 12.05 గంటల ప్రాంతంలో తెనాలి స్టేషన్ దగ్గరకు వచ్చేసరికి అప్పటివరకూ ఫోన్ మాట్లాడుతూ ట్రాక్ పక్కన నిలబడిన యువతి ఒక్కసారిగా ట్రాక్ పైకి వచ్చేసింది. ఆమెను తప్పుకోమని అరుస్తూ ఎమర్జెన్సీ బ్రేక్ వేశా. అయితే అప్పటికే రైలు ఇంజన్ ఆమెకు తగిలింది. స్పృహ తప్పి పడిపోయిన ఆమెను ప్రయాణికుల సహకారంతో ట్రైన్ ఎక్కించుకుని తెనాలి స్టేషన్‌లో స్టేషన్ మాస్టర్‌కు అప్పగించా'నని జన్మభూమి ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్ విజయ్‌రామ్ జీఆర్‌పీ పోలీసులకు అప్పుడే స్టేట్‌మెంట్ ఇచ్చారు. రైల్వే స్టేషన్ మాస్టర్ దగ్గర ఉన్న పుస్తకంలో కూడా ప్రమాదానికి సంబంధించిన వివరాలను నమోదు చేశారు. సోషల్ మీడియా ట్రోలింగ్‌లకు గీతాంజలి ఈ నెల ఏడున రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేయడం ఆ తర్వాత చికిత్స పొందుతూ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై తెలుగుదేశం సోషల్ మీడియాలోనూ, అఫిషియల్ మీడియాలో కూడా ఈ వ్యవహారాన్ని తప్పుదోవ పట్టించేలా కామెంట్స్ పెడుతున్నారు. ఎవరో ఇద్దరు వ్యక్తులు ఆమెను రైలు కిందకు తోసేసి పరారు అయ్యారంటూ ఒక వీడియోలో ఇద్దరు మాట్లాడుకుంటున్నట్లుగా చూపిస్తూ మార్ఫింగ్ వీడియోని సర్క్యులేట్ చేస్తున్నారు. దీనిని ఎడిట్ చేసి బయటకు వదిలినట్లుగా పోలీసుల విచారణలో స్పష్టం అయ్యింది. ఈ వీడియోను సర్క్యులేట్ చేసింది ఎవరు? అనేదానిపై కూడా విచారణ జరుపుతున్నారు. చనిపోయిన తర్వాత కూడా వదలకుండా ఆమె వ్యక్తిత్వాన్ని తప్పు పట్టేవిధంగానే తెలుగుదేశం సోషల్‌మీడియాలో బురదజల్లుతోంది. లోకోపైలట్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌తో అసలు ఈ వ్యవహారంలో ఎవరి ప్రమేయం లేదని, ఆమె ఒక్కతే వచ్చి ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు స్పష్టం అవుతోంది. అయినా తెలుగుదేశం చేస్తున్న తప్పుడు ఆరోపణల నేపథ్యంలో పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. తెనాలి డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో పోలీసుబృందం బుధవారం సంఘటనా స్థలానికి వెళ్లి అక్కడ చుట్టుపక్కల వారిని విచారించింది. దగ్గరలో ఏమైనా సీసీ కెమెరాలు ఉన్నాయా అన్న విషయాన్ని ఆరా తీసింది. సోషల్‌మీడియా ట్రోలింగ్‌ల నేపథ్యంలో మృతి చెందినట్లు ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు నేపథ్యంలో ట్రోలింగ్‌కు పాల్పడిన హ్యాండిల్స్‌ను గుర్తించి బాధ్యులను అదుపులోకి తీసుకునే దిశగా పోలీసు బృందాలు తమ విచారణ వేగవంతం చేశాయి. ఒక బీసీ మహిళను వేధించి ఆత్మహత్యకు పురిగొల్పడమే కాకుండా చనిపోయిన తర్వాత కూడా ఈ విధంగా ట్రోల్ చేయడాన్ని తెలుగుదేశం పార్టీలోనే కొందరు తప్పు పడుతున్నారు.

నాడు రిషితేశ్వరిని ఇలాగే పొట్టన పెట్టుకున్నారు

నాడు రిషితేశ్వరి నుంచి నేటి గీతాంజలి వరకూ పచ్చమూకల వికృత చర్యలకు బలైపోయిన వారే. తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, సోషల్ మీడియా ఎవరిని తీసుకున్నా వారికి ముందు నుంచి మహిళలంటే చిన్నచూపే. 2015లో గుంటూరు జిల్లాలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్కిటెక్చర్ విద్యార్థిని ఎం. రిషితేశ్వరి ర్యాగింగ్‌కు గురై యూనివర్సిటీ వసతి గృహంలో ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. బీసీ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థిని ఆత్మహత్యకు కారణమైన యూనివర్సిటీ అధికారులు, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోకుండా అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా మౌనం వహించింది. విద్యార్థిని మృతికి కారణమైన అప్పటి ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.బాబురావుతోపాటు అప్పుడు యూనివర్సిటీ పరిపాలనలో ఉన్న ఉన్నతాధికారులపై కేసు నమోదు చేయాలని, రిషితేశ్వరి కుటుంబానికి న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమం చేశాయి. బలహీన వర్గాల విద్యార్థినికి న్యాయం చేసేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వప్రయత్నించకపోగా న్యాయం కోసం ఉద్యమిస్తున్న వారిని అడ్డుకుంది. రిషితేశ్వరి మరణానికి కారకులపై చర్యలు తీసుకోవాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఉద్యమం చేస్తున్నాయనే కారణంతో ప్రభుత్వం, యూనివర్సిటీ ఉన్నతాధికారులు యూనివర్సిటీ విద్యార్థి సంఘాలను నిషేధించారు. యూనివర్సిటీలో ఉన్న విద్యార్థి సంఘాల బోర్డులను సైతం తొలగించారు. ఉద్యమాన్ని అణిచేందుకు ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నించింది. విద్యార్థిని ఆత్మహత్యలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను రక్షించేందుకు టీడీపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అప్పట్లో ప్రజాసంఘాలు బహిరంగంగానే ఆరోపణలు చేశాయి. విచారణ కమిటీల పేరుతో కాలయాపన చేసింది. రిషితేశ్వరి ఆత్మహత్యపై కథనాలు రాస్తున్నారనే అక్కసుతో కొందరు మీడియా ప్రతినిధులపై కేసులు నమోదు చేస్తామని కూడా బెదిరించారు. రాష్ట్రంలో బలహీన వర్గాల మహిళల ప్రాణాలకు రక్షణ లేదని రిషితేశ్వరి మరణానికి కారకులపై చర్యలు తీసుకోవాలని, చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకమైన నిర్లక్ష్యం వీడాలని అప్పట్లో ఎమ్మెల్యే ఆర్కే రోజాతోపాటు పలువురు అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలదీశారు. తప్పనిసరి పరిస్థితుల్లో టీడీపీ ప్రభుత్వం అప్పటి ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.బాబురావుపై చర్యలు తీసుకుందే తప్ప చిత్తశుద్ధితో వ్యవహరించలేదు. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా కూడా బుద్ధి మార్చుకోలేదు.

ముఖ్యమంత్రి ప్రసంగంలో తప్పేముంది?

- జన్మభూమి కమిటీలను, వలంటీర్లతో పోల్చి మాట్లాడటం తప్పెలా అవుతుంది?
- వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనాలో వద్దో తేల్చాల్సింది ఎన్నికల సంఘమే
- స్పష్టం చేసిన హైకోర్టు ధర్మాసనం
- వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉండాలని ఆదేశాలిచ్చామన్న ఈసీ
- అలా అయితే విచారించేందుకు ఏమీ లేదన్న ధర్మాసనం.. పిల్ కొట్టివేత



సాక్షి, అమరావతి: పల్నాడు జిల్లాలో ఇటీవల నిర్వహించిన గ్రామ, వార్డు వలంటీర్ల అవార్డుల ప్రదాన కార్యక్రమంలో ప్రతిపక్ష నేతను విమర్శిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రసంగాన్ని చట్ట విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టేసింది. ముఖ్యమంత్రి ప్రసంగాన్ని చట్ట విరుద్ధంగా ప్రకటించడం ఏమిటంటూ హైకోర్టు ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి తన ప్రసంగంలో గత ప్రభుత్వంలో ఏర్పాటైన జన్మభూమి కమిటీలను, ప్రస్తుతం తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థను పోల్చారని, దీనిని తామెలా తప్పుపట్టగలమని ప్రశ్నించింది. అలా పోలిక తేవడానికి వీల్లేదంటారా అంటూ నిలదీసింది. సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడం ద్వారా ప్రజలకు వలంటీర్లు మంచి పని చేయడంలేదా? మంచి చేసిన వాళ్లను సన్మానించకూడదా అని పిటిషనర్‌ను ప్రశ్నించింది. ఈ కార్యక్రమానికి ఖర్చు చేసిన మొత్తాన్ని ముఖ్యమంత్రి నుంచి వసూలు చేయాలని ఎలా కోరతారు అంటూ ప్రశ్నించింది. వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనాలా? వద్దా? అన్నది నిర్ణయించాల్సింది కేంద్ర ఎన్నికల సంఘమే తప్ప, తాము కాదని హైకోర్టు తేల్చి చెప్పింది. అందులో జోక్యం చేసుకోలేమంది. వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనకూడదని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ఇప్పటికే ఆదేశాలు ఇచ్చిందని సీఈసీ తరఫు సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ హైకోర్టుకు వివరించారు. పోలింగ్ ఏజెంట్లుగా కూడా వ్యవహరించడానికి వీల్లేదని చెప్పామని, ఈ విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశామని తెలిపారు. వలంటీర్ల విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టమైన నిర్ణయం తీసుకున్నందున, ఈ వ్యాజ్యంలో విచారించేందుకు ఏమీ లేదని హైకోర్టు తేల్చి చెప్పింది. పిల్‌ను కొట్టేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల్లో వలంటీర్లకు ఎలాంటి విధులు అప్పగించకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ప్రకాశం జిల్లా అన్నంభొట్లవారి పాలెం గ్రామానికి చెందిన చెన్నుపాటి సింగయ్య హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే.

ఏపీలో 2018 గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష రద్దు

తిరిగి పరీక్ష నిర్వహించాలని హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) 2018లో నిర్వహించిన గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష మాన్యువల్ మూల్యాంకనాన్ని హైకోర్టు చట్ట విరుద్ధంగా, ఏకపక్ష చర్యగా ప్రకటించింది. మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని తేల్చింది. అందువల్ల గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష మొత్తాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపింది. తిరిగి మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని అధికారులను ఆదేశించింది. నిబంధనల ప్రకారమే సమాధాన పత్రాలను మూల్యాంకనం చేయాలని చెప్పింది. పరీక్ష నిర్వహణకు ముందు అభ్యర్థులకు కనీసం రెండు నెలల సమయం ఇవ్వాలని ఆదేశించింది. మొత్తం ప్రక్రియను ఆరు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించింది. 2022 మే 26న ఏపీపీఎస్సీ ప్రకటించిన అర్హుల జాబితాను కూడా రద్దు చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు బుధవారం తీర్పు వెలువరించారు.

డామిట్..

అడ్డం తిరిగిందే!

తమ వాళ్లకే సీట్లు ఇప్పించాలనుకున్న చంద్రబాబు ప్లాన్‌కు గండి

- జనసేనలో అంతా బాబు చెప్పినట్టే జరుగుతోందంటున్న టీడీపీ వర్గాలు
- బీజేపీ విషయంలోనూ అదే వ్యూహం.. జీవీఎల్‌కు టికెట్ లేకుండా చేసే యోచన
- నరసాపురం బీజేపీ ఖాతాలో వేసి రఘురామకు ఇప్పించే ఎత్తుగడ విఫలం
- చర్చల్లో బాబు స్పాన్సర్డ్ నాయకులు లేకుండా కమలనాథుల జాగ్రత్తలు
- ఇవన్నీ చూసి కథ అడ్డం తిరిగిందని తలపట్టుకుంటున్న బాబు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

16న వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రకటన

ఒకేసారి 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాలకు ప్రకటించనున్న ఏపీ సీఎం జగన్

సాక్షి, అమరావతి: పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చేందుకు మరోసారి చారిత్రక విజయంతో అధికారంలోకి రావడమే లక్ష్యంగా ఎన్నికల సమరభేరి మోగించేందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధమయ్యారు. జనబలమే గీటురాయిగా, సామాజిక న్యాయమే పరమావధిగా ఇప్పటికే శాసనసభ, లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తల నియామక ప్రక్రియను దాదాపుగా పూర్తి చేశారు. ఒకవైపు టీడీపీ–జనసేన–బీజేపీ కూటమిలో సీట్ల పంపకాలు, అభ్యర్థుల ఎంపికపై అసమ్మతి సెగలు పొగలు కక్కుతుండగా రెట్టించిన ఉత్సాహంతో అభ్యర్థులను ఖరారు చేసి కదనరంగంలోకి దూకేందుకు వైఎస్సార్ సీపీ సన్నద్ధమైంది. ఈమేరకు ఈనెల 16వతేదీన వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలోని దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్‌వద్ద 2019 ఎన్నికల తరహాలోనే ఒకేసారి 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను సీఎం జగన్ ప్రకటించనున్నారు. ఆ వెంటనే ఈనెల 18 నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. రోజుకు రెండు లేదా మూడు సభలు, రోడ్ షోలు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధమైంది. రోజూ ఒకే ప్రాంతంలో కాకుండా వేర్వేరు చోట్ల బహిరంగ సభలు, రోడ్ షోలు నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు.

ఉరిమే ఉత్సాహంతో..

ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో భీమిలి(ఉత్తరాంధ్ర), దెందులూరు(ఉత్తర కోస్తా), రాప్తాడు (రాయలసీమ), మేదరమెట్ల(దక్షిణ కోస్తా)లో నిర్వహించిన సిద్ధం సభల ద్వారా వైఎస్సార్ సీపీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేశారు. ఆ సభలకు జనం పోటెత్తడం, ఒకదానికి మించి మరొకటి గ్రాండ్ సక్సెస్ కావడంతో ఉరిమే ఉత్సాహంతో కదనరంగంలోకి దూసుకెళ్లడానికి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు సిద్ధంగా ఉన్నారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేయడం ద్వారా సీఎం వైఎస్ జగన్ విశ్వసనీయతను చాటుకున్నారు. ఈ ఎన్నికల్లోనూ అమలు చేయగలిగే హామీలతో మేనిఫెస్టో రూపకల్పనపై కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం అది తుది దశకు చేరుకుంది. అభ్యర్థులను ప్రకటించిన వెంటనే మేనిఫెస్టోను విడుదల చేసి ప్రచార భేరి మోగించాలని సీఎం జగన్ నిర్ణయించారు. టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి అభ్యర్థులను ప్రకటించేలోగా ప్రచారంలో దూసుకెళ్లే దిశగా అడుగులు వేస్తున్నారు.

చేసిన మంచిని వివరిస్తూ.. మోసాలను ఎండగడుతూ

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గత 58 నెలలుగా సీఎం వైఎస్ జగన్‌తోపాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, శ్రేణుల్లో ప్రజల్లోనే ఉన్నారు. జనంతో మమేకమవుతూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నారు. సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా 87 శాతం కుటుంబాల ఖాతాల్లో డీబీటీ రూపంలోనే రూ.2.65 లక్షల కోట్లను సీఎం వైఎస్ జగన్ నేరుగా జమ చేశారు. పరిపాలన వికేంద్రీకరణ, సచివాలయాలు–వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను పారదర్శకంగా ఇంటి గుమ్మం వద్దే అందిస్తున్నారు. వీటితోపాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన అంశాన్ని సీఎం వైఎస్ జగన్ ప్రచారపర్వంలో వివరించనున్నారు.

నగర వార్తలు

వారాల ఆనంద్‌కు స్టార్ సెలబ్రిటీ అవార్డు



స్టార్ సెలబ్రిటీ అవార్డును పొందిన వారాల ఆనంద్, ఇతర అవార్డులు పొందిన వారితో స్టార్ ఆస్పత్రి డాక్టర్లు

రాయదుర్గం: వరల్డ్ కిడ్నీ డేను పురస్కరించుకొని నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని స్టార్ హాస్పిటల్‌లో ప్రపంచ కిడ్నీ దినోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఏటా అందించే స్టార్ సెలబ్రిటీ అవార్డులను కిడ్నీ మార్పిడి చేయించుకొని ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన వారికి ప్రదానం చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, కవి, రచయిత, షార్ట్ ఫిల్మ్ డాక్యుమెంటరీ మేకర్ అయిన వారాల ఆనంద్‌కు ప్రముఖ మూత్రపిండ మార్పిడి నిపుణులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ జ్యోత్స్న చేతుల మీదుగా స్టార్ సెలబ్రిటీ అవార్డును అందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డాక్టర్లు శ్రీధర్, జ్యోత్స్న మాట్లాడుతూ కిడ్నీ వ్యాధి చికిత్సలో అత్యాధునిక సాంకేతిక సేవలు అందుబాటులో వచ్చాయన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు బయపడాల్సిన అవసరం లేదన్నారు. ఈ వ్యాధిని ముందుగా గుర్తించడం వలన మెరుగైన చికిత్స, మరణాల నివారణకు వీలు ఉన్నప్పటికీ, సాధారణంగా ఈ సీకేడీ వ్యాధి పట్ల ప్రజలకు మెరుగైన సమాచారం అందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అందుకోసమే స్టార్ ఆస్పత్రి ద్వారా ప్రపంచ కిడ్నీ దినోత్సవ వేడుకల్లో పోస్ట్ ట్రాన్స్‌ప్లాంట్ సర్వైవర్స్‌తో పరస్పర చర్య ద్వారా కిడ్నీ వ్యాధికి సంబంధించిన అనేక అంశాలపై అవగాహన కలిగిస్తున్నామని చెప్పారు. అనంతరం పలువురికి కూడా ఇతర అవార్డులను అందించారు. పలువురు డాక్టర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఎండలు మండిపోతున్నా.. సందర్శకులు దండిగా వస్తూ..!



చార్మినార్ ప్రాంగణంలో సేద తీరుతున్న పర్యాటకులు

చార్మినార్: మండే ఎండలను సైతం లెక్కచేయని పర్యాటకులు దండిగా తరలివస్తున్నారు. పాతబస్తీలోని చార్మినార్, మక్కా మసీదు, సాలార్‌జంగ్ మ్యూజియం, హెచ్‌ఈహెచ్ నిజాం మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్ మ్యూజియంలు సందర్శకులతో కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా పాత బస్తీలోని మ్యూజియంలకు పర్యాటకుల నుంచి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. వీకెండ్‌లో సందర్శకుల సంఖ్య మరీ రెట్టింపు అవుతోంది. మధ్యాహ్నం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో కొద్దిగా తగ్గుతున్న పర్యాటకుల సంఖ్య ఉదయం, సాయంత్రం వేళల్లో ఎక్కువవుతోంది. దీంతో పాత నగరంలోని పర్యాటక ప్రాంతాల వద్ద స్థానిక వ్యాపారులకు సైతం గిరాకీ పెరిగింది.

ప్రత్యేక ప్యాకేజీల కింద బుకింగ్

మ్యూజియంలను సందర్శించడానికి తెలంగాణ టూరిజం శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పాతబస్తీలోని పలు చరిత్రాత్మక కట్టడాలను ప్రత్యేక ప్యాకేజీ కింద బుకింగ్ చేయించుకునే అవకాశాలు కల్పించింది. సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. దీంతో ప్రతి రోజు సందర్శకులు అత్యధిక సంఖ్యలో పాతనగరానికి వస్తున్నారు. వీరికి తోడు ప్రైవేటు వాహనాలతోపాటు సొంత వాహనాల్లో పాతబస్తీలోని మ్యూజియంలను సందర్శించడానికి క్యూ కడుతున్నారు.

సందడిగా సాలార్‌జంగ్ మ్యూజియం

దారుషిఫా చౌరస్తాకు సమీపంలో మూసీనది పక్కన 1968లో నూతనంగా నిర్మించిన భవనంలోకి సాలార్‌జంగ్ మ్యూజియన్ని మార్చినప్పటి నుంచి సందర్శకుల సందడి పెరిగింది. 1, 2, 3 సాలార్‌జంగ్‌లు భారతదేశంతోపాటు విదేశాల నుంచి సేకరించిన దాదాపు 48 వేల కళాఖండాలను మ్యూజియంలో పొందుపరిచారు. రెబేకా (పాలరాతి ముసుగు సుందరి) గంటలు కొట్టే గడియారంలతోపాటు చైనా, జపనీస్, యూరోపియన్ పెయింటింగ్‌లతో కూడిన గ్యాలరీలు, అరుదైన కళాఖండాలు మ్యూజియంలో సందర్శకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి.

బస్సుల్లో తరలింపు


ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సాధారణ, ఏసీ బస్సుల్లో ప్రత్యేక ప్యాకేజీల కింద పర్యాటకులను పురానీహవేలీలోని హెచ్‌ఈహెచ్ నిజాం మ్యూజియానికి తరలిస్తున్నారు. 1911లో రాజ్యాధికారం చేపట్టిన ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ తన పాతికేళ్ల పరిపాలనను పురస్కరించుకొని అప్పట్లో విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. దేశ, విదేశాల నుంచి ఎందరో ప్రముఖులు హాజరై బహుమతులు అందజేశారు. వీటన్నింటిని ఒక దగ్గర చేర్చి ప్రజల సందర్శనార్థం పురానీహవేలీలో నిజాం మ్యూజియంను ఏర్పాటు చేశారు.

పాతబస్తీలోని పర్యాటక కేంద్రాల్లో సందడి

- తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు
- మ్యూజియంలకు పెరుగుతున్న ఆదరణ
- వీకెండ్‌లో ఎక్కువగా పర్యాటకుల రాక

గోల్కొండ కోటకు పెరిగిన సందర్శకులు

గోల్కొండ: పర్యాటక ప్రాంతమైన గోల్కొండ కోట బుధవారం పర్యాటక శోభను సంతరించుకుంది. వివిధ ప్రాంతాల నుంచి కోట దర్శనానికి పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివచ్చారు. కోటలో ఎటు చూసిన పర్యాటకులే కానవచ్చారు. ముఖ్యంగా రాణిమహల్, నగీనాబాగ్, క్లాపింగ్ పోర్టిపో తదితర ప్రాంతాల్లో పర్యాటకులు పోటాపోటీగా సెల్ఫీలు దిగుతూ సంబరపడ్డారు. క్లాపింగ్ పోర్టికోలోని ఎత్తైన ప్రదేశంలో అమర్చబడ్డ భారీ ఫిరంగి వద్ద ఫోటోలు దిగడానికి పర్యాటకులు బారులు తీరారు. యువ జంటలు మేమంటే మేమంటూ ఫోజులు ఇస్తు సెల్ఫీలు దిగారు.



కోటలో పర్యాటకుల సందడి

గౌడలకు రెండు ఎంపీ స్థానాలు కేటాయించాలి

- తెలంగాణ గౌడ, కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ డిమాండ్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు గౌడలకు రెండు ఎంపీ స్థానాలను కేటాయించాలని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగొని బాలరాజ్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ గడ్డమీది విజయ్‌కుమార్‌గౌడ్, గౌడ సంఘం ఉపాధ్యక్షులు పోతగాని అయిలన్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో గౌడలు క్రియాశీలకంగా భాగస్వాములయ్యారని తెలిపారు. రాష్ట్రంలో 40 లక్షల మంది గౌడ జనాభా ఉందని, అయితే రాజకీయ ప్రాధాన్యత ఉంటేనే గౌడ సామాజిక వర్గం అభివృద్ధి చెందుతుందని అన్నారు. గౌడలకు గతంలో ముగ్గురు పార్లమెంటు సభ్యులు ఉండేవారని, ఇప్పుడు ఒకరు కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి పార్టీ రెండు ఎంపీ సీట్లను కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికే బీజేపీ ఒక స్థానాన్ని కేటాయించిందని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో తగిన ప్రాధాన్యత కల్పించని పార్టీలను ఎండగడతామని హెచ్చరించారు.



మీడియాతో మాట్లాడుతున్న బాలరాజ్‌గౌడ్, వెంకన్నగౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్

కుల సర్వేకు వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలి

- అఖిలపక్ష, కుల సంఘాల సదస్సు డిమాండ్

కాచిగూడ: లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ ముందే కుల సర్వేకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి అధ్యక్షతన అఖిల పక్ష, కుల సంఘాల సదస్సు బుధవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్ హోటల్‌లో జరిగింది. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, ప్రొఫెసర్ కోదండరామ్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, ప్రొఫెసర్ మురళీ మనోహర్, ప్రొఫెసర్ సుదర్శన్‌రావు, ప్రొఫెసర్ సత్యనారాయణ, ప్రొఫెసర్ ప్రభంజన్ కుమార్, ఆచార్య ఎం.భాగయ్య, కె.పి.మురళీకృష్ణ మాట్లాడారు. కుల సర్వే త్వరితగతిన చేపట్టకపోతే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లు గల్లంతయ్యే అవకాశం ఉందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని అఖిలపక్షం ఆధ్వర్యంలో కలిసి మరోసారి విన్నవించాలని సమావేశంలో తీర్మానించారు. రాష్ట్రంలోని ప్రజలందరి వివరాలు కులాలవారీగా రాష్ట్ర ప్రభుత్వం సేకరించబోయే సామాజిక, ఆర్థిక, కుల సర్వే కార్యాచరణకు మార్గదర్శకాలతో ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. సమావేశంలో సుమారు 70 కుల సంఘాలకు చెందిన ప్రతినిధులు, న్యాయవాదులు, వైద్యులు, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.



సదస్సులో కోదండరామ్, కృష్ణమోహన్ రావు, దుంద్ర కుమారస్వామి తదితరులు

అలరిస్తున్నాయి.. ఆదరిస్తున్నారు!



నగరంలో పుంజుకుంటున్న లైవ్ కన్సర్ట్స్


- సిద్ధమతున్న మరికొన్ని తెలుగు కచేరీలు
- మండువేసవిలో సేద తీరుతున్న సంగీతప్రియులు

సాక్షి, సిటీబ్యూరో: అద్భుత సాహిత్యానికి, అధునాతన సంగీత వాయిద్యాల జోరు తోడైతే..! ఇంకా చెప్పేదేముంది... ఇక మ్యూజిక్ లవర్స్‌కు పండుగే పండుగ. ఇప్పుడు అలాంటి పండుగలు లైవ్ కన్సర్ట్స్ రూపంలో నగరవాసులను అలరిస్తున్నాయి. లైవ్ మ్యూజిక్ కన్సర్ట్స్ సంగీత ప్రియులను మ్యాజిక్ చేస్తున్నాయి. వాటిని సంగీతప్రియులు కూడా అమితంగా ఆదరిస్తున్నారు. ఒకప్పుడు ఉత్తరాదిలో విరివిగా జరిగే ఈ ఈవెంట్లకు ఇప్పుడు హైదరాబాద్‌కు విస్తరించాయి. సన్‌బర్న్ వంటి అంతర్జాతీయ సంగీత వేడుకలు మొదలు పాన్ ఇండియా సింగింగ్ స్టార్స్ వరకు జరిగే పలు రకాల కన్సర్ట్స్ వైపు ఆసక్తి చూపుతున్నారు. నగరంలో కోవిడ్ అనంతరం వీటి సంఖ్య మరింతగా పెరిగింది. ప్రతీ నెలలో కనీసం ఒకటీ, రెండైనా చిన్నా, పెద్దా లైవ్ కన్సర్ట్‌లు జరుగుతున్నాయి. తాజాగా వేసవి నేపథ్యంలో నగరంలో పలు లైవ్ మ్యూజిక్ కన్సర్ట్స్‌కు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మార్చి నెలలోనే దాదాపు నాలుగు లైవ్ కన్సర్ట్‌లు జరుగుతుండటం విశేషం. ఇందులో భాగంగా ప్రముఖ మ్యూజిక్ బ్యాండ్‌లు కేఫ్, రిసార్ట్ వేదికగా కన్సర్ట్‌లను నిర్వహిస్తుండగా వివిధ భాషల్లో టాప్ ప్లే బ్యాక్ సింగర్‌గా ప్రఖ్యాతిగాంచిన టాలీవుడ్ సినీ గాయని సునీత గాత్రంతో శిల్పకళా వేదికగా ప్రత్యేకమైన ఈవెంట్ జరగనుంది. ఇదే నెలలో విశాల్ మిశ్రా కన్సర్ట్, ఎక్స్–ఫెస్టివల్ వంటి పలు సంగీత కార్యక్రమాలకు వేదికలు సిద్ధమయ్యాయి.

ఇప్పుడు తెలుగు కన్సర్ట్స్ న్యూట్రెండ్..

భాగ్యనగరం అన్ని రంగాలతోపాటు లైవ్ మ్యూజిక్ కన్సర్ట్స్‌కు స్వర్గధామంగా మారింది. ఒకప్పుడు నార్త్ నుంచి వచ్చే బ్యాండ్స్‌కు ఇక్కడ ఆదరణ ఎక్కువ ఉండేది. కానీ, కోవిడ్ అనంతరం తెలుగు ఆర్గానిక్ ప్రత్యక్ష సంగీత కచేరీలు కూడా విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. బెంగుళూరు, చెన్నై నుంచి సైతం సంగీతప్రియులు ఇక్కడి కన్సర్ట్స్‌కు ఆసక్తి చూపించడం విశేషం.

ఊహించని రిటర్న్ గిఫ్ట్ ఇస్తా...



చివరగా 2019లో లైవ్ కన్సర్ట్ చేశాను. మళ్లీ ఈ నెల 23వ తేదీన శిల్పకళా వేదికగా ఎస్‌వీఎం గ్రాండ్ ఆధ్వర్యంలో జరిగే అతిపెద్ద సంగీత కార్యక్రమంలో పాడనున్నాను. దీనికి సంబంధించిన టికెట్లు ఇప్పటికే 90 శాతం వరకు అమ్ముడుపోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది. తెలుగు లైవ్ కన్సర్ట్‌కు ఇంతటి ఆదరణ లభించడం వల్ల భవిష్యత్‌లో మరిన్ని తెలుగు కన్సర్ట్ సంఖ్య పెరగడానికి ఆస్కారముంది. ఇంతటి ఆదరణ అందిస్తున్న తెలుగు సంగీత ప్రియులకు ఇదే వేదిక పై వారు ఊహించని ఒక రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలని నిశ్చయించుకున్నాను.


–ప్రముఖ సినీ గాయని సునీత

సాక్షి
ఫ్యామిలీ
హైదరాబాద్
గురువారం ॥ 14-3-2024

కొత్తదారి

కార్పొరేట్ ప్రపంచంలో మూడు దశాబ్దాల పాటు పనిచేసిన హరియాణాలోని గురుగ్రామ్‌కు చెందిన సీమా సేథ్ ఇక ఆ రంగంలో మరింత ముందుకు వెళ్లాలనుకోలేదు. ఒకసారి వెనక్కి తిరిగి చూసింది. ఒక రోజు ఒక ఆటోడ్రైవర్‌తో మాట్లాడుతున్నప్పుడు చదువుకు దూరమైన నిరుపేద పిల్లల గురించి తెలుసుకుంది. ఈ క్రమంలో కార్పొరేట్ ప్రపంచాన్ని వదిలి 'నయీ దిశ' పేరుతో స్వచ్ఛంద సంస్థను ప్రారంభించి కొత్త దారిలో ప్రయాణిస్తోంది. అట్టడుగు వర్గాలకు చెందిన పిల్లలను విద్యావంతులను చేస్తోంది. తాను కూడా టీచర్‌గా మారి పిల్లలకు పాఠాలు చెబుతోంది....


సీమా సేథ్



కార్పొరేట్ రంగం నుంచి కార్మిక లోకానికి...

'ఇంజినీర్ కావాలనేది నా లక్ష్యం' అంటున్న బప్పన్ దాస్ 'నయీ దిశ' గురించి ఎంతో గొప్పగా మాట్లాడుతాడు. బప్పన్ తొమ్మిది నెలల వయసు ఉన్నప్పుడు తల్లిదండ్రులు ఉపాధి వెదుక్కుంటూ పశ్చిమ బెంగాల్ నుంచి గురుగ్రామ్‌కు వచ్చారు. 'ఈరోజు తిండి దొరికితే చాలు' అన్నట్లుగా ఉండేది వారి ఆర్థిక పరిస్థితి. దీంతో చదువు మాట అటుంచి బప్పన్ కనీసం బడి ముఖం కూడా చూడలేకపోయాడు.

'నయీ దిశ' పుణ్యమా అని బప్పన్ ఎనిమిది సంవత్సరాల వయసులో బడిలోకి అడుగు పెట్టాడు.

'సీమా మేడమ్ నుంచి పాఠాలు వినడమే కాదు ఆమెతో కలిసి ఆడుకున్నాం. సరదాగా ఎన్నో ప్రాంతాలు తిరిగాం' అంటాడు బప్పన్.

బడి అంటే భయపడే స్థితి నుంచి బడికి ఇష్టంగా వెళ్లడం వరకు బప్పన్‌ను మార్చివేసింది సీమ.

'నిరుపేద పిల్లల జీవితాల్లో మార్పు తెచ్చే ప్రయత్నం చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఒక మార్గం మరో మార్గంలోకి తీసుకువెళ్లి మరిన్ని మంచిపనులు చేయిస్తుంది' అంటుంది సీమ.

ఉద్యోగం చేస్తున్న రోజుల్లో ప్రతి రోజూ సాయంత్రం సికిందర్‌పూర్‌లోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి పిల్లలకు ఇంగ్లీష్ పాఠాలు బోధించేది. ఈ పని తనకు ఎంతో ఉత్సాహాన్ని, బలాన్ని ఇచ్చేది. తనను రోజూ స్కూల్‌కు తీసుకెళ్లే ఆటోడ్రైవర్ 'పిల్లలకు పాఠాలు చెప్పడానికి డబ్బులు తీసుకుంటారా?' అని అడిగాడు.

'లేదు' అని చెప్పింది సీమ.

తాను ఉండే కాలనీ పేరు చెప్పి 'అక్కడ చాలా మంది పిల్లలు బడికి వెళ్లడం లేదు' అని చెప్పాడు.

'ఎందుకు?' అని అడిగింది సీమ.

'పిల్లలను బడికి పంపించే స్తోమత తల్లిదండ్రులకు లేదు' అని చెప్పాడు ఆటోడ్రైవర్. ఆ తరువాత...

'మేడమ్... మీరు అక్కడ స్కూల్ పెట్టండి. ఎంతో మంది పిల్లలు చదువుకొని బాగుపడతారు' అన్నాడు ఆటోడ్రైవర్.

సీమ ఆలోచనలో పడింది.

ఆ తరువాత ఆసక్తి పెరిగింది. 'మీ కాలనీలో స్కూల్ ఎక్కడ స్టార్ట్ చేయాలో చెబితే అక్కడే చేస్తాను' అన్నది సీమ. ఆటోడ్రైవర్ నివసించే పేద ప్రజల కాలనీలో ఒక గోదాములో సీమ స్కూల్ స్టార్ట్ చేసింది. 35 మంది పిల్లలతో 'నయీ దిశ' ప్రస్థానం మొదలైంది. కొద్దిమంది పిల్లలతో ఒక గదిలో మొదలైన స్కూల్ ఆ తరువాత వందమంది పిల్లలతో ఎనిమిది గదుల్లోకి విస్తరించింది.

గురుగ్రామ్‌లోని వివిధ కళాశాలలలో చదివే విద్యార్థులు ఈ స్కూల్‌కు వచ్చి కంప్యూటర్ నుంచి థియేటర్ వరకు ఎన్నో విషయాలు బోధిస్తున్నారు. విద్యాసంబంధమైన కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా 'నయీ దిశ' కేంద్రంగా మారింది.

వినే వారు తప్పకుండా ఉంటారు

మన మనసులో మంచి ఆలోచన ఉన్నప్పుడు, అది వినడానికి ఈ విశ్వంలో ఎవరో ఒకరు తప్పనిసరిగా ఉంటారు. 'ఆలోచన బాగానే ఉంది గానీ.. అసలు ఇది నెరవేరుతుందా...' అనుకున్న ఎన్నో ఆలోచనలు నెరవేరాయి. మంచి పని కోసం ప్రయాణం ప్రారంభించినప్పుడు దారే తన వెంట తీసుకువెళుతుంది. ఎన్ని అవరోధాలు ఉన్నా వాటంతట అవే తొలగిపోతాయి.

– సీమ, నయీ దిశ-వ్యవస్థాపకురాలు

'నయీ దిశ' స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎంతో మంది నిరుపేద పిల్లలకు అకాడమిక్ పునాదిని ఏర్పాటు చేసింది సీమ. ఇప్పుడు ఆ పునాది మీదే పిల్లలు ఎన్నో కలలు కంటున్నారు.

'తమ పిల్లల్లో వచ్చిన మార్పును చూసి తల్లిదండ్రులు సంతోషించారు. నయీ దిశ పిల్లలకు ఎంత విలువ ఇస్తుందో దగ్గరనుంచి చూశారు. పిల్లలకు బడి అంటే స్వేచ్ఛ అనుకునేలా చేశాం. పిల్లలు తమ మనసులోని భావాలను అందంగా వ్యక్తీకరించడం నుంచి ఇంగ్లీష్‌లో మాట్లాడడం వరకు ప్రతి క్షణం అభ్యాస వేడుకే' అంటుంది సీమ.

'మొదటి నుంచీ పిల్లలకు ఎన్నో సబ్జెక్ట్‌లు బోధిస్తూ వారి ఎదుగుదలను చూశాను. మొదట్లో క్రమశిక్షణా రాహిత్యంతో ఉండే పిల్లలు... కాలక్రమేణా మాట, మర్యాద నేర్చుకున్నారు' అంటుంది 'నయి దిశ' స్కూల్లో పని చేస్తున్న నిషా అనే టీచర్.

'నయీ దిశ' విజయంతో ఇందిరా కాలనీలో మరో స్కూల్‌ను ప్రారంభించింది సీమ. ఈ స్కూల్‌లో 65 మంది నిరుపేద పిల్లలు చదువుకుంటున్నారు.

సిలబస్‌ను సరిగ్గా అనుసరిస్తున్నారో లేదో తెలుసుకోవడానికి, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సవాళ్లను అర్థం చేసుకోవడానికి నెలకొకసారి టీచర్ ట్రైనింగ్ క్లాసులు నిర్వహిస్తున్నారు. ప్రతి నెల పేరెంట్స్-టీచర్ మీటింగ్ కూడా ఉంటుంది.

'మా అబ్బాయికి చదువు పట్ల ఉండే శ్రద్ధ చూస్తుంటే ముచ్చట వేస్తోంది. ఇదంతా నయీ దిశ పుణ్యమే. డాక్టర్ కావాలనేది మా అబ్బాయి కల. పదిమందికి ఉపయోగపడే కల కంటే అది తప్పక నెరవేరుతుంది అని సీమ మేడమ్ ఒక మీటింగ్‌లో చెప్పారు' అంటున్నాడు అశోక్‌రావు అనే పేరెంట్. ●

మార్పు

తమిళనాడులోని పురాతన నృత్య-నాటక రూపం 'కట్టైకుట్టు'లో మహిళల ప్రాతినిధ్యం ఏ రకంగానూ ఉండేది కాదు. 'కట్టైకుట్టు' అంటే 'పురుషులకు మాత్రమే పరిమితమైన కళారూపం'గా ఉన్న పేరును భారతి తమిళవనన్ బృందం మార్చే ప్రయత్నం చేస్తోంది. 'కట్టైకుట్టు'కు సంబంధించి నటన, సాంకేతికత, సంగీతం, దర్శకత్వం లాంటి వివిధ విభాగాల్లో అద్భుత ప్రతిభ ప్రదర్శిస్తోంది. ఎంతో మంది ఔత్సాహికులకు స్ఫూర్తి ఇస్తోంది....

చరిత్రను తిరగరాశారు రంగస్థలానికి కొత్త వెలుగు తెచ్చారు

కాంచీపురంలో 33 సంవత్సరాల క్రితం ప్రారంభమైన 'కట్టైకుట్టు సంఘం' పురాతన కళాసంప్రదాయం అయిన కట్టైకుట్టును సజీవంగా ఉంచడానికి అంకితం అయింది. ఆ పురాతన కళారూపాన్ని ఈ తరానికి పరిచయం చేయడంతోపాటు 'ఈ కళలో మహిళలు అద్భుతాలు సృష్టించగలరు' అని నిరూపించింది.

'కట్టైకుట్టు నేర్చుకోవడానికి ఆడా, మగా తేడా లేదు. కులం, మతం అడ్డు కాదు అని చెప్పాలనుకున్నాం' అంటారు కట్టైకుట్టు నిర్వాహకులు.

'కట్టైకుట్టు' ప్రదర్శన ఆషామాషీ కాదు. ఖరీదైన అలంకరణతో కూడిన ఓపెన్-ఎయిర్ ప్రదర్శన.సంగీతం, పాటలు, మాటలను ఏకతాటిపైకి తెచ్చి ప్రేక్షకులను రంజింప చేయాలి.

'ఇంత క్లిష్టమైన కళకు మహిళలు అర్హులు కాదు' అనే భావనను 'కట్టైకుట్టు సంఘం' తొలగించింది. మహిళల అద్భుత కళాప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చింది. మొదట్లో మహిళలను రంగస్థలం మీదికి తీసుకురావడం అనేది అంత తేలిగ్గా జరగలేదు. పురుషులతో కలిసి నటించడానికి కొందరు మహిళలు నిరాకరించారు. కొందరు ఒప్పుకున్నా వారి తల్లిదండ్రులు అభ్యంతర పెట్టారు.

'ఇదేమైనా ప్రభుత్వ ఉద్యోగమా! తినడానికి తిండి కూడా దొరకదు' అని కొందరు నిట్టూర్చారు.

అయితే ఎన్నో అవరోధాలను అధిగమిస్తూ కళాప్రియులైన మహిళలను రంగస్థలం మీదికి తీసుకురాగలిగారు. వారిలో నిండైన ఆత్మవిశ్వాసాన్ని నింపగలిగారు.

'మీరొక చారిత్రక ఘట్టంలో భాగం అవుతున్నారు' అని చెప్పారు.

ఆ మహిళా కళాకారులు చారిత్రక ఘట్టంలో భాగం కావడమే కాదు చరిత్రను తిరగ రాశారు.'కట్టైకుట్టు'కు కొత్త వెలుగు తీసుకువచ్చారు.

'కట్టైకుట్టు' సంఘంలోని వారందరూ వివాహిత మహిళలే. డిగ్రీ పూర్తి చేసిన వారే.

'బాడీ మూమెంట్, బాడీ లాంగ్వేజ్, డైలాగ్, ఒక పెద్ద డైలాగ్‌ను సంగీతంతో మిళితం చేసే విధానంతో కూడిన కట్టైకుట్టు కళారూపాన్ని మహిళా కళాకారులు కూడా అద్భుతంగా చేయగలరని నిరూపించాం' అంటుంది భారతి తమిళవనన్. ఆమె గత పన్నెండు సంవత్సరాలుగా 'కట్టైకుట్టు' ప్రదర్శనలు ఇస్తోంది. ఎంతోమంది మహిళలకు నేర్పిస్తోంది.


'కట్టైకుట్టు' కళా ప్రదర్శన



ఎన్నో అవరోధాలు అధిగమించి...

మా ఊళ్లో కట్టైకుట్టు కళాకారులను చూస్తూ పెరిగాను. నేను కూడా వారిలాగా చేయాలి అని కలలు కనేదాన్ని. అయితే పెరిగి పెద్దయ్యే క్రమంలో కట్టైకుట్టు రంగస్థలంపై అడుగు పెట్టడానికి ఎన్ని అవరోధాలు ఉన్నాయో తెలిసింది. అయినా సరే, ఒక్కో అడుగు వేస్తూ ముందుకు వెళ్లాను. తల్లిదండ్రులు ప్రోత్సహించారే తప్ప అభ్యంతర పెట్టలేదు. ఈ పురాతన కళారూపంలోకి మరింత మంది మహిళలు రావాలని కోరుకుంటున్నాను.

– భారతి తమిళవనన్

భారతీ కళాకారుల కుటుంబం నుంచి రాలేదు. తన స్వగ్రామం వేలూరులో కట్టైకుట్టు కళాకారులను చూస్తూ పెరిగింది,

'ప్రదర్శన కోసం వేరే గ్రామాలకు వెళ్లినప్పుడు పురుషులు మమ్మల్ని తక్కువ చేసి మాట్లాడతారు. అలాంటి వారికి మేము మా ప్రతిభతోనే తగిన సమాధానం చెబుతాం. మహిళలు చేయలేరు అన్నవారే ప్రదర్శన తరువాత మమ్మల్ని ప్రశంసించడం మరిచిపోలేని విషయం' అంటుంది తమిళ జ్వానసన్. వివాహ సమయంలో తప్ప ప్రదర్శనకు ఎప్పుడూ సెలవు ఇవ్వలేదు తమిళ జ్వానసన్.

ప్రముఖ కళాకారిణి సంగీత ఈశ్వర్ దగ్గర కట్టైకుట్టు, భరతనాట్యం నేర్చుకున్న తిలగావతి పళని 'శ్రీకృష్ణ కట్టైకుట్టు కుజు' పేరుతో స్వంత కట్టైకుట్టు పాఠశాలను నడుపుతోంది.

'కట్టైకుట్టు కళాకారులు నిరక్షరాస్యులు , మహిళలు ఈ కళారూపానికి తగరు...లాంటి ఎన్నో అపోహలను బద్దలు కొట్టాం' అంటుంది పళని. ప్రస్తుతం ఆమె తన పాఠశాల ద్వారా 65 మంది విద్యార్థులకు 'కట్టైకుట్టు'లో శిక్షణ ఇస్తోంది.

ప్రతిష్ఠాత్మకమైన 'కట్టైకుట్టు గురుకులం' ద్వారా గ్రామీణ ప్రాంతంలోని పిల్లలకు 'కట్టైకుట్టు'లో శిక్షణ ఇస్తోంది కట్టైకుట్టు సంఘం. వీరిలో నుంచి భారతి లాంటి ఎంతో మంది అద్భుత కళాకారులు రంగస్థల ప్రపంచానికి పరిచయం కావచ్చు. ప్రతి సంవత్సరం 'కట్టైకుట్టు సంఘం' కాంచీపురంలో పెద్ద ఉత్సవాన్ని నిర్వహిస్తోంది. ప్రపంచం నలుమూలల ఉన్న కళాభిమానులను ఈ ఉత్సవం ఆకట్టుకుంటోంది. ●

దివ్యమైన విజయం


అనీ దివ్య

స్త్రీల కలలు తరచు సామాజిక నిబంధనల మధ్య పరిమితం అవుతుంటాయి. అలాంటి ప్రపంచంలో అనీ దివ్య అసమానతలను ధిక్కరించి కొత్త అవకాశాలను అందిపుచ్చుకుంది. పంజాబ్‌లోని పఠాన్‌కోట్ జిల్లాలో పుట్టి, విజయవాడలో పెరిగిన అనీ దివ్య... బోయింగ్ 777 ను నడిపి ప్రపంచంలోనే అతి పిన్న వయస్కురాలైన మహిళా కమాండర్‌గా పేరు పొందింది. 'మహిళా కమాండర్లలో అతి పిన్నవయస్కురాలిగా చేరాలని కలలు కనలేదు. కానీ, అభిరుచి, అంకితభావం ఆమె కలను సాకారం చేశాయి' అని చెప్పే ముప్పై ఏడేళ్ల దివ్య... మహిళా శక్తి అంటే ఏమిటో తన విజయగాథ ద్వారా మనకు పరిచయం చేస్తుంది.

'అమ్మాయిలు పెద్దగా కలలు కనడానికి వీలులేని ప్రదేశం నుండి వచ్చాను' అని చెప్పే దివ్య 11వ తరగతి వరకు సాధారణ విద్యార్థిని. ఆమె తన కలను సాకారం చేసుకోవడానికి 90 శాతం కంటే ఎక్కువ మార్కులు స్కోర్ చేయడం తప్పనిసరి అని తెలుసుకుంది. అడ్డంకులను అధిగమించాలని నిశ్చయించుకుని, సవాల్‌ను ఎదుర్కొంది. అదే సంవత్సరంలో అన్ని సబ్జెక్టులలో నూటికి నూరు మార్కులు స్కోర్ చేసింది. దీంతో ఆమె కలలు స్పష్టంగా ఉన్నాయి అని కుటుంబ సభ్యులకూ అర్థమైంది. కానీ, ముందుకు వెళ్లే మార్గం సులభంగా లేదు. అందుకు తగినంత ఖర్చు పెట్టే ఆర్థిక స్తోమత ఆమె కుటుంబానికి లేదు. కానీ, ఆమె తండ్రి ఫ్లయింగ్ స్కూల్ ఫీజు కోసం రుణం తీసుకున్నాడు. దీంతో ఆమె అసలు ప్రయాణం మొదలైంది. 17 ఏళ్ల వయసులో ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఇందిరాగాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమీ ఫ్లయింగ్ స్కూల్‌లో చేరింది. 19 ఏళ్ల వయసులో కమర్షియల్ లైసెన్స్ పొందిన అతి పిన్న వయస్కురాలైన మహిళా పైలట్‌గా నిలిచింది. ట్రైనింగ్ పూర్తయ్యాక ఎయిర్ ఇండియాలో కో-పైలట్‌గా చేరింది. 21 ఏళ్ల వయసులో ట్రైనింగ్ కోసం లండన్‌కు వెళ్లింది. అక్కడ ఆమె బోయింగ్ 777ను నడపడం ప్రారంభించింది. పైలట్‌గానే కాదు కెప్టెన్ దివ్య మోటివేషనల్ స్పీకర్ కూడా. విమానయాన రంగంలో తన అనుభవాలు, సవాళ్లను వేదికలపై స్పీచ్‌లుగా ఇచ్చింది. ముంబై రిజ్వీ లా కాలేజీ నుండి ఎల్ఎల్‌బీ పట్టా కూడా పొందింది.

ఎగతాళి చేసేవారు

''నాన్న ఆర్మీలో ఉద్యోగి అవడంతో మా కుటుంబం పఠాన్‌కోట్‌లో ఉండేది. నేను అక్కడే పుట్టాను. నాన్న వాలంటరీ రిటైర్మెంట్ తీసుకొని విజయవాడలో స్థిరపడ్డారు. అలా, నా స్కూల్ చదువు మొత్తం విజయవాడలోనే జరిగింది. చిన్నప్పటి నుంచి పైలట్ కావాలనే కోరిక ఉండేది. ఇది తెలిసి ఇతర పిల్లలు నన్ను ఎగతాళి చేసేవారు. పిల్లల్లో చాలామంది ఇంజనీరింగ్ లేదా డాక్టర్ కావాలనే అనుకునేవారు. అదృష్టవశాత్తు నా ఎంపికకు నా తల్లిదండ్రులు మద్దతు ఇచ్చారు. మా అమ్మ ఎప్పుడూ నన్ను ప్రోత్సహించేది. అయితే, పైలట్ కావాలనే నా నిర్ణయాన్ని బంధువులు, కుటుంబ స్నేహితులు వ్యతిరేకించేవారు. ఇది అమ్మాయిలకు తగిన వృత్తిగా అనుకునేవారు కాదు.

సవాల్‌గా తీసుకున్నాను..

ఇంగ్లీష్ రాయడం, చదవడం వచ్చు. కానీ, ఇంగ్లీషులో మాట్లాడటం అనేది సమస్యగా ఉండేది. దీంతో ట్రైనింగ్ కాలేజీలో చేరిన మొదటి రోజు నుంచీ తోటి వారి హేళనకు గురయ్యాను. ఒక చిన్న పట్టణం నుండి వెళ్లడం, ఇంగ్లీషులో పట్టులేకపోవడంతో మొదటి రోజు నుండి సవాళ్లు ఎదురయ్యాయి. చాలాసార్లు మా సీనియర్లు క్లాస్ బయటకు పిలిచి ర్యాగ్ చేసేవారు. ఈ సమస్యను అధిగమించాలంటే ముందు నా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలనుకున్నాను. అందుకు సెలవుల్లో నాకున్న సమయాన్ని సద్వినియోగం చేసుకున్నాను. ఆంగ్లంలో మాట్లాడటానికి మంచి పట్టు సాధించాను. ట్రైనింగ్ పూర్తయ్యే సమయానికి స్కాలర్‌షిప్ కూడా వచ్చింది.

సాధించినప్పుడే మన శక్తి బయటకు తెలుస్తుంది

ప్రపంచంలోనే బి777 మహిళా కమాండర్లలో అతి పిన్న వయస్కురాలిగా పేరు తెచ్చుకున్నందుకు గర్వంగా ఉంది. నడిచొచ్చిన దారిని చూసుకుంటే అన్నింటిని ఎలా అధిగమించాను అనే ఆశ్చర్యం కలుగుతుంది. నిజానికి ఎవరి ప్రయాణమూ అంత సాఫీగా సాగదు. ఎత్తుపల్లాలు ఉండనే ఉంటాయి. ఆ కష్టాలను దాటుకొని వచ్చినప్పుడు ఎంతో ఆనందం కలుగుతుంది. మనలోని ఆత్మ విశ్వాసం బయటకు కనిపిస్తుంది. కలలు సామాజిక అంచనాలకు, ఆర్థిక పరిమితులకు పరిమితం కాదని ఆ శక్తి గుర్తు చేస్తుంది. ఒక చిన్న పట్టణం నుండి ఏవియేషన్ కమాండింగ్ ఎత్తుల వరకు ఎదగడంలో నా బలహీనతలపై చాలా పోరాటం చేశాను'' అని వివరిస్తుంది కెప్టెన్ అనీ దివ్య. ●

బ్యూటిప్స్

ఇలా చేయండి... ఈ ఒక్కటీ చాలు...

కొంతమంది స్కిన్ చాలా మెరిసిపోతుంది. మరి కొంతమందికి మాత్రం డ్రై స్కిన్, మొటిమలు, టాన్, పిగ్మెంటేషన్, మచ్చలు, డల్ స్కిన్ వంటి సమస్యలు ఉంటాయి. వీటి వల్ల చాలా మంది సెల్ఫ్ కాన్ఫిడెన్స్ కోల్పతారు. నలుగురిలోకి వెళ్లలేరు. అయితే, విటమిన్ ఇ చర్మానికి సంబంధించిన అనేక సమస్యల్ని దూరం చేస్తుంది. మరి దీనిని ఎలా అప్లై చేయాలి. అప్లై చేస్తే ఏయే లాభాలు ఉన్నాయో తెలుసుకోండి.




చర్మ సమస్యలకి విటమిన్ ఇ చక్కటి ఉపశమనం. ఇందుకోసం టీ స్పూన్ బొప్పాయి జ్యూస్, టీ స్పూన్ రోజ్ వాటర్‌ని తీసుకోవాలి. అందులోనే విటమిన్ ఇ ఆయిల్ కలిపి ముఖానికి పట్టించాలి. 20 నిమిషాల తర్వాత క్లీన్ చేయాలి. దీనివల్ల ముఖం కాంతివంతంగా, మృదువుగా మారుతుంది.







స్కిన్ టోన్ పెరగడానికి: కొద్దిగా విటమిన్ ఇ ఆయిల్‌ని అంతే పరిమాణంలో పెరుగు, గుడ్డుతో కలపండి. దీనిని బాగా మిక్స్ చేయండి. దీనిని బాగా కలిపి ముఖానికి అప్లై చేసి మృదువుగా మసాజ్ చేయండి. తర్వాత శుభ్రం చేయండి. ముఖం మెరిసిపోతుంది.

విటమిన్ ఈ ఆయిల్‌ని కలబందతో కలిపి కూడా వాడొచ్చు. దీనివల్ల ముఖం మెరిసిపోతుంది. కాంతిమంతంగా మారుతుంది.

టీ స్పూన్ పరిమాణంలో గ్రీన్ టీ తీసుకోండి. అందులోనే తేనె కూడా వేయండి. తర్వాత కొద్దిగా విటమిన్ ఇ ఆయిల్ వేయండి. వీటన్నింటిని కలిపి ముఖానికి పట్టించి, ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. దీనివల్ల ముఖంపై ముడతలు, మచ్చలు తగ్గిపోతాయి.



ఇంటిప్స్

మురికిని ఇలా వదిలించండి



- వాటర్ బాటిల్‌లో సగం వరకు నీళ్లుపోయాలి. మిగతా సగంలో నిమ్మకాయ ముక్కలు, ఉప్పు, ఐస్ ముక్కలను వేసి బాగా షేక్ చేయాలి. ఇలా పది నిమిషాలు చేసిన తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఈ విధానంలో బాటిల్ కడగడం వల్ల బాటిల్‌లో సూక్ష్మజీవులు పూర్తిగా పోతాయి.
- టీస్పూను వంటసోడా, రెండు టీస్పూన్ల వెనిగర్‌ను బాటిల్‌లో వేసి మూతపెట్టాలి. ఇరవై నిమిషాల తరువాత బాటిల్‌ను బాగా షేక్ చేసి కడగాలి. ఇలా కడిగిన బాటిల్‌ను మూతతీసి పూర్తిగా ఆరిన తరువాత వాడుకోవాలి.
- వంటసోడా, వెనిగర్‌ను సమపాళ్లల్లో తీసుకుని కలపాలి. ఈ మిశ్రమాన్ని బాగా మాడిన గిన్నె, ఫ్రైపాన్‌పై రాసి ఇరవై నిమిషాలు నానబెట్టాలి. తరువాత డిష్‌వాషర్‌తో రుద్ది కడిగితే మురికి మొత్తం తొలగి పోతుంది.
- గోరువెచ్చని పాలల్లో రెండు టీస్పూన్ల పెరుగు వేసి కలపాలి. పాలల్లో ఈ మిశ్రమం వేసి, వడలను వేసి ఐదారు గంటలు నానపెడితే పెరుగు చక్కగా తోడుకుంటుంది. ఇప్పుడు ఈ వడలకు తాలింపు వేసి తింటే పెరుగు వడలు చాలా రుచిగా ఉంటాయి. పెరుగు లేనప్పుడు ఇలా చేస్తే పెరుగు పులవకుండా పెరుగు వడలు రుచిగా వస్తాయి.



- వేడినీళ్లలో బేకింగ్ సోడా, కొద్దిగా నిమ్మరసం వేసి కలపాలి. ఈ నీటిలో టూత్ బ్రష్‌ను మునిగేలా వేస్తి ఇరవై నిమిషాలు నానబెట్టాలి. తరువాత సాధారణ నీటితో కడిగితే బ్రష్‌లో ఉన్న మురికి, బ్యాక్టీరియా పోతుంది. పదిరోజులకొకసారి బ్రష్‌లను ఇలా శుభ్రం చేసుకుంటే, దంతాలు ఆరోగ్యంగా ఉంటాయి.
- రెండు టేబుల్ స్పూన్ల కార్న్‌ఫ్లోర్, రెండు టేబుల్ స్పూన్ల బియ్యప్పిండిని కలపాలి. ఈ మిశ్రమంలో ముంచిన టిక్కాను, తరువాత గుడ్లసొనలో ముంచి డీప్‌ఫ్రై చేస్తే టిక్కా క్రిస్పీగా మరింత రుచిగా వస్తుంది. ●



ప్రిక్వార్టర్ ఫైనల్లో రష్మిక, సహజ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీ సింగిల్స్ విభాగంలో హైదరాబాద్ క్రీడాకారిణులు శ్రీవల్లి రష్మిక, సహజ యామలపల్లి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. ఇండోర్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో తొలి రౌండ్‌లో రష్మిక 6-3, 1-0తో టాప్ సీడ్ ఇరీనా మరియా (రొమేనియా)పై ... సహజ 6-3, 6-1తో జీల్ దేశాయ్‌పై గెలిచారు. రష్మికతో మ్యాచ్‌లో రెండో సెట్ మధ్యలో గాయంతో ఇరీనా వైదొలిగింది.

భారత హాకీ జట్టు శిక్షణ బృందంలో ప్యాడీ అప్టన్

పారిస్ ఒలింపిక్స్ సమయంలో భారత పురుషుల హాకీ జట్టు సభ్యుల మానసిక దృఢత్వం కోసం... దక్షిణాఫ్రికాకు చెందిన విఖ్యాత మెంటల్ కండీషనింగ్ కోచ్ ప్యాడీ అప్టన్ సేవలు తీసుకోవాలని హాకీ ఇండియా నిర్ణయం తీసుకుంది. 2011లో వన్డే ప్రపంచకప్ టైటిల్ నెగ్గిన భారత క్రికెట్ జట్టుకు ప్యాడీ అప్టన్ మెంటల్ కండీషనింగ్ కోచ్‌గా ఉన్నారు. ఇటీవల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ, ఆసియా క్రీడల సమయంలోనూ అప్టన్ భారత హాకీ జట్టు వెంబడి ఉన్నారు.





సాత్విక్-చిరాగ్ జోడీ శుభారంభం

బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పురుషుల డబుల్స్ విభాగంలో టాప్ సీడ్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ జంట సాత్విక్-చిరాగ్ 21-18, 21-14తో 2019 చాంపియన్ జోడీ మొహమ్మద్ అసన్-హెండ్రా సెతియావాన్ (ఇండోనేసియా)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో 2022 విజేత జోడీ మొహమ్మద్ షోహిబుల్ ఫిక్రి-బగాస్ మౌలానా (ఇండోనేసియా)తో సాత్విక్-చిరాగ్ ద్వయం తలపడుతుంది.

లక్ష్య సేన్ బోణీ



మరోవైపు పురుషుల సింగిల్స్‌లో 2022 రన్నరప్, భారత స్టార్ లక్ష్య సేన్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. తొలి రౌండ్‌లో ప్రపంచ 18వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21-14, 21-14తో ప్రపంచ 33వ ర్యాంకర్ మాగ్నస్ జొహాన్సన్ (డెన్మార్క్)పై విజయం సాధించాడు. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో భారత ప్లేయర్ ప్రియాన్షు రజావత్‌కు నిరాశ ఎదురైంది. చికో ఔరా ద్వి వర్దాయో (ఇండోనేసియా)తో జరిగిన మ్యాచ్‌లో ప్రియాన్షు 19-21, 21-11, 9-21తో ఓడిపోయాడు. మహిళల డబుల్స్ విభాగంలో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో (భారత్) జోడీ ముందంజ వేయగా... గత ఏడాది సెమీఫైనల్ చేరిన పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జంట ఈసారి తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. అశ్విని-తనీషా ద్వయం 21-13, 21-18తో యెంగ్ ఎన్గా టింగ్-యెంగ్ పుయ్ లామ్ (హాంకాంగ్) జోడీపై నెగ్గింది. గాయత్రి-ట్రెసా జోడీ 18-21, 12-21తో అప్రియాని రహయు-సితీ ఫాదియా (ఇండోనేసియా) జంట చేతిలో ఓటమి పాలైంది.

ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్

చివరి లీగ్ మ్యాచ్‌లో ఘన విజయం

- 7 వికెట్లతో గుజరాత్ జెయింట్స్ ఓటమి
- రేపు ముంబై, బెంగళూరు మధ్య ఎలిమినేటర్

న్యూఢిల్లీ: ఉమెన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా రెండో ఏడాది తుది పోరుకు అర్హత సాధించింది. గ్రూప్ దశలో ఆడిన 8 మ్యాచ్‌లలో 6 గెలిచిన ఢిల్లీ 12 పాయింట్లతో టాపర్‌గా ఫైనల్‌కు చేరుకుంది. బుధవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ 7 వికెట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. ఈ ఓటమితో పట్టికలో చివరి స్థానంతో గుజరాత్ ఈ సీజన్‌ను ముగించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ జెయింట్స్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 126 పరుగులే చేసింది. భారతి ఫుల్‌మలి (36 బంతుల్లో 42; 7 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలవగా...కాథరీన్ బ్రైస్ (22 బంతుల్లో 28 నాటౌట్; 4 ఫోర్లు), ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (21 బంతుల్లో 22; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఒకదశలో జట్టు స్కోరు 48/5 కాగా... భారతి, బ్రైస్ ఆరో వికెట్‌కు 50 బంతుల్లో 68 పరుగులు జోడించి ఆదుకున్నారు. ఢిల్లీ బౌలర్లలో మిన్ను మణి, మరిజాన్ కాప్, శిఖా పాండే తలా 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ 13.1 ఓవర్లలో 3 వికెట్లకు 129 పరుగులు సాధించి గెలిచింది. ఓపెనర్ షఫాలీ వర్మ (37 బంతుల్లో 71; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు వేగంలో అర్ధసెంచరీ సాధించగా... జెమీమా రోడ్రిగ్స్ (28 బంతుల్లో 38 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) మరోసారి జోరు ప్రదర్శించింది. షఫాలీ, జెమీమా మూడో వికెట్‌కు 55 బంతుల్లోనే 94 పరుగులు జత చేశారు. విజయానికి 2 పరుగుల దూరంలో షఫాలీ వెనుదిరిగినా... జెమీమా ఫోర్ కొట్టడంతో మరో 41 బంతులు మిగిలి ఉండగానే క్యాపిటల్స్ జట్టుకు గెలుపు దక్కింది. ఫైనల్లో ఢిల్లీ ప్రత్యర్థిని నిర్ణయించే 'ఎలిమినేటర్' మ్యాచ్ రేపు జరుగుతుంది. గత ఏడాది చాంపియన్ ముంబై ఇండియన్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు 'ఎలిమినేటర్' పోరులో తలపడనున్నాయి. లీగ్ దశలో ఇరు జట్ల మధ్య రెండు మ్యాచ్‌లు జరగ్గా... చెరో మ్యాచ్‌లో విజయం సాధించి సమఉజ్జీలుగా నిలిచాయి. ఆదివారం జరిగే ఫైనల్‌తో డబ్ల్యూపీఎల్ రెండో సీజన్ ముగుస్తుంది.



షఫాలీ వర్మ

డబ్ల్యూపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
ఢిల్లీ	8	6	2	12	1.198
ముంబై	8	5	3	10	0.024
బెంగళూరు	8	4	4	8	0.306
యూపీ	8	3	5	6	-0.371
గుజరాత్	8	2	6	4	-1.158

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

రచిన్‌కు 'హ్యాడ్లీ' అవార్డు



క్రైస్ట్‌చర్చ్: ప్రపంచ క్రికెట్‌లో ఇటీవల సంచలన ప్రదర్శనతో దూసుకొచ్చిన న్యూజిలాండ్ యువ ఆటగాడు రచిన్ రవీంద్రకు ఆ దేశపు బోర్డు నుంచి సముచిత గుర్తింపు దక్కింది. కివీస్ వార్షిక అవార్డుల్లో రచిన్ అత్యుత్తమ ఆటగాడిగా నిలిచి ప్రతిష్టాత్మక 'సర్ రిచర్డ్ హ్యాడ్లీ' పురస్కారాన్ని అందుకున్నాడు. అటు టెస్టు, ఇటు పరిమిత ఓవర్ల క్రికెట్‌లో గత ఏడాది కాలంలో 24 ఏళ్ల రచిన్ సంచలన ప్రదర్శన కనబర్చాడు. వన్డే వరల్డ్‌కప్‌లో 3 సెంచరీలు సహా 578 పరుగులు సాధించిన రచిన్... ఇటీవల దక్షిణాఫ్రికాపై టెస్టులో డబుల్ సెంచరీతో మెరిశాడు. అతి పిన్న వయసులో 'హ్యాడ్లీ అవార్డు' గెలుచుకున్న ప్లేయర్‌గా రచిన్ నిలిచాడు. న్యూజిలాండ్ 'టెస్టు ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు కేన్ విలియమ్సన్‌కు దక్కింది.

ముంబైకు టైటిల్ లాంఛనమే!

రెండో ఇన్నింగ్స్‌లో పోరాడుతున్న విదర్భ ● కరుణ్ నాయర్, అక్షయ్ అర్ధ సెంచరీలు

ముంబై: అత్యద్భుతం జరిగితే తప్పించి... ముంబై జట్టు 42వసారి రంజీ ట్రోఫీ చాంపియన్‌గా నిలవడం లాంఛనం కానుంది. ముంబై నిర్దేశించిన 538 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన విదర్భ జట్టు బ్యాటర్లు బుధవారం పట్టుదలతో ఆడారు. ముంబై బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. ఓవర్‌నైట్ స్కోరు 10/0తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ జట్టు ఆట ముగిసే సమయానికి 92 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 248 పరుగులు సాధించింది. విదర్భ విజయం సాధించాలంటే మ్యాచ్ చివరిరోజు మరో 290 పరుగులు సాధించాలి. చేతిలో 5 వికెట్లు ఉన్నాయి. ఒకవేళ మ్యాచ్ 'డ్రా'గా ముగిస్తే తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా ముంబై జట్టును విజేతగా ప్రకటిస్తారు. నాలుగో రోజు ఆటలో విదర్భ బ్యాటర్లు కరుణ్ నాయర్ (220 బంతుల్లో 74; 3 ఫోర్లు), కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ (91 బంతుల్లో 56 బ్యాటింగ్; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో రాణించారు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 90 పరుగులు జోడించారు. అంతకుముందు అథర్వ తైడె (64 బంతుల్లో 32; 4 ఫోర్లు), ధ్రువ్ షోరే (50 బంతుల్లో 28; 4 ఫోర్లు), అమన్ మోఖాడె (78 బంతుల్లో 32; 2 ఫోర్లు) కూడా ముంబై బౌలర్లకు అంత తొందరగా వికెట్ సమర్పించుకోకుండా క్రీజులో సాధ్యమైనంత ఎక్కువసేపు ఉండేందుకు ప్రయత్నించారు. విదర్భ కోల్పోయిన ఐదు వికెట్లు ముంబై స్పిన్నర్లకే లభించడం గమనార్హం.



కరుణ్ నాయర్

అగ్ర స్థానానికి అశ్విన్

ఆరోసారి నంబర్‌వన్‌గా ఆఫ్‌స్పిన్నర్ ● ఐసీసీ టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్

దుబాయ్: భారత సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ర్యాంకింగ్స్‌లో మళ్లీ దూసుకుపోయాడు. తాజా టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అశ్విన్ 870 రేటింగ్ పాయింట్లతో అగ్ర స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లండ్‌తో ధర్మశాలలో జరిగిన చివరి టెస్టులో 9 వికెట్లతో చెలరేగడంతో రెండో స్థానం నుంచి అశ్విన్ టాప్ ర్యాంక్‌కు ఎగబాకాడు. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో ఈ స్టార్ బౌలర్ నంబర్‌వన్‌గా నిలవడం ఆరోసారి కావడం విశేషం. 2016 అక్టోబర్‌లో తొలిసారి ఐసీసీ టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ ర్యాంక్ అందుకున్న అశ్విన్ ఆ తర్వాత మరో నాలుగుసార్లు అగ్రస్థానాన్ని అలంకరించాడు. ఇప్పటి వరకు టాప్ ర్యాంక్‌లో ఉన్న భారత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా (847 పాయింట్లు) రెండో స్థానానికి పడిపోగా... రెండు స్థానాలు ఎగబాకిన ఆ్రస్టేలియా పేస్ బౌలర్ జోష్ హాజల్‌వుడ్ (847) బుమ్రాతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచాడు. టాప్-10లో భారత్ నుంచి రవీంద్ర జడేజా (7వ స్థానం) కూడా ఉండగా... ఇంగ్లండ్‌తో సిరీస్‌లో ఆకట్టుకున్న కుల్దీప్ యాదవ్ 31 నుంచి 15 స్థానాలు ఎగబాకి 16వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.

టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టాప్-10లో ముగ్గురు భారత ఆటగాళ్లు ఉండటం విశేషం. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో రెండు సెంచరీలు సాధించిన కెప్టెన్ రోహిత్ శర్మ ఐదు స్థానాలు ఎగబాకి 5వ ర్యాంక్‌కు చేరుకోగా...యశస్వి జైస్వాల్ 10 నుంచి 8వ స్థానానికి పురోగతి సాధించాడు. మరో టాప్ ప్లేయర్ విరాట్ కోహ్లి ఇంగ్లండ్‌తో సిరీస్ మొత్తానికి దూరమైనా... ఒకటే ర్యాంక్ కోల్పోయి 9వ స్థానంలో కొనసాగుతున్నాడు. టెస్టు ఆల్‌రౌండర్ల జాబితాలో భారత ఆటగాళ్లు రవీంద్ర జడేజా, అశ్విన్ కూడా ఎలాంటి మార్పూ లేకుండా వరుసగా మొదటి, రెండో ర్యాంక్‌లో కొనసాగుతున్నారు.



శరత్ సంచలనం

న్యూఢిల్లీ: సింగపూర్ స్మాష్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) టోర్నమెంట్‌లో భారత స్టార్ ఆచంట శరత్ కమల్ సంచలన విజయంతో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 88వ ర్యాంకర్ శరత్ కమల్ 8-11, 11-6, 11-8, 11-9తో ప్రపంచ 13వ ర్యాంకర్ డార్కో జోర్జిచ్ (స్లొవేనియా)ను బోల్తా కొట్టించాడు. మరోవైపు మహిళల డబుల్స్‌లో ఐహిక ముఖర్జీ-సుతీర్థ ముఖర్జీ (భారత్) జోడీ పోరాటం ముగిసింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఐహిక-సుతీర్థ ద్వయం 4-11, 14-12, 3-11, 9-11తో అడీనా (బెల్జియం)-మరియా జియావో (స్పెయిన్) జంట చేతిలో ఓడిపోయింది.





ఐపీఎల్‌కు హ్యారీ బ్రూక్ దూరం

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్ నుంచి ఇంగ్లండ్ స్టార్ హ్యారీ బ్రూక్ వైదొలిగాడు. గత నెలలో తన బామ్మ కన్నుమూసిన నేపథ్యంలో కుటుంబసభ్యులతో ఉండాలని బ్రూక్ నిర్ణయం తీసుకున్నాడు. గత ఏడాది మినీ వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రూ. 4 కోట్లకు బ్రూక్‌ను కొనుగోలు చేసింది. గత ఐపీఎల్ సీజన్‌లో బ్రూక్ సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున 11 మ్యాచ్‌లు ఆడి కేవలం 190 పరుగులు సాధించాడు.

సినిమా



● ప్రభాస్

అరుదైన రికార్డ్

హీరో ప్రభాస్ క్రేజ్ గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. పాన్ ఇండియా స్థాయిలోనే కాదు.. పాన్ వరల్డ్ రేంజ్‌లో అభిమానులను అలరిస్తున్నారాయన. రేర్ కాంబినేషన్స్, రికార్డ్ స్థాయి బాక్సాఫీస్ నంబర్స్, భారీ పాన్ వరల్డ్ మూవీ లైనప్స్... ఇలా అన్ని అంశాల్లో ఎన్నో రికార్డులు, ఘనత సాధించిన ప్రభాస్ తాజాగా మరో అరుదైన రికార్డ్ సొంతం చేసుకున్నారు. తాజాగా ఎక్స్ (ట్విట్టర్) టాప్ హ్యాష్ ట్యాగ్స్ ఆఫ్ ఇండియా లిస్టులో నిలిచిన ఏకైక హీరోగా రికార్డ్ సాధించారు ప్రభాస్. ట్విట్టర్ ఇండియా విడుదల చేసిన ఈ జాబితాలో ఎంటర్‌టైన్‌మెంట్ విభాగంలో టాప్ 10 మోస్ట్ యూజ్డ్ హ్యాష్ ట్యాగ్స్‌లో ప్రభాస్ మాత్రమే చోటు దక్కించుకున్నారు. తమ అభిమాన హీరో సాధించిన ఈ క్రెడిట్‌తో ఫుల్ ఖుషీ అవుతున్నారు ప్రభాస్ ఫ్యాన్స్. ఇదిలా ఉంటే.. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం మే 9న విడుదల కానుంది. అలాగే మారుతి దర్శకత్వంలో 'రాజా సాబ్' సినిమాలోనూ నటిస్తూ బిజీగా ఉన్నారు ప్రభాస్. మంచు విష్ణు టైటిల్ రోల్‌లో రూపొందుతున్న 'కన్నప్ప'లో కీలక పాత్ర చేస్తున్నారు. అలాగే ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'సలార్ 2', సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' చిత్రాలు ఉన్నాయి. ఈ చిత్రాలషూటింగ్ ఆరంభం కావాల్సి ఉంది.

బ్యాట్‌మేన్ ఆలస్యంగా వస్తాడు

బ్యాట్‌మేన్ విన్యాసాలను 'బ్యాట్‌మేన్'లో అద్భుతంగా చూపించారు దర్శకుడు మాట్ రీవ్స్. ఈ చిత్రం 2022లో రిలీజై బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. దాంతో ఈ చిత్రానికి సీక్వెల్ ప్రకటించినప్పటి నుంచి విడుదల కోసం బ్యాట్‌మేన్ అభిమానులు ఎదురు చూస్తున్నారు. జెఫ్రీ రైట్, రాబర్ట్ ప్యాటిన్‌సన్, ఆండీ సెర్కిస్ ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని 2025 అక్టోబరులో రిలీజ్ చేయాలనుకున్నారు. ఇంకో ఏడాది ఆగాలా? అనుకున్న అభిమానులు మరింత నిరాశపడే చేదు వార్తను ఇచ్చింది 'బ్యాట్‌మేన్ 2' యూనిట్. వచ్చే ఏడాది ఈ చిత్రాన్ని విడుదల చేయడంలేదు. 2026 అక్టోబరు 2న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఇలా 'బ్యాట్‌మేన్ 2' చిత్రం ఏకంగా ఏడాది ఆలస్యంగా థియేటర్స్‌కు రానుంది. కాగా కథ, స్క్రీన్ ప్లే విషయంలో దర్శకుడు మాట్ రీవ్స్ కొత్తగా కొన్ని మార్పులు అనుకున్నారని, వీటిని సెట్స్‌లో చిత్రీకరించేందుకు టైమ్ పడుతుందని, అందుకే 'బ్యాట్‌మేన్ 2' చిత్రం విడుదల వాయిదా పడిందని హాలీవుడ్ సమాచారం.



● బ్యాట్‌మేన్ 2




● రష్మికా మందన్నా ● అంజలి ● సూర్య

విద్యార్థులే కానీ... వేసవి సెలవులు లేవు

వేసవి వస్తే విద్యార్థులు రిలాక్స్ అవుతారు. వేసవి సెలవులను ఆస్వాదిస్తారు. కానీ.. ఈ విద్యార్థులకు మాత్రం వేసవి సెలవులు లేవు. కాలేజీలకు వెళుతున్నారు. ఎందుకంటే వీళ్లు రియల్ స్టూడెంట్స్ కాదు.. రీల్ స్టూడెంట్స్. కొందరు స్టార్స్ ప్రస్తుతం స్టూడెంట్స్‌గా నటిస్తున్నారు. షూటింగ్ సెట్స్‌లో క్లాసులకు హాజరు అవుతున్నవారు కొందరైతే.. ప్రిపరేషన్ స్టూడెంట్స్ మరికొందరు. ఈ విద్యార్థుల గురించి తెలుసుకుందాం.

● కెరీర్‌లో పలు చిత్రాల్లో కాలేజ్ స్టూడెంట్‌గా నటించారు హీరో సూర్య. కానీ ఐదు పదుల వయసుకి చేరువ అవుతున్న టైమ్‌లో కూడా కాలేజ్‌కి వెళ్లేందుకు రెడీ అవుతున్నారు. 'సూరరైపోట్రు' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో సూర్య, దర్శకురాలు సుధ కొంగర కాంబినేషన్‌లో ఓ పీరియాడికల్ యాక్షన్ డ్రామా తెరకెక్కనుంది. స్టూడెంట్ నుంచి గ్యాంగ్‌స్టర్‌గా మారే ఓ వ్యక్తి జీవితం నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుందట. స్టూడెంట్ రోల్ కోసం ప్రస్తుతం సూర్య బరువు తగ్గుతున్నారని సమాచారం. 2డీ ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మించనున్న ఈ చిత్రం షూటింగ్ త్వరలో ఆరంభం కానుంది.



● శ్రీవిష్ణు

● కాలేజీ స్టూడెంట్

● కాలేజీలో ఓ ఫెయిల్యూర్ స్టూడెంట్‌గా తెరపై శ్రీ విష్ణు కనిపించిన ప్రతిసారీ ఆయనకు మంచి పేరు వచ్చింది. 'నీదీ నాదీ ఒకే కథ', 'బ్రోచేవారెవరురా' వంటి సినిమాల్లో శ్రీ విష్ణు స్టూడెంట్‌గా నటించారు. మళ్లీ ఈ తరహా పాత్రలో శ్రీవిష్ణు హీరోగా నటించిన చిత్రం 'ఓం భీమ్ బుష్'. శ్రీవిష్ణుతో పాటు ఈ చిత్రంలో రాహుల్ రవీంద్రన్, ప్రియదర్శి ఇతర లీడ్ రోల్స్ చేశారు. ఓ యూనివర్సిటీలోని ముగ్గురు పీహెచ్‌డీ స్కాలర్స్ జీవితాలు ఓ ఘటనతో సడన్‌గా ఏ విధంగా మలుపు తిరిగాయి? అనే కోణంలో ఈ చిత్రం ఉంటుంది. ఈ సినిమా ఫస్టాఫ్‌లో కాలేజీ సీన్స్ ఉంటాయి. శ్రీ హర్ష కొనుగంటి దర్శకత్వంలో వి సెల్యూలాయిడ్, సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. స్టూడెంట్‌గా ఇన్నాళ్లూ సెట్‌లో బిజీగా ఉన్న శ్రీవిష్ణు ఇప్పుడు ఈ చిత్రం ప్రమోషన్స్‌తో బిజీగా ఉంటున్నారు.

● రోల్ హీరోయిన్ రష్మికా మందన్నాకు బాగా కలిసి వస్తుందని చెప్పొచ్చు. ఆ మాట కొస్తే... నటిగా రష్మికా మందన్నా కెరీర్ మొదలైంది కన్నడ హిట్ క్యాంపస్ డ్రామా 'కిర్రిక్ పార్టీ' సినిమాతోనే. అంతేకాదు...రష్మికా మందన్నా తెలుగు ఎంట్రీ మూవీ 'ఛలో'లోనూ, రెండో మూవీ 'గీత గోవిందం'లోనూ ఆమెది కాలేజీ స్టూడెంట్ రోల్. ఇలా కాలేజీ స్టూడెంట్‌గా రష్మికా మందన్నా చేసిన సినిమాలన్నీ దాదాపు సూపర్ హిట్స్. తాజాగా ఈ కోవలో రష్మికా మందన్నా చేస్తున్న చిత్రం 'ది గాళ్‌ఫ్రెండ్'. ఈ చిత్రంలో రష్మికా మందన్నా పీజీ గ్రాడ్యుయేట్ స్టూడెంట్ రోల్‌లో కనిపిస్తారని తెలిసింది. ఆమె బాయ్ ఫ్రెండ్‌గా దీక్షిత్ శెట్టి నటిస్తున్నారు. ఓ కాలేజ్ స్టూడెంట్ తన ప్రేమను నెగ్గించుకునే క్రమంలో పడిన సంఘర్షణ నేపథ్యంతో ఈ సినిమా ఉంటుందట. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. 'చి..ల..సౌ'తో దర్శకుడిగా తొలి సినిమాతోనే హిట్ కొట్టిన రాహుల్ రవీంద్రన్ 'ది గాళ్ ఫ్రెండ్' సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే రిలీజయ్యే చాన్స్ ఉంది.

● 'ఏవండీ.. (మృణాల్ ఠాకూర్).. రామచంద్రా.. (చిన్న వాయిస్‌తో విజయ్ దేవరకొండ).. నేను కాలేజ్‌కి వెళ్లాలి.. కొంచెం దించేస్తారా? (మృణాల్ ఠాకూర్),.. ఒక లీటర్ పెట్రోల్ కొట్టిస్తే దించేస్తా..' (విజయ్ దేవరకొండ)...'ఫ్యామిలీస్టార్' సినిమాలోని డైలాగ్ ఇది. సో.. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ కొన్ని సన్నివేశాల్లో కాలేజీకి వెళతారని కన్ఫార్మ్ చేసుకోవచ్చు. 'గీత గోవిందం' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు పరశురామ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ ఇది. బాలీలో ఓ పాట చిత్రీకరిస్తే ఈ చిత్రం షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 5న విడుదల కానుంది.

● 'ఇగై' సినిమా కోసం లా పాయింట్స్ చెబుతున్నారు అంజలి. ఎందుకంటే ఈ సినిమాలో అంజలి లా స్టూడెంట్. అశోక్ వేలాయుదం దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ సినిమాలో మెయిన్ లీడ్ రోల్ చేస్తున్నారు అంజలి. చిత్రీకరణ ప్రారంభమైంది. ఈ చిత్రాన్ని తమిళ, తెలుగు భాషల్లో రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

ఈ నటీనటులే కాక.. మరికొందరు కూడా కాలేజీ స్టూడెంట్ రోల్స్ చేస్తున్నారు.



● మృణాల్ ఠాకూర్



● నాగార్జున

బ్యాంకాక్‌లో కుబేర

ధనుష్, నాగార్జున అక్కినేని లీడ్ రోల్స్‌లో నటిస్తున్న మల్టీస్టారర్ ఫిల్మ్ 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రష్మికా మందన్న కథానాయికగా నటిస్తున్నారు. నారాయణ్ దాస్ కె. నారంగ్ ఆశీస్సులతో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ (ఏషియన్ గ్రూప్ యూనిట్), అమిగోస్ క్రియేషన్స్‌పై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్ షూటింగ్‌ని బ్యాంకాక్‌లో ప్రారంభించారు. ''సరికొత్త కథాంశంతో రూపొందుతున్న చిత్రం 'కుబేర'. బ్యాంకాక్‌లో ప్రారంభించిన షెడ్యూల్‌లో నాగార్జునతో పాటు మరికొందరు నటీనటులపై కొన్ని టాకీ, యాక్షన్ పార్ట్‌లు చిత్రీకరించనున్నాం. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా ఇంతకుముందు ఎవరూ చూడని కొన్ని అద్భుతమైన లొకేషన్లలో చిత్రీకరణ జరుపుకుంటోంది. శివరాత్రి కానుకగా విడుదలైన ఈ చిత్రం ఫస్ట్ లుక్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ: సోనాలీ నారంగ్, సంగీతం: దేవి శ్రీ ప్రసాద్, కెమెరా: నికేత్ బొమ్మి.

ఆ దూరాన్ని వెయ్ దరువెయ్ తగ్గిస్తుంది

- సాయిరామ్ శంకర్



''పూర్తి స్థాయి వినోదం, ఫ్యామిలీ డ్రామా, ఓ చిన్న సందేశం.. ఇలా అన్ని వాణిజ్య అంశాలతో 'వెయ్ దరువెయ్' సినిమా తెరకెక్కింది. ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని చెప్పగలను. నా కెరీర్‌లో ఈ మధ్య గ్యాప్ వచ్చింది. ఆ దూరాన్ని 'వెయ్ దరువెయ్' తగ్గిస్తుందనే నమ్మకం ఉంది'' అని హీరో సాయిరామ్ శంకర్ అన్నారు. నవీన్ రెడ్డి దర్శకత్వంలో సాయిరామ్ శంకర్, యశా శివకుమార్ జంటగా నటించిన చిత్రం 'వెయ్ దరువెయ్'. లక్ష్మీనారాయణ పొత్తూరు సమర్పణలో సాయి తేజ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై దేవరాజు పొత్తూరు నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా సాయిరామ్ శంకర్ మాట్లాడుతూ– ''నవీన్ 'వెయ్ దరువెయ్' కథ చెప్పగానే నచ్చింది. ఇందులో నా పాత్ర చాలా సరదాగా ఉంటుంది. నాకు తప్పకుండా మంచి కమ్ బ్యాక్ మూవీ అవుతుందనిపించింది. ఈ సినిమాని 35 రోజుల్లోనే పూర్తి చేశామంటే ఆ క్రెడిట్ నిర్మాత, డైరెక్టర్, కెమెరామేన్‌లదే. పైగా నటీనటులందరూ అనుభవం ఉన్నవాళ్లు కావడం కూడా మరో కారణం. ఈ మూవీకి భీమ్స్‌గారి సంగీతం, నేపథ్య సంగీతం ప్లస్ అయింది. నా 20 ఏళ్ల సినీ ప్రయాణంలో విజయాలు, పరాజయాలూ ఉన్నాయి. ప్రస్తుతం ఆచితూచి మంచి కథలు ఎంచుకుంటున్నా. మా అన్నయ్య (పూరి జగన్నాథ్) దర్శకత్వంలో హీరోగా చేసే స్థాయికి నేనింకా చేరుకోలేదు. ఆ స్థాయి, ఆ స్టార్‌డమ్, నా మార్కెట్ పరిధి పెరిగినప్పుడు చేస్తాను. ప్రస్తుతం నేను నటించిన 'ఒక పథకం ప్రకారం, రీ సౌండ్' సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి'' అన్నారు.

సాక్షి బిజినెస్

గురువారం
14-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	906	72,762
నిఫ్టీ ▽	338	21,997

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	16,229	▽ 35
డోజోన్స్	33,190	△ 184
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,772	△ 24
డాక్స్	17,961	▽ 4
షాంఘై	3,043	▽ 12
నికాయ్	38,969	▽ 102

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	65,335	▽ 231
బంగారం (99.5 స్వచ్ఛత)	65,073	▽ 230
వెండి (కిలో)	72,469	▽ 206

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	81.23	84.52
£	బ్రిటన్ పౌండ్	103.88	108.33
€	యూరో	88.65	92.70
¥	జపాన్ ఎన్ (100)	46.00	66.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	52.71	56.92
S$	సింగపూర్ డాలర్	60.07	64.30
SAR	సౌదీ రియాల్	21.19	22.76
UAE D	యూఏఈ దిర్హామ్	21.67	23.45
¥	చైనా యువాన్	10.39	12.38

పేటీఎంకు మరో షాక్

15లోగా వేరే బ్యాంకుల ఫాస్టాగ్‌లు తీసుకోండి: యూజర్లకు ఎన్‌హెచ్‌ఏఐ సూచన

న్యూఢిల్లీ: టోల్ ప్లాజాల దగ్గర ఇబ్బంది పడే పరిస్థితి తలెత్తకుండా మార్చి 15లోగా ఇతర బ్యాంకుల నుంచి ఫాస్టాగ్‌లు తీసుకోవాలంటూ పేటీఎం ఫాస్టాగ్ యూజర్లకు నేషనల్ హైవేస్ అథారిటీ (ఎన్‌హెచ్‌ఏఐ) సూచించింది. తద్వారా జాతీయ రహదారులపై ప్రయాణించేటప్పుడు జరిమానాలు, డబుల్ ఫీజు చార్జీలను నివారించవచ్చని ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఇతరత్రా సందేహాల నివృత్తి కోసం ఇండియన్ హైవే మేనేజ్‌మెంట్ కంపెనీ (ఐహెచ్‌ఎంసీఎల్) వెబ్‌సైట్‌లోని ఎఫ్‌ఏక్యూ సెక్షన్‌ను సందర్శించాలని తెలిపింది. నిబంధనల ఉల్లంఘనల కారణంగా పేటీఎం పేమెంట్స్ బ్యాంకుపై (పీపీబీఎల్) రిజర్వ్ బ్యాంక్ ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మార్చి 15 తర్వాత నుంచి పేటీఎం ఫాస్టాగ్ యూజర్లు తమ ఖాతాలను రీచార్జ్ చేసుకునే వీలుండదు. అయితే, తమ ఖాతాల్లో బ్యాలెన్స్‌ను వాడుకోవచ్చు.

ఈ-స్కూటర్‌కు రూ.10,000

ఈ-త్రీవీలర్‌కు రూ.50,000 వరకు ● కేంద్ర నూతన ప్రోత్సాహక పథకం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ ద్విచక్ర, త్రిచక్ర వాహనాల విక్రయాలను దేశవ్యాప్తంగా ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని బుధవారం ప్రకటించింది. ఇందులో భాగంగా ఎలక్ట్రిక్ టూవీలర్‌కు రూ.10,000 వరకు ఆర్థిక ప్రోత్సాహకం అందిస్తారు. సుమారు 3.33 లక్షల యూనిట్ల ఈ-టూవీలర్లకు మద్దతు ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అలాగే ఈ-రిక్షా, ఈ-కార్ట్ కొనుగోలుకు రూ.25,000 వరకు, పెద్ద ఈ-త్రీవీలర్‌కు రూ.50,000 వరకు ఆర్థిక ప్రోత్సాహకం ఉంటుంది. 41,000 యూనిట్లకు ఈ స్కీమ్‌ను విస్తరిస్తారు. ఈ పథకం కోసం భారీ పరిశ్రమల శాఖ రూ.500 కోట్లను కేటాయించింది. 2024 ఏప్రిల్‌తో మొదలై జూలై వరకు ఈ స్కీమ్‌ను అమలు చేస్తారు. ఫేమ్-2 సబ్సిడీ పథకం ఈ ఏడాది మార్చి 31న ముగుస్తుండడంతో ప్రభుత్వం కొత్త పథకాన్ని పరిచయం చేసింది.

పసిడి రుణాలను సమీక్షించుకోండి

ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఆర్థిక శాఖ ఆదేశాలు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకులు ఇస్తున్న పసిడి రుణాల్లో నిబంధనల ఉల్లంఘన జరుగుతుండటంపై కేంద్రం దృష్టి పెట్టింది. ఇలాంటి పలు ఉదంతాలు తమ దృష్టికి వచ్చాయని, ఈ నేపథ్యంలో బంగారం రుణాల పోర్ట్‌ఫోలియోను సమగ్రంగా సమీక్షించుకోవాలని పీఎస్‌యూ బ్యాంకులన్నింటికీ సూచించింది. ఈ మేరకు బ్యాంకుల చీఫ్‌లకు లేఖ రాసినట్లు ఆర్థిక సర్వీసుల విభాగం (డీఎఫ్‌ఎస్) కార్యదర్శి వివేక్ జోషి తెలిపారు. బంగారం రుణాలపై ఫీజులు.. వడ్డీల వసూళ్లు .. ఖాతాల మూసివేతలో అవకతవకలు జరుగుతుండటం, తగినంత విలువ గల బంగారాన్ని తనఖా పెట్టించుకోకుండానే రుణాలివ్వడం, నగదు రూపంలో రీపేమెంట్లు తీసుకోవడం తదితర ఉల్లంఘనలపై డీఎఫ్‌ఎస్ ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా 2022 జనవరి 1 నుంచి 2024 జనవరి 31 వరకు మంజూరైన రుణాలపై సమీక్ష జరగనుంది.

రామ్‌కో సిమెంట్స్ గతి శక్తి కార్గో టెర్మినల్ ప్రాజెక్ట్ ప్రారంభం



భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం జయంతిపురం గ్రామంలోని రామ్‌కో సిమెంట్స్ యూనిట్‌లో 'గతి శక్తి కార్గో టెర్మినల్ ప్రాజెక్ట్'ను బుధవారం వర్చువల్ పద్ధతిలో ఆవిష్కరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-3-2024	
విశాఖ	450-00
చిత్తూరు	483-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	433-00
విజయవాడ	433-00
రిటైల్ ధర (డజను)	72.00
13-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	410-00
వరంగల్	412-00
రిటైల్ ధర	4.70

చిన్న షేర్ల పెద్ద క్రాష్

- కుప్పకూలిన ఈక్విటీ మార్కెట్
- 73 వేల దిగువకు సెన్సెక్స్
- 22 వేల కిందికి నిఫ్టీ





సెన్సెక్స్ భారీ పతనంతో బీఎస్‌ఈలో రూ.13.47 లక్షల కోట్లు ఆవిరయ్యాయి. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.372 లక్షల కోట్లకు దిగివచ్చింది. గత 3 రోజుల్లో రూ.20.69 లక్షల కోట్ల సంపద ఆవిరైంది.

ముంబై: చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్ల భారీ పతనంతో దేశీయ ఈక్విటీ మార్కెట్ బుధవారం కుప్పకూలింది. అమెరికా ద్రవ్యోల్బణం దిగిరాకపోవడంతో 'ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు' ఆశలు సన్నగిల్లాయి. ట్రేడింగ్‌లో వినిమయ, ఇంధన, మెటల్ షేర్ల భారీ పతనంతో పాటు విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. ఫలితంగా సెన్సెక్స్ 73,000, నిఫ్టీ 22,000 స్థాయిలను కోల్పోయాయి.

లాభాల నుంచి భారీ నష్టాల్లోకి

ద్రవ్యోల్బణం 4 నెలల కనిష్టానికి దిగివచ్చిన సానుకూల సంకేతాలతో ఉదయం స్టాక్ సూచీలు లాభాలతో మొదలయ్యాయి. ఉదయం సెన్సెక్స్ 325 పాయింట్లు పెరిగి 73,993 వద్ద, నిఫ్టీ 96 పాయింట్లు బలపడి 22,432 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. అయితే చిన్న, మధ్య తరహా షేర్లలో నెలకొన్న అమ్మకాలతో సూచీలు ఆరంభ లాభాలు కోల్పోయి క్రమంగా నష్టాల్లోకి జారుకున్నాయి. ఈ షేర్ల ట్రేడింగ్‌లో అవకతవకలు జరుగుతున్నాయన్న సెబీ చైర్మన్ మాధవీ పురి ఇటీవలి వ్యాఖ్యలు దీనికి నేపథ్యం. ఒకానొక దశలో సెన్సెక్స్ 1,152 పాయింట్లు క్షీణించి 72,516 వద్ద, నిఫ్టీ 430 పాయింట్లు దిగివచ్చి 21,906 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. చివరికి సెన్సెక్స్ 906 పాయింట్లు నష్టపోయి 72,762 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 338 పాయింట్లు పతనమై 21,997 వద్ద స్థిరపడ్డాయి.

- స్కాటిష్ చమురు కంపెనీ కెయిర్న్‌కు రూ.77.6 కోట్లు చెల్లించాలంటూ సెబీ ఆదేశాలు జారీ చేయడంతో వేదాంత లిమిటెడ్ షేరు 7% నష్టపోయి రూ.252 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ 8% నష్టపోయి రూ.250 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. కంపెనీకి రూ.6,858 కోట్ల నష్టం వాటిల్లింది.
- మార్కెట్ పతనంలో భాగంగా అదానీ గ్రూప్ షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. మొత్తం పదింటికి గానూ ఏడు కంపెనీల షేర్లు నష్టపోయాయి

● జీజే కెమికల్స్ షేరు బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.221)తో పోలిస్తే 4.52% డిస్కౌంట్‌తో రూ.211 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 18% క్షీణించి రూ.181 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 16% నష్టపోయి రూ.185 వద్ద ముగిసింది. కంపెనీ విలువ రూ.724 కోట్లుగా నమోదైంది.

ఎఫ్‌అండ్‌వోపై దృష్టి ఆందోళనకరం

రిటైల్ ఇన్వెస్టర్లకు సీఈఏ హెచ్చరిక



అత్యధిక రిస్కులతోకూడిన ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్(ఎఫ్‌అండ్‌వో)లో లావాదేవీలు చేపట్టేందుకు రిటైల్ ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడం ఆందోళనకరమని ప్రధాన ఆర్థిక సలహాదారు(సీఈఏ) వి.అనంత నాగేశ్వరన్ తాజాగా పేర్కొన్నారు. తక్షణ లాభాలపై దృష్టి పెట్టడం పెట్టుబడుల పురోగతికి ప్రతికూలమని సెబీ నిర్వహించిన ఒక కార్యక్రమంలో పేర్కొన్నారు.

2026 ఆఖర్లో టాటా 'ధోలేరా' చిప్

టాటా, సీజీ పవర్ సెమీకండక్టర్ల ప్లాంట్ల శంకుస్థాపనలో కేంద్ర మంత్రి వైష్ణవ్ వెల్లడి



కార్యక్రమంలో కేంద్రమంత్రి వైష్ణవ్, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ తదితరులు

ధోలేరా (గుజరాత్): టాటా ఎలక్ట్రానిక్స్ తలపెట్టిన ధోలేరా (గుజరాత్) ప్లాంటు నుంచి చిప్‌ల తొలి బ్యాచ్ 2026 డిసెంబర్ నాటికి అందుబాటులోకి రాగలదని కేంద్ర ఐటీ, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ ప్లాంటులో 28, 50, 55 నానోమీటర్ నోడ్‌ల చిప్స్ తయారు కానున్నాయని పేర్కొన్నారు. టాటా గ్రూప్‌నకు చెందిన రెండు, సీజీ పవర్‌కి చెందిన ఒక చిప్ ప్లాంటుకు ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం శంకుస్థాపన చేసిన సందర్భంగా మంత్రి ఈ విషయాలు తెలిపారు. ఈ మూడింటిపై కంపెనీలు మొత్తం రూ. 1.26 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నాయి. మూడు భారీ సెమీకండక్టర్ల ప్లాంట్లకు ఒకే రోజున శంకుస్థాపన చేయడం రికార్డని మంత్రి చెప్పారు. 2029 నాటికి టాప్ 5 సెమీకండక్టర్ల వ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. టాటా ఎలక్ట్రానిక్స్ సెమీకండక్టర్ల ప్రాజెక్టులతో అస్సాంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 72,000 పైచిలుకు ఉద్యోగాల కల్పన జరగగలదని టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ తెలిపారు.

ఫినో పేమెంట్స్ బ్యాంక్‌లో ఇద్దరు మహిళా డైరెక్టర్లు



అనితా సుధీర్ పాయ్   నీతా ముఖర్జీ

ముంబై: ఫినో పేమెంట్స్ బ్యాంక్ తాజాగా అనితా సుధీర్ పాయ్, నీతా ముఖర్జీలను తమ బోర్డులో స్వతంత్ర డైరెక్టర్లుగా నియమించుకుంది. వారికి సుమారు మూడు దశాబ్దాల పాటు బ్యాంకింగ్ రంగంలో అనుభవం ఉన్నట్లు సంస్థ తెలిపింది. అనిత ఇటీవలి వరకు యస్ బ్యాంక్ సీవోవోగా వ్యవహరించగా, నీతా ముఖర్జీ ఐసీఐసీఐ బ్యాంక్..ఆర్‌బీఎల్ బ్యాంక్ మొదలైన వాటిల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు.

హెచ్‌ఐఎల్ చేతికి టాప్‌లైన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సీకే బిర్లా గ్రూప్ కంపెనీ అయిన హెచ్‌ఐఎల్ తాజాగా పైప్స్, ఫిట్టింగ్స్ బ్రాండ్ టాప్‌లైన్‌ను కొనుగోలు చేసింది. టాప్‌లైన్‌ను ప్రమోట్ చేస్తున్న క్రెస్టియా పాలిటెక్‌తో ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకుంది. డీల్ విలువ రూ.265 కోట్లు. డీల్‌లో భాగంగా క్రెస్టియాకు చెందిన అనుబంధ కంపెనీలు టాప్‌లైన్ ఇండస్ట్రీస్, ఆదిత్య పాలిటెక్నిక్, ఆదిత్య ఇండస్ట్రీస్, సాయినాథ్ పాలిమర్స్ సైతం హెచ్‌ఐఎల్ పరం అయ్యాయి. తూర్పు భారత్‌లో టాప్‌లైన్‌కు ప్రముఖ బ్రాండ్‌గా పేరుంది. 2023-24లో క్రెస్టియా, అనుబంధ కంపెనీల మొత్తం అంచనా టర్నోవర్ రూ.330 కోట్లు అని హెచ్‌ఐఎల్ వెల్లడించింది.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ కోసం | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

టీఎస్ ఎడ్‌సెట్-2024

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(టీఎస్‌సీహెచ్‌ఈ).. 2024-25 సంవత్సరానికి సంబంధించి రెండేళ్ల బీఈడీ రెగ్యులర్ కోర్సుల్లో ప్రవేశాలకు తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీఎస్ ఎడ్‌సెట్-2024) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం, నల్గొండ ఈ పరీక్షను నిర్వహిస్తుంది. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
» **ఎంపిక విధానం:** సీబీటీ పరీక్ష ద్వారా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.05.2024.
» **పరీక్ష తేది:** 23.05.2024(గురువారం)
» **వెబ్‌సైట్:** https://edcet.tsche.ac.in

సీటెట్ జూలై-2024

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ).. కేంద్రీయ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (సీటెట్ జూలై-2024)కు నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న 136 నగరాల్లో సీటెట్ పరీక్షను 20 భాషల్లో నిర్వహిస్తారు. ఈ పరీక్షను ప్రతీ సంవత్సరం రెండుసార్లు(జూలై, డిసెంబర్) నిర్వహిస్తారు. సీటెట్‌లో సాధించిన స్కోరుకు జీవితకాల వ్యాలిడిటీ ఉంటుంది.

» **అర్హత:** పన్నెండో తరగతి, డిగ్రీ, డీఈఎల్‌ఈడీ/డీఈడీ(ప్రత్యేక విద్య), బీఈడీ, బీఈడీ(ప్రత్యేక విద్య), బీఈఎల్‌ఈడీ/బీఎస్సీఈడీ/బీఏఈడీ/బీఎస్సీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **పరీక్ష విధానం:** మొత్తం రెండు పేపర్లు, పేపర్-1, పేపర్-2 ఉంటాయి.
పేపర్-1, 150 మార్కులకు, పేపర్-2, 150 మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుంది. పరీక్ష సమయం 2.30 గంటలు. ప్రశ్నలు మల్టిపుల్ ఛాయిస్ విధానంలో అడుగుతారు. -పేపర్-1 పరీక్ష ఒకటి నుంచి ఐదో తరగతులు బోధించే ఉపాధ్యాయులకు, పేపర్-2 ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతులు బోధించే ఉపాధ్యాయులకు నిర్వహిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఫీజు చెల్లింపు, ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.04.2024.
» **పరీక్ష తేది:**07.07.2024(పేపర్-1-పేపర్-2).
» **వెబ్‌సైట్:** https://ctet.nic.in

ఐఆర్‌ఈఎల్(ఇండియా) లిమిటెడ్, ముంబైలో 10 ఉద్యోగాలు

ముంబైలోని ఇండియన్ రేర్ ఎర్త్స్ లిమిటెడ్ (ఐఆర్‌ఈఎల్).. శాశ్వత ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 10(మేనేజర్, డిప్యూటీ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్)
» **విభాగాలు:** మైనింగ్, మినరల్, టెక్నికల్.
» **అర్హత:** 60% మార్కులతో ఇంజనీరింగ్‌లో ఉత్తీర్ణులవ్వాలి. పనిచేసిన అనుభవం ఉండాలి. మేనేజర్ పోస్టులకు ఎనిమిదేళ్లు, డిప్యూటీ మేనేజర్ పోస్టులకు ఐదేళ్లు, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు రెండేళ్ల అనుభవం తప్పనిసరిగా ఉండాలి.
» **వయసు:** మేనేజర్ పోస్టులకు 35 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 32 ఏళ్లు, అసిస్టెంట్ మేనేజర్‌కు 28 ఏళ్లు మించకూడదు. ఓబీసీకి మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ, సైకోమెట్రిక్ టెస్ట్ ద్వారా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.03.2024
» **వెబ్‌సైట్:** www.irel.co.in/careers

బెల్ బెంగళూరులో ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్) ఒప్పంద ప్రాతిపదికన ఎస్‌బీయూ మిలిటరీ రాడార్‌లో ప్రాజెక్ట్ ఇంజనీర్-1 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04
» **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్.
» **అర్హత:** బీఈ/బీటెక్(ఈ-సీ/సీఎస్/ఐటీ) ఉత్తీర్ణులవ్వాలి. రెండేళ్ల పని అనుభవం ఉండాలి. **వయసు:** 32 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల వయసు సడలింపు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.55,000 వరకు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా.
దరఖాస్తును మేనేజర్ హ్యూమన్ రిసోర్సెస్, మిలిటరీ రాడర్స్-ఎస్‌బీయూ, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, జలహల్లి పోస్టు, బెంగళూరు-560013 చిరునామకు పంపించాలి.
» **పని చేయాల్సిన ప్రదేశాలు:**
జోర్హాట్, తేజ్‌పూర్, అస్సాం.
» **దరఖాస్తులకు చివరితేది:** 25.03.2024.
» **వెబ్‌సైట్:** https://bel-india.in

టీచర్ కొలువు.. ఇలా సులువు!

» 11,062 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల
» ఎస్‌జీటీ, ఎస్‌ఏ, పీఈటీ, ఎల్‌పీ ఉద్యోగాలు
» బీఈడీ, డీఈడీ అర్హతగా పోటీ పడే అవకాశం
» రాత పరీక్షకు 80 శాతం, టెట్‌కు 20 శాతం వెయిటేజీ



టీఎస్ జాబ్స్

ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులు.. బీఈడీ, డీఈడీ పూర్తి చేసుకున్న వారు ఎంతో ఆసక్తిగా ఎదురు చూసే కొలువులు! తెలంగాణ విద్యాశాఖ తాజాగా 11,062 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. డీఎస్సీగా సుపరిచితమైన ఈ టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్‌కు పోటీ తీవ్రంగా ఉంటుంది. రాత పరీక్షకు 80 శాతం, టెట్ స్కోర్‌కు 20 శాతం వెయిటేజీ కల్పించి తుది ఎంపిక చేపడతారు. ఈ నేపథ్యంలో.. తెలంగాణ టీచర్ పోస్టుల నోటిఫికేషన్ వివరాలు, అర్హతలు, ఎంపిక విధానం, రాత పరీక్షల్లో రాణించేందుకు ప్రిపరేషన్ తదితర సమాచారంతో ప్రత్యేక కథనం..

మొత్తం 11,602 పోస్టులు

తెలంగాణ విద్యా శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం-మొత్తం 11,062 టీచర్ పోస్టులు భర్తీ చేయనున్నారు. వీటిలో స్కూల్ అసిస్టెంట్స్-2,629 పోస్టులు, సెకండరీ గ్రేడ్ టీచర్స్-6,508, లాంగ్వేజ్ పండిట్స్-727,ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్(పీఈటీ)-182, స్పెషల్ కేటగిరీ స్కూల్ అసిస్టెంట్స్-220, స్పెషల్ కేటగిరీ ఎస్‌జీటీ-796 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

ఈ టీచర్ పోస్టులకు దరఖాస్తుకు బీఈడీ, డీఎడ్ తదితర అర్హతలు ఉండాలి. సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ) పోస్టులకు డీఎడ్ పూర్తిచేసిన వారే అర్హులు. బీఈడీ వారు అర్హులు కాదు. స్కూల్ అసిస్టెంట్(ఎస్‌ఏ) పోస్టులకు బీఈడీ పూర్తిచేసిన వారు అర్హులు. నాలుగేళ్ల బీఈడీ పూర్తిచేసిన వారు కూడా అర్హులే. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసేవారు ఇంటర్‌లో 50శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. దీనితో పాటు యూజీ డీపీఈడీ కోర్సు పూర్తిచేసి ఉండాలి. డిగ్రీ పూర్తిచేసిన వారు బీపీఈడీ కోర్సులో ఉత్తీర్ణులై ఉండాలి. బీఈడీ, డీఎడ్ చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వయసు: 18-46 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు వయో సడలింపు ఉంటుంది.

టెట్‌కు వెయిటేజీ

టీఎస్ టీచర్ రిక్రూట్‌మెంట్ పోస్టులకు పోటీ పడుతున్న అభ్యర్థులు తప్పనిసరిగా టెట్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. స్కూల్ అసిస్టెంట్స్, లాంగ్వేజ్ పండిట్స్ అభ్యర్థులు టెట్ పేపర్-2లో.. సెకండరీ గ్రేడ్ టీచర్స్ పోస్టులకు టెట్ పేపర్-1లో అర్హత పొందాల్సి ఉంటుంది. టీచర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో భాగంగా టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్‌కు 80 శాతం వెయిటేజీ, టెట్ స్కోర్‌కు 20 శాతం వెయిటేజీని కల్పించి తుది నియామకాలు ఖరారు చేస్తారు.

రాత పరీక్ష ఇలా

- స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండిట్ పోస్టులకు 160 ప్రశ్నలు-80 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో జీకే అండ్ కరెంట్ అఫైర్స్ (20 ప్రశ్నలు-10 మార్కులు); విద్యా దృక్పథాలు (20 ప్రశ్నలు-10 మార్కులు); సంబంధిత సబ్జెక్ట్ కంటెంట్ (88 ప్రశ్నలు-44 మార్కులు); టీచింగ్ మెథడాలజీ (32 ప్రశ్నలు-16 మార్కులు) విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులకు సంబంధించి 200 ప్రశ్నలు-100 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో జీకే అండ్ కరెంట్ అఫైర్స్ నుంచి 20 ప్రశ్నలు (10 మార్కులు), జనరల్ ఇంగ్లిష్ 20 ప్రశ్నలు (10 మార్కులు), కంటెంట్ నుంచి 160 ప్రశ్నలు-80 మార్కులకు అడుగుతారు.

80 మార్కులకు ఎస్‌జీటీ పరీక్ష

ఎస్‌జీటీ పోస్టులకు నిర్వహించే పరీక్షలో 8 విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. మొత్తం 160 ప్రశ్నలు- 80 మార్కులకు పరీక్ష ఉంటుంది. జీకే అండ్ కరెంట్ అఫైర్స్(20 ప్రశ్నలు-10 మార్కులు), విద్యా దృక్పథాలు(20 ప్రశ్నలు-10 మార్కులు), లాంగ్వేజ్-1(18 ప్రశ్నలు-9 మార్కులు), లాంగ్వేజ్-2 (18 ప్రశ్నలు-9 మార్కులు), మ్యాథమెటిక్స్ (18 ప్రశ్నలు-9 మార్కులు), సైన్స్ (18 ప్రశ్నలు-9 మార్కులు), సోషల్ స్టడీస్ (18 ప్రశ్నలు-9 మార్కులు), టీచింగ్ మెథడాలజీ (30 ప్రశ్నలు-15 మార్కులు)ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. అన్ని పోస్టులకు పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది. ఈసారి పరీక్షను ఆన్‌లైన్ టెస్ట్‌గా నిర్వహించనున్నారు. పరీక్షకు లభించే సమయం రెండున్నర గంటలు.

రాత పరీక్షలో రాణించేలా..

ఎస్‌జీటీ అభ్యర్థులు

ఎస్‌జీటీ పోస్టులకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ప్రధానంగా మూడు అంశాలపై దృష్టి పెట్టాలి. అవి.. విద్యా దృక్పథాలు, కంటెంట్, మెథడాలజీ. విద్యా దృక్పథాలకు సంబంధించి వర్తమాన భారతదేశంలో విద్యా సంబంధ అంశాలు; దేశంలో విద్యా చరిత్ర; ఉపాధ్యాయ సాధికారత, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ, విద్యాహక్కు చట్టం వంటి అంశాలపై సంపూర్ణ అవగాహన ఏర్పరచుకోవాలి. కంటెంట్ కోసం.. పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను అధ్యయనం చేయడం లాభిస్తుంది. సోషల్‌లో భూగోళశాస్త్రం,చరిత్ర, పౌరశాస్త్రం, అర్థశాస్త్రం; మ్యాథ్స్‌లో సంఖ్యామానం, అంకగణితం, బీజగణితం, సమితులు-సంబంధాలు, క్షేత్రగణితం, రేఖాగణితం; తెలుగులో కవులు-కావ్యాలు, భాషా రూపాలు, పరుషాలు-సరళాలు; ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, టెన్సెస్, వొకాబ్యులరీ, ఆర్టికల్స్-ప్రిపొజిషన్స్ తదితర అంశాలపై దృష్టిసారించాలి. మెథడాలజీని ప్రత్యేక దృష్టితో చదవాలి. బోధనా లక్ష్యాలు, భాషా నైపుణ్యాలు, బోధనా ప్రణాళిక, మూల్యాంకనం తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

స్కూల్ అసిస్టెంట్.. ప్రతి సబ్జెక్ట్‌కు ప్రత్యేకంగా

స్కూల్ అసిస్టెంట్ పోస్టుల అభ్యర్థులు తమకు అర్హత ఉన్న సబ్జెక్ట్ పరంగా ప్రత్యేక దృక్పథంతో చదవాలి.

మ్యాథమెటిక్స్-స్కూల్ అసిస్టెంట్

అభ్యర్థులు కంటెంట్ పరంగా.. బీజ గణితం, వ్యాపార గణితం, క్షేత్ర గణితం, రేఖా గణితం, త్రికోణమితి, శ్రేఢులు, సమితులు-సంబంధాలు వంటి అంశాలపై పరిపూర్ణ అవగాహన పొందాలి. మెథడాలజీ కోణంలో.. గణితశాస్త్ర బోధనా లక్ష్యాలు, బోధనా విలువలు, బోధనా ప్రణాళిక, బోధనా పద్ధతులు, మూల్యాంకనం వంటి పాఠ్యాంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి.

బయాలజీ- స్కూల్ అసిస్టెంట్

ఈ సబ్జెక్ట్‌లో కంటెంట్ పరంగా..జీవ శాస్త్రం-ఆధునిక పద్ధతులు, జీవ ప్రపంచం, సూక్ష్మ జీవుల ప్రపంచం, జంతు ప్రపంచం వంటి అంశాలపై పట్టు సాధించాలి. ఈ సబ్జెక్ట్‌లో మెథడాలజీకి సంబంధించి జీవశాస్త్ర బోధనా లక్ష్యాలు, విజ్ఞానశాస్త్ర పాఠ్యప్రణాళిక, జీవశాస్త్ర ఉపగమాలు-పద్ధతుల గురించి పూర్తిగా పరిజ్ఞానం సొంతం చేసుకోవాలి.

ఫిజికల్ సైన్సెస్- స్కూల్ అసిస్టెంట్

ఈ సబ్జెక్ట్‌లో మెజర్‌మెంట్స్, యూనిట్స్, డైమెన్షన్స్, సహజ వనరులు, మన విశ్వం, కాంతి సిద్ధాంతం, ఉష్ణం, ధ్వని విభాగాలకు సంబంధించి ఉండే అన్ని అంశాలను అప్లికేషన్ విధానంలో నేర్చుకోవాలి. అదే విధంగా అయస్కాంతత్వం, విద్యుదయస్కాంతత్వం, ఆధునిక భౌతిక శాస్త్రాలకు సంబంధించిన అన్ని విషయాలపై లోతైన అవగాహన ఏర్పరచుకోవాలి. ఫిజికల్ సైన్సెస్‌లో మెథడాలజీకి సంబంధించి బోధన పరికరాలు, మూల్యాంకన పద్ధతులు, బోధనలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగాలపై అవగాహన పెంచుకోవాలి.

సోషల్ స్టడీస్- స్కూల్ అసిస్టెంట్

ఇందులో కంటెంట్ పరంగా.. భూగోళశాస్త్రం: సౌర కుటుంబం-భూమి; భూ ఉపరితల స్వరూపాలు-వర్గీకరణ; ప్రపంచ ప్రకృతిసిద్ధ మండలాలు; ఖండాలు; భారతదేశ ఉనికి-భౌతిక అమరిక; వాతావరణం; సముద్రాలు; తెలంగాణ భౌగోళిక అంశాల గురించి అవగాహన పొందాలి. చరిత్రకు సంబంధించి.. మధ్యయుగప్రపంచం; ప్రాచీన భారతీయ నాగరికతలు; ఢిల్లీ సుల్తానులు; మొఘలుల సామ్రాజ్యం; భారతదేశంలో స్వాతంత్ర్య ఉద్యమం; ఆధునిక ప్రపంచం; ఆర్థిక, సామాజిక రంగాల్లో మార్పులపై ప్రత్యేక దృష్టితో చదవాలి. పౌరశాస్త్రం విషయంలో భారత రాజ్యాంగం; లౌకికత్వం-భారతదేశం; ప్రపంచ శాంతి-భారతదేశ పాత్ర; ఐక్యరాజ్య సమితి-విధివిధానాలపై అవగాహన పొందాలి. ఎకనామిక్స్ నుంచి ద్రవ్యోల్బణం; ఆర్థికాభివృద్ధి; భారతదేశ ఆర్థిక వ్యవస్థ లక్షణాలు; జాతీయ ఆదాయం; ద్రవ్యం వంటి బేసిక్ కాన్సెప్ట్స్‌పై అవగాహన పెంచుకోవాలి. సోషల్ స్టడీస్ మెథడాలజీలో సాంఘిక అధ్యయన బోధనా ఉద్దేశాలు; విలువలు; విద్యా ప్రణాళిక; ఉపాధ్యాయుడు; బోధనోపకరణాలు; మూల్యాంకనం తదితర పాఠ్యాంశాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి.

అన్నింటితో అనుసంధానం

సబ్జెక్ట్ ఏదైనా అభ్యర్థులు ప్రిపరేషన్ పరంగా.. అనుసంధానం విధానాన్ని అవలంబించడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఒక అంశం వివిధ తరగతుల్లో ఉన్నప్పుడు ఆ అంశానికి సంబంధించి ఆయా తరగతుల్లోని అన్ని విషయాలను ఒకేసారి క్రోడీకరించుకుని చదవడం ఎంతో మేలు చేస్తుంది. టీచింగ్ మెథడాలజీ అంశాలను విశ్లేషణాత్మకంగా చదివితేనే మదిలో నిక్షిప్తమవుతాయి. వీటితోపాటు.. రోజూ దినపత్రికలను చదవడం అలవర్చుకోవాలి.

అప్లికేషన్ అప్రోచ్

అన్వయ దృక్పథం (అప్లికేషన్ ఓరియెంటేషన్)తో ప్రిపరేషన్ సాగించాలి. ఈ విధానం ఫలితంగా ప్రశ్నను ఏ రూపంలో అడిగినా సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది. కేవలం కొశ్చన్ అండ్ ఆన్సర్ విధానంలో చదవడం వల్ల ప్రతికూల పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుంది. అభ్యర్థులు ఇప్పటి నుంచే కంటెంట్, మెథడాలజీ పరంగా ఉమ్మడి రాష్ట్రంలో నిర్వహించిన చివరి రెండు, మూడు డీఎస్సీ పరీక్షల ప్రశ్న పత్రాలను అభ్యసించడం వల్ల పరీక్ష తీరు, ప్రశ్నల శైలిపై అవగాహన ఏర్పడుతుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 2024, ఏప్రిల్ 3
- **రాత పరీక్ష:** మే/జూన్‌లో నిర్వహించే అవకాశం
- **వెబ్‌సైట్:** https://tsdsc.aptonline.in/tsdsc/LoginPage



ఏఐకి చెప్తే..
వెబ్‌సైట్ రెడీ!

ప్రపంచంలోనే మొట్టమొదటి కృత్రిమ మేధ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ 'డెవిన్'ను రూపొందించిన కాగ్నిషన్ కంపెనీ

➤ కృత్రిమ మేధ (ఏఐ) ప్రోగ్రామ్‌లకు చిన్న సూచన చేస్తే.. మనకు కావాల్సినట్టుగా ఫొటోలను తయారు చేసిపెడుతున్నాయి.. కావాల్సినట్టుగా వీడియోలనూ రూపొందిస్తున్నాయి.. అడిగిన డేటాను నెట్‌లో సెర్చ్ చేసి పెడుతున్నాయి.. అనుమానాలు ఉంటే తీరుస్తున్నాయి.. ఇవన్నీ ఒక ఎత్తయితే.. ఇప్పుడు ఏకంగా వెబ్‌సైట్లను, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్‌లను కూడా పూర్తిస్థాయిలో తయారు చేసిపెట్టగల 'ఏఐ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్' వచ్చేసింది.

'డెవిన్' పేరుతో..

టెక్నాలజీ ప్రపంచంలో ఇటీవల వచ్చిన చాట్ జీపీటీ ఏఐ ప్రోగ్రామ్ ఎంతో కలకలం రేపింది. అది విద్యార్థులకు కావాల్సిన ఆర్టికల్స్ రాసిపెట్టడం నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు అవసరమైన కోడ్‌లనూ సిద్ధం చేసి ఇవ్వడం సంచలనం సృష్టించింది. కానీ ఇప్పుడు అమెరికాకు చెందిన కాగ్నిషన్ అనే స్టార్టప్ కంపెనీ 'ఏఐ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్'ను సృష్టించింది. దానికి 'డెవిన్' అని పేరు పెట్టింది. వెబ్‌సైట్లను, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్‌లను కూడా పూర్తిస్థాయిలో తయారు చేసి ఇవ్వగలదని ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పలు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల ఇంటర్వ్యూలను, వివిధ బెంచ్ మార్క్ టెస్టులను ఇది విజయవంతంగా పాస్ అయిందని తెలిపింది. ఇలాంటి పూర్తిస్థాయి ఏఐ ప్రోగ్రామ్ ప్రపంచంలోనే ఇదే మొదటిది కావడం గమనార్హం.

కోడ్ నుంచి డిస్ప్లే దాకా..

సాధారణంగా ఒక సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్, వెబ్‌సైట్‌ను రూపొందించడంలో చాలా ప్రక్రియలు ఉంటాయి. కోడ్ రాయడం దగ్గరి నుంచి టెస్టింగ్, డీబగ్గింగ్ చేయడం, చివరికి దాన్ని డిస్ప్లే చేయడం దాకా ఎన్నో క్లిష్టమైన పనులు చేయాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఉన్న చాట్ జీపీటీ వంటి ఏఐ ప్రోగ్రామ్‌లు.. కొంతవరకు సాఫ్ట్‌వేర్ కోడ్‌లను రాసిపెట్టగలుగుతున్నాయి కూడా. అయితే తాము అభివృద్ధి చేసిన 'డెవిన్'.. సాఫ్ట్‌వేర్ కోడ్ రాయడంతోపాటు.. టెస్టింగ్, డీబగ్గింగ్, డిస్ప్లే కూడా చేయగలదని 'కాగ్నిషన్' కంపెనీ ప్రకటించింది. ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చేయగల స్థాయిలో పూర్తిస్థాయిలో పనిచేసే వెబ్‌సైట్‌ను రెడీ చేసి పెడుతుందని వివరించింది. అది కూడా జస్ట్ ఒక చిన్న కమాండ్ ఇస్తే సరిపోతుందని తెలిపింది. ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీలను నేర్చుకోగలదని వివరించింది.

➤ కేవలం కంప్యూటర్‌లో సృష్టించడం కాకుండా.. వాస్తవంగా సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్స్ ఎంత సమర్థంగా పనిచేస్తున్నాయనేది తేల్చే 'ఎస్‌డబ్ల్యూఈ–బెంచ్‌మార్క్'లో డెవిన్ మంచి పనితీరు చూపడం గమనార్హం. ఈ బెంచ్ మార్క్‌లో.. చాట్ జీపీటీ–3.5 ప్రోగ్రామ్ 0.52%, చాట్ జీపీటీ–4 ప్రోగ్రామ్ 1.74%, క్లాడ్ 4.8% సాఫ్ట్‌వేర్ సమస్యలను పరిష్కరించగలిగితే.. డెవిన్ ఏకంగా 13.86% పరిష్కరించగలిగింది.

తప్పులను గుర్తించి సరిదిద్దుకునేలా..



'డెవిన్' ఏఐ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఎలా పనిచేస్తుందన్న దానిపై కాగ్నిషన్ కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ స్కాట్ వూ ఒక వీడియోను కూడా విడుదల చేశారు. ఈ ఏఐ ప్రోగ్రామ్‌కు కొన్నేళ్లుగా శిక్షణ ఇస్తున్నామని.. తాను చేసిన తప్పులను గుర్తించి సరిదిద్దుకునే సామర్థ్యం కూడా ఉందని ఆయన వెల్లడించారు. 'ఏఐ' ప్రోగ్రామ్‌ల రాకతో భారీగా ఉద్యోగాలు పోతాయన్న ఆందోళనలపైనా ఆయన స్పందించారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు ఉపయుక్తంగా ఉండేందుకు 'డెవిన్'ను రూపొందించామని.. దీనినే పూర్తిస్థాయిలో 'ఏఐ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్'గా వినియోగించాలన్నది తమ ఉద్దేశం కాదని పేర్కొన్నారు. వెబ్‌సైట్లతోపాటు మనకు కావాల్సిన విధంగా వీడియో దృశ్యాలనూ 'డెవిన్' రూపొందించగలదని వెల్లడించారు.

– సాక్షి సెంట్రల్ డెస్క్



మత్స్యావతారంలో యాదగిరీశుడు..

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడో రోజైన బుధవారం అర్చకులు అలంకార, వాహన సేవలకు శ్రీకారం చుట్టారు. ఉదయం శ్రీస్వామి వారు మత్స్యావతార అలంకారంలో, రాత్రి శేష వాహనంపై ఆలయ మాడ వీధిలో ఊరేగారు. ఆలయ తూర్పు మాడ వీధిలో ఉదయం, సాయంత్రం నిర్వహించిన సేవను అధిష్ఠించి వేద మంత్రాలు, పారాయణికులు, రుత్వికులు వేదం పఠించారు. మత్స్యావతార, శేష వాహన సేవల విశిష్టతను ఆలయ ప్రధానార్చకుడు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు భక్తులకు వివరించారు.

19 మంది మహిళలకు ఉత్తమ పురస్కారాలు

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం 19 మంది మహిళలకు ఉత్తమ పురస్కారాలను ప్రకటించింది. ఈమేరకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్సవాల కమిటీ ప్రతిపాదించిన పేర్లను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. అవార్డు అందుకోనున్న ఒక్కో మహిళకు రూ.లక్ష చొప్పున ప్రభుత్వం అందించనుంది.

అవార్డు పొందిన మహిళలు వీరే

స్పోర్ట్స్: తనుపర్తి చికిత, కుడుముల లోకేశ్వరి, **లిటరేచర్:** డాక్టర్ ముక్తేవి భారతి, దేవనపల్లి వీణావాణి, సూరియా జబీన్, **విద్య:** డాక్టర్ సరోజన బండ, **హ్యాండీక్రాఫ్ట్:** బినా కేశవరావు, **సోషల్ సర్వీస్:** గుర్రాల సరోజ, జమీలా నిషత్, **స్పెషల్ కేటగిరీ:** అరిపిన జయలక్ష్మి, **డ్యాన్స్:** భాగ్యలక్ష్మి, ప్రొ.అరుణభిక్షు, **పేర్ని నాట్యం:** శ్రీమతి సునీల, **రివైవల్ ఆఫ్ బోనాల కోలాటం:** బండి రాములమ్మ, గొరిగె నీల, **డప్పు ఆర్టిస్ట్:** మట్టాడి సారవ్వ, **ఆర్గానిక్ ఫార్మింగ్:** సీహెచ్.పుష్ప, **ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్త :** లుక్మా కమ్యూనిటీ కిచెన్, **ఉమెన్ ప్రొటెక్షన్ శక్తి టీమ్:** సౌత్ సెంట్రల్ రైల్వే ఉమెన్ ఆర్‌పీఎఫ్

గ్రూప్‌-1 దరఖాస్తులకు నేడు ఆఖరు

ఇప్పటివరకు వచ్చినవి 2.7లక్షలు



సాక్షి, హైదరాబాద్: వివిధ ప్రభుత్వ శాఖల్లో 563 గ్రూప్‌–1 ఉద్యోగాల భర్తీకి సంబంధించి తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తలపెట్టిన దరఖాస్తుల స్వీకరణకు స్పందన అంతంత మాత్రంగానే ఉంది. గురువారం సాయంత్రం 5గంటలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పణ పూర్తికానుంది. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం వరకు కేవలం 2.7లక్షల దరఖాస్తులు మాత్రమే అందినట్లు టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది. గత నోటిఫికేషన్ వెల్లడించిన సమయంలో 3,80,082. మంది అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించారు. దాదాపు రెండేళ్ల తర్వాత దరఖాస్తుల స్వీకరణ చేపట్టగా గత దరఖాస్తుల సంఖ్య కంటే 1.1లక్షల మంది తక్కువగా స్పందించడం గమనార్హం. 2022 ఏప్రిల్‌లో టీఎస్‌పీఎస్సీ 503 గ్రూప్‌–1 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. అప్పటి నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ తాజాగా 563 ఉద్యోగాలతో నోటిఫికేషన్ ఇవ్వగా... గతంలో దరఖాస్తు చేసుకున్న వారంతా తిరిగి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, కానీ ఫీజు చెల్లించే అవసరం లేదని టీఎస్‌పీఎస్సీ స్పష్టం చేసింది. ఈ క్రమంలో గతంలో దరఖాస్తు చేసుకున్న వారంతా తిరిగి దరఖాస్తు సమర్పించాల్సి ఉండగా... వారి నుంచి స్పందన అంతగా రాలేదు. గురువారం సాయంత్రానికి గడువు ముగియనుండగా... ఆలోపు ఏమేరకు స్పందన ఉంటుందో చూడాలి.

నేటినుంచి కన్హాలో అంతర్జాతీయ ఆధ్యాత్మిక సమ్మేళనం



రేపు హాజరుకానున్న రాష్ట్రపతి ద్రౌపదీముర్ము
17వ తేదీ వరకు కార్యక్రమాలు
లక్ష మందికిపైగా హాజరు కానున్న ప్రముఖులు

నందిగామ: ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రమైన రంగారెడ్డి జిల్లాలోని కన్హా శాంతివనం అంతర్జాతీయ ఆధ్యాత్మిక సమ్మేళనా నికి సిద్ధమైంది. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమయ్యే కార్యక్రమం ఈనెల 17 వరకు కొనసాగనుంది. ఇందులోభాగంగా 15వ తేదీన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, 16న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రపంచ వ్యాప్తంగా వందకుపైగా దేశాల నుంచి 300కుపైగా ఆధ్యాత్మిక సంస్థలు, పలువురు మత పెద్దలతోపాటు లక్ష మందికిపైగా ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమం ప్రపంచంలోని అన్ని విశ్వాసాలు, అన్ని మతాలకు చెందిన ఆధ్యాత్మిక పెద్దలను ఒక చోటికి తీసుకురానుంది. ప్రపంచ శాంతి కోసం అన్ని మతాల సారాంశాన్ని ఏకతాటిపైకి తీసుకురావడానికి ఈ సమ్మేళనం ఎంతగానో దోహదపడుతుందని భావిస్తున్నారు. విశ్వ ఆధ్యాత్మిక సమ్మేళనాన్ని (గ్లోబల్ స్పిరిచ్యువాలిటీ మహోత్సవ్ 2024) రాష్ట్రపతి ఈ నెల 15న ప్రారంభించనున్నారు.

హాజరుకానున్న ప్రముఖులు: ఈ ఆధ్యాత్మిక సమ్మేళనానికి చినజీయర్ స్వామి, అభిజిత్ హెల్డర్, ఆచార్య ధీరేంద్ర కృష్ణశాస్త్రి, రాందేవ్ బాబా, భావ జైన్, బీకే మృత్యుంజయ, బీకే శివానీ, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ గురూజీ డీ కమ్లేష్ పటేల్, దస్తూరీజీ ఖుర్షద్, దేవి చిత్రలేఖ, స్వామీ చిందానంద్, జగద్గురు రామభద్రాయచారి, మాతా అమృతామయి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్‌తోపాటు సినీ ప్రముఖులు వెంకటేశ్, సమంతా, కీర్తిశెట్టి, కబీర్ బేడీ, మాధుర్ భండార్కర్, శేఖర్ కపూర్ తదితరులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ గాయకుడు శంకర్ మహదేవన్ నేతృత్వంలో సంగీత కార్యక్రమాలుంటాయని పేర్కొన్నారు.



పసిడి కాంతుల ప్రతిబింబం

యాదగిరిగుట్ట పరిసరాల్లో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. వర్షపు నీరు ఆలయ మాడ వీధులలో నిలిచిపోయింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా పసిడి కాంతులతో వెలుగుతున్న యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రతిబింబం వర్షపు నీటిలో ఇలా కాంతులీనింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువనగిరి

జూన్ నెల శ్రీవారి దర్శనం, ఆర్జితసేవ టికెట్లు, శ్రీవారిసేవ కోటా విడుదల



తిరుమల: తిరుమల శ్రీవారి భక్తుల సౌకర్యార్థం జూన్ నెలకు సంబంధించి ఈ నెలలో ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్న దర్శనం, ఆర్జితసేవ టికెట్లు, శ్రీవారిసేవ కోటా వివరాలను టీటీడీ తెలిపింది. https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని కోరింది.

16న జాతీయ లోక్‌అదాలత్

టీఎస్‌ఎల్‌ఎస్‌ఏ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఎన్‌ఐ యాక్ట్ కేసులు, ఎక్సైజ్ కేసులు, కార్మిక వివాదాలు, మ్యాట్రిమోనియల్, సివిల్ కేసుల్లో రాజీ కోసం ఈ నెల 16న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగాను, ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ(టీఎస్‌ఎల్‌ఎస్‌ఏ) సభ్య కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటన తెలిపారు. హైకోర్టుతో పాటు తాలూకా కోర్టుల్లోనూ ఈ లోక్ అదాలత్ నిర్వ హించనున్నట్లు ఆయన వెల్లడించారు. కేసులను పరిష్కరించుకోవాలనుకునే వారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, న్యాయసేవా సదన్, మండల న్యాయసేవా కమిటీలను సంప్రదించాలని... కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సత్వర న్యాయం పొందా లని సూచించారు. హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి, టీఎస్‌ఎల్‌ఎస్‌ఏ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ మార్గ దర్శకాల మేరకు కార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

పీఆర్ ఇంజనీరింగ్ ఇన్‌చార్జ్ ఈఎన్‌సీగా కనకరత్నం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఇన్‌చార్జ్ ఈఎన్‌సీగా వి.కనకరత్నం నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత ఈఎన్‌సీ బి.సంజీవరావు ఎక్స్‌టెన్షన్‌ను రద్దుచేయడంతో కొత్త ఈఎన్సీ నియామకం అవసరమైంది. దీంతో కనకరత్నంకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించింది. 1989లో సర్వీసులో చేరిన కనకరత్నం ఇప్పటివరకు ఇంజనీరింగ్ చీఫ్ ఇంజనీర్(టెక్నికల్) హోదాలో పనిచేశారు. మరో ఏడాదిపాటు సర్వీసులో కొనసాగనున్నారు. ఈ ఉత్తర్వులకు అనుగుణంగా కనకరత్నం బుధవారం బాధ్య తలు స్వీకరించారు. ఈ సందర్భంగా సంజీవరావుకు వీడ్కో లు పలికిన ఇంజనీర్లు, ఉద్యోగులు, సిబ్బంది కనకరత్నంకు స్వాగతం పలికారు.

హైదరాబాద్‌లో ఈఏఈసీ, సీఓఎంఈటీ

కేంద్ర మంత్రి నారాయణ్ రాణే వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్‌ఎంఈ) ఎగుమతులను పెంచేందుకు, వాటిని ప్రోత్సహించేందుకు హైదరాబాద్‌లో ఈఏఈసీ, సీఓఎంఈటీ సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఎస్‌ఎంఈ కేంద్ర మంత్రి నారాయణ్ రాణే తెలిపారు. ఎంఎస్‌ఎంఈ 16వ గవర్నింగ్ కౌన్సిల్ 15వ వార్షిక సర్వసభ్య సమావేశం బుధవారం ఢిల్లీలో నారాయణ్ రాణే అధ్యక్షతన జరిగింది. హైదరాబాద్ యూసఫ్‌గూడలోని 'ఎన్‌ఐ–ఎంఎస్‌ఎంఈ'లో 'ఎక్స్‌పోర్ట్ అక్సలరేషన్ అండ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్'(ఈఏఈసీ), 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎంఎస్‌ఎంఈ ఎనాబుల్‌మెంట్ ఆఫ్ టెక్నాలజీ'(సీఓఎంఈటీ) సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. పరిశోధన, లాజిస్టిక్స్ సొల్యూషన్స్, డిజిటల్ మార్కెటింగ్ శిక్షణ, నిధుల యాక్సెస్, గ్లోబల్ మార్కెట్ ప్లేస్‌తో సహా సమగ్ర మద్దతు సేవలను 'ఈఏఈసీ' అందిస్తుందని కేంద్రమంత్రి నారాయణ్ రాణే తెలిపారు. స్వదేశీ సాంకేతికత అభివృద్ధి, డిజిటల్ కేటలాగింగ్‌తో టెక్నాలజీ డెవలప్‌మెంట్, టెస్టింగ్, డెమోన్‌స్ట్రేషన్, సర్టిఫికేషన్ కోసం 'సీఓఎంఈటీ' ఎంఎస్‌ఎంఈలకు వేదికగా నిలుస్తుందన్నారు.

మరో 17 మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

సాక్షి, హైదరాబాద్: మరో 17 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరితో పాటు మరో ఇద్దరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను కూడా బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హుస్నాబాద్ ఆర్డీవో పి.బెన్షాలమ్‌ను యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా, బాన్సువాడ ఆర్డీవో వి.భుజంగరావును నిర్మల్ భూసేకరణ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేసింది. ఈ ఇద్దరితో పాటు మరో 17 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేసింది. డిప్యూటీ కలెక్టర్ ఎం. కృష్ణారెడ్డిని ప్రభుత్వానికి రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.